జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 41 సంచిక: 1 విజయవాడ 5-5-2008 పేజీలు : 16 వెల: రు 5.00

లోపలి పేజీలలో.....

మేడే లక్ష్య సాధనకోసం నేటి శ్రామికవర్గం అంకితం కావాలి!

అంతర్జాతీయ కార్మికోద్యమంలో మేడే ఒక మహోజ్వల దినంగా నిలిచింది. అది శ్రామికవర్గానికి ఎంతో స్ఫూర్తిదాయకమైంది. చికాగో కార్మికులు సాగించిన వీరోచిత పోరాటాలు, ఆత్మబలిదానాలు మొదటి ఇంటర్నేషనల్ సహకారం మేడేగా రూపుదిద్దుకొన్నది. అది కార్మికోద్యమానికి ఒక ఆయుధమైంది. దోపిడీ సమాజాన్ని అంతంచేసి సోషలిస్టు సమాజ నిర్మాణానికి నాందిపలికింది. అటువంటి మేడే విశిష్టతను నేటి శ్రామికవర్గం తెలుసుకోవాలి.

మేడే పూర్వరంగం:

19వ శతాబ్దిలో 4వ దశకం ముందు యూరప్‌లో, అమెరికాలో పరిశ్రమలు బాగా అభివృద్ధిచెందాయి. అప్పుడు యాజమాన్యాలు 16 గంటలనుండి 20 గంటల వరకు కార్మికులతో పనిచేయించాయి. 6 సంవత్సరాల బాలలనూ,మహిళలనుకూడా రోజుకు 14 నుండి 16 గంటలు పని చేయించేవి. నిర్దిష్టమైన నియమ నిబంధనలు లేవు. వారి శ్రమను దారుణంగా దోపిడీ చేశాయి. పనిదినం 10 గంటలకు మించరాదని కార్మిక సంఘాలు ఆందోళన సాగించాయి. ఇవి, అమెరికాలో మరింత ఉధృతంగా చెలరేగాయి.

అమెరికాలో వివిధ కార్మిక సంఘాలు 1866లో బాల్టిమోర్‌లో సమావేశమై 'నేషనల్ లేబర్ యూనియన్' అనే జాతీయ కార్మిక సంఘాన్ని ఏర్పాటుచేశాయి. ఆ సమావేశం, పనిదినం 8 గంటలుగా ఉండాలని అందుకు శాసనం చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. దానికోసం ఎడతెగని పోరాటాలు సాగించింది. పెట్టుబడిదారీ విధాన బానిసత్వంనుండి అమెరికా కార్మికవర్గం విమోచన చెందాలని ప్రయత్నించింది.

దీనికి రెండు సంవత్సరాలముందు, 1864లో బ్రిటీష్, ఫ్రెంచి, జర్మన్ దేశాల కార్మిక సంఘాల నాయకులు లండన్‌లో సమావేశమై, మొదటి ఇంటర్నేషనల్‌ను స్థాపించారు. ఈ సమావేశానికి మార్క్స్, ఎంగెల్స్‌లు హాజరయ్యారు. వారు తయారు చేసిన కార్మిక సంఘాల విజ్ఞప్తిని, నిబంధనావళిని ఆ సమావేశం ఆమోదించింది. శ్రమ విమోచనను స్థానిక లేదా జాతీయ సమస్యగాక సామాజిక సమస్యగా పరిగణించింది. ఇది, అన్ని దేశాలకు వర్తిస్తుందని, కార్మికవర్గం రాజకీయాధికార సాధన కర్తవ్యం చేపట్టాలనీ ఆ సమావేశం స్పష్టంచేసింది.

1866 ఆగస్టులో అమెరికాలో ఏర్పడిన నేషనల్ లేబర్ యూనియన్ ముందుకు తీసుకొచ్చిన 8 గంటల పనిదినాన్ని, 1866 సెప్టెంబరులో జెనీవాలో సమావేశమైన మొదటి ఇంటర్నేషనల్ మహాసభ సమర్థిస్తూ తీర్మానించింది. అంతేగాక 8 గంటల పనిదినాన్ని శాసనంచేసి, కాలపరిమితి విధించాలని లేనియెడల కార్మికవర్గ విమోచనకోసం చేసే ప్రయత్నాలు విఫలమవుతాయని జెనీవా సభ విశదం చేసింది.

1867లో మార్క్స్ వెలువరించిన తన పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటిలో 8 గంటల పనిదినంకోసం సాగించిన పోరాటాలను పేర్కొనడమేగాక అవి, కార్మికవర్గం వున్న ప్రతి దేశానికి వ్యాపించాయని పేర్కొన్నారు.

1877లో అమెరికాలో రైల్వే కార్మికులు , ఉక్కు కార్మికులు సమ్మె పోరాటాలు సాగించారు. వీటిల్లో వేలాదిమంది పాల్గొన్నారు. ఆ సమ్మెలను ప్రభుత్వం, యాజమాన్యాలు పాశవికంగా అణచివేశాయి. 1884-85ల మధ్య అమెరికా ఆర్థిక సంక్షోభంలో పడింది. కార్మికుల స్థితిగతులు దుర్భరంగా తయారైనాయి. అనేకమంది ఉపాధి కోల్పోయారు.

1884 అక్టోబరులో అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ చికాగోలో సమావేశమై 8 గంటల పనిదినం కోసం కార్మికులందరు ఏకంకావాలని, సమ్మెలు చేయాలని తీర్మానించింది. సమీకరణకు పూనుకొన్నది. 1885లో జరిగిన ఆ సమాఖ్య సమావేశం మే మొదటి తేదీన కార్మికులు పని ప్రదేశాలనుండి బయటకు వచ్చి హర్తాళ్ సాగించాలని పిలుపు ఇచ్చింది. అదే సంవత్సరంలో అమెరికాలో 2467 సమ్మెలు జరిగాయి.

చికాగోలో మేడే సమ్మె:

కార్మికులు తమ జీవన పరిస్థితులను, పని పరిస్థితులను మెరుగుపరచాలని, చికాగో కార్మికవర్గం 1886 మే 1 నుండి సమ్మెను ప్రారంభించింది. ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఇతర నగరాలకు మేడే సమ్మె ఉద్యమం వ్యాపించింది. కార్మికవర్గం ఐక్యతను ప్రదర్శించింది. 8 గంటల పనిదినం ప్రాముఖ్యతను చాటిచెప్పింది. చికాగో సమ్మెల కేంద్రమయింది. ఇది, పెట్టుబడిదార్లకు, ప్రభుత్వానికి గంగవెర్రు లెత్తించింది. మే 3న చికాగోలో సమ్మె చేస్తున్న కార్మికులు జరుపుకొంటున్న సభపై పోలీసులు పాశవికంగా దాడిచేసి, 6గురు కార్మికులను తమ పొట్టన పెట్టుకొన్నారు. ఎంతోమంది గాయపడ్డారు. పోలీసుల దాడికి వ్యతిరేకంగా మే 4న హే మార్కెట్‌వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం అక్కడ శాంతియుతంగా నిర్వహించిన సభ ముగింపులో తిరిగి పోలీసులు అక్రమంగా దాడిచేశారు. అదే సమయంలో ఎవరో బాంబు వేశారు. ఒక సైనికుడు మృతి చెందాడు. పోలీసుల, కార్మికుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో 7గురు పోలీసులు, నల్గురు కార్మికులు చనిపోయారు. ఈవిధంగా హే మార్కెట్ వద్ద రక్తపాతం జరిపించడం, నల్గురు కార్మిక నాయకులను ఉరికంబం ఎక్కించడం, ఇతర సమరశీల నాయకులను జైళ్ళపాలు చెయ్యడం, ఆ తర్వాత దేశవ్యాపితంగా కార్మికులపై దాడులు సాగించడం ద్వారా 8 గంటల పనిదిన సమ్మె ఉద్యమాన్ని పాలకవర్గాలు తాత్కాలికంగా అణచివేయడం జరిగింది.

1888లో సెయింట్ లూయిస్ వద్ద అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ జరిపిన సదస్సు 8 గంటల పనిదినం ఉద్యమాన్ని పునరుజ్జీవం చేయాలని తీర్మానించింది. రెండు సంవత్సరాల నాడు 8 గంటల పనిదినంకోసం సమ్మె ప్రారంభించిన రోజు మే 1న తిరిగి పోరాటం పునఃప్రారంభించే రోజుగా ఎంచుకోవడం జరిగింది.

8 గంటల పని దినం పోరాటానికి సంఘీభావంగా నిలిచిన మొదటి ఇంటర్నేషనల్ కేంద్రాన్ని లండన్ నుండి న్యూయార్కుకు 1872లో తరలించాక అది అవకాశ ధోరణులకు బలైంది. ఫలితంగా 1876లో ఆ సంస్థ రద్దు అయింది. 1889లో పారిస్‌లో వివిధ దేశాల సోషలిస్టు, కమ్యూనిస్టు నాయకులు సమావేశమై రెండవ ఇంటర్నేషనల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వచ్చిన అమెరికన్ కార్మిక ప్రతినిధులు 8 గంటల పనిదినం కోసం తాము సాగించిన అపూర్వమైన సమ్మె పోరాటాలను, తిరిగి ఆ ఉద్యమ పున: నిర్మాణానికి చేస్తున్న కృషిని వివరించారు. 8 గంటల పనిదినం ప్రాధాన్యతను పారిస్ సభ పరిగణించింది. అంతేగాక ఈ డిమాండ్‌ను అన్ని దేశాలు ఆమోదించి శాసనం చేయాలని, దాని కొరకు అంతర్జాతీయంగా శ్రామికవర్గం మే1ని మేడేగా పాటించాలని ఆ సభ తీర్మానించింది. దీనననుసరించి 1890 మే1న అనేక దేశాలలో మేడే దినోత్సవం జరిగింది. 1891లో బ్రసెల్స్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ మహాసభ 8 గంటల పనిదినం డిమాండ్‌ను ఉద్ఘాటించింది. అంటే బూర్జువా వర్గ పెత్తనాన్ని తుదముట్టించి, కార్మికవర్గం ఆర్థిక విమోచన కోసం రాజకీయ హక్కులను వినియోగించుకోవాలని వక్కాణించింది. 1890 మే1న కమ్యూనిస్టు ప్రణాళిక నాల్గవ జర్మన్ ఎడిషన్ ముద్రణకు ఎంగెల్స్ రాసిన ఉపోద్ఘాతంలో 8 గంటల పని దినం డిమాండ్ కోసం, ప్రపంచ కార్మికులందరూ ఏకమై ఉన్నారన్న విషయాన్ని వివిధ దేశాల పెట్టుబడిదార్లకు, భూస్వాములకు తెలియచేయాలన్నారు. 1896లో లెనిన్ జైలులో వుండగా మేడే ప్రాముఖ్యతను వివరిస్తూ ఒక కరపత్రాన్ని విడుదల చేశారు. అందులో మేడే అంతర్జాతీయ ప్రాధాన్యతను వివరించడమేగాక దాని రాజకీయ ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు.

1886లో చికాగో కార్మికులు మే సమ్మె సందర్భంగా చిందించిన రక్తతర్పణం, అగణిత త్యాగాలు, మొదటి, రెండవ ఇంటర్నేషనల్ సంఘీభావ ఉద్యమాలు 8 గంటల పని దినం సాధనకు ముఖ్య భూమిక వహించాయి. ఫలితంగా అన్ని దేశాల్లో క్రమంగా అనేక పోరాటాల అనంతరం 8 గంటల పనిదినం అమలుకు వచ్చింది.

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

ప్రజాస్వామ్య స్థాపన దిశగా నేపాలు పరిణామాలు

నేపాలులో రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పాటుకు జరిగిన ఎన్నికలు ముగిసాయి. ఎన్నికలు హింసాయుత సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగాయనీ, ప్రజలు డబ్బు మద్యం వంటి ప్రలోభాలను తిరస్కరించారనీ స్వతంత్ర అంతర్జాతీయ పరిశీలకులు తెలిపారు. కార్టర్ ఫౌండేషన్ వంటి సామ్రాజ్యవాదుల సంస్థలు కూడా మావోయిస్టులు హింసకు పాల్పడతారంటూ తాము చేసిన ప్రచారాన్ని తామే దిగమింగి ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు అంగీకరించాల్సి వచ్చింది. రాజ్యాంగ నిర్ణాయక సభలోని 602 సీట్లలోనూ 220 సీట్లు గెలుచుకున్న కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాలు(మావోయిస్టు) ఏకైక పెద్ద పక్షంగా వుండగా, మిగిలిన సీట్లను 25 యితర పార్టీలు గెలుచుకున్నాయి. సిపిఎన్(మావోయిస్టు) నాయకుడు కా॥ ప్రచండ(పుష్పకుమార్ దహల్) సారథ్యంలో మిశ్రమ ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు సాగుతున్నాయి.

ఈ ఎన్నికలు దక్షిణాసియాలో చారిత్రక ప్రాధాన్యత కలిగి వున్నాయి. దక్షిణాసియా దేశాల చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రజలు రాజ్యాంగ నిర్ణాయక సభను ఎన్నుకున్నారు. రాజు జ్ఞానేంద్ర ఫాసిస్టు పాలనకూ, భూస్వామ్య వ్యవస్థకూ వ్యతిరేకంగా నేపాలు ప్రజానీకం ఉవ్వెత్తున ఎగసిన 2006లో ఉద్యమపు ప్రత్యక్ష ఫలితమిది. అమెరికా సామ్రాజ్యవాదుల, భారత ప్రాంతీయ విస్తరణవాదుల జోక్యానికి వ్యతిరేకంగా సాగిన ప్రజాఉద్యమపు ఫలితమిది. అనేక దశాబ్దాలుగా నేపాలు ప్రజలు ప్రజాస్వామ్యంకోసం పోరాడుతున్నారు. అలాంటి పోరాటం వల్లనే 1990లో రాజు పంచాయతిని ఏర్పాటు చేసాడు. అనేక పార్టీలు పంచాయితీకి ఎన్నికై పాలన సాగించినప్పటికీ, రాచరికం పంచాయితీని నామమాత్రా వశిష్టంగానే వుంచాయి. నిజమైన అధికారాలన్నీ రాజు చేతిలోనే వుండి పోయాయి. ప్రస్తుత ఎన్నికలు రాచరికానికి చరమగీతం పాడాయి.

1990ల తర్వాత నేపాలులో కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు) నాయకత్వంలో కార్మికులు, రైతాంగం పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ సాగించిన దోపిడీ వ్యతిరేక వర్గ పోరాటాల పరాకాష్టే 2006లో వచ్చిన ప్రజావెల్లువ. ఈ కాలంలో సాయుధ పోరాటంతో సహ అనేక పోరాట రూపాలను ప్రజలు అనుసరించారు. ప్రజాస్వామిక శక్తులూ, సంస్థలూ పోరాటాలు నిర్వహించాయి. రాచరికానికీ, ప్రజాస్వామ్యానికీ మధ్య ఈ పోరాటాలు విభజన రేఖను గీసాయి. వివిధ రాజకీయ పార్టీలకూ, శక్తులకూ విభజనరేఖకు ఏ వైపున నిలుస్తారో పరీక్షకు గురిచేశాయి. రాచరికానికి వ్యతిరేకించే శక్తులు ఏడుపార్టీల కూటమిగా (నేపాలీ కాంగ్రెస్, సిపిఎన్(యు.ఎంఎల్) సిపిఎన్(మావోయిస్టు)లతో సహా) ఏర్పడేట్లు చేసాయి. ఈ కూటమి మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పాటుకు ఎన్నికలు జరిపింది. ఫలితంగా రాజ్యాంగ సభ ఏర్పడింది.

గత రెండేళ్లుగా నేపాలులో రాజకీయ కార్యకలాపాలు పెద్దఎత్తున సాగాయి. నేపాలుకు ఎలాంటి రాజ్యాంగం కావాలన్న అంశంపై విస్తృత చర్చ జరిగింది. ప్రజాస్వామిక రూపం గురించిన (అధ్యక్ష తరహా లేదా మంత్రివర్గపాలన) చర్చనలావుంచితే సారానికి సంబంధించి ఫ్యూడలిజం రద్దుకావాలన్నదే ప్రజల బలీయ ఆకాంక్షగా ముందుకొచ్చింది. దీని కనుగుణంగానే కొత్త రాజ్యాంగాన్ని రూపొందించాల్సి వుంటుంది.

ఇదంత సులువుగా సాగేదికాదు. ఫ్యూడలు దోపిడీ, అణచివేతలనుండి శతాబ్దాలుగా లబ్ధిపొందుతున్న నేపాలులోని అభివృద్ధి నిరోధక వర్గాలు ఈ క్రమాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాయి. రాచరికానికి సైనిక, రాజకీయ, ఆర్థిక మద్దతునిస్తూ కాపాడిన సామ్రాజ్య వాదులకూ, ఈ ప్రాంతంలో పెద్దన్నయ్యగా వ్యవహరించే భారత పాలకులకూ ఈ పరిణామాలు రుచించవు. ప్రస్తుతం ఈ శక్తులన్నీ నేపాలులో ప్రజాస్వామిక ప్రక్రియను బలపరుస్తున్నాయంటే, అది ప్రజా ఉద్యమ బలాన్ని తప్పనిసరై గుర్తించటమే తప్ప, తమ స్వార్థ, సంకుచిత ప్రయోజనాలు వదలుకున్నాయని అర్థం కాదు. ఈ శక్తుల కపటత్వాన్ని గుర్తెరిగి తగిన విధంగా వ్యవహరించే పరిణితిని పెంపొందించుకోవాలి.

అనేక యిబ్బందులూ, సమస్యలూ, ప్రమాదాలు ఎదురౌతున్నా నేపాలు ప్రజలూ, రాజకీయ శక్తులూ తమ ప్రధానాంశంపై కేంద్రీకరించి ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయటం అభినందనీయ విజయం. దాని ద్వారా వారు రాచరికానికి స్వస్థి చెప్పారు. ప్రజాస్వామిక పాలనకు నాంది పలికారు. ఇక ఫ్యూడలిజం రద్దువైపుగానూ, పొరుగు దేశాలతో సమస్థాయి సంబంధాల ఏర్పాటు దిశగానూ వారు ప్రయాణించాల్సి వుంది. నేపాలు ప్రజల ఈ చారిత్రక విజయానికి 'జనశక్తి' ఆహ్వానం పలుకుతున్నది. ఫ్యూడలిజం రద్దుదిశగా వారి పురోగమనం విజయం సాధించాలని కోరుకుంటున్నది.

ప్రజాస్వామిక పాలన దిశగా నేపాలు ప్రజల ప్రయాణానికి భారత ప్రజల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ వుంటాయి. పొరుగు దేశమైన నేపాలు పట్ల పెత్తందారీతనాన్నీ, దాని ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యందారీతనాన్ని ప్రదర్శిస్తున్న భారత పాలకులు తమ వైఖరి మార్చుకోవాలనీ, భారత-నేపాలు దేశాలమధ్య సమస్థాయి సంబంధాలు నెలకొల్పాలనీ భారత ప్రజలు కోరుకుంటున్నారు. దక్షిణాసియాలోనూ, నేపాలులోనూ సామ్రాజ్యవాదుల, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదుల ఆధిపత్యం, జోక్యం సాగరాదని వారు కోరుకుంటున్నారు. ఈ సమిష్టి ప్రయోజనాలే భారత-నేపాలు మధ్య, దక్షిణాసియా ప్రజలమధ్య స్నేహ సౌభ్రాతృత్వ సంబంధాలను పటిష్టమొనర్చుతాయి. ❋

నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)కు అభినందనలు!

ప్రస్తుతం నేపాల్‌లోగల పరిస్థితుల్లో, ఏప్రియల్ 10వ తేదీన నేపాల్ రాజ్యాంగ పరిషత్తు సభకు జరిగిన ఎన్నికలలో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విజయం సాధించటంలన్నది ప్రాధాన్యతగల విషయం. సి.పి.ఐ(ఎం-ఎల్) కేంద్రకమిటీ తరఫున నేను నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీకి నా అభినందనలను తెలియచేస్తున్నాను

రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా నేపాల్ ప్రజలు స్పష్టమైన ఓటును వేశారు. కానీ సామ్రాజ్యవాద శక్తులు, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదమూ దాని ఏజెంట్లూ ఈ పరిణామంపట్ల సంతోషంగా లేరు. గతంలో మాదిరిగానే, యిప్పుడు కూడా వాళ్ళు తమ కుయుక్తులతో ఈ ప్రజా విజయాన్ని ధ్వంసంచేయటాన్ని కొనసాగిస్తారు. అదేవిధంగా గతంలో మాదిరిగానే, తన అభివృద్ధి నిరోధక విధానాల కొనసాగింపుగా భారత ప్రభుత్వం నేపాల్ యొక్క అంతర్గత వ్యవహారాల్లో ఎన్నికలముందూ, ఎన్నికల కాలంలోనూ కలుగచేసుకోవటానికి ప్రయత్నించింది. ఇదే నీతి బాహ్యమైన క్రీడను భారత ప్రభుత్వం కొనసాగిస్తుంది. ఈ శక్తులపట్ల నేపాల్ ప్రజలు అప్రమత్తంగా వుండాలి.

ఎన్నికల్లో సాధించిన విజయంతో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అడ్డంకులనన్నీ అధిగమించి, రాచరిక వ్యవస్థను నిర్మూలిస్తుందని మేము ఆశిస్తున్నాం.

న్యూఢిల్లీ
24-04-2008

కానూసన్యాల్, ప్రధాన కార్యదర్శి
సి.పి.ఐ(ఎం.ఎల్)

మే 2వ తేదీన బిజెపి పార్టీ యిచ్చిన హర్తాళ్ పిలుపును ఓడించండి!

ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా మే 2వ తేదీన హర్తాళ్ జరపాలని బి.జె.పి యిచ్చిన పిలుపు, మిగిలిన యితర పాలకవర్గ పార్టీల మాదిరిగానే ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు గల అసలు కారణాన్ని దాచిపెట్టడానికీ, ధరల పెరుగుదలకు ఆ పార్టీ కూడా కారణం అన్న విషయాన్ని దాచిపెట్టేందుకూ బి.జె.పి పడుతున్న అగచాట్లను బట్టబయలుచేస్తోంది. ఆహార మంత్రిత్వశాఖ 22-4-2008న యిచ్చిన ప్రకటనలో, “2007-08 సంవత్సరంలో దేశంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి ఒక కొత్త రికార్డు స్థాయిలో వుంటుందనీ, గత సంవత్సరంకన్నా 10 మిలియన్ల టన్నుల అధిక ఉత్పత్తి జరుగుతుందనీ,” చెప్పటం జరిగింది. అయినా కూడా ఆహార ధాన్యాల ధరలు యింకా పెరిగిపోతున్నాయంటే దాని అర్థం తన ఆరు సంవత్సరాల పాలనలో బి.జె.పి నాయకత్వాన వున్న ఎన్.డి.ఎ.ప్రభుత్వం సరళీకరణ- ప్రైవేటీకరణ విధానాలను త్వరితం చేయటం వలన, నిత్యావసర వస్తువుల చట్టాన్ని ఎన్.డి.ఎ ప్రభుత్వం సవరించటంవలన, ప్రస్తుత యు.పి.ఎ.ప్రభుత్వం అమలు జరుపుతున్న విధానాలవలన ఈ ధరల పెరుగుదల జరుగుతోందని. ఎన్.డి.ఎ, యు.పి.ఎ ప్రభుత్వాల పాలనలో ఈ విధానాల అమలువలన, దారిద్ర్యరేఖకు పైన-దారిద్ర్య రేఖకు దిగువన అన్న నేరపూరిత పద్ధతులను అవలంబించటంవలన ప్రజాపంపిణీ వ్యవస్థ ధ్వంసం చేయబడింది. ఆహార ధాన్యాల సేకరణను (ప్రొక్యూర్‌మెంట్‌ను) ప్రభుత్వం గణనీయంగా తగ్గించివేయటంవలన, భారత ఆహార సంస్థ గిడ్డంగులు దాదాపుగా ఖాళీగా వుంచబడ్డాయి. ప్రైవేటు గుత్త సంస్థలపైనా, హోల్‌సేల్ వాణిజ్యం పైనా గల నియంత్రణలు అన్నీ తొలగించబడ్డాయి. ‘ఫ్యూచర్ ట్రేడింగ్” ద్వారానూ, బ్యాంకులు అడ్వాన్సులు యివ్వటంవల్లనూ, ప్రైవేటు ఏజెన్సీలు అక్రమంగా సరుకులు నిలిపివేయటానికి అవకాశాలు సులభం చేయబడ్డాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణను దేశంలో ప్రవేశపెట్టాక ప్రత్యేకించి ఎన్.డి.ఎ, యు.పి.ఎ ప్రభుత్వాలు అమలులో వున్న ఆహార ధాన్యాల సేకరణ, నిల్వవుంచటం, ప్రజాపంపిణీ విధానాలను ఉద్దేశ్యపూర్వకంగా చిన్న చూపు చూడటంవలన ప్రస్తుతపు ధరలు పెరిగే తీవ్రమయిన సంక్షోభ పరిస్థితి ఏర్పడింది.

ధరల పెరుగుదలకు మరో మౌలిక కారణం రోజు రోజుకూ క్రమంగా పెరిగిన పెట్రోలియం ఉత్పత్తుల ధరలు. 1998లో బి.జె.పి నాయకత్వానగల ఎన్.డి.ఎ ప్రభుత్వం అధికారానికి వచ్చిన నాటి నుండీ, యిప్పటికి పెట్రోలు, డీసెల్‌ల ధరలు రెట్టింపు పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్టులో క్రూడ్‌ఆయిల్ పెరుగుదల యిందుకు ఒక కారణంకాగా, దక్షిణాసియాలో మన భారత దేశంలోనే ఎక్కువ ధరలు వుండటానికి కారణం వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న, సంవత్సరానికి 11/2 లక్షల కోట్ల రూపాయల పన్నులు. ప్రజలు పదే పదే డిమాండు చేసినా ఎన్.డి.ఎ. ప్రభుత్వంకానీ, యూ.పి.ఎ. ప్రభుత్వంకానీ ఈ పన్నులను తగ్గించటానికి నిరాకరించాయి.

అనూహ్యమైన ధరలు పెరిగి దేశంలోని మెజార్టీ ప్రజల జీవితాలను దుర్భరం చేస్తుంటే, యు.పి.ఎ ప్రభుత్వం సరళీకరణ-ప్రైవేటీకరణ విధానాలను వెనక్కు త్రిప్పికొట్టడానికిగానీ, పెట్రోలియం ఉత్పత్తులపైగల భారీ ఎత్తు పన్నులను తగ్గించటానికిగానీ అహంకారంతో నిరాకరించింది. ధరలు తగ్గుతాయని ఆశించటానికి వీలులేకుండా, అక్రమ నిల్వదారులకు, స్టాక్‌మార్కెటీర్లకూ యు.పి.ఎ. ప్రభుత్వం ఆరకంగా తోడ్పడుతోంది. ఇప్పుడు ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పిలుపునిచ్చిన బి.జె.పి తన పాలనాకాలంలో “నూతన తరపు సంస్కరణలు” అనే పేరిట తాను వేగవంతంచేసిన సరళీకరణ- ప్రైవేటీకరణ రాజ్యాన్ని తను అధికారంలోకి వస్తే వెనక్కి త్రిప్పి కొట్టడానికి సంసిద్ధంగా వుందా? లేక పెట్రోలియం ఉత్పత్తులపై వున్న భారీ ఎత్తు పన్నులను తగ్గించటానికి సంసిద్ధంగా వుందా? మన దేశంలోనూ, విదేశాల్లోనూ ప్రస్తుత సంక్షోభం దారితీయటానికి కారణమైన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను వెనక్కి త్రిప్పికొట్టడానికి బి.జె పి సంసిద్ధంగా వుందా? ఇటువంటి మౌలిక ప్రశ్నలపట్ల పూర్తి మౌనంగా వుంటూ, ధరల పెరుగుదల సృష్టిలో తన స్వంత పాత్రను దాచిపెడుతూ, బి.జె.పి. ఈ హర్తాళ్ పిలుపునివ్వటం ద్వారా కేవలం ప్రజల్ని మోసం చేస్తోంది. ఈ రకంగా ప్రస్తుత సంక్షోభ పరిస్థితులను వాడుకొని కర్నాటక తదితర రాష్ట్రాలలో తొందరలో జరుగబోయే ఎన్నికలలో తాను లాభం పొందాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోంది.

నేటి ధరల పెరుగుదలకు కారణమైన తీవ్ర సంక్షోభ పరిస్థితులను సృష్టించిన బాధ్యత యు.పి.ఎ, ఎన్.డి.ఎ ప్రభుత్వాలదేననీ, యితర పాలకవర్గ పార్టీలదేనని గుర్తించాల్సిందిగా ప్రజలకు మేము విజ్ఞప్తి చేస్తున్నాం. ధరల పెరుగుదలపై పార్లమెంటులో చర్చలు జరుగుతున్న 17-04-2008న తమ, తమ పార్టీ సభ్యులు లోక్‌సభలో హాజరవటానికి కూడా సమయం దొరకని ఈ పాలకవర్గ పార్టీలు, యిప్పుడు బి.జె.పి 2వ తేదీ హర్తాళ్‌కు పిలుపు నిచ్చినట్లుగా అవకాశవాద క్రీడలు ఆడుతూ, ప్రజల్ని మోసం చేయబూనుకుంటున్నాయి. ఇప్పుడు కావల్సిందేమిటంటే అక్రమ నిలువదార్లకూ, బ్లాక్ మార్కెటీర్లకూ వ్యతిరేకంగా ఒక గొప్ప ప్రజా తిరుగుబాటు. ఈ గొప్ప ప్రజా తిరుగుబాటు వాళ్ళ గిడ్డంగులను ఆక్రమించుకొని, ఆకలిగొన్న ప్రజలకు ఆహార ధాన్యాలను పంచాలి. ఈ గొప్ప ప్రజా తిరుగుబాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సరళీకరణ-ప్రైవేటీకరణ విధానాలను వెనక్కి త్రిప్పికొట్టమనే ఒత్తిడితో బలవంతంచేయగలగాలి. మనం యిటువంటి కుహనా హర్తాళ్ పిలుపులను ఓడించి నయా ఉదారవాద రాజ్యాన్ని త్రిప్పికొట్టడానికీ, ప్రజల మౌలిక డిమాండ్లను అందులో భాగమయిన ఆహార ధాన్యాలనూ, నిత్యావసర వస్తువులనూ భరించగల ధరలలో ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా, చట్టబద్ధ రేషన్ పద్ధతిద్వారా పంపిణీ చేయాలనే డిమాండును సాధించటంకోసం అవసరమయిన ప్రజా తిరుగుబాటును నిర్మిద్దాం. ఈ అవగాహనతో బి.జె.పి యొక్క కుహనా హర్తాళ్ పిలుపుయొక్క స్వభావాన్ని బట్టబయలుచేసి ప్రచార కార్యక్రమం ద్వారా ఓడిద్దాం! కాంగ్రెస్ నాయకత్వంలో గల యు.పి.ఎ ప్రభుత్వంయొక్క, యితర రాష్ట్ర ప్రభుత్వాల యొక్క ప్రజావ్యతిరేక విధానాలను బట్టబయలుచేస్తూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి, ఆ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక స్వభావాలను బట్టబయలు చేద్దాం!

న్యూఢిల్లీ
24-04-2008

కానూసన్యాల్
ప్రధాన కార్యదర్శి
సి.పి.ఐ(ఎం.ఎల్)

ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా మే 1వ తేదీనుండి ఆందోళనలు జరుపమని సి.పి.ఐ(ఎం.ఎల్)కేంద్రకమిటీ పిలుపు

ఆహార ధాన్యాల, నిత్యావసరవస్తువుల ధరలు మున్నెన్నడూ లేనంతగా పెరిగిపోయి, దేశంలోని విశాల ప్రజానీకం బ్రతకటాన్ని దుస్సాధ్యం చేశాయి.

ఒకటి తర్వాత మరొక ప్రభుత్వం అనుసరించిన నయా ఉదారవాద విధానాలయొక్క ప్రత్యక్ష ఫలితమే, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ధరలు పెరగటం. సిపిఎం చేత మద్దతు యివ్వబడుతున్న యు.పి.ఎ ప్రభుత్వ హయాంలో ఈ ధరల పెరుగుదల మరింత విపరీతమై ప్రస్తుత క్లిష్టపరిస్థితి సృష్టింపబడింది. సామ్రాజ్యవాద ఆదేశాలకు లోబడి ప్రజాపంపిణీ వ్యవస్థ ధ్వంసం చేయబడింది. మొత్తం ఆహార ధాన్యాల మార్కెట్టును రిలయన్సులాంటి స్పెక్యులేటివ్ కంపెనీలు తమ గుత్తాధిపత్యంలోకి తీసుకొన్నాయి. మెకెన్సీ రిపోర్టుపై ఆధారపడి దేశమంతటాగల భారత ఆహార కార్పొరేషన్ (ఎఫ్.సి.ఐ) గోడవున్లలోని సరకులను ఖాళీ చేయటం జరిగింది లేదా గోడవున్లను మూసివేయటం జరిగింది. ఆహార ధాన్యాల, నిత్యావసరవస్తువుల నిల్వలు అక్రమ నిల్వదారుల వద్దా, బ్లాక్ మార్కెటుదారులవద్దా భారీఎత్తున పేరుకుపోయాయి. ఆహార ధాన్యాలనూ, నిత్యావసర వ్యవసాయిక ఆహార పదార్థాలను ప్రొక్యూర్‌మెంటు (సేకరించటం) నుండి ప్రభుత్వం నిష్క్రమించటంతో, రైతులు తమ ఉత్పత్తులకు అయిన కాడికి అమ్ముకునే స్థితికి నెట్టబడ్డారు. అంతేకాక యు.పి.ఎ. ప్రభుత్వం ఫ్యూచర్ ట్రేడింగ్ వాణిజ్యాన్ని అనుమతించటంతో భారీ ఎత్తున ఆహార పదార్థాలనూ, నిత్యావసర వస్తువులనూ మార్కెట్టునుండి తరలించి, అక్రమంగా నిలువ చేసుకోవటానికి దారితీసింది. దీనికి తోడు ప్రభుత్వం స్వదేశీ, విదేశీ బడా రిటైల్ కంపెనీలకు లైసెన్సులు యివ్వటం ద్వారా రిటైల్ వ్యాపారాన్ని కార్పోరేటీకరణ జరపటానికి, గుత్తాధిపత్యం పొందటానికీ ప్రోత్సాహమిచ్చింది. దేశంలో యిప్పటికే లక్ష్యం మేరకు ఆహార ధాన్యాల నిల్వలు సమృద్ధిగా వున్నాయనే అబద్ధపు ప్రచారం చేస్తూ, ప్రభుత్వమే ఉద్దేశ్యపూర్వకంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని మార్కెట్టు చోదక శక్తులకు, సంపన్నులకు అనుకూలమైన విధానాలతో నిరుత్సాహపరిచి ఆహార ధాన్యాల సరఫరాకు అంతరాయం కలుగచేసింది. వీటన్నింటినీ మించి, దేశంలోని ఆహార భద్రతయొక్క పరిస్థితి ప్రమాదకరంగా వున్న నేటి పరిస్థితుల్లో, రాష్ట్రాలకు గల ప్రస్తుత ఆహారపు కోటాలను కూడా గణనీయంగా తగ్గించి వేయటం జరిగింది.

ఈ సందర్భంగా సి.పి.ఐ(ఎం.ఎల్) కేంద్రకమిటీ ఈ క్రింది డిమాండ్లను చేస్తోంది.

- తక్షణమే ప్రజాపంపిణీ వ్యవస్థను పూర్తిగా పునరుద్ధరించాలి. ఆహార ధాన్యాల, నిత్యావసర వస్తువుల ఫ్యూచర్‌ట్రేడింగ్‌ను రద్దుచేయాలి.
- అక్రమ నిల్వలకు పాల్పడే అందరు అక్రమ నిల్వదారులపైనా, బ్లాక్‌మార్కెటుదార్లపైనా, హోల్‌సేల్ వ్యాపారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలి.
- ఆహార ధాన్యాల, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిలుపుదలచేయటానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.
- ఆహార ధాన్యాలనూ, నిత్యావసర వస్తువులనూ ప్రైవేటు వ్యాపారులు ప్రొక్యూర్‌మెంటు (సేకరించటం)చేయటాన్ని, వ్యాపారం చేయటాన్ని రద్దుచేయాలి.
- రైతులకు గిట్టుబాటుధరను తప్పనిసరిగా చెల్లించే ఏర్పాటు చేయాలి.
- ఆహార ధాన్యాలనూ. నిత్యావసరవస్తువులనూ చట్టబద్ధంగా రేషన్‌యిచ్చే విధానాన్ని దేశమంతటా అమలు జరపాలి.

కోల్‌కతా
28-04-2008

కానూసన్యాల్
ప్రధాన కార్యదర్శి
సి.పి.ఐ(ఎం.ఎల్)

భారతదేశంలో మేడే: (1వ పేజీ తరువాయి)

బ్రిటీష్ వలస పాలకుల కాలంలో మన దేశంలో పనిగంటల తగ్గింపు కోసం కార్మికవర్గం ఎన్నో పోరాటాలు సాగించింది. 1918లో 12 గంటల పనిదినంగా నిర్దేశిస్తూ ఫ్యాక్టరీ చట్టాన్ని అమలు జరిపింది. అంతర్జాతీయంగా సాగిన పనిగంటల తగ్గింపు పోరాటాల ప్రభావంతో మనదేశంలో 10 గంటల పనిదినం, 60 గంటలు మించరాదని వలస ప్రభుత్వం ఫ్యాక్టరీ చట్టాన్ని సవరించింది. ఆ తర్వాత 8 గంటల పని దినం కోసం బారతదేశం కార్మికవర్గం సాగించిన ఆందోళన వలన 1934లో రాయల్ కమీషన్‌ను నియమించింది. అది చేసిన సిపార్సుల ప్రకారం రోజుకు 8 గంటలు, వారానికి 48 గంటల మించరాదని ఫ్యాక్టరీ చట్టాన్ని సవరించినా, దానిని యజమాన్యాలు 1948 వరకు అమలు చేయలేదు. ఆనాటి నుండి ఇది అమలవుతున్నది.

1962లో జెనివాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) వారానికి 40 గంటలు పనిని 40కి తగ్గించాలని లేదా వారానికి 5 రోజుల పని విధానానికి కుదించాలని తీర్మానించింది. దీనిని భారత ప్రభుత్వం అమలు చేయలేదు. ఇటువంటి సౌలభ్యాలను పోరాటాలు లేకుండా సాధించుకోవడం సాధ్యం కాదన్న అనుభవాలు శ్రామికవర్గం ముందు ఎన్నో ఉన్నాయి.

8 గంటల పనిదినం ఏ స్థితిలో ఉంది?

ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, టెక్నాలజీ నేడు ఎంతో పెరిగింది. అందువలన 8 గంటల పని దినాన్ని సులభతరం చేసి, శ్రామికవర్గ ఉత్పాదకశక్తిని పెంచుకోవచ్చును. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దీనికి విరుద్ధంగా అంతర్జాతీయంగా, పాలక వర్గాలు పనిగంటలు పెంచుతున్నాయి. నెలవారీ వేతన స్థానంలో రోజువారి వేతనం, గంటలవారీ వేతనం, కాంట్రాక్టు వేతనం వంటి విధానాలు అమలు చేస్తున్నాయి బహుళజాతి కంపెనీలు వాటి పనిని ఔట్‌సోర్సింగ్ ద్వారా అంతకంటే చిన్న కంపెనీలకు అప్పగించుతున్నాయి. షాపుల్లోనైతే ఏ రోజుకారోజు చేసిన పని గంటల లెక్కన కట్టి వేతనం చెల్లించే పద్ధతిని ప్రవేశపెట్టాయి. కార్మిక చట్టాల సవరణ కోసం పాలకుల మీద ఒత్తిడి పెరుగుతున్నది. కొన్ని దేశాల్లో సవరించాయి. మన దేశంలో అందుకు ప్రయత్నాలు తీవ్రమైనాయి. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో పని గంటలు పెంచాలన్న ఒక ప్రతిపాదన కేంద్ర ఆర్థికమంత్రి చేశారు. సెజ్‌లలోనయితే ప్రస్తుత కార్మిక చట్టాలు వర్తించవని కేంద్రం చట్టం చేసింది. అంతర్జాతీయంగా, జాతీయంగా 8 గంటల పనిదినాన్ని తగ్గించాల్సిందిపోయి, కార్మిక వర్గం ఎన్నో మహత్తర త్యాగపూరిత పోరాటాలు నలిపి సాధించుకొన్న 8 గంటల పనిదినాన్ని తిరగదోడి పెంచే యత్నాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఇందుకు పలు రకాల పద్ధతులు అనుసరించబడుతున్నాయి. వీటన్నిటి వలన శ్రామిక వర్గం ఉద్యోగ భద్రతను కోల్పోతున్నది. ఉపాధి తరిగిపోతున్నది. వేతనం, పి.ఎఫ్ వంటి సౌలభ్యాలకు కోతపడుతున్నది. సాధించుకొన్న హక్కులు, స్వేచ్ఛ హరించబడుతున్నాయి. ఈ విధంగా శ్రామికవర్గం యొక్క శ్రమశక్తిని కారుచౌకగా మరింత దోపిడీ చేయడానికి జరిగేవే ఈ యత్నాలు వేరు కాదు. ఇది నేడు 8 గంటల పని దినానికి పట్టిన దుస్థితి! దీనికి కారణం ఏమిటి?

మార్క్సు, ఎంగెల్సు, లెనిన్‌లు రూపొందించి, బోధించి, అమలు జరిపిన కార్మికవర్గ సిద్ధాంతాలనుండి కొంతమంది కార్మికపార్టీ నాయకులు వైదొలగడం, వాటిని వక్రీకరించడం; రాజకీయ, అర్థశాస్త్ర, వర్గపోరాట సిద్ధాంతాలను నిస్సారం చేయడం. కార్మికవర్గ, ప్రయోజనాలను బూర్జువా వర్గ ప్రయోజనాలకు బలిపెట్టడం వంటి కారణాలు కార్మివర్గ పోరాటాలను, కార్మికవర్గ పార్టీలను బలహీనపరచడమేగాక, వీటికి వేరుపురుగు చందంగా తయారైనారు. ఫలితంగా మేడే లక్ష్యాలు వెనుకపట్టు పట్టాయి. దేశ విదేశాలలో మేడే ఉత్సవాలు ప్రతి సంవత్సరం జరుగుతున్నాయి. అయితే అవి ఒక తంతుగా మారాయి, మేడే లక్ష్యాలను సాధించలేవు. దాని లక్ష్యాలను నెరవేర్చాలంటే శ్రామికవర్గం వాటికి పునరంకితం కావాలి! అందుకు శ్రామికవర్గం సంఘటితంగా వర్గపోరాటాలను ఉధృతంగా సాగించడం జరగాలి!! అంటే ఆర్థిక రాజకీయ సైద్ధాంతిక రూపాల్లో శ్రామికవర్గం పోరాటాలను సాగించడమే దాని లక్ష్యం కావాలి! అందుకు మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాల, మావో ఆలోచనకనుగుణంగా ఆయా దేశాల, సమాజాల చారిత్రక నేటి భౌతిక పరిస్థితుల మేరకు కార్మిక పార్టీలైన కమ్యూనిస్టు పార్టీల కార్యక్రమం, పంథా, నిర్మాణం వుండాలి. పోరాటాల సాగించాలి. అదే మేడే స్ఫూర్తి, కర్తవ్యం!

కార్మికవర్గంలో అనైక్యతను సృష్టించటానికి కారణభూతమైన యూనియన్ గుర్తింపు ఎన్నికలు

మన రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఎ.పి.ఎస్.ఆర్.టి.సి)లోనూ, సింగరేణి బొగ్గుగనుల సంస్థలోనూ, విశాఖపట్నంలోని ఉక్కు కర్మాగారంలోనూ గుర్తింపు యూనియన్ ఎన్నికలు రెండేళ్ళకోసారి జరుగుతున్నాయి. ఈ ఎన్నికలు జనరల్ ఎన్నికలను తలపించేంతటి భారీ స్థాయిల్లో జరుగుతున్నాయి. ఇందుకు పోటీ పడే యూనియన్లు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి తమ మొత్తం శక్తి, యుక్తులన్నింటినీ ఈ గుర్తింపు ఎన్నికలలో నెగ్గటంకోసమే వెచ్చించటాన్ని మనం గమనిస్తున్నాం. ఇటీవలికాలంలో రైల్వేలలో జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికలు, అప్పుడప్పుడు పోస్టల్-టెలిగ్రాఫ్‌రంగంలో జరిగే గుర్తింపు యూనియన్ ఎన్నికలు కూడా యిదేవిధంగా భారీస్థాయిలో జరగటాన్ని మనం చూస్తున్నాం. కోడ్ ఆఫ్ డిసిప్లిన్ (యూనియన్ల క్రమశిక్షణా నియమావళి) అనే క్లాజుక్రింద ఈ ఎన్నికలను ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రంలలో జరపటం జరుగుతోంది. ఈ ఎన్నికలు సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిన నిర్వహింపబడుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో మధ్యప్రదేశ్ పారిశ్రామిక సంబంధాల చట్టం, మహారాష్ట్రలో బొంబాయి పారిశ్రామిక సంబంధాల చట్టం ప్రకారం యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరుపబడుతున్నాయి. అయితే ఈ రెండు రాష్ట్రాల్లో రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నికలు జరపాలా వద్దా అన్న అంశం లేబర్ కోర్టుల నిర్ణయానికి వదిలి వేయటం జరిగింది.

నూతన ఆర్థిక విధానం పేరిట భారత ప్రభుత్వం మనదేశంలో అవలంభించి, అమలుపరుస్తున్న సరళీకరణ, ప్రవేటీకరణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల ఫలితంగా కార్మిక విధానాలలో వాటి అమలులో నేడు అనేక మార్పులు సంభవించాయి. ఎన్నో మహత్తర పోరాటాలద్వారా కార్మికవర్గం కష్టపడి సంపాదించుకొన్న హక్కులపై బడా పారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గం నిరంతరం అనేక దాడులు జరుపుతోంది. యజమానులు కార్మికసంఘ ఉద్యమాన్ని నలిపిపారేయాలనే ఉద్దేశ్యంతో దుర్మార్గమైన దాడులు జరుపుతున్నారు. యూనియన్లను బలవంతంగా చితగ్గొట్టడం, కక్షసాధింపులకు గురి చేయటం, అక్రమంగా పరిశ్రమలను మూసివేయటం ఉద్యోగుల సంఖ్యను తగ్గించివేయటం అన్నవి 1980 తర్వాతి కాలంలో విపరీతంగా పెరిగిపోయింది యజమానులు కార్మిక ప్రమాణాలను ఉల్లంఘించటం అన్నదాన్ని కొనసాగిస్తున్నారు. యజమానులు కార్మికులపై జరిపే దాడులను ప్రభుత్వ కార్మికశాఖ యంత్రాంగమూ, న్యాయవ్యవస్థా క్రియాశీలంగా సమర్థిస్తున్నాయి. అభివృద్ధి, ప్రజాస్వామిక హక్కులు, కార్మికసంఘాలు-వాటి నిర్మాణం అన్న విషయంలో పెట్టుబడిదారీవర్గం-రాజ్యం(ప్రభుత్వాలు) కుమ్మక్కయి పోయాయి.

ప్రవేటీకరణ, కాంట్రాక్టు కార్మిక నియామక విధానం, యూనియన్ వ్యతరేకతత్వం లాంటి సమస్యలు నేడు భారత కార్మికవర్గాన్ని వేధిస్తున్నాయి. నేడు ప్రభుత్వాలుకాక, పరిశ్రమలను బహుళజాతి కార్పోరేషన్లు, బడాపారిశ్రామిక సంస్థలూ నియంత్రిస్తున్నాయి. కార్మిక చట్టాలను మరింత సరళతరం చేయాలన్న అభిప్రాయం ముమ్మరంగా ప్రచారం చేయబడుతోంది. కార్మికుల వేతనాలు, పని పరిస్థితులు, పనిభారం లాంటి వివాదాల విషయంలో ప్రభుత్వం (రాజ్యం) జోక్యం చేసుకొంటే ఉత్పాదకత-ఉత్పత్తులపై అది దుష్ప్రభావాన్ని కలుగ చేస్తుందనీ అందువలన అటు ప్రభుత్వంగానీ, యిటు కార్మిక సంఘాలుగానీ కల్పించుకొంటే ఉద్యోగితకు అటువంటి జోక్యం ఆటంకపరుస్తుందనీ ప్రబోధింప బడుతోంది. కార్మికుల సమిష్టి బేరసారాలాడే హక్కును, మార్కెట్టు శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మలచటంవలన తత్పర్యవసానంగా అమలులోకి వచ్చిన అనియత రంగంగా మార్చివేయటం, కార్మికులను క్యాజువల్ కార్మికులుగా మార్చటం, కార్మికరంగాన్ని మహిళా కార్మికులతో నింపటంఅన్న విధానాలు ఆటంకంగా పరిణమించాయి. ప్రత్యేకించి ప్రత్యేక ఆర్థిక మండళ్ళలోనూ, దుస్తుల-టెక్స్‌టయిల్సు పరిశ్రమలోనూ, ఎలక్ట్రానిక్ రంగ పరిశ్రమల్లోనూ, ఇ టి.-ఐటిఎస్ రంగ పరిశ్రమల్లోనూ కార్మికుల సంఘటితత్వం-సంఘం అన్న భావాలనే యజమాన్యాలు బలవంతంగా తృంచిపారేసే పరిస్థితులు నేడు నెలకొనివున్నాయి. ఇటువంటి నేపధ్యంలో యూనియన్ గుర్తింపు ఎన్నికలనేవి కార్మికులకు ఏవిధంగా ప్రయోజనకరమైనవి. ఈ ఎన్నికల వలన కార్మికవర్గం ఏ ప్రయోజనాలను సాధించగలుగుతుంది అన్న అంశాన్ని పరిశీలించవలసివుంటుంది. తగు నిర్ధారణకు చేరుకోవటానికి ముందు భారత కార్మికోద్యమంయొక్క చరిత్రను గురించీ, దాని పరిణామ క్రమం గురించీ, ఆ క్రమంలో దేశంలో చేయబడ్డ కార్మిక చట్టాల గురించీ, వాటి స్వభావ స్వరూపాల గురించీ, పాలక ప్రభుత్వాలు అవలంభించిన వైఖరుల గురించీ అవలోకనంచేసుకోవటం అవసరం. అపుడు మాత్రమే ఈ యూనియన్ గుర్తింపు ఎన్నికల యొక్క స్వభావ, స్వరూపం అవి కార్మికవర్గంలో పడవేసిన ప్రభావాల గురించి అర్థంచేసుకోవటం సాధ్యమవుతుంది.

భారత కార్మికోద్యమ ఉజ్వల చరిత్ర:

19వ శతాబ్దపు రెండవ భాగంలో ఆధునిక పరిశ్రమలతోపాటు కార్మికవర్గం పుట్టుకొచ్చింది. అదే కాలంలో దేశంలో జాతీయ భావనలు కూడా ప్రజల్లో పుట్టుకొచ్చి, వృద్ధిపొందటం జరిగింది. 1882-1890 మధ్యకాలంలో బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో సుమారు 25 సమ్మెలదాకా జరిగినట్లు రికార్డులలో నమోదయి వుంది. 1895లో బడ్జ్‌బడ్జ్ జ్యూట్ మిల్లులో సమ్మె జరిగింది. అదే సంవత్సరం అహ్మదాబాదు టెక్సటయిల్సులో కూడా సమ్మె జరిగింది. కానీ కార్మికులు ఒక సంఘ నిర్మాణంలోకి సంఘటిత పరచబడటం జరుగలేదు. అందువలన ఈ సమ్మెలు తాత్కాలిక మేలునే కార్మికులకు చేకూర్చగలిగాయి. 20వ శతాబ్దపు మొదటి దశాబ్దంలో జరిగిన సమ్మెలు కార్మికవర్గ ప్రతిఘటన, మిలిటెన్సీలలో నూతన ధోరణులను తీసుకువచ్చాయి. అప్పుడే పుట్టుక వస్తున్న కార్మిక సంఘ నిర్మాణాలకూ, జాతీయ పోరాటానికీ మధ్య ఒక చక్కటి సంబంధాన్ని ఏర్పర్చాయి.

ఆసన్ సోల్ రైల్వే కార్మికులు ప్రారంభించిన సమ్మె లాహోర్, ఝంఝాలవరకూ పాకింది. ఈ సమ్మె నాటి బ్రిటీష్ ఇండియాకు రాజధాని అయిన కలకత్తాకు పూర్తిగా రైలు రవాణా సంబంధాలను తెంచివేసింది. 10 రోజులు సాగిన ఈ సమ్మె అనంతరం, అదే బాటలో రైల్వే యింజను డ్రైవర్లు, ఫైర్‌మెన్, బ్రేక్‌మెన్ తదితరులు పయనించి అదే సంవత్సరం డిసెంబరు నెలలో సమ్మె జరిపారు. ఈ రెండు సమ్మెలను ప్రభుత్వం పాశవికంగా అణచివేసింది. 600 మంది రైల్వే కార్మికులను డిస్మిస్ చేసింది. రైల్వేలను నడపటానికి బ్రిటీష్ సైనిక దళాలను పిలిపించింది. రైల్వే కార్మికుల సమావేశాలను పోలీసు చేతా, మిలటరీ దళాలచేతా భగ్నం చేయించింది.

1980లో రాజకీయ ప్రాధాన్యంగల బొంబాయి కార్మికుల సమ్మె జరిగింది. బాలగంగాధర తిలక్‌ను రాజద్రోహం క్రింద అరెస్టుచేసి, విచారణ జరుపుతున్న దానికి నిరసనగా జరిగిన సమ్మె యిది. వేలాదిమంది కార్మికులు కోర్టు బయట ఎదురుచూస్తున్న కార్మికులు పోలీసులతో తలపడ్డారు. జూలై నెలలో సమ్మెచేసిన బొంబాయి కార్మికులు వీధుల్లోకి వచ్చి ఊరేగింపులు జరిపారు. 1908 జూలై 19వ తేదీన 65,000 మంది బొంబాయి కార్మికులు సమ్మె జరిపారు. తర్వాతి రోజుల్లో వ్యాపారస్తులు, షాపు యజమానులు, రేవు కార్మికులు ఈ సమ్మెలో చేరారు. తుపాకీ కాల్పులు జరిపి కార్మికులను చంపినా, అరెస్టులు సాగించినా సమ్మె దారులైన కార్మికులు బెదరక తమ సమ్మెను కొనసాగించారు. నిరసన ప్రదర్శనలలో కనీసం 200మంది కార్మికులు తమ ప్రాణాలను విడిచారు. అనేకమంది గాయపడ్డారు. వేలమంది అరెస్టు చేయబడ్డారు. ఈరకంగా దేశంలో మొదటి రాజకీయ సమ్మె జరిగింది. ఇదే రకమైన రాజకీయ సమ్మెను 1908లో రావల్పిండిలోని ముస్లిం, సిక్కు కార్మికులు-ఆయుధాగారంలో పనిచేసే, రైల్వే యింజనీరింగ్ డిపార్టుమెంటులో పనిచేసే కార్మికులు సమ్మె చేశారు. ఆరకంగా ఉధృతమవుతున్న జాతీయ పోరాటాలలోకి అప్పుడే తలెత్తుతున్న పారిశ్రామిక కార్మికవర్గం ప్రత్యక్షంగా తనను తాను కలుపుకొంది. పరాయిపాలన నుండి రాజకీయ స్వాతంత్రంకోసం ఈ రకంగా బొంబాయి కార్మికుల సమ్మె రూపంలో, పారిశ్రామిక కార్మికవర్గం రణరంగంలోకి దూకింది. ఈ ఘటనయొక్క చారిత్రాత్మక ప్రాధాన్యతను లెనిన్ తన రచనలలో రాయటం జరిగింది. అంతేకాక, ఈ సమ్మె, పారిశ్రామిక కార్మికవర్గం తాను క్రుంగిపోతున్న భయంకరమైన పని, పనిపరిస్థితులపట్ల చెందిన నిరాశ, నిస్పృహలను, ఆగ్రహాన్ని వ్యక్తంచేసింది.

ఆ రకంగా నాడు కార్మికవర్గం చూపించిన ఐక్యత, సమిష్టిబలం, అసంఖ్యాకమైన త్యాగాలతో కూడిన సంఘ నిర్మాణ ఫలితంగా, నాటి దోపిడీ వలస, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సహితం పాక్షికంగా దోపిడీ నుండి నిరోధించటం జరిగింది. నాడు రోజుకు 20 గంటలపాటు పనిచేయించుకొనే కార్మికుల పనిగంటలను కుదించాలని ప్రభుత్వం నియమించిన టెక్స్‌టయిల్ ఫ్యాక్టరీ కమిటీ 1911లో తన రిపోర్టులో సిఫార్సు చేయటం, ఫ్యాక్టరీ చట్టం మగ కార్మికుడికి రోజుకు 12 గంటల పనిని పరిమితంచేస్తూ నిర్ణయించటం జరిగింది.

బాలగంగాధర తిలక్, లాలాలజపతిరాయ్, పి.ఎఫ్ ఆండ్రూస్ లాంటి జాతీయవాద నాయకులు, ఈ మిలిటెంట్ కార్మికులను ఒక అఖిలభారత కార్మిక సంస్థలోకి సంఘటితపరచడానికి ఈ సమ్మెలు దారి తీసాయి. కార్మికవర్గంచేత నాయకత్వం వహించబడి నడపబడుతున్న రష్యాలోని విప్లవంతో స్ఫూర్తిపొందిన నవ్య మానవతావాద జాతీయవాద నాయకులు 1920లో ఎ.ఐ.టి.యు.సి ఏర్పాటుకు పూనుకొన్నారు. సామ్రాజ్యవాద బూర్జువావర్గం అంతర్జాతీయ కార్మిక సంస్థను ఏవిధంగా ఏర్పాటుచేయక తప్పలేదో, అదే రకంగా వీరు (జాతీయవాద నాయకులు) ఎ.ఐ.టి.యు.సి.ని ఏర్పాటు చేయకతప్పలేదు.

ఎ.ఐ.టి.యు.సి.యొక్క మొట్టమొదటి ప్రణాళికలో ఈ విధంగా కార్మికులకు పిలుపు నివ్వటం జరిగింది. "భారత దేశ కార్మికులారా! మీరు చేయాల్సిందల్లా ఒకే ఒకపని. మీయొక్క ఐక్యతను సాధించటం. మీ యొక్క సంఘ నిర్మాణాలను ధృడపరచుకోవాలి. మీ విముక్తి కోసం ఫ్యాక్టరీ చట్టాల వైపుకు చూడకండి! చట్టం మీకు ఐక్యతను ప్రసాదించదు. చట్టం మీలో సోదరత్వ భావాన్ని రేకెత్తించదు. సోదరత్వ భావమన్నది మీకుగా మీరే మీ పనివల్ల సృష్టించుకోవాలి. కార్మికుడ్ని నాశనం చేయాలన్నదే ఫ్యాక్టరీలలోనూ, క్షేత్రాలలోనూ పెట్టుబడిదారులిస్తున్న నినాదం. ఐక్యత, మానవులమధ్య సోదరత్వం అన్నదే మీ నినాదాలు కావాలి. మీయొక్క విముక్తి మీ సంఘాల/సంస్థల బలంలోనే వుంది. మీలో వున్న బలహీనతన్నింటినీ వదిలించుకోండి. మీరు తప్పనిసరిగా స్వాతంత్ర్యం, అధికారం పొందే దారిలో పయనిస్తారు."

నాటి జాతీయోద్యమ నాయకత్వం కేవలం డొమీనియన్ ప్రతిపత్తి (దేశ స్వపరిపాలనా హక్కును కలిగివుండి బ్రిటీష్ సార్వభౌమాధికారం క్రిందనే వుండే అధినివేశ ప్రతిపత్తి)ని దాటి ముందుకు పోవటానికి విముఖంగా వున్న పరిస్థితుల్లో, కార్మికవర్గమే బ్రిటీష్ పరిపాలననుండి సంపూర్ణ స్వాతంత్రం పొందాల్సిన అవసరం ఉందనే వైఖరిని తీసుకొందన్న విషయం ఈ సందర్భంగా గమనార్హమైన విషయం. ఆవిర్భావపు దినాన్నుండీ ఎ.ఐ.టి.యు.సి. భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలనీ, స్వతంత్ర భారతదేశం సోషలిస్టు ప్రజాస్వామ్య దేశంగా వుండాలనే వైఖరి చేపట్టింది. సైమన్ కమీషన్‌కు వ్యతిరేక ఉద్యమాన్ని ఎ.ఐ.టి.యు.సి. నిర్వహించింది. ఈ నేపధ్యంలోనే కార్మికవర్గాన్ని వాస్తవ బానిసత్వంలో బంధించటానికి ఉద్దేశింపబడిన పారిశ్రామిక భద్రతా బిల్లును జాతీయ ఎసెంబ్లీలో చర్చించే సందర్భంగా, చెవిటివారిని వినేటట్టు చేయటంకోసం భగత్‌సింగ్ బాంబువేయటం జరిగిందన్న విషయం మనం గుర్తుంచుకోవాలి. జాతీయ నాయకులైన జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోసు తదితరులను ప్రజాస్వామిక సోషలిస్టు వైఖరిని తీసుకోవటానికి ప్రేరిపించినది ఈ కాలంలోని కార్మికవర్గ ఉద్యమమేనన్నది సత్యదూరమైన విషయంకాదు.

ప్రథమ ప్రపంచ సంగ్రామం అనంతరం, యుద్ధ కాలంలో పడిపోయిన వాస్తవ వేతనాలను పునరుద్ధరించుకోవటంకోసం కార్మికవర్గం మిలిటెంటు పోరాటాలను జరిపింది. 1920-30 దశకాలలోని మిలిటెంటు కార్మికసంఘ ఉద్యమం ప్రజాస్వామ్య సోషలిజం వైపుకు రాజకీయాలను ప్రేరేపిస్తే, అధికార మార్పిడీ (స్వాతంత్ర మనబడే) జరగటంకోసం, కార్మిక సంఘ మిలిటెన్సీని చూసి భయపడ్డ జాతీయ బూర్జువా నాయకత్వం తొందర తొందరగా అటు బ్రిటీష్ బూర్జువా వర్గంతోనూ యిటు దేశంలోని ఫ్యూడల్ భూస్వామ్య వర్గంతోనూ ఒప్పందం చేసుకొంది.

సమ్మెల ఉధృతి పెరిగింది. ప్రజారాసుల రాజకీయ చర్యలు రోజురోజుకీ పెరిగిపోయాయి. భారత నావికాదళ ఖైదీల విచారణ సందర్భంగా దేశవ్యాపితంగా ప్రజానిరసన వెల్లువలా వ్యక్తమయింది. విద్యార్థులూ, కార్మికులూ ప్రజల ప్రదర్శనలకు ముందు పీఠీన వుండి నాయకత్వం వహించారు. ఈ సార్వత్రిక నిరసన ఉధృతిని చూసి భయపడ్డ సామ్రాజ్యవాద ప్రభువులకు భారత నావికాదళ ఖైదీలను వదలిపెట్టాల్సిన స్థితి ఏర్పడింది. కానీ ఈ నిరసన నిప్పురవ్వ దావానలంలా ఎగిసింది. ఉద్యమం నిలకడగా పతాక స్థాయికి చేరుకొంది. 1946 ఫిబ్రవరి 18న రాయల్ ఇండియన్ నేవీ ఉద్యోగులు తిరుగుబాటు జరిపి బొంబాయి, కరాచీ, కొచ్చిన్ హార్బర్లలోగల ఓడలను తమ స్వాధీనంలోకి తీసుకొన్నారు. ఈ రకంగా జరిగిన నావికా ఉద్యోగుల తిరుగుబాటు కార్మికవర్గంలోగల సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ రాజకీయ అవగాహనా పరిపక్వతను ప్రతిబింబించింది. అదే సందర్భంలో జాతీయ నాయకులు దేశ విభజన జరిగైనా సరే దేశాధికారాన్ని దక్కించుకోవాలనే ఆలోచనల్లో వున్నారు. కాంగ్రెస్, ముస్లింలీగ్, కత్తి సుత్తి చిహ్నాంగల ఎర్రజెండాలను ధరించిన నావికా ఉద్యోగుల సమ్మె పోరాట కేంద్రకమిటీ బొంబాయి ప్రజలకు, తమ పోరాటాన్ని హర్తాళ్, సార్వత్రిక సమ్మెలు జరుపటంద్వారా మద్దతు నివ్వమని విజ్ఞప్తి చేసింది. ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వాన గల బొంబాయి కార్మికులు తక్షణమే, సమిష్టిగా స్పందించారు. బొంబాయిలోగల 3 రైల్వే వర్కుషాపులూ, అన్ని యితర చిన్నా, పెద్ద ఫ్యాక్టరీలు వెంటనే సమ్మెలోకి దిగాయి. 3 లక్షలమందికి పైగా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ వివాదంలో జోక్యం కల్గించుకొని 250 మందిని కాల్చిచంపిన దుర్మార్గపు మిలటరీ చర్యకు భయపడకుండా కార్మికవర్గం ధృడంగా నిలబడింది. ఈ సమ్మెకు మద్దతుగా ఫిబ్రవరి 23న కలకత్తాలోని రైల్వే పారిశ్రామిక కార్మికుల సంఘీభావ సమ్మెను జరిపారు. ఈ రకంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భారత కార్మికవర్గం ధృడంగా పాల్గొంది.

1946 జూలై 11న పోస్టు అండ్ టెలిగ్రాఫ్ వర్కర్స్ దేశవ్యాపిత సమ్మె జరిపారు. వీరికి మద్దతుగా జూలై 29న కార్మికులు దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను జరిపారు. అదేరకంగా ఆ సంవత్సరంలో దక్షిణ రైల్వే కార్మికులు బ్రహ్మాండమయిన సమ్మెను జరిపారు. ఆ సంవత్సరం దేశంలోని కార్మికులు మేడే ఉత్సవాలను, దేశ వ్యాపితంగా భారీఎత్తున జరిపారు. ఈ రకంగా భారత కార్మికవర్గం స్వాతంత్ర్యం కొరకు జరుగుతున్న జాతీయ పోరాటాన్ని శిఖరాగ్ర స్థాయికి తీసుకుపోవాలన్న తన ధృడ నిశ్చయాన్ని ప్రకటించింది.

దాంతో బ్రిటీష్ పాలకులకు, భారత బడాబూర్జువా వర్గంతో ఒక ఒప్పందం కుదుర్చుకొని, ఆ మేరకు అధికార మార్పిడీ చేయటం తప్ప మరో ప్రత్యామ్నాయం కనబడలేదు.

1946 జూలై 18న బ్రిటన్‌లోని హౌస్ ఆఫ్ కామన్సులో మాట్లాడుతూ భారత నాయకులతో చర్చలు జరిపిన బ్రిటీష్ క్యాబినెట్ మిషన్‌లో సభ్యుడైన ఎ.వి. అలెగ్జాండర్ యిలా చెప్పాడు. "...అధికార మార్పిడి జరగటానికి ముందు జరిగిన ఘటనలను గురించి తెల్సిన వారెవరికైనా బ్రిటీష్ బూర్జువావర్గం, తన చేతిలోని ప్రభుత్వాధికారపు పగ్గాలను భారత బూర్జువా వర్గానికి అప్పజెప్పి, భారత దేశాన్నుండి వదలి పెట్టాలనే నిర్ణయం చేసుకోవటంలో, భారత కార్మికవర్గం ఒక నిశ్చయాత్మకమైన పాత్రను పోషించిందన్న విషయం అర్థమవుతుంది.

ఈ రకంగా భారత కార్మికవర్గం యొక్క ఐక్య, సంఘటిత, మిలిటెంట్ పోరాటాలే బ్రిటీష్ సామ్రాజ్యవాదులను దేశం వదలి వెళ్లిపోవటానికి కారకమయ్యాయి.

అయితే అధికారమార్పిడి (15, ఆగస్టు, 1947) అనంతరం, భారత దేశపాలక వర్గం అయిన బూర్జువా వర్గం భారత కార్మికవర్గంపై చట్టపరంగానూ, నిర్మాణ పరంగానూ దాడిని ప్రారంభించింది. ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ (ఐ.ఎన్.టి.యు.సి.)ని ఏర్పాటుచేసి, ఐక్యంగా వున్న మిలిటెంటు ఎ.ఐ.టి.యు.సి.ని చీల్చింది.

1947 పారిశ్రామిక వివాదాల చట్టాన్ని తీసుకువచ్చి, పారిశ్రామిక కార్మిక చర్యలు (పోరాటాలను) పారిశ్రామిక వివాదాలను కోర్టులకు బందీచేసి, ఉమ్మడి బేరసారాలు ఆడే హక్కును కార్మికవర్గం చేతుల్లో లేకుండా కోర్టులకు బంధించి వేసింది. సమిష్టి బేరసారాల స్థానంలోకి న్యాయస్థానాలు మధ్య వర్తిత్వం నెరిపే విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. కార్మికులను సంఘటితపరిచి పోరాడవల్సిన అవసరాన్ని నిష్ఫలంగాచేసి, తొత్తులుగామారే వ్యవహరించే కార్మికసంఘ వ్యవస్థను ఒకవైపూ, కార్మికసంఘ నిరంకుశ నాయకత్వాన్ని మరోవైపూ ప్రోత్సహించటం జరిగింది.

భారత బూర్జువావర్గం చేసిన 1947 పారిశ్రామిక వివాదాలచట్టం ప్రచ్ఛన్న రూపంలో పనిచేసి కార్మికవర్గానికి ఎనలేని హాని కలిగించింది. కోర్టులు మధ్యవర్తిత్వ తీర్పులు అంగీకరించటాన్ని తమని సరిచేయటం ద్వారా ఈ చట్టం, కార్మికవర్గంలో పుట్టుకొస్తున్న వర్గచైతన్యాన్ని అడ్డుకొంది. వర్గచైతన్యపూరిత కార్మికసంఘతత్వం పోరాటానికి బదులు,

(తరువాయి 3వ పేజీలో)

(3వ పేజీ తరువాయి)

[illegible] వాణిజ్య కార్మిక సంఘతత్వాన్ని వృద్ధిపరిచింది [illegible] సంఘీభావతత్వంకల వర్గ రాజకీయ కార్మిక ఉద్యమం మనదేశంలో అభివృద్ధి చెందలేకపోయింది డిఫెన్సు ఆఫ్ ఇండియా రూల్‌లోని 81కి అనుగుణంగా చేయబడ్డ ఈ పారిశ్రామిక వివాదాల చట్టం 1947 ఈ రకంగా కార్మికవర్గాన్ని, కార్మిక సంఘ ఉద్యమాన్ని నిర్వీర్యం చేయుటంలో ప్రముఖమైన పాత్రను నిర్వహించింది.

ఈరకంగా "స్వతంత్ర" భారతదేశంలోని కార్మిక వర్గాన్ని చీల్చటానికి భారత పాలకవర్గాలకు సర్దార్ పటేల్, జి.ఎల్.నందా, 'అభ్యుదయ' నాయకుడైన జవహర్లాల్ నెహ్రూలు అమితంగా తోడ్పడ్డారు. మార్కెట్టు పోటీ తత్వాన్ని ప్రవేశపెట్టడం ద్వారా కార్మికవర్గంలో చీలికలకు అవకాశాలను చొప్పించారు.

తర్వాతి కాలంలో వివిధ పాలకవర్గ రాజకీయ పార్టీలు తమ అనుబంధ కార్మికసంఘాలను ఏర్పాటుచేసి కార్మికోద్యమాన్ని మరింతగా చీల్చాయి. దీనికితోడు భారత కమ్యూనిస్టుపార్టీలోని చీలికలవలన కార్మిక సంఘాలలో కూడా చీలికలు ఏర్పడ్డాయి. ఇదికాక అనేక స్వతంత్ర యూనియన్లు ఏర్పాటు చేయబడ్డాయి. అనేక యాజమాన్యాలు తమ స్వయం నిర్వహణలోని యూనియన్లు ఏర్పాటుచేయటం జరిగింది. ఈ రకంగా అధికారమార్పిడి జరిగిన మరుక్షణాన్నే భారత బడా బూర్జువావర్గం, కార్మికవర్గపు ధృఢ ఐక్యతను భగ్నంచేస్తూ, చీలికలను తీసుకురావటం ద్వారా, చట్టాలను చేయటంద్వారా కార్మికవర్గంలో పుట్టుకొస్తున్న వర్గ చైతన్యాన్ని కట్టడి చేయకలిగాయి. నేడు రాజకీయ వర్గ చైతన్యంతో కూడిన నాయకులు కార్మికసంఘాల్లో పనిచేయటం అన్నది దుస్సాధ్యమయిన విషయంగా మారింది.

యూనియన్ గుర్తింపు ఎన్నికల మూల సూత్రాల పుట్టుక-ఉద్దేశ్యాలు:

గ్రేట్ బ్రిటన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలకు గుర్తింపు యివ్వటానికి కొన్ని సూత్రాలు నిర్ణయించటం జరిగింది. ఇదే ప్రకారం భారతదేశంలోని ప్రభుత్వోద్యోగుల సంఘాలకు గుర్తింపు సమస్య చర్చకు వచ్చింది.

19[illegible]లో ఇండియన్ [illegible] అసోసియేషన్ ఏర్పాటుతో ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలకు గుర్తింపు మంజూరుచేసే విషయం భారత ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

కాని 1919లో భారత దేశంలోని సైనిక సామాగ్రిని తయారుచేసే ఫ్యాక్టరీలలోని ఫోర్‌మెన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు సమస్య ప్రభుత్వ పరిశీలనకు రావటంతో, గుర్తింపు నివ్వటానికి ప్రభుత్వం కొన్ని షరతులను విధించింది. దానితోపాటు ప్రైవేటు యజమానులు ఏ ప్రాతిపదికపై ఆధారపడి ఉద్యోగ సంఘాలకు గుర్తింపు యివ్వటానికి వారు అంగీకరిస్తారో తెల్సుకుని, వాటిపై ఆధారపడి ప్రభుత్వం 1921 అక్టోబరు 13న కొన్ని సూత్రాలను (గుర్తింపుకోసం) ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు, తమ ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన అదనపు నిబంధనలను అమలుజరపవచ్చునని అనుమతి యిచ్చింది.

అయితే యూనియన్లను గుర్తించటానికి ప్రత్యేకమయిన చట్టం ఏదీ చేయబడలేదు. ఈ ఎన్నికలు ప్రత్యక్ష రహస్య బ్యాలెట్ ఎన్నికల ద్వారా జరగాలా? లేక పరోక్ష పద్ధతిలో జరగాలా? అన్న విషయంలో కూడా ఏ విధమైన చట్టం తీసుకురాబడలేదు.

ఒక్క మహారాష్ట్రలోనే, బొంబాయి పారిశ్రామిక సంబంధాల చట్టం-మహారాష్ట్ర కార్మిక సంఘాల గుర్తింపుచట్టం అన్నది చేయబడింది. ఈ చట్టం సూత్రబద్ధంగా ఒక పరిశ్రమలో, ఒకే యూనియన్ అన్న దాన్ని అంగీకరిస్తూ, మెజార్టీ యూనియన్‌కు గుర్తింపు యివ్వటాన్ని అనుమతిస్తుంది. అయితే ఈ చట్టం కేవలం టెక్స్‌టయిల్సు పరిశ్రమకే వర్తిస్తుంది.

గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు కూడా యిదే రకమయిన టెక్సటయిల్సు పరిశ్రమతోబాటు, మరో 7 పరిశ్రమలకు వర్తించే గుర్తింపు ఎన్నికల చట్టాన్ని చేశాయి.

మిలిటెంటు పోరాటాలు నిర్వహించిన కమ్యూనిస్టు సంఘమైన ఎ.ఐ.టి.యు.సి.ని, కార్మికుల ప్రతినిధిగా నాయకత్వ స్థానంలోకి రాకుండా నిరోధించడానికి వలస ప్రభుత్వం నాడు బొంబాయి పారిశ్రామిక సంబంధాల చట్టంచేసి వాడుకొంది.

అధికారమార్పిడి జరిగిన అనంతరం 1981లో బొంబాయి టెక్సటయిల్సులో దీర్ఘకాలిక సమ్మెను(పూర్తిగా) నిర్వహించిన దత్తా సామంత్ యూనియన్ ఎం.జి.కె.యు.కు గుర్తింపులేదు. సమ్మెను వ్యతిరేకించినా, కార్మికులు నామమాత్రపు పలుకుబడి కూడాలేని సమ్మెను నివారించలేని ఆర్.ఎం.ఎం.ఎస్‌కు గుర్తింపు యివ్వటం జరిగింది.

[illegible] నందా అధ్యక్షతన నిర్వహింపబడిన [illegible] (ఇండియన్ లేబర్ కాన్ఫరెన్సు), కార్మిక సంఘాల సభ్యత్వాన్ని వెరిఫై (పరిశీలించాలని) నిర్ణయించటం జరిగింది. ఈ వెరిఫికేషన్ ఏవిధంగా జరపాలనే మార్గదర్శక సూత్రాలు నిర్వహించే కేంద్ర ప్రభుత్వ చట్టమేమీలేదు. ఈ వెరిఫికేషన్ నాల్గు రకాలుగా జరపాలని నిర్ణయించారు. అవి: 1) సాధారణ వెరిఫికేషన్ 2) కోడ్ ఆఫ్ డిసిప్లిన్ క్రింద వెరిఫికేషన్ 3) బ్యాంకులలో చట్టపరమైన వెరిఫికేషన్ 4) పోర్టు ట్రస్టు-డాక్‌లేబర్ బోర్డుల్లో తాత్కాలికంగా వెరిఫికేషన్.

ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రంలో పరిపాలనాపరమైన ఏర్పాట్ల ద్వారా సీక్రెట్ బ్యాలట్ తరపున గుర్తింపు ఎన్నికలు జరుపబడుతున్నాయి.

వివిధ జాతీయ, అంతర్జాతీయ వేదికల మహాసభ ల్లోనూ, కమిటీల్లోనూ, కౌన్సిళ్ళలోనూ, వేజ్‌బోర్డు తదితరముల్లో ప్రాతినిధ్యం యివ్వటంకోసం ఈ యూనియన్ గుర్తింపు ప్రక్రియ జరపాలన్నది ప్రభుత్వ వర్గాలు యిందుకు చెప్తున్న కారణం.

నాడు మిలిటెంటు పోరాటాలను సాగిస్తున్న (1920-24 మధ్యకాలంలో) భారత కార్మిక వర్గానికి కళ్ళెంవేసి, కార్మిక సంఘాలను నియంత్రించటంకోసం 1927 కార్మిక సంఘ చట్టాన్ని బ్రిటీష్ పాలకులు చేస్తే,

1947 పారిశ్రామిక వివాదాల చట్టం ద్వారా భారత కార్మికోద్యమాన్ని మిలిటెంటు పోరాట పంధానుండి ప్రక్కకు మళ్ళించి, కార్మికవర్గంలో వర్గ చైతన్యం పెరగకుండా నిరోధించేందుకు భారత పాలకులు పూనుకొన్నారు.

ఐ.ఎన్.టి.యు.సి. పోరాటంతో భారత కార్మికోద్యమంలో తీసుకొచ్చిన చీలికతో తృప్తి పడని భారత పాలకులు, మరిన్ని చీలికలను ప్రోత్సహించి కార్మిక వర్గంలో "ఐక్యత-దాని ప్రాధాన్యత" అన్న భావాన్ని ధ్వంసం చేయటంద్వారా, శాశ్వతంగా కార్మికులను చీల్చివుంచటంకోసం జి.ఎల్.నందా ఎంతో కుయుక్తితో ఈ అస్పష్ట యూనియన్ గుర్తింపు విధానాన్ని చొప్పించటం జరిగింది. అంతేకాక ఎంతో చాకచక్యంగా గుర్తించబడిన యూనియన్‌కు ఆఫీసు ఆవరణలో సమావేశాలు ఏర్పాటు చేసుకొనే సౌకర్యంతోపాటు, గుర్తించబడ్డ యూనియన్ నాయకులకు ప్రత్యేక శలవులు మంజూరు చేయటం. ఉద్యోగులనుండి యూనియన్ చందాలు వసూలు చేయటంవంటి సౌకర్యాలను ఎరచూపి, వారిని యజమాన్యాలు మచ్చిక చేసుకోవటానికి బాటవేయబడ్డాయి విచిత్రమేమిటంటే గుర్తింపు పొందిన నాయకత్వంతోనే విధిగా యాజమాన్యాలు కార్మిక వివాదాలను పరిష్కరించుకోవాలనే నిబంధన మాత్రం ఎక్కడా చట్టబద్ధంగా చేయబడలేదు. పోగా యిందువలన యజమాన్యాలు ఒక యూనియన్‌ను మరో యూనియన్‌కు పోటీ పెట్టి వివాదాలు పరిష్కరించకుండా జాప్యం చేయటానికి ఈ విధానం తోడ్పడుతుంది.

ఈ గుర్తింపు పద్ధతి అన్నది ఏ పేరిట పిలవబడుతున్నా, కార్మిక సంఘాలను అదుపు చేయటానికి రాజ్యం (పాలకవర్గాలు-పాలకులు) వాడుతున్న పనిముట్టుగా వివిధ దేశాలలోని అనుభవం ద్వారా అర్థమవుతోంది.

నేడు మన పాలకులూ-పాలకవర్గాలూ తమకు ఆదర్శ రాజ్యంగా ఎన్నుకొన్న అమెరికాలో ఈ గుర్తింపు ఎన్నికలనేవి, ప్రతిభావంతమైన-దృఢమైన-మిలిటెంట్లు యూనియన్లు ఏర్పడకుండా వాడబడుతున్న సాధనంగా అనుభవంలో రుజువైంది. మెక్సికోలో అయితే ఈ గుర్తింపు పద్ధతిని ప్రభుత్వ అనుకూల తొత్తు యూనియన్లను కార్మికులకు ప్రాతినిధ్యం వహించేటట్టు చేసేందుకూ, మిలిటెంటు యూనియన్లను నివారించటానికీ వాడబడుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో అనుభవాలు:

ఆర్టీసీలో గత 20 సంవత్సరాలకాలంగా ఈ యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో రెండే రెండు యూనియన్లు-ఎన్.ఎం.యు, ఎంప్లాయీస్ యూనియన్లు-గుర్తింపును (ఒకసారి ఒకరు, మరోసారి మరొకరు) పొందుతూ వున్నాయి. అలా గుర్తింపు పొందిన యూనియన్ తన గుర్తింపు కాలంలో, యాజమాన్యంతో పోరాడి సాధించిన ప్రత్యేక సౌకర్యం అన్నదేమీ లేదు. పోగా గతంలో ఒక మహత్తర కార్మికోద్యమం నిర్వహింపబడిన ఆర్టీసీలో నేడు కార్మికోద్యమం పూర్తిగా నిర్వీర్యం చేయబడింది. గతంలో సాధించుకొన్న హక్కులు క్రమంగా హరింపబడ్డాయి. ఆర్టీసిలో ప్రవేటీకరణ చాపక్రింద నీరులా చుట్టుముట్టింది. డిపోలు మూతబడ్డాయి. కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింపబడింది. కార్మికులపై పనిభారం అధికాధికంగా పెంచబడింది. అప్రకటితంగా పనిగంటలు పెంచబడ్డాయి. కాంట్రాక్టు నియామకాలు (డ్రైవర్లు, కండక్టర్లు) పెరిగిపోయాయి. కార్మికులపై పని ఒత్తిడి, వేధింపులూ దుర్భరస్థాయికి పెరిగిపోయాయి. ఇంట్లో మనిషి చచ్చిపోయినా ఒకరోజు శెలవు దొరకడం దుర్లభమయింది. చీటికీ, మాటికీ సస్పెన్షన్లకు గురిచేయటం, సస్పెన్షన్ లిఫ్టుచేయాలంటే అధికారులకు ముడుపులు తప్పనిసరిగా చెల్లించాల్సిరావటం (గుర్తింపు యూనియన్ నాయకుల అంగీకార, ప్రోత్సాహాలతోనే) విధాయకంగా మారిపోయింది. తగు మెరుగైన వైద్య సౌకర్యం కల్పించబడకపోయినా సిక్ సర్టిఫికేట్లు, ఫిట్‌నెస్, అన్‌ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు (నిజంగా అనారోగ్యంగా-ప్రాణాంతక రోగంతో బాధపడుతున్నా సరే) పొందాలంటే విధిగా వైద్యశాఖాధికారులకు భారీఎత్తు మొత్తాల్లో ముడుపులు చెల్లించాల్సిన స్థితి ఏర్పడింది. ఒక రోజు శెలవుకోసమైనా పైఅధికారులను పాదార్థికంగా సంతోషపెట్టాల్సిన స్థితి ఏర్పడింది. నెలంతా కష్టపడి జీతాలకోసం బ్యాంకుల దగ్గరకు చేరి, బ్యాంకు ఉద్యోగుల దయా దాక్షిణ్యాలకు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనేకమయిన పనులు అవుట్‌సోర్సింగ్‌కు యివ్వబడుతున్నాయి. అనేకమయిన ఉద్యోగాలు కాంట్రాక్టుకు యివ్వటం జరిగింది. సంక్షేమ సౌకర్యాలు పూర్తిగా రద్దుచేయబడ్డాయి. రిక్రియేషన్ సౌకర్యాలు రద్దుచేయబడ్డాయి. అసలటువంటి సౌకర్యం ఒకప్పుడు ఆర్టీసీలో వున్నట్టే యిప్పటి కార్మికులకు తెలియదు. కార్మికులను అధికారులు తమ క్రిందపనిచేసే పాలేర్లకన్నా హీనంగా చూడటం అన్నది సర్వసామాన్యమైన అంశంగా మారిపోయింది. ఆర్టీసీ ఆస్తులను యాజమాన్యం యిష్టారాజ్యంగా అయినవాళ్ళకు లీజులకిస్తూ కాజేయడానికి అవకాశాలు కల్పిస్తోంది. ప్రయాణీకుల సౌకర్యాల కోసమని ఉద్దేశింపబడిన బస్‌స్టేషన్లు, ప్రయాణీకులకు నామమాత్రపు సౌకర్యాలనైనా కల్పించకపోగా, అవి ప్రైవేటు వ్యాపారస్తుల స్వంత ఆవరణలుగా మారిపోయాయి. ఇప్పుడైతే యాజమాన్యం ఆర్టీసీలో షేర్లను బహిరంగంగా మార్కెట్లో అమ్మే వ్యాపారాన్నే చేయ నిర్ణయించింది

ఈ పరిణామాలన్నింటికి మీరంటే, మీరు కారణం అని "గుర్తింపు"ను పొందుతున్న ప్రధాన యూనియన్లు రెండూ ఒకరినొకరిని నిందించుకొంటూ కాలం గడిపేస్తున్నాయి తప్ప, కార్మికులను ఐక్యపరచి, సంఘటిత పోరాటాలు నిర్వహించటానికి పూర్తి విముఖతతో వున్నాయి.

నిరంతరం గుర్తింపుపొంది, యాజమాన్యం కల్పించే సౌకర్యాలకు అనుభవించటానికే నాయకత్వాలు తహతహలాడుతూ, కార్మికుల మధ్య యూనియన్ సెంటిమెంటు, ప్రాంతీయ, కుల. మత విబేధాలను రెచ్చగొడుతూ ఒక యూనియన్ సభ్యులు, మరో యూనియన్ సభ్యులను తమ ఆగర్భ శతృవుగా భావించే స్థాయికి తీసుకొచ్చాయి. ఆరకంగా కార్మికుల మధ్య వుండాల్సిన మవులికమయిన ఐక్యత శాశ్వతంగా ధ్వంసంచేయబడింది. సభ్యులలో వర్గచైతన్యం కాదుకదా, కనీస కార్మిక సంఘచైతన్యంకూడా అలవడకుండా అడ్డుకోబడింది. కార్మిక సంఘ నిర్వహణ అనేది ఒక లాభసాటి వ్యాపార స్థాయికి కుదించబడింది. సభ్య కార్మికులు సహితం తమ సమస్య పరిష్కారాన్ని వ్యాపార ఆర్థిక దృష్టితో (లాభ నష్టాల బేరీజు) పరిగణించే స్థాయికి తీసుకురావటం జరిగింది. ఆరకంగా కార్మికోద్యమం ఈరోజున చీలిపోయి, నిరంకుశ అధికారుల చేతిలో, ప్రభుత్వపు చేతిలో బందీ చేయబడింది.

నిజాంకాలంలో, ఎన్.ఎస్.ఆర్.టి.సి.లో, వర్గ దృక్పధంతో, అత్యంత చైతన్యవంతంగా కామ్రేడ్ ఖాసింసాబ్ నాయకత్వాన నిర్మింపబడి, నిర్వహింపబడిన మహత్తర ఆర్టీసీ కార్మికోద్యమం నేడు ఈరకంగా భ్రష్టుపట్టింది. ఇందుకుగల యితర కారణాలకన్నా, ఈ గురిత్మపు ఎన్నికల రోగమే ప్రధానంగా ఆర్టీసి కార్మికోద్యమాన్ని నిర్వీర్యపరచిందనేది అనుభవంలో తేలిన విషయం.

ఇక సింగరేణి బొగ్గుగనులకొస్తే, మహత్తర పోరాట చరిత్ర కలిగిన సింగరేణి కార్మికోద్యమం, నేడు అనైక్యతతో, చీలికలు పీలికలయిపోయింది. ఈ గుర్తింపు ఎన్నికలన్నవి కార్మికులకు మెరుగైన జీవన పని పరిస్థితులను కల్పించలేక పోగా వారు గతంలో సాధించుకొన్న హక్కులను జారవిడుచుకోవటానికే దోహదపడ్డాయి. వారి ఐక్యత ధ్వంసం చేయబడింది. వారి పోరాట చైతన్యం మొద్దుబార్చబడింది. పలురూపాల్లో ఈ సంస్థలోకి ప్రైవేటీకరణ చొరబడింది. వి.ఆర్.ఎస్ పేరిట ఏటా వేలాది మంది కార్మికులు బయటికిపంపి వేయబడుతున్నారు. ప్రతి ఏటా ఉత్పత్తి లక్ష్యాలను పెంచే పేరిట యాజమాన్యం కార్మికులపై అదనపు పనిభారాన్ని పెంచేస్తోంది. ఆధునీకరణ-యాంత్రీకరణ పేరిట విదేశీ పెట్టుబడి దారుల లాభాలకనువైన యంత్రాలను ప్రవేశపెట్టడం జరుగుతోంది. భూగర్భ గనుల్లో భద్రతా చర్యలు తీసుకొనటంలో యాజమాన్యం ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యంచేస్తూ, పెనుప్రమాదాలకు కారకమయి వందలాది మంది కార్మికులను గని ప్రమాదాల్లో బలితీసుకోవటం జరుగుతోంది. బలవంతంగా కార్మికులకు బ్యాంకులద్వారా వేతనాలు చెల్లించే పద్ధతి రుద్దబడింది ప్రమాదంలో మరణించిన, తీవ్రంగా గాయపడిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగమిచ్చే సౌకర్యం రద్దుచేయబడింది. కార్మికుల నివాసాల్లో (క్వార్టర్లలో) వాడుకొనే ఉచిత విద్యుత్తుకు యిప్పుడు బిల్లులు వసూలు చేయటం మొదలైంది. అంబులెన్సు నిర్వహణతో సహా అనేక సర్వీసులు ప్రవేటీకరింపబడ్డాయి. ప్రవేటు యాజమానులకు ఎక్కువ లాభాలు చేకూర్చే, సంస్థకు ఎక్కువ నష్టాలు తెచ్చే ఓపెన్‌కాస్టు గనులు అప్పగించబడ్డాయి. బొగ్గుత్రవ్వక యంత్రాలు సహితం ప్రైవేటు యజమానులకు కాంట్రాక్టుకు యివ్వబడ్డాయి. కార్మికులపై అధికారుల వేధింపులు నానాటికీ పెరిగిపోతున్నాయి.

ఈ సమస్యలను పరిష్కరించాల్సిన గుర్తింపు యూనియన్/ప్రధాన యూనియన్ నాయకత్వాలు ఈ పరిస్థితికి నువ్వంటే, నువ్వు కారణం అంటూ ఒకరొకరు నిందించుకొంటూ కాలం గడిపేస్తున్నారు తప్ప, కార్మికులను సమస్య ప్రాతిపదికగా ఐక్యపరచి, పోరాటానికి సంసిద్ధం చేయటానికి పూనుకోవటంలేదు.

ఎన్నికల్లో నెగ్గటంకోసం కార్మికులను పలు ప్రలోభాలకు గురిచేయటంతోపాటు, వేధింపులకు గురిచేయటం, వివిధ సంఘాల కార్మికుల మధ్య విద్వేషాలను రెచ్చకొట్టడం చేస్తున్నాయి. గతకాలంలో కన్నా కూడా నేడు సింగరేణి కార్మికుల జీవన, పని పరిస్థితులు దిగజారిపోతున్నాయి.

నాడు ధృడదీక్షతో, అత్యంత ఉన్నత వర్గ చైతన్యంతో కా॥శేషగిరిరావు నిర్మించి, నడిపిన మహత్తర సింగరేణి కార్మికోద్యమం నేడు అనైక్యతతో ఛిన్నాభిన్నమై, నిష్టమయింది. ఇందుకు ప్రధాన కారణం ఈ యూనియన్ గుర్తింపు ఎన్నికలేనన్నది నిస్సందేహం.

ఇక విశాఖపట్నం స్టీలు ప్లాంటు విషయానికొస్తే, కాంట్రాక్టు కార్మికులతో సహా 25వేలమంది పనిచేసే ఈ సంస్థలో గత 10 ఏళ్ళుగా యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరుగుతూనే వున్నాయి. ఒక్కసారి ఎ.ఐ.టి.యు.సి., మరోసారి సి ఐ టి యు యూనియన్లు, ఒకేఒకసారి ఐ.ఎన్ టి.యు.సి యూనియన్ గుర్తింపును పొందాయి. వీరిలో ఎవరు గుర్తింపుపొందినా ఈ సంస్థలు ప్రైవేటీకరణ నల్లేరుమీద బండిలా సాగిపోతూనే వుంది కాంట్రాక్టు కార్మికుల నియామకం అన్నది గణనీయంగా పెరిగిపోయింది. స్టీలుప్లాంటులో 251 వాటాలను అమ్మటానికి విశాఖస్టీలు ప్లాంటు ఏకగ్రీవ తీర్మానం చేసింది. యూనియన్ ఏది నెగ్గినా ప్రభుత్వం, యాజమాన్యాలు ఖాతరు చేయకుండా వ్యవహరిస్తోంది ఇంతవరకూ అనేకసార్లు గుర్తింపు ఎన్నికలలో ఒకరితో మరొకరు తలపడిన ఎ.ఐ.టి.యు.సి, సి.ఐ టి.యు లు ప్రోగ్రెసివ్‌ఫ్రంటు పేరుతో మరో 7 యితర యూనియన్లతో ఐక్యసంఘటన కట్టి 59% ఓట్లు పొంది గుర్తింపు పొందటం జరిగింది. గుర్తింపు ఎన్నికలకోసం ఐక్య సంఘటన కట్టడానికి ఈ యూనియన్ నాయకత్వాలు పడ్డశ్రమ, సమస్యల సాధనకోసం కార్మికులను ఐక్యంగా పోరాటపథంలో నడిపించటానికి పడివుంటే, అది సత్ఫలితాలను ఇచ్చి వుండేది. కానీ ఈ "వామపక్ష" యూనియన్లు ఎన్నికల్లో నెగ్గటమే తమ లక్ష్యంగా పెట్టుకొని తదనుగుణంగా పనిచేయటంవలన స్టీలుప్లాంటు కార్మికోద్యమంలో ఐక్యత సాధింపబడలేదు. శాశ్వత ఉద్యోగులకూ, కాంట్రాక్టు ఉద్యోగులకూ మధ్యగల వ్యత్యాసభావం అలాగే కొనసాగుతోంది. తమ సమస్యల పరిష్కారంకోసం కాంట్రాక్టు కార్మికులు విడిగానే పోరాటం చేయాల్సిన స్థితిలోనే వున్నారు. ఇక్కడకూడా నేటి కార్మికుల దుస్థితికి మీరంటే, మీరే కారణం అని ఒకరినొకరు దుమ్మెత్తిపోసుకొంటూ యూనియన్ నాయకత్వాలు కాలం గడిపేస్తున్నాయి. చట్టబద్ధ యూనియన్ నిర్వహణే సాగుతోంది తప్ప, కార్మికులను వర్గచైతన్యపూరితం చేయటం అన్న అవగాహనే నాయకత్వాలలో కానరావటంలేదు. ఎన్నికల్లో గుర్తింపుపొంది యాజమాన్యాలు కల్పించే సౌకర్యాలను అనుభవించటమన్నదే నాయకుల ధ్యేయంగా వుంది.

ఈ రకంగా రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో కార్మికులుగల 3 పెద్ద పరిశ్రమల్లోనూ యూనియన్ గుర్తింపు ఎన్నికలన్నవి, కార్మికుల ప్రయోజనాలను పెంపొందించటానికీ, జీవన పని పరిస్థితులను మెరుగుపరచటానికీ ఏరకంగానూ ఉపయోగపడలేదు. పోగా ఈ ఎన్నికల పోటీ పేరిట కార్మిక సంఘాల మధ్య స్పర్ధలు పెరిగాయి. ఒకే రకమయిన పని, జీవన పని పరిస్థితుల్లో దోపిడీలకు గురవుతున్న ఒకే సంస్థ కార్మికుల మధ్య పెంపొందాల్సిన ఐక్యతాభావం బదులు, శతృత్వభావం వ్రేళ్ళూనికొని వుంది. గతంలో అనేక పోరాటాలద్వారా ఆయా సంస్థల కార్మికోద్యమం సాధించుకొన్న హక్కులు హరింపబడ్డాయి. వర్గ చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన పారిశ్రామిక కార్మికవర్గం, పోటీ

(తరువాయి 5వ పేజీలో)

సామ్రాజ్యవాదులు సృష్టించిన ఆహారం కొరతపై ప్రపంచ వ్యాపితంగా పేదల పోరాటాలు

ఆహార సంక్షోభం ప్రపంచ వ్యాపితంగా తీవ్రరూపం దాల్చింది. ఆహార ఉత్పత్తులు గణనీయంగా తగ్గిపోయాయి. 2007-08లో 42.37 కోట్ల టన్నుల బియ్యం అవసరం కాగా 42.08 కోట్ల టన్నుల బియ్యం, 61.20 కోట్ల టన్నుల గోధుమలకుగాను 60.40 కోట్ల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతాయనే అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ప్రపంచ ఆహార నిల్వలు 50 రోజులకు కూడా సరిపోవన్న వాస్తవం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రపంచ వ్యాపితంగా వీటి ధరలు మూడేళ్ళ కాలంలో 83శాతం పెరగ్గా, ఈ ఏడాదిలోనే 57శాతం పెరుగుదల నమోదు అయ్యింది.

ఆహార ఉత్పత్తుల కొరత, వాటి ధరలు విపరీతంగా పెరగటం దానికి అనుగుణంగా ఆదాయం లేకపోవటంతో సామాన్య ప్రజలు ఆహార పదార్థాలకోసం అలమటిస్తున్నారు. నిరుపేదలు పట్టెడన్నం దొరక్క వీధిపోరాటాలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పేదల ఆకలి తీర్చే విధానాలు చేపట్టని ఆయా దేశాల ప్రభుత్వాలు, పేదలపై క్రూరమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి. పాలకులు ఎంత నిర్బంధం ప్రయోగించినా ఆహార పదార్థాలకోసం పేదల పోరాటాలు ఉవ్వెత్తున లేస్తూనే వున్నాయి. ఆహారం కోసం బాహాబాహీ వీధిపోరాటాలకు సిద్ధపడుతున్నారు

కరేబియన్ దీవులకు చెందిన హైతీలో వారంరోజుల నుండి ఆహార పదార్థాలకోసం జరుగుతున్న నిరసన ప్రదర్శనలతో ప్రధాన రహదారులన్నీ అట్టుడికి పోతున్నాయి మాకు ఆహారాన్ని ఇవ్వండంటూ నినాదాల ప్లేకార్డులు ఎక్కడ చూసినా కన్పిస్తున్నాయి ఆహార సమస్యపై అధ్యక్ష భవనానికి వెళ్లటానికి ప్రయత్నించిన పేదలపై బాష్పవాయువు, లాఠీచార్జీ, రబ్బరు బుల్లెట్లతో పాలకులు అణిచివేసే ప్రయత్నం చేశారు ఈ సంఘర్షణలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

దక్షిణాఫ్రికాలో ఆహార ధాన్యాలకోసం పలు ప్రాంతాల్లో పెద్దపెట్టున ప్రదర్శనలతోపాటు, గోదాములపై దూసుకుపోతున్న ప్రజలపై విచ్చలవిడి లాఠీచార్జీ చేశారు. ఆఫ్రికా ఖండం నేడు ఆకలిఖండంగా అట్టుడికిపోయింది. నూటికి 80శాతం మందికి కడుపునిండా ఆహారం కరువే. సూడాన్‌కు పశ్చిమాన ఉన్న ధర్ఫూర్ ప్రజలు ఆహారంకోసం హింసాయుత ఉద్రిక్త వాతావరణంలో జీవిస్తున్నారు. 2004 నుండి ఆహారం లేక అలమటిస్తున్న ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారు. ప్రజల ఆహార సమస్య తీర్చలేని పాలకులు ప్రజలపై క్రూర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. అయినా ప్రజలు ప్రభుత్వ సైన్యాలతో వీధిపోరాటాలు సాగిస్తూనే ఉన్నారు. కొందరి అభ్యర్థన మేర ఐక్యరాజ్య సమితి శాంతి దళాలు వచ్చినా, ఆహారాన్ని అందిస్తేనే గ్రామాల్లోకి వారిని అనుమతిస్తామని పేర్కొన్నారు.

ఈ ఖండంలోని మరొక దేశం నైజీరియాలోని ప్రజలను కూడా ఆహార సమస్య వెన్నాడుతున్నది. దేశంలోని 12 లక్షలమంది ప్రజలకు వెంటనే ఆహారం అందించకపోతే ఆకలి చావులు సంభవిస్తాయని, పోషకాహారం లోపంవలన లక్షా 20వేల మంది చిన్న పిల్లలు మరణిస్తారని తాజాగా అక్కడి అంచనాలు వెల్లడిస్తున్నాయి. కొన్ని దేశాల్లో అరటిపండు, బంగాళ దుంప ముఖ్య ఆహారంగా ఉంది. అవి కూడా కరువై ప్రజల ఆహార సమస్య దుర్భరంగా మారింది. ఈ పంటల స్థానంలో బయోడీజిల్ పంటలు రావటమే ఇందుకు కారణం. ఫిలిప్పైన్‌లో ఆహారం దొరక్క ఆకలికి ఆగలేని ప్రజలు బియ్యం గోడౌన్లపై దాడులు చేస్తున్నారు. అక్కడ ఆహార పంటలు కాకుండా, ఇతర పంటలు వేసే వారిపై ప్రభుత్వం నిఘా పెట్టిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. తిండికోసం మనీల ప్రజలు జరిపిన పోరాటంలో అనేకమంది గాయపడటమే కాకుండా కాల్పుల్లో ఒకరు చనిపోయారు. బాంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో 2008 మార్చి 13న వేలాదిమంది జౌళి కార్మికులు చౌక డిపోలపైన, ఇతర వ్యాపార కేంద్రాలపైన దాడులుచేసి తమకు అందిన ఆహార పదార్థాలు చేతబట్టుకొని పరుగులు తీశారు. ఇది అక్కడ ఆహార సంక్షోభానికి అద్దంపడుతుంది తమ అవసరాల కన్నా కోటి టన్నుల బియ్యాన్ని అదనంగా ఉత్పత్తిచేసి ప్రపంచంలోనే పెద్ద బియ్యం ఎగుమతిదారుగా ఉన్న థాయిలాండ్ బియ్యం అమ్మకాలపై ఆంక్షలు విధించింది.

ఇంకా ఈజిప్టు, సిరియా, లెబనాన్, కామెరూన్, మొజాంబిక్, ఉజ్బెకిస్థాన్, సెనగల్, ఎమెన్, బొలీవియా, మెక్సికో, ఫాసో, టర్కీ మొదలైన దేశాల్లో ఆహారంకోసం ప్రజల ఆందోళనలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

ఈవిధంగా 37 దేశాల్లోని 100కోట్ల మంది పేదలు ఆకలి పోరాటాలు చేస్తున్నారు. ఆహారం లేక చనిపోయే దానికన్నా అందుకోసం పోరాడి చనిపోదామనే నిర్ణయానికి వస్తున్నారు.

భారతదేశంలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉత్పన్నమై ఉన్నాయి. ఆహారపంటల విస్తీర్ణం పంటల ఉత్పత్తి తగ్గుదల భయం గొలుపుతున్నది. 2001-02 సంవత్సరంలో 11.2 కోట్ల ఎకరాల్లో వరిసాగు చేయగా 9 కోట్ల 30 లక్షల టన్నుల పంట ఉత్పత్తి అయ్యింది. గోధుమ 6.40 కోట్ల ఎకరాల్లో సాగు చేయబడి 7.18 కోట్ల టన్నుల పంట ఉత్పత్తి అయ్యింది. ఇవే పంటలు 2002-03 నాటికి వరిసాగు 9.97 కోట్ల ఎకరాలకు పడిపోయి, ఉత్పత్తి 7.27 కోట్లకు తగ్గగా, గోధుమ 6.14 కోట్ల ఎకరాలకు పడిపోయి, ఉత్పత్తి 6.50 కోట్ల టన్నులకు పడిపోయింది.

1980-1997 వరకు వ్యవసాయరంగం పెరుగుదల 3.2 శాతం ఉండగా ఆ తర్వాత 1 5 శాతానికి పడిపోయింది. 1950-51లో స్థూల దేశీయ ఉత్పత్తిలో వ్యవసాయరంగం వాటా 56 శాతం ఉండగా 2006-07 నాటికి 18 శాతానికి పడిపోయింది. గత నాలుగు సంవత్సరాల్లో వ్యవసాయ కూలీల సంఖ్య 8.6 కోట్లనుండి 10.6 కోట్లకు పెరిగింది. దేశ జనాభాలో 21 కోట్ల 20 లక్షల మంది ఆకలితో అలమటిస్తున్నారు. 1980లో తలసరిన 1830 కేలరీల ఆహారం తీసుకొంటే 1998 నాటికి 16వందల కేలరీలకు పడిపోయింది ఇప్పుడు ఇది మరింతగా పడిపోయింది.

ఫుడ్ కార్పోరేషన్ ద్వారా సేకరించిన బియ్యం గోదాముల్లో ముక్కిపోతున్నాయని చెప్పి, పేదలకు యిచ్చే ప్రజా పంపిణీ ధరకన్నా తక్కువగా విదేశాలకు ఎగుమతి చేశారు పాలకులు. ఆ ధరకే దేశంలోని పేదలకు మాత్రం అందించాలా బియ్యం ఇవ్వటానికి, వారి ఆకలి తీర్చటానికి మాత్రం పాలకులు ప్రయత్నం చేయలేదు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ఆహారాన్ని అందించే బాధ్యత నుండి పాలకులు తప్పుకొనే విధానాలు చేపడుతున్నారు. గోడౌన్లను ప్రైవేటు వ్యాపారులకు అద్దెకిస్తున్నారు ఆహార ధాన్యాల సేకరణను పెద్దఎత్తున తగ్గిస్తున్నారు. విదేశాల నుండి ముఖ్యంగా అమెరికానుండి ఆహార ధాన్యాల దిగుమతి ఎక్కువ అయ్యింది. 2006లో కోటీయాభై లక్షల టన్నులు సేకరణ చేస్తానని చెప్పి, 90 లక్షల టన్నులు(60 శాతం) మాత్రమే సేకరించారు. 2007లో కూడా ప్రకటించిన లక్ష్యంలో 60 శాతంకి మించి సేకరించలేక పోయారు.

బహిరంగ మార్కెట్‌లో బియ్యం, గోధుమలు, పప్పులు, నూనెల ధరలు 150 శాతం పైగా పెరిగి సామాన్యుల ఆహార వస్తువుల కొనుగోలు గణనీయంగా పడిపోయింది. నిరుపేదలు ఆకలితో అలమటిస్తున్నారు. పాలకులే ఆహారం అందచేయాలనే ఆందోళనలు ప్రారంభమైనాయి. ఈ విధంగా భారతదేశం కూడా తీవ్రమైన ఆహార సంక్షోభంలో ఉండి పేదలు భయానకమైన పరిస్థితుల్లో ఉన్నారు.

ప్రపంచ వ్యాపితంగా ఆహార సంక్షోభం, ప్రజల ఆకలి కేకలకు సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్య వాదం, దాని కనుసన్నలలో మెలిగే ప్రపంచబ్యాంక్ కారణం. ప్రపంచీకరణ, ప్రపంచ వాణిజ్య ఒప్పందం పేరుతో మూడవ ప్రపంచ దేశాల వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెట్టి, వాటి ఆహార పంటల ఉత్పత్తిని దెబ్బతీయటం, ఆహార ధాన్యాలకోసం తనపై ఆధారపడేటట్లు చేసుకొని, ఆ దేశాలపై పట్టు సాధించటం ద్వారా తన ప్రయోజనాలను సాధించుకొనేందుకు అవసరమైన విధానాలను అమెరికా అమలు జరుపుతున్నది. ఇందుకు ప్రపంచ బ్యాంక్‌ని సాధనంగా ఉపయోగిస్తున్నది. రుణాలు కావాలంటే రైతులకు యిచ్చే సబ్సిడీలను ఎత్తివేయాలని, ఆహార పంటల ఉత్పత్తులు తగ్గించి, దిగుమతులు చేసుకోవాలని, ఆహారాన్ని అందించే బాధ్యతనుండి పాలకులు తప్పుకోవాలని ప్రపంచబ్యాంక్ వత్తిడి ప్రారంభించింది. మరొకవైపున అమెరికా, తూర్పుయూరప్ దేశాలు పెద్దఎత్తున రైతులకు సబ్సిడీలను యిస్తున్నాయి. ఒక్క సంవత్సరం 36,300 కోట్ల డాలర్లను ఈ దేశాలు సబ్సిడీగా యిస్తున్నాయి. అమెరికా, తన వ్యవసాయరంగ కార్పోరేట్ సంస్థలకు 18వేల కోట్ల డాలర్లు సబ్సిడీగా యిచ్చింది. భారతదేశం లాంటి దేశాలు నామమాత్రంగా ఇస్తున్న సబ్సిడీలు కూడా రద్దుచేయమని ప్రపంచబ్యాంక్ డిమాండ్ చేస్తున్నది.

వెనుకబడిన దేశాలు ఆహారపంటలు తగ్గించి, కూరగాయలు, పండ్లు, మొక్కజొన్న పంటలు పండించమని చేస్తున్న వత్తిడి ఫలితంగా వీటి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుంది. పండ్లు, కూరగాయల లాంటి ఆహార పదార్థాలను అభివృద్ధిచెందిన దేశాలకు ఎగుమతి చేస్తారు. తన ఇంధన అవసరాలకోసం అమెరికా జీవ ఇంధన తయారీకి మొక్కజొన్న తదితర ఆహారపంటలను వాడుతున్నది. వెనుకబడిన దేశాలను కూడా జీవ ఇంధనానికై ఆహార పంటలను వాడమనీ లేదా జట్రొపా వంటి పంటల సాగును పెంచమనీ ఆదేశిస్తున్నది.

2004-07 మధ్య కాలంలో ప్రపంచ మొక్కజొన్న ఉత్పత్తి 5.10 కోట్ల టన్నులకు పెరిగింది. ఇది ప్రజల ఆహార అవసరాలను తీర్చేందుకు వినియోగం కావటం లేదు. జీవ ఇంధనంకోసం అమెరికా 5 కోట్ల టన్నుల మొక్కజొన్నను ఉపయోగించుకొన్నది. ఈ సంవత్సరం 11.40 కోట్ల మొక్కజొన్నను ఇథనాల్ తయారీకోసం ఉపయోగించే చర్యలు చేపడుతున్నది. ఈ మొక్కజొన్నతో ఏడాది పొడవునా 82 దేశాలపై ప్రజల కడుపు నింపవచ్చు. అభివృద్ధి చెందిన దేశాల్లోని వాహనదారులకు జీవ ఇంధన సరఫరా కోసం ఉపయోగిస్తున్న పంటతో వెనుకబడిన దేశాల్లోని 200కోట్ల మంది ఆకలి తీర్చవచ్చు. అమెరికాలో పండే మొక్కజొన్న పంటలో మూడవ వంతును జీవ ఇంధనానికే ఉపయోగిస్తున్నది.

భారత దేశంలో కూడా సామ్రాజ్యవాదుల వత్తిడి ఫలితంగా ఆహారపంటల విస్తీర్ణాన్ని తగ్గించి, కూరగాయలు, పండ్లు, పూలు, మొక్కజొన్న పంటల విస్తీర్ణాన్ని పెంచింది. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల ప్రజలకు పండ్లు, కూరగాయలు లాంటి బలవర్ధక ఆహారాన్ని చౌకగా అందించటంతోపాటు మొక్కజొన్న ఎగుమతి పెద్దఎత్తున అమెరికాకు ఎగుమతి అవుతున్నది. 2017 నాటికి కోటి 20 లక్షల హెక్టార్లలో జీవ ఇంధన పంటలు పండించాలని పాలకులు లక్ష్యంగా పెట్టుకొన్నారు ఈ మేరకు ఆహార పంట సాగుభూమి మరింత తగ్గి ఆహార ధాన్యాల కొరత తీవ్రమౌతుంది.

ప్రపంచంలో ఆయిల్ సంక్షోభం ఏర్పడి, దాని ధరలు పెరగటానికి అమెరికా మరియు ఇతర సామ్రాజ్యవాద దేశాలే కారణం. ప్రపంచంపై ఆధిపత్యం కోసం వీటి మధ్య జరిగిన ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలు, ఆయుధ వ్యాపారంకోసం దేశాల మధ్య యుద్ధాలు సృష్టించటం, ఇతర దేశాల సహజ వనరులను కొల్లగొట్టటానికి ఆయా దేశాలపై దురాక్రమణ యుద్ధాలు చేయటం సామ్రాజ్యవాదుల లక్ష్యం. ఇటీవల ఇరాక్‌పై అమెరికా దాడి కూడా ఇందులో భాగమే.

మధ్య ఆసియాలోని ఆయిలు వనరులపై గుత్తాధిపత్యంకోసమే అమెరికా ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధానికి పాల్పడింది. దీనికోనవే మిగిలిన సామ్రాజ్యవాద దేశాలు ఈ యుద్ధాన్ని సమర్థించాయి. ఈ గుత్తాధిపత్యంతో బ్యారలు 40 డాలర్లనుండి నేటికి 100 డాలర్లకు ఆయిలు ధరలు పెంచివేసింది. వ్యక్తిగత రవాణా వాహనాల వినియోగంతో ఇంధనం వృథా కావటమే కాకుండా, వాతావరణ కాలుష్యమూ, భూమండల వేడిమి పెరుగుదల కారణమౌతున్నదని శాస్త్రీయంగా నిరూపించబడింది. దీనికి పరిష్కారం సామూహిక రవాణా వాహనాల వినియోగమని నిర్ధారించబడింది. అయినా వృథాగా తరిగిపోతున్న ఆయిలుకు ప్రత్యామ్నాయమంటూ జీవ ఇంధన తయారీ అంటూ సాగుభూమిని జీవ ఇంధన పంటలకు తరలిస్తున్నారు. అందువల్ల ఏర్పడిన ఆహార ధాన్యాల కొరతను ఆహారపంటల రేట్లను పెంచివేసి తమ నిలువు దోపిడీకి వాడుకుంటున్నారు.

వెనుకబడిన దేశాలను ఆహార పంటలు తగ్గించుకొని అమెరికా తదితర దేశాలనుండి చౌకగా వాటిని దిగుమతి చేసుకోమని ప్రపంచ బ్యాంకు ఆదేశిస్తూ వచ్చింది. అమెరికా- యూరప్ దేశాలు, తమ రైతులకు పెద్దఎత్తున సబ్సిడీలు యిచ్చి, ఎగుమతి సుంకాన్ని గణనీయంగా తగ్గించే ఏర్పాట్లు చేసి అంతర్జాతీయ మార్కెట్‌లో చౌకగా ఆహారవస్తువులను సరఫరా చేసింది. వెనుకబడిన దేశాల్లో ఆహార పంటల ఉత్పత్తి తగ్గి వాటి కొరత ఏర్పడగానే వీటి ధరలను పెంచాయి గత మూడేళ్ళలో అంతర్జాతీయ మార్కెట్‌లో తెల్లబియ్యం 225 శాతం పెరగగా, గోధుమ ధర 181శాతం, ఇతర ఆహార ధాన్యాల ధరలు 82 శాతం పెరిగాయి. దీన్ని పరిశీలిస్తే అమెరికా తదితర దేశాలు చౌకగా ఆహార ధాన్యాలు అందిస్తామనే దానివెనుక కుట్రదాగి ఉందనే వాస్తవం బహిర్గతం అయ్యింది.

వెనుకబడిన దేశాల వ్యవసాయరంగవు సంక్షోభానికీ, ఆహార పంటల ఉత్పత్తి పడిపోవటానికీ, వాటి ధరలు పెరగటానికీ, ఆహార సంక్షోభం ఏర్పడి, ప్రపంచ ప్రజలు ఆకలి కోరల్లో చిక్కుకొవటానికీ సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదం ప్రధాన కారణం. అందువలన ఆహార సంక్షోభంనుండి బయటపడాలంటే అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకం మూడవ ప్రపంచ దేశాల ప్రజలు ఉద్యమించాలి. తమ దేశాల్లో ప్రజల ఆహార అవసరాలను తీర్చే స్వతంత్ర వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసుకోవాలి.

- జాలయ్య

(4వ పేజీ తరువాయి)

వాణిజ్య భావజాలాన్ని అలవరచుకొంది. కార్మికవర్గానికి కీలకాంశం అయిన "ఐక్యత" ఈ ఎన్నికల రూపంలో బహుచాకచక్యంగా విధ్వంసం చేయబడింది. కార్మికులను ఐక్యపరచటంఅన్న కర్తవ్యాన్ని సంక్లిష్టపరచటం జరిగింది. ప్రభుత్వం ఈ వినాశకర యూనియన్ గుర్తింపు ఎన్నికల విధానాన్ని యితర రంగాలకు విస్తరించి కార్మికుల, ఉద్యోగుల మధ్యగల ఐక్యతను విచ్ఛిన్నంచేసే యత్నాలకు పూనుకొంటోంది.

ఈ అనుభవాలను చూసినప్పుడు, నాడు కుయుక్తితో జి.ఎల్.నందా ప్రవేశపెట్టిన ఈ యూనియన్ గుర్తింపు విధానం అన్నది కార్మికవర్గం యొక్క పునాది అయిన ఐక్యతను విచ్ఛిన్నం చేయటంలో కృతకృత్యమైందనీ, వర్గ కార్మికోద్యమ ఎదుగుదలను నివారించ గలిగిందనీ అర్థమవుతోంది.

ఈ వాస్తవాలను కార్మికవర్గం అర్థంచేసుకోవాలి! తన ఐక్యతకు యితర అన్ని అంశాలకన్నా అత్యధిక ప్రాధాన్యత నివ్వాలి!! వర్గ చైతన్యాన్ని పెంపొందించుకొనేందుకు తక్షణం పూనుకోవాలి!!! కార్మికవర్గానికి ఈ రకమయిన ప్రేరణను బయటినుండే యివ్వాల్సిందే తప్ప, యాజమాన్యాలకూ-ప్రభుత్వాలకూ మచ్చికఅయిన నిరంకుశ కార్మిక సంఘ నాయకత్వం అందించదనేది అందుకు పూనుకోదనేది రహస్యమైన విషయం ఏమీ కాదు.

సమస్యల ప్రాతిపదికగా, వర్గ అవగాహనతో కార్మికవర్గాన్ని ఐక్యపరచి, వర్గపోరాట మార్గాన్ని చేపట్టడానికి సమాయత్తంచేయటమన్నది నేటి ఆవశ్యకత కర్తవ్యంగా వుంది.

(లేబర్‌ఫైల్‌లో నవీన్‌చంద్ర రాసిన వ్యాసంలోని వివరణలు, నిర్ధారణల ఆధారంగా 'భారత కార్మికోద్యమ ఉజ్వల చరిత్ర' అన్న భాగం రాయబడింది.)

- పాణిగ్రాహి

'కార్మికవర్గ విప్లవం ద్వారా మాత్రమే అల్పసంఖ్యాకుల ధనస్వామ్య నిరంకుశ వ్యవస్థను కూలద్రోసి, సోషలిజాన్ని స్థాపించటం సాధ్యం'

సమాజాన్ని ఆయా దేశ, కాల పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిస్టు పద్ధతుల్లో విశ్లేషించి, సమాజంలో తలెత్తుతున్న వర్గ సంఘర్షణలు పసిగట్టి. వాటిని పరిష్కరించటానికి చేబట్టాల్సిన శాస్త్రీయ మార్గాన్ని సూచిస్తూ, అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో నవలా రూపంలోకి రచనలు చాలా తక్కువగానే ప్రపంచ ప్రజలకు అందుబాటులో వున్నాయి. శాస్త్రీయ ప్రాపంచిక అవగాహన పట్ల మరింత స్పష్టత ఏర్పడ్డ, పలు రకాల సామాజిక ఉద్యమాలను-వాటి అనుభవాలను-వాటి గుణపారాల సారాంశాన్ని సవివరంగా తెల్సుకోగల యిబ్బడి-ముబ్బడి అవకాశాలు గల నేటి 21వ శతాబ్దపు, అత్యాధునిక యుగంలో కూడా అటువంటి నవలలు తగినన్ని రావటం లేదు. నిజం చెప్పుకోవాలంటే అటువంటి ఆవశ్యకమయిన నవలలు బహు తక్కువ సంఖ్యలోనే వస్తున్నాయి.

కానీ నూరేళ్ళ క్రితమే యిటువంటి ఉత్తమ నవలలు కొన్ని ప్రపంచ ప్రజానీకానికి అందుబాటులోకి తేబడ్డాయి. సమాజాన్ని మార్క్సిస్టు అవగాహనతో విశ్లేషిస్తూ, తగు శాస్త్రీయ పరిష్కారాన్ని సూచించిన అటువంటి మహత్తర మైన నవలల్లో ప్రముఖ అమెరికన్ రచయిత జాక్‌లండన్ రాసిన "ఇనుప మడమ"(ఐరన్ హీల్) అనే నవల అద్వితీయమయినది ఈ నవల ప్రచురింపబడి 100 సంవత్సరాలు గడచిపోయినా, నేటికీ ఈ నవలలో అమెరికన్ సమాజ స్వభావం గురించి చేయబడ్డ విశ్లేషణలూ, సూచించబడ్డ పరిష్కారమూ మౌలికంగా సరైనవిగానే వున్నాయి. ఆ రకంగా నేటికీ అమెరికన్ కార్మిక వర్గానికి ఈ "ఇనుప మడమ" శాస్త్రీయమైన వర్గ అవగాహనను పెంపొందించుకొని, అలవర్చు కోవటానికి దోహదకారిగానే వుంటుంది

1876లో జన్మించిన జాక్‌లండన్, చితికిపోయిన కుటుంబ ఆర్థిక పరిస్థితుల వలన 13 ఏళ్ల బాల్యంలోనే న్యూస్‌పేపర్లు అమ్మటం ద్వారానూ, యిళ్ళను ఊడ్చేపని చేయించటం ద్వారానూ, యితర చిన్న చిన్న పనులు చేయటం ద్వారానూ సంపాదించి దానితో కుటుంబానికి తోడ్పాటుపడాల్సిన స్థితిలోకి నెట్టబడ్డాడు. తత్ఫలితంగా అతడు స్వయంగానే తనకు అందుబాటులో గల పుస్తకాలను చదవటం ద్వారానూ, లైబ్రరీల్లో చదువు కోవటం ద్వారానూ విద్యను అభ్యసించాడు. 15వ ఏట నుండి చేపలవేటను వృత్తిగా స్వీకరించి, రెండు ఏళ్ళ కాలం ఆ వృత్తిలో గడిపాడు. తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు మరింత ఆర్థికంగా శిక్షించటంతో, తన 17వ ఏట ఒక ఓడలో పనికి కుదురుకొని జపాన్ తీర ప్రాంతాలలో, ప్రకృతి శక్తులతో పోరాడుతూ గొప్ప అనుభవాన్ని గడించాడు. 7 నెలల కాలం అనంతరం తిరిగి వచ్చిన జాక్ లండన్ 'శాన్‌ఫ్రాన్సిస్కో-మార్నింగ్ కాల్' అనే పత్రిక నిర్వహించిన వివరణాత్మక వ్యాసాల పోటీకి 'జపాన్ తీరంలో తుఫాను' అనే అంశంపై వ్యాసం రాసి, ఆ పోటీలో బహుమతిని గెల్చుకొన్నాడు. అప్పటి నుండి పత్రికలకు వ్యాసాలు, కథనాలు రాయటం ద్వారా సంపాదించే యత్నానికి పూనుకొన్నాడు. కానీ అందువల్ల తగినంత సంపాదన లేకపోవటంతో ఆ రోజుల్లో ఉత్తర ధృవంలోని క్లొండైక్ ప్రాంతంలో బంగారు గనుల వెతుకులాటకు అనేక బృందాలు పోతుండటంతో జాక్ లండన్ కూడా బంగారపు వెతుకులాటకు, తన బావతో కలిసి క్లొండైక్ పయనమయ్యాడు. చలికి గడ్డ కట్టుకుపోయే అక్కడి వీరోచిత కృత్యాలు, అనుభవాలు జాక్ లండన్‌కు ఒక వాస్తవిక ప్రాపంచిక అవగాహన ఏర్పడ్డానికి దోహదం చేశాయి. ఏడాదికాలం తర్వాత తిరిగి శాన్‌ఫ్రాన్సిస్కోకు తిరిగి వచ్చిన జాక్‌లండన్ నవలా రచనను చేబట్టాడు. 1903లో అతడు లండన్ నగరంలోని, ఈస్టు ఎండ్ ప్రాంతంలో దుర్భర జీవితాలను గడుపుతున్న, పెట్టుబడిదారీ విధానం చేత విసర్జించబడి నైపుణ్యంలేని, అసంఘటితంగా వుంటూ కడుపునిండా తిండి లేక, వుంటానికి ఆశ్రయంలేక దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న పారిశ్రామిక కార్మికులు నివసించే "అథో ప్రపంచం లేదా అగాధంలో" జీవితాలను వెళ్ళమారుస్తున్న ప్రజలతో 6 వారాల పాటు గడిపి పారిశ్రామిక యంత్ర భూతాల దాడి వలన కోలుకోవటానికి వీలులేని దెబ్బతిని, బ్రతుకే ఒక శాపంగా మారినా కూడా మృత్యువుతో పోరాడుతూ జీవిస్తున్న ఆ దౌర్భాగ్యుల విషాదానుభవాలను తాను కూడా ప్రత్యక్షంగా అనుభవించి వారి స్థితిగతులను స్వయంగా అధ్యయనం చేసి తెలుసు కొన్నాడు. పారిశ్రామిక సుభిక్షదశలోనే, పెట్టుబడిదారీ వ్యవస్థ సుభిక్షంగానే వున్న 1903లోనే ఆ కార్మికుల దౌర్భాగ్య స్థితి ఆ రకంగా వుంటే, సంక్షోభ కాలంలో వారు మరెంతటి దుస్థితికి నెట్టబడతారో? అన్న విషయాన్ని అవగాహన చేసుకోవటానికి "అథో జగత్తు"లో అతడు చేసిన ఈ విహారం ఎంతగానో తోడ్పడింది.

ఎంగెల్సు రాసిన "ఇంగ్లండులో కార్మికవర్గ స్థితిగతులు" అన్న పుస్తకం ఇంగ్లీషులోకి తర్జుమా చేయబడిన అనంతరం 1885లో అమెరికాలో ప్రచురింప బడింది. ఆ పుస్తకానికి ముందుమాటగా ఎంగెల్సు "అమెరికాలోని కార్మికోద్యమం" అన్న అంశం గురించి రాసారు. ఆ పుస్తకం తక్షణం అమ్ముడైపోయింది. కానీ 1885 ఫిబ్రవరిలో వ్యక్తం కాబడ్డ ఏకగ్రీవ అమెరికన్ ప్రజాభిప్రాయం ఏమిటంటే "అమెరికాలో యూరోపియన్ అర్థంలో వున్న కార్మికవర్గమన్నదే లేదు. తత్పర్యవసానంగా అమెరికాలో పెట్టుబడిదారులకూ, కార్మికులకూ మధ్య వర్గపోరాటం అన్న పేరిట యూరోపియన్ సమాజాన్ని ముక్కముక్కలుగా చింపి పారవేసిన వర్గపోరాటం అమెరికన్ రిపబ్లిక్కులో సాధ్యంకాదు. అందువలన సోషలిజం అన్నది అమెరికాకు విదేశాలనుంచి దిగుమతి చేయబడ్డ విషయం. ఇది ఎన్నడూ అమెరికన్ భూభాగం మీద వ్రేళ్ళూనుకోదు" అన్నది.

కానీ యీ "ఏకగ్రీవ ప్రజాభిప్రాయం" వ్యక్తంకాబడ్డ ఒక సంవత్సరకాలంలోనే 1886లో 8 గంటల పనిదినాన్నే డిమాండుచేస్తూ, మేడే ఉద్యమ బావుటాను ఎత్తినది అమెరికన్ కార్మికవర్గమే అన్న చారిత్రిక సత్యాన్ని గమనంలోకి తీసుకుంటే, "1845లో ఇంగ్లండులోని కార్మికవర్గం ఎటువంటి దుస్థితిలో మ్రగ్గుతోందో, 1885లో అమెరికాలోని కార్మికవర్గం కూడా అదే దుస్థితిలో మ్రగ్గుతోంది" అని ఎంగెల్సు చేసిన నిర్ధారణ ఎంతగా సరిఅయినదో, ఎంతటి ఖచ్చితమయినదో విశదమవుతోంది

యూరోపియన్ దేశాల్లో అయితే తనను తాను ఈ ఆధునిక సమాజంలో ఒక ప్రత్యేక వర్గంగా అర్థం చేసుకోవటానికీ, రూపొందటానికీ వివిధ సెక్షన్ల పాలకవర్గాలతో ఏర్పాటు చేయబడ్డ రాజకీయ పార్టీల నుండి స్వతంత్రంగా ఒక పార్టీని ఏర్పాటు చేసుకోవటానికి కార్మికవర్గానికి చాలా ఏళ్ళు పట్టింది. ఇందుకు కారణం మధ్య యుగాల నాటి శిథిలాలు, కార్మికవర్గం స్వతంత్ర శక్తిగా అవతరించటానికి అవరోధంగా వుంది. కానీ అదే అమెరికాలో అయితే, అటువంటి మధ్యయుగపు శిథిలాల ప్రతిబంధకం లేకుండాపోవటంతో, 17వ శతాబ్దంలోని ఆధునిక బూర్జువా సమాజానికి చెందిన శక్తులతో పుటుకు రావటంతో, అక్కడి కార్మికవర్గానికి, ఒక వర్గశక్తిగా అభివృద్ధి పొందటానికి అతి తక్కువ కాలం పట్టింది.

ఈ పరిణామాలన్నింటినీ సరైన మార్క్సిస్టు పరిశీలనతో, అమెరికన్ సమాజం యొక్క పరిణామాన్ని జాక్‌లండన్ సక్రమంగానే అవగాహన చేసుకోవటం జరిగింది. ప్రత్యేకించి అమెరికన్ పెట్టుబడిదారీ విధానం క్రమానుగతంగా ముదిరి సామ్రాజ్యవాదంగా పరిణామం చెందిన క్రమాన్ని, పెట్టుబడిదారీ విధానపు నిర్దిష్ట లక్షణాలనూ, పెట్టుబడిదారీ విధానం మొత్తం సమాజాన్ని, సమాజంలోని యితర వర్గాలన్నింటినీ, సామాజిక వ్యవస్థనూ, పాలనా వ్యవస్థనూ సాంస్కృతిక-నైతిక-విద్యా-న్యాయ వ్యవస్థలనూ తన గుప్పిట్లో పెట్టుకొని నయానా, భయానా ఎలా నియంత్రించగలుగుతుందో, ప్రపంచ మార్కెట్టుపై అధిపత్యం కోసం పెట్టుబడిదారీ దేశాలు యుద్ధాలను ఎలా సృష్టిస్తాయో, పెట్టుబడిదారీ విధానం ప్రజాస్వామ్యం అన్న భావనను ఏ రకంగా అభాసుపాలు చేస్తుందో, ప్రజాస్వామ్యపు ముసుగులో ఎలా నిరంకుశ పాలనను సాగిస్తుందో, ఓట్లు, పార్లమెంటరీ పాలన అన్న వాటిని ఎంతగా భ్రష్టు పట్టిస్తుందో, వాటిని ఎంతటి బూటక సంస్థలుగా కుదించి వేస్తుందో? ప్రజాస్వామ్య మూలస్థంభాలలో ఒకటిగా నేటికీ సగర్వంగా చెప్పబడే పత్రికా వ్యవస్థ ఏ రకంగా ప్రజాస్వామ్యాన్ని హరించటానికి పెట్టుబడిదారీ విధాన సాధనంగా వినియోగింపబడుతుందో, కార్మికవర్గాన్ని, కార్మిక నాయకత్వాలను పెట్టుబడిదారీ వర్గం ఏ రకంగా లోబరుచుకొంటోందో, అందుకు ఎటువంటి మాయోపాయాలనూ, కుదరకపోతే నిర్బంధాన్ని ప్రయోగిస్తుందో పెట్టుబడిదారీ నిరంకుశవర్గం సృష్టించిన విధిలేని పరిస్థితుల్లో, కార్మికవర్గానికి వర్గపోరాటం చేపట్టి, రక్తపాత విప్లవం ద్వారా, పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చివేసి, సోషలిస్టు సమాజాన్ని స్థాపించటం అన్నటి ఎంతటి అనివార్య కర్తవ్యమో అన్న విషయాలను జాక్‌లండన్ నూరు సంవత్సరాల క్రితమే మార్క్సిజం-లెనినిజం ఇంకా అభివృద్ధి చెందుతున్న రోజుల్లోనే అర్థం చేసుకొన్నాడు అని చెప్పటానికి ఈ "ఇనుప మడమ" నవల తిరుగులేని తార్కాణంగా మన ముందు వుంది. సామ్రాజ్యవాదం పట్లా, పెట్టుబడిదారీ విధానం పట్లా- ఆ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం వేరేదీ లేదనే అభిప్రాయం పట్లా గల (నేటికీ పెట్టుబడిదారీ విధాన సమర్థకుల) భ్రమలను, ఈ నవల సశాస్త్రీయంగా తునాతునకలు చేస్తుంది. పెట్టుబడిదారీ విధానానికీ, వ్యవస్థకూ- సోషలిజమే తిరుగులేని ప్రత్యామ్నాయం అన్న విషయాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించటమేగాక సకారణంగా మనలను ఒప్పించి తీరుతుంది.

సోవియట్ యూనియన్‌లోనూ, తదితర సోషలిస్టు దేశాల్లోనూ, సోషలిస్టు వ్యవస్థలు పతనమై, తిరిగి పెట్టుబడిదారీ వ్యవస్థలు ఏర్పడటానికి గల మూల కారణాలు, వాటి బీజాలు ఎక్కడున్నాయో గ్రహించటానికి ఈ 'ఇనుప మడమ' దోహద పడుతుంది. క్లిష్టమైన, మార్క్సిస్టు శాస్త్రాన్నీ, సైద్ధాంతిక సూక్ష్మాలను, మీమాంసలను చక్కగా పాఠకులందరికీ అర్థమయ్యే రూపంలో, కథ ద్వారా, నాటకీయత ద్వారా చెప్పగలిగిన ఘనత జాక్ లండన్‌కు ఈ 'ఇనుప మడప' నవల ద్వారా దక్కుతుంది. మాక్జిం గోర్కీ 'అమ్మ' నవల సరసన అన్ని అంశాలలో అదే స్థాయిలో వున్న నవల 'ఇనుప మడమ' అని చెప్పటం ఎంత మాత్రమూ అతిశయోక్తి కానే కాదు.

'ఇనుప మడమ' నవలలో అమెరికాలో జరిగినట్టుగా రచయిత కల్పించిన 'మొట్టమొదటి కార్మిక తిరుగుబాటు' అన్న వృత్తాంతం దానికి సంబంధించిన 1912-1932 మధ్యగల సంక్షోభ కాలానికి చెందినది. ఆరు దశాబ్దాల అనంతరం ఈ వృత్తాంతం వివరాలు బయల్పడి వెల్లడి చేయబడుతోందనే రూపంలో(ఊహాత్మకమయిన, 'మానవ సౌభ్రాతృత్వం శకం' ఏర్పడిన 419 సంవత్సరం, నవంబరు 27న ఊహాత్మక నగరమైన ఆర్డిస్ నగరం నుండి ఈ నవల ప్రచురింపబడిందనే రూపంలో) కథా గమనాన్ని రచయిత జాక్ లండన్ మన ముందుంచటం జరిగింది.

బహుశా నాడు (1908) అమెరికాలో కార్మికవర్గం పైనా, సోషలిస్టులపైనా, సోషలిస్టు భావజాల ప్రచారం పైనా వున్న తీవ్ర నిర్బంధ పరిస్థితుల వలన జాక్‌లండన్ యిటువంటి ఊహాగ్రస్త కల్పిత శకాన్ని ఎంచుకొని ఈ నవల కథాగమనాన్ని ప్రజలకు అందించటానికి ఈ రకమయిన రూపాన్ని ఎంచుకొని వుండవచ్చు!

ఈ ఊహాగ్రస్త శకం, కల్పిత పట్టణాల ప్రస్తావన వచ్చినప్పుడల్లా పాఠకుల మనస్సుల్లో ఒకింత గందర గోళం ఏర్పడే అవకాశమున్నా, కథలోని ఘటనలూ, కథా చిత్రణా, పాఠకులను కథాంశంలోకి యీడ్చుకుపోవటం అన్నది ఈ నవలా రచనలోని ఒక విశిష్టత.

కార్మికనాయకుడైన ఎర్నెస్టు ఎవర్‌హార్డ్ భార్య అయిన ఎవిస్ ఎవర్‌హార్డు రాసుకొన్న జ్ఞాపకాల రూపంలో ఈ నవల యొక్క కథా గమనం ప్రారంభమయి విపులీకరించ బడుతుంది. ఆమె తమ దేశంలో జరుగబోయే రెండవ తిరుగుబాటు అనబడే కార్మికుల తిరుగుబాటు తుఫాను అపరిపక్వమయినది కాకూడదనే ఆకాంక్ష వ్యక్తం చేయటంతో తమ కథను చెప్పటం ప్రారంభిస్తుంది.

భర్త ఎర్నెస్టు ఎవర్‌హార్డు పట్ల గల అమిత ప్రేమాభిమానాలు, గౌరవం, అతడి సామర్థ్యం పట్ల తనకుగల అచంచల విశ్వాసం వలన ఎవిస్ ఎవర్‌హార్డు తన భర్తను "తన వెలుగొందే ఆదర్శమయిన మానవ స్వేచ్ఛ కోసం, తన నిరంతర భానుడైన ఆ ఆదర్శం వైపుకు శూన్యంలో నుండి అలుపూ, సొలుపూ లేకుండా రెక్కలు గొట్టుకుంటూ పైకెగిరిన రాబందు"గా ఆమె వర్ణిస్తుంది. రాబోయే రెండో కార్మిక తిరుగుబాటుకు అతడే అంతా సర్వసన్నద్ధం చేసి, తన జీవితాన్నంతటినీ అందుకోసమే అంకితం చేసి, తన జీవితాన్ని అందుకోసమే అర్పించిన మహావ్యక్తిగా తన భర్తను గురించి ఎవిస్ ఎవర్‌హార్డు భావించుకొంటుంది.

ఈ నవలలోని కథానాయకుడు ఎర్నెస్టు ఎవర్‌హార్డు, తన భార్య భావించుకొన్నట్టుగా అంతటి అసామాన్యమైన వ్యక్తి కాకపోయినా, ఆ కాలంలో ప్రపంచమంతటా విప్లవం కోసం తమ జీవితాలను అంకితం చేసిన అనేకమంది వీరులలో యితడు ఒకడు. కార్మికవర్గ తత్వశాస్త్రానికి భాష్యం చెప్పటంలోనూ, ఆ తత్త్వశాస్త్రాన్ని విశదపరచటంలోనూ అతడు అనితరమైన విశేష కృషిని సాగించినవాడు. "కార్మికవర్గశాస్త్రం", కార్మికవర్గ తత్త్వశాస్త్రం" అనే పేరిట యితడు కార్మికవర్గ జ్ఞానాన్ని అభివృద్ధి చేశాడు.

అతడు తన నిత్య జీవితంలో ఏ విధంగా ఈ కార్మికవర్గతత్వాన్ని విశదీకరించి, ప్రచారం చేసి, కార్మిక వర్గాన్ని వర్గపోరాట పథంవైపుకు మళ్ళించే యత్నం చేశాడో, ఈ సందర్భంగా మార్క్సిస్టు విజ్ఞాన శాస్త్రాన్ని, ప్రత్యేకించి మార్క్సు ఆవిష్కరించిన అదనపు విలువ సిద్ధాంతాన్ని ఏ రకంగా అమెరికన్ సామాజిక పరిస్థితులకు అన్వయించి, గతితార్కికంగా అమెరికన్ సమాజం ఎటువంటి పరిణామానికి గురవుతుందో తేల్చి చెప్పి కొద్దిమందిచే నిర్వహింపబడే నిరంకుశ ధనస్వామ్య వ్యవస్థకు ప్రత్యామ్నాయాన్ని ఏ రకంగా చూపటం జరిగిందో అన్న వైనాన్ని ఈ కథాగమన క్రమంలో అర్థం చేసుకొందాం.

ఎవిస్ ఎవర్‌హార్డు యొక్క తండ్రి జాన్ కన్నింగ్ కాలిఫోర్నియాలోని, బర్కిలీ యూనివర్శిటీలో ఒక భౌతికశాస్త్ర ప్రొఫెసర్. అంతేకాక అతడు వివిధ పరిశోధనలు జరిపిన ప్రముఖ శాస్త్రవేత్త. అతడు భౌతిక శాస్త్ర పరిశోధనలు చేస్తూ ఆనందంగానే వుండేవాడు. భార్య మరణించటంతో అతడు ఆ ఖాళీని పూర్తి చేసుకోవటం కోసం తత్త్వశాస్త్రం వైపుకు మొగ్గాడు. అటునుంచి నెమ్మదిగా ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రాల వైపుకు తన ఆసక్తిని మరల్చాడు అతడికి న్యాయం జరగాలనీ విషయం పట్ల దృఢమైన ఆకాంక్ష వుంది జరుగుతున్న తప్పులను(సమాజంలో) సరిదిద్దాలనే, అన్యాయానికి గురైన వారికి న్యాయం చేయాలనే తపన వుంది అందువలన వివిధ సామాజిక తాత్విక అంశాలను చర్చల ద్వారా తెల్సుకొని, తగు పరిష్కారం కనుగొనేందు కోసం తన యింటిలోని భోజనశాలనే ఆయన ప్రయోగశాలగా మలచి, తాను ఎంచుకొన్న వ్యక్తులను డిన్నర్‌కి పిలిచి, అక్కడ చర్చలు నిర్వహించి ఆ చర్చల సారాంశాలనుండి, వాస్తవాలు గ్రహించే పరిశోధనా ప్రక్రియను నిర్వహిస్తున్నాడు. అందులో భాగంగానే ఒక రోజు రాత్రి తాను వ్యక్తిగతంగా పిలుచుకొనే "మత బోధకుల రాత్రి" అన్న దాన్ని నిర్వహించాడు. ఈ డిన్నర్‌కు బిషప్ మోర్‌హౌస్, డాక్టర్ హామర్ ఫీల్డు, బాలింగ్ ఫోర్డు లాంటి పండితులైన మతబోధకులు వచ్చారు. వీరితోపాటు సోషలిస్టు తత్త్వశాస్త్రంలో నాయకుడిగా అంగీకరింపబడ్డ, సోషలిస్టు పార్టీ నాయకుడూ అయిన ఎర్నెస్టు ఎవర్ హార్డును కూడా జాన్‌కన్నింగ్ హాం ఈ డిన్నర్‌కు ఆహ్వానించటం జరిగింది.

అమెరికాలో రెండువందల సంవత్సరాల కాలంగా జీవిస్తున్న ఎవర్‌హార్డుల కార్మికవర్గ కుటుంబంలో ఎర్నెస్టు ఎవర్‌హార్డు జన్మించాడు. అతడి తండ్రి ఒక ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేసేవాడు. చాలీ చాలని జీతంతో తన భార్యనూ, ఎర్నెష్టుతో పాటు అతని సోదరులనూ, అక్కా చెల్లెళ్లనూ పోషించటం కోసం అతడు అబద్ధాలు ఆడేవాడు. చిన్న చిన్న దొంగతనాలు చేసేవాడు. యంత్రాలకు బానిసగా కట్టబడి ఎంత పనిచేసినా కుటుంబానికి తిండి పెట్టలేని పరిస్థితులూ, అతడి శక్తినంతటనీ యంత్రాలే పీల్చి పిప్పి చేసి, అఖరికి అతడి ప్రాణాన్నే చిదిమి పారేస్తాయి. అందువలన ఎర్నెస్టు తన 10వ ఏటనే మిల్లులో పనికి వెళ్లాడు. తర్వాతి కాలంలో, అతడు అప్రెంటీసు చేసి గుర్రాలకు నాడాలు కొట్టే వృత్తిని నేర్చుకున్నాడు. అతడు తనకు తానే స్వయంగా విద్యను అభ్యసించాడు. జర్మన్, ఫ్రెంచి బాషలను నేర్చుకున్నాడు. ప్రస్తుతం (ఫిబ్రవరి 1912లో) తాత్విక, శాస్త్రీయ గ్రంథాలను తర్జుమా చేయటం ద్వారా సంపాదన చేస్తున్నాడు. దీనికి తోడు అతడు గతంలో రాసి, ప్రచురించిన ఆర్థికశాస్త్రీయ గ్రంథాలు అమ్మగా వచ్చే కొద్దిపాటి రాయల్టీలు కూడా అతనికి ఆదాయవనరుగా వుంది.

డిన్నర్ టేబుల్ వద్ద కూర్చొని మతాధిపతులైన మతబోధకులు కార్మికవర్గాన్ని గురించీ, కార్మికవర్గానికీ, చర్చికీ గల సంబంధం గురించీ, కార్మికవర్గానికి చర్చి

గతంలో చేసిన దాన్ని గురించీ, ప్రస్తుతం చేస్తున్న దాని గురించీ నాన్‌స్టాప్‌గా మాట్లాడుతున్నారు. వారి సంభాషణలను ఎర్నెస్టు మౌనంగా వింటూ కూర్చున్నాడు. ఈ విషయంలో ఏదైనా మాట్లాడమని జాన్ కన్నింగ్ హాం ఎర్నెస్టును కోరుతాడు. 'నే చెప్పేందుకు ఏమీ లేదు' అంటూ ఎర్నెస్టు మౌనంగా కూర్చున్నాడు. అతడి ప్రవర్తనకు విసుగు చెందిన జాన్ కన్నింగ్ హాం 'మన మధ్య కార్మికవర్గ సభ్యులున్నారు. ఆయన ప్రస్తుత పరిస్థితుల గురించి, ఆసక్తికరమైన విషయాలను మనకు నూతన దృక్కోణంలో తెలియచేస్తారు' అంటూ ప్రకటిస్తాడు. మత బోధకులు అతడ్నుంచి విషయాలు వినటానికి ఆసక్తి ప్రదర్శిస్తాడు.

"నాకు క్రైస్తవ మత సంబంధమైన వివాదాస్పద అంశాలకు చెందిన విషయాలకు సంబంధించిన మర్యాదలు ఎలా పాటించాలో తెలియదు. అందుకు మన్నించండి అంటూ సూటిగా తన వాదన విన్పించటాన్ని మొదలుపెడ్తాడు.

"మీకు కార్మికవర్గాన్ని గురించి ఏ మాత్రం కూడా తెలీదు. మీ ఆలోచనా పద్ధతి మాదిరిగానే మీ సామాజిక శాస్త్రం కూడా బహు దుర్మార్గమైనది. అతి నిరుపయోగ మైనది."

"మీరు ఆధిభౌతిక వాదులు, మీరు ఆలోచనా ప్రపంచంలో అరాచకవాదులు, మీలో ప్రతి ఒక్కరూ, ఎవరికి వారు తమ వాంఛలకూ, వూహాలకూ అనుగుణంగా సృష్టించుకొన్న భూమికి బయట వున్న విశ్వజగత్తులోనే విహరిస్తారు. మీకు మీరు జీవిస్తున్న వాస్తవ ప్రపంచం గురించీ ఏమీ తెలీదు.

"మిమ్మల్ని అధిభౌతిక వాదులుగా పిలుస్తున్నానంటే అందుకు కారణం మీరు అధిభౌతికంగా ఆలోచిస్తారు కాబట్టి... అదిభౌతికవాది సిద్ధాంతం నుండి వాస్తవాలను వూహిస్తాడు. శాస్త్రజ్ఞుడు వాస్తవాలనుండి సిద్ధాంతాన్ని తయారుచేస్తాడు"

"మీరు మిమ్మల్ని తాత్వికవేత్తలుగా చెప్పు కొంటున్నారు. కానీ తత్వశాస్త్రం అంటే ఏమిటో మీకు తెలియదు. తత్వశాస్త్రమంటే అన్ని శాస్త్రాలకన్నా విస్తృతమైనది. అది విజ్ఞానశాస్త్రం యొక్క విజ్ఞానశాస్త్రం."

ఆధిభౌతికవాదులు ప్రపంచానికి ఏం చేశారో చెప్పండి కాకమ్మ కథలు చెబుతూ తమ నీడలనే, దేముళ్ళుగా తప్పుగా అర్థం చేసుకొని దాన్నే ప్రచారం చేశారు."

"మీరు చెబుతున్నట్టు నూతన ప్రదేశాలను కనుక్కోవటం కోసం జరిపిన సముద్రయానానికి కారణం అదిభౌతికుల ఆలోచనలూ, వారి ఊహలూ ఎంతమాత్రం కానే కావు. నాడు అవసరమైన తిండి, సిల్కుబట్టలూ, ఆభరణాలూ, డాలర్లూ-సెంట్లూ, భారతదేశానికి వెళ్ళే భూమార్గాలను మూసివేయటమన్న కారణాలే సముద్ర యానానికి, నూతన ప్రదేశాలు కనుక్కోవటానికీ కారణాలు, ప్రేరకాలుగా వున్నాయి. ఆ క్రమంలోనే అమెరికాను కనుక్కోవడం జరిగింది."

"సత్యశోధనకు సరైన మార్గాన్ని డాక్టరు జోర్డాన్ స్పష్టంగా చెప్పాడు-సత్యాన్ని కనుక్కోవటానికి కొలబద్ద ఏమిటంటే, అది మన వాస్తవ జీవితానికి పనికొస్తుందా దాన్ని మనం ప్రాణంతో సమానంగా నమ్మి జీవించ వచ్చునా అన్నదే"

"మీరు అధిభౌతికవాదం మనస్సంబంధమయినది నిత్య వ్యవహార విషయాలు కాదు అంటారు. కానీ మీరు మాత్రం గోడల్లోంచి కాకుండా ద్వారాల గుండా నడవటాన్నే అలవాటు చేసుకొన్నారు. రొట్టె, వెన్న వేపుడు మాంసం తినటం ద్వారానే ప్రాణాన్ని నిలబెట్టుకొంటారు. గడ్డాలు గీసుకోవటానికి రేజర్లనే నమ్ముకొంటారు- ఈ రకంగా మీ అధిభౌతికవాదం పనిచేయదు అని మీకు మీరే అంగీకరిస్తున్నారు."

"మీరు ఈ రాత్రి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యక్తం చేసిన అభిప్రాయాల ద్వారా మీకే మీ తెలీదనే విషయాన్ని పదే, పదే మీకుగా మీరే అంగీకరించారు. నిజానికి మీకు కార్మికవర్గాన్ని గురించి తెలిసే అవకాశమే లేదు. మీరు కార్మికవర్గం నివసించే ప్రాంతాల్లో నివసించరు. మీరు పెట్టుబడిదారులతో కలిసి మరో ప్రాంతంలో నివసిస్తారు. మీకు పెట్టుబడిదారీ వర్గమే జీతం యిస్తుంది. తిండిపెట్టి మేపుతుంది. ఈ రాత్రి యిక్కడికి రావటానికి మీరు ధరించిన దుస్తులను సహితం పెట్టుబడిదారీ వర్గమే యిస్తుంది. ఇందుకు ప్రతిఫలంగా మీరు వాళ్ళకి నచ్చిన రకపు అధిభౌతిక తత్వాన్నే ప్రబోధిస్తారు. ఎందుకంటే ప్రస్తుతం కొనసాగుతున్న. సుస్థాపితమైన సామాజిక వ్యవస్థకు ఆ ప్రబోధనల వలన ప్రమాదం ఏమీ లేదు కాబట్టి"

"ఒకవేళ మీలో ఎవరైనా సుస్థాపితమైన సామాజిక వ్యవస్థకు ప్రమాదం తెచ్చి పెట్టే విధంగా మీ నమ్మకాలను మార్చుకొంటే, మీ ప్రబోధనలు మీ యజమానులకు నచ్చవు. అందువలన మిమ్ములను మతబోధక స్థానం నుండి తొలగిస్తారు. అప్పుడప్పుడు అటువంటి వాళ్ళు

జాక్‌లండన్ ఈ ఎపిసోడ్ ద్వారా మతబోధకుల వైఖరినీ, సమాజంలో చర్చి నిర్వహిస్తున్న పాత్రనూ, ఎంతో ప్రతిభాపూర్వకంగా వాళ్ళ మధ్య జరిగిన చర్చల రూపంలో చిత్రించారు. ఈ రకమయిన-మతానికి సంబంధించిన అంశంపై చర్చ నాడూ, నేడూ కూడా ఎంతో ఆవశ్యక మయిన అంశం. నాడూ, నేడూ కూడా పాశ్చాత్య దేశాల, అమెరికా దేశపు కార్మికుల భావజాలంపై చర్చికి గల పట్టు చాలా గణనీయమైనది. తమను దోపిడీ చేస్తూ, దౌర్భాగ్య స్థితిలోకి నెట్టిన పెట్టుబడిదారీ వర్గంపై దోపిడీ సామాజిక వ్యవస్థపై కార్మికులు తమ వ్యతిరేకతను వ్యక్తం చేయకుండా, దోపిడీ-నిర్బంధాలను నిరసించకుండా, వారి మనస్సులను-భావాలను కట్టడి చేస్తున్నది వారికి చర్చి ప్రబోధిస్తున్న మత భావాలే!

ఉద్వాసనలకు గురవుతున్నారు. ఇలా చెప్పి మీ చిత్తశుద్ధిని నేను సవాల్ చేయటల్లేదు. మీరు చిత్తశుద్ధితోనే, నమ్మిన విషయాలనే ప్రబోధిస్తున్నారు. అందువలనే పెట్టుబడిదారీ వర్గానికి మీరు చేస్తున్న ప్రబోధనలు విలువైనవిగా వున్నాయి. అదే మీ ప్రబోధనల్లోని బలం."

"మీ మెదళ్ళు, సుస్థాపితమైన వ్యవస్థకు అనుకూలమైన సిద్ధాంతాలతో నిండి వున్నాయి. మీరు స్విస్‌గార్డుల్లాగా(పెట్టుబడిదారీ వర్గానికి) చిత్తశుద్ధితో కూడిన కిరాయి సైనికులు. మీరు ఉప్పు తింటున్న పెట్టుబడిదారులకే నిజాయితీగా సేవ చేయండి. కానీ దయచేసి కార్మికవర్గంలోకి వచ్చి వారికి మోసపూరిత మయిన నాయకుల సేవలు అందించకండి. కానీ మీరు లేకుండానే కార్మికవర్గం యింతవరకూ మనగలిగింది. యిప్పుడు మీరు లేకుండానే, మీ అవసరం లేకుండానే బ్రతకగలుగుతుంది".

అంటూ ఎర్నెస్టు ఎవర్‌హార్డు, ఆ మత బోధకులందరినీ, వారి వర్గ స్వభావాన్ని బట్టబయలు చేస్తూ, వారు పెట్టుబడిదారీ వర్గ సేవకులే అన్న విషయాన్ని వెల్లడించి వారిని అవాక్కు చేస్తాడు.

జాక్‌లండన్ ఈ ఎపిసోడ్ ద్వారా మతబోధకుల వైఖరినీ, సమాజంలో చర్చి నిర్వహిస్తున్న పాత్రనూ, ఎంతో ప్రతిభాపూర్వకంగా వాళ్ళ మధ్య జరిగిన చర్చల రూపంలో చిత్రించారు. ఈ రకమయిన-మతానికి సంబంధించిన అంశంపై చర్చ నాడూ, నేడూ కూడా ఎంతో ఆవశ్యక మయిన అంశం. నాడూ, నేడూ కూడా పాశ్చాత్య దేశాల, అమెరికా దేశపు కార్మికుల భావజాలంపై చర్చికి గల పట్టు చాలా గణనీయమైనది. తమను దోపిడీ చేస్తూ, దౌర్భాగ్య స్థితిలోకి నెట్టిన పెట్టుబడిదారీ వర్గంపై దోపిడీ సామాజిక వ్యవస్థపై కార్మికులు తమ వ్యతిరేకతను వ్యక్తం చేయకుండా, దోపిడీ-నిర్బంధాలను నిరసించకుండా, వారి మనస్సులను-భావాలను కట్టడి చేస్తున్నది వారికి చర్చి ప్రబోధిస్తున్న మత భావాలే!

లెనిన్ చెప్పినట్టు "పెట్టుబడి యొక్క తీవ్రమయిన దాడి మూలకంగానే, ఆధునిక మతం వేళ్ళూనుకోవటానికి (కార్మికుల్లో)" కారణమయింది. అమెరికాలో ప్రధానంగా రోమన్ క్యాథలిక్ చర్చి "భగవంతుడే ఆస్తులను ప్రజలకు పంచిపెట్టాడు" అనే ప్రబోధనలు చేసి, ధనస్వాముల పట్ల పేద కార్మికులు అసూయా, ద్వేషాలు పెంచుకోకుండా నిలువరించింది. మరోవైపు ప్రొటెస్టంట్ చర్చి కూడా "యువజనులను హానికరమైన ప్రభావాల నుండి సంరక్షించటం కోసం" అన్న లక్ష్యంతో కార్మిక జనుల మధ్యకు చొరబడింది. వారందరూ ప్రత్యేకించి కార్మిక కుటుంబాల స్త్రీలలోనూ, స్త్రీ కార్మికుల్లోనూ తమ ప్రబోధాలు జరిపి కార్మికవర్గం యొక్క భావజాలాన్ని వీలైనంత పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా మలుచుకోకుండా నిరోధించగలిగారు. ఈ రకంగా లెనిన్ చెప్పినట్లు "పెట్టుబడి యొక్క విధేయులైన మోత కూలీలుగా చర్చి మతబోధకులు పనిచేశారు. ఈ విషయాన్ని జాక్‌లండన్ వారి వాదోపవాదాల రూపంలో పాఠకులకు చక్కగా వివరించటం జరిగింది. మతం అన్నది బూర్జువా వర్గం, కార్మికవర్గంపై ప్రయోగించిన "తాత్విక ఆయుధం" అన్న విషయాన్ని పాఠకులు అర్థం చేసుకొనేటట్లు చేయగలిగారు.

తిరిగి అసలు కథలోకి వద్దాం! డిన్నర్ సందర్భంగా వారి వాదోపవాదాలను విన్న ఎవిస్ ఎర్నెస్టు ఎవర్ హార్డ్ పట్ల, అంతకుముందు తాను చూసిన మరే యితర పురుషుడి పట్ల లేనంతటి యిష్టతను పెంచుకొంది. అందుకు కారణం అతడి వాదనాపటిమా, మేధస్సులో మాత్రమేకాక, అతడి ధృడమైన దేహదారుఢ్యం కూడా వుంది. అయితే అతడి వాదనా శైలి నచ్చినా, ఆమెకు అతడి వాదానాంశాల్లో నచ్చనిది అతడు వర్గపోరాటం, 'పెట్టుబడికీ శ్రమశక్తికీ మధ్యగల వైరం, ప్రయోజనాల మధ్య ఘర్షణ' అన్న అంశాలకు విపరీతమయిన ప్రాధాన్యం యివ్వటం అన్నది.

ఎర్నెస్టు వాదనలను డా॥ హామర్‌ఫీల్డు కానీ, డా॥ బాలింగ్ ఫోర్డు కానీ మెచ్చుకోలేదు సరికదా 'తెలిసీ తెలయని కుర్రకుంక వాడుగు' అంటూ కొట్టిపారేశారు.

కానీ మధ్య వయస్కుడూ, మధుర గంభీరమూర్తీ, రూపంలో, గుణంలో అపరక్రీస్తూ, మంచిపండితుడూ అయిన బిషప్ మూర్ హౌస్‌కు మాత్రం ఎర్నెస్టు బాగా నచ్చాడు. "ధృఢమయిన యువకుడు, చాలా సజీవంగా వున్నాడు-చాలా సజీవంగా వున్నాడు కానీ మరీ విపరీతమయిన ధీమాతో వున్నాడు' అంటూ అతడ్ని మెచ్చుకొన్నాడు.

ఎర్నెస్టు, బర్కిలీ యూనివర్శిటీలో జీవశాస్త్రంలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. అంతేకాక అతడు "తత్వశాస్త్రమూ- విప్లవం" అన్న పుస్తకాన్ని రాస్తున్నాడు. అందువలన అతడు తరుచుగా బర్కిలీ వచ్చి జాన్ కన్నింగ్ హాం యింటికి వస్తున్నాడు.

అలా అతడు ఆ యింటికి వచ్చిన ఒక సందర్భంలో బిషప్ మూర్‌హౌస్ కూడా అక్కడ వున్నాడు. అప్పుడు ఎవిస్ తాను అతడు రాసిన "కార్మికవర్గ తత్వశాస్త్రం" అన్న పుస్తకాన్ని చదివాననీ, తనకు ఆ పుస్తకం చదివిన తర్వాత, అతడితో ఒక వివాదాంశం వుందనీ అతడికి చెప్పింది. అతడు "వర్గద్వేషాన్ని రెచ్చగొడుతున్నాడనీ, కార్మికవర్గంలో గల సంకుచిత దుర్మార్గ భావాలను రెచ్చగొట్టడం అన్నది పెద్ద తప్పూ నేరమూ అనీ, వర్గ ద్వేషం అన్నది సమాజ వ్యతిరేకమయినదనీ, సోషలిస్టు వ్యతిరేకమయినదనీ" ఆమె తన తగాందాంశాన్ని అతడి ముందుంచింది.

అందుకు అతడు తానా తప్పులు చేయలేదనీ, తన పుస్తకంలో తాను రాసిన ఏ అంశంలోనూ వర్గద్వేషం లేదనీ, వర్గద్వేషం వేరు, వర్గపోరాటం వేరు అనీ తాము (సోషలిస్టులు) వర్గద్వేషాన్ని రెచ్చగొట్టటం లేదనీ, వర్గపోరాటం అన్నది సామాజిక అభివృద్ధి సూత్రం అన్న అంశాన్ని మాత్రమే తాము చెబుతున్నామనీ, వర్గపోరాటానికి తాము ఎంతమాత్రమూ బాధ్యులంకాదనీ, వర్గపోరాటాన్ని తాము తయారుచేయటం లేదనీ, తాము కేవలం వర్గపోరాట సూత్రాన్ని వివరిస్తున్న వారమేననీ, తాము విరుద్ధ ప్రయోజనాల ఘర్షణ యొక్క స్వభావాన్ని అందువలన సృష్టింపబడే వర్గపోరాటాన్ని వివరిస్తున్న వారిమేననీ తెలియచేస్తాడు. ఆదిమ కమ్యూనిష్టు సమాజం నుంచి, ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజం వరకూ చరిత్రలో జరిగిన వర్గపోరాటాల క్రమాన్నీ అతడు తెలియచెప్తాడు. వ్యక్తిగత ఆస్తి అన్నది సమాజానికి అంకితం చేయబడినపుడే వర్గపోరాట పరంపర అంతరిస్తుందని తెలియచేస్తాడు.

ఈ సందర్భంలో బిషప్ మూర్‌హౌస్ కల్పించుకొని తాను ఎర్నెస్టు భావంతో ఏకీభవించననీ, పెట్టుబడికీ-శ్రమశక్తికీ మధ్య వైరుధ్యం అన్నదే లేదనీ, అసలు అటువంటి వైరుధ్యమే వుండకూడదనీ వాదనకు దిగుతాడు. పెట్టుబడి అనేది లేకుంటే కార్మికుడికి పని అనేదే లేకుండా పోతుందని వాదిస్తాడు.

ఇందుకు ప్రతిగా ఎర్నెస్టు లాభాలు సంపాదించి పెట్టేందుకు కార్మికులశక్తి లేకపోతే పెట్టుబడి కుళ్ళిపోయి నశిస్తుంది అంటూ బదులిచ్చి, కార్మికుడూ, పెట్టుబడి దారుడు కూడా స్వార్ధపరులు అనే అంశాన్ని అంగీకరిస్తూనే, పరిశ్రమ మీద సంపాదించిన లాభాన్ని పంచుకోవటానికి యిద్దరూ (పెట్టుబడిదారుడు డివిడెండు కోసం, కార్మికుడు కూలి కోసమూ) ఎవరికి వారు ఎక్కువ భాగం కోసం తలపడడంతో, అందు మూలంగా వారిరువురి ప్రయోజనాల మధ్య వైరుధ్యం ఏర్పడుతుందనీ, ఆ రోజున శాన్‌ఫ్రాన్సిస్కోలో వీధి రైల్వేలు సంపాదించిన మొత్తాన్ని పంచుకొనే విషయంలో చెలరేగిన వివాద ఫలితంగా కార్మికులు సమ్మె చేస్తున్నారనీ వివరిస్తాడు.

అలా సమ్మె చేయటం తప్పనీ, అందువల్ల కార్మికులపై సానుభూతిని ఎలా చూపించగలమని బిషప్ ప్రశ్నిస్తాడు.

"వారి (కార్మికుల) అవగాహన సంకుచితమైనది. మనుష్యులుగా ప్రవర్తించాలి కానీ, మృగాల్లా కాదు. ఇప్పుడు హింస జరుగుతుంది. హత్యలు జరుగుతాయి. దు:ఖించే విధవరాళ్ళు, అనాధలూ పెరిగిపోతారు. పెట్టుబడీ, శ్రమశక్తీ మిత్రులుగా వుండాలి. వాళ్ళిద్దరూ పరస్పర ప్రయోజనం కోసం చేయి, చేయి కలిపి పనిచేయాలి. వాళ్ళు స్వార్ధపరులుగా వుండకూడదు" అంటూ బిషప్ మూర్‌హౌస్ ఆవేశంగా చెప్తాడు.

"నిజమే. అలా జరక్కూడదనే. కానీ కుళ్ళు ధర్మసూత్రాల మీద ఆధారపడిన సామాజిక వ్యవస్థ వున్నంత కాలమూ అలాగే జరుగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ కుళ్ళు ధర్మసూత్రాల మీద ఆధారపడి వుంది. అటువంటి కుళ్ళు వ్యవస్థను మీ చర్చి సమర్థిస్తోంది. మీరు బోధించే ప్రవచనాలన్నీ కుళ్ళు ధర్మసూత్రాలే-వాటికి మరేదీ అర్థం లేదు" అంటూ ఎర్నెస్టు వివరిస్తాడు.

"చర్చి ఈ మధ్యకాలంలో జీసస్‌క్రీస్తు బోధనలను ప్రబోధించటం లేదు. కార్మికవర్గాన్ని ఘోరంగా, దుర్మార్గంగా, అమానుషంగా దోచుకొనే పెట్టుబడిదారీ వర్గపు చర్యలను చర్చి క్షమించిపారేస్తోంది. ఇంతవరకూ ఒక్కసారి కూడా చర్చి పెట్టుబడిదారీ వర్గం యొక్క దుర్మార్గానికి వ్యతిరేకంగా తన నిరసనను తెలుపలేదు. ఎందుకంటే పెట్టుబడిదారీ వర్గం యొక్క మద్దతును పొందుతూ ఆ వర్గంపైననే అదే ఆధారాన్ని పొందుతోంది కనుక".

"18వ శతాబ్దపు తర్వాతి భాగంలో యంత్రాలూ, ఫ్యాక్టరీ వ్యవస్థా ప్రవేశపెట్టబడటంతో, అశేష సంఖ్యలో శ్రామిక ప్రజలు భూమి నుండి దూరం చేయబడ్డారు. పాతకాలపు వ్యవస్థలోని కార్మికుల పని ఏర్పాట్లు ధ్వంసం చేయబడ్డాయి. శ్రామిక ప్రజలు గ్రామాల నుండి ఖాళీ చేయించబడి ఫ్యాక్టరీ పట్టణాలకు తోలబడ్డారు. యంత్రాలపై పనిచేయటానికి తల్లులూ, పసిపిల్లలూ వాడబడ్డారు. కుటుంబాలు విచ్ఛిన్నమయినాయి. వారి జీవన, పని పరిస్థితులు అత్యంత ఘోరంగా వున్నాయి. అది ఒక బాధాకరమయిన నెత్తుటి కథ.

"శతాబ్దంన్నర క్రిందటే ఆధునిక కార్మికవర్గం ఆవిర్భవించింది. పెట్టుబడిదారుడు దేశాన్నంతటినీ కసాయి-శాలగా మార్చివేస్తున్నా చర్చి నోర్మూసుకు మౌనంగా కూర్చుంది. ఆ దుర్మార్గానికి తన నిరసనను వ్యక్తం చేయలేదు. ఆ విషయాన్నే చర్చి పట్టించుకోలేదు. ఇప్పుడూ చర్చి పట్టించుకోలేదు. చర్చి ప్రమేయం లేకుండానే కార్మికవర్గం మనుగడలోకి వచ్చి కొనసాగుతోంది."

"చికాగాలో వారానికి కేవలం తొంభై సెంట్లు కూలీ కోసం పని చేసే స్త్రీలున్నారు. చర్చి ఈ ఘోరం పట్ల తన నిరసనను వ్యక్తం చేయలేదు; ఒకవేళ ఏ మత బోధకుడైనా ఈ దారుణం పట్ల నిరసన వ్యక్తం చేయాలనుకుంటే, తన ఉద్యోగం నుండి తొలగింప బడతాడు" అని ఎర్నెష్టు బిషప్‌కు తెలియచెప్తాడు.

"నువ్వు చెప్పే దుర్మార్గాల్లాంటి వాటిని మన సమాజంలో నాకు చూపించు. నేను నా నిరసనను తెలియచేస్తాను. ఈ విషయాలన్నీ చర్చికి తెలియకే అది తప్పు చేసిందని నేను నీకు రుజువు చేస్తాను. పారిశ్రామిక సమాజంలో జరుగుతున్న ఘోరాలన్నింటికీ కారణం పెట్టుబడిదారీ వర్గం యొక్క అమాయకత్వం, అజ్ఞానాలు మాత్రమే. ఒక్కసారి అ వర్గానికి మంచి సందేశం అందిందంటే తక్షణమే పెట్టుబడిదారీ వర్గం తన తప్పులను తాను సవరించుకొంటుంది. అటువంటి మంచి సందేశాన్ని అందించాల్సిన విధి చర్చిదే." అంటూ బిషప్ మూర్‌హౌస్ బదులిస్తాడు.

"అయితే మీకు ఉద్వాసన ఖాయం" అంటూ ఎవరెస్టు చెప్తాడు.

"నీ అభిప్రాయాలు తప్పని రుజువు చేస్తాను" అంటూ బిషప్ సవాలను స్వీకరిస్తాడు.

ఈ వాదననంతటినీ వింటున్న ఎవిస్ 'కలుగ చేసుకొని, నీవు చెప్తున్న పారిశ్రామిక దుర్గార్గం, తప్పిదం అన్నవి బిషప్ చెప్తున్నట్లుగా అజ్ఞానం వల్ల జరుగుతున్నవేననీ, సమాజంలోని చీలికలు చాలా పెద్దవిగా, కలుసుకోలేనంతగా విడిపోయాయనీ వాదిస్తుంది. "ఆటవిక యిండియన్లు కూడా నేటి పెట్టుబడిదారీ వర్గమంతటి క్రూరులూ, అమానుషత్వం కలవారు కారని" ఎర్నెస్టు ఆమెతో అంటాడు.

తమ వర్గం అంతటి క్రూరమయినదీ, దుర్మార్గ మయినదీ కాదని ఆమె బదులిస్తుంది.

ఆ విషయాన్ని నీవు నీకే నిరూపించుకోమనీ, నీవు, నీ తండ్రి సియర్రా మిల్లులో పెట్టుబడి పెట్టిన వాటాలపైన వచ్చిన డివిడెండ్లతో కొనుక్కొన్న నీ గౌను కార్మికుల రక్తంతో తడిసిందేనని చెప్తూ ఆమెకే సవాలు విసురుతాడు ఎర్నెస్టు.

అతడు తనను వ్యక్తిగతంగా అవమానపరిచినట్టు భావించి ఆమె కళ్ళనీళ్ళ పర్యంతమవుతుంది.

సరిగ్గా అదే సమయంలో, రోడ్డు మీద నుండి నడుచుకొంటూ పోతున్న ఒక మనిషి అక్కడ ఆగి వారి వైపు చూశాడు. ధృఢకాయుడిగా వుండి, మాసినబట్టలు ధరించిన అతడి వీపు మీద వెదురు స్టాండ్ల, కుర్చీల వెదురు తెరల సరుకుల బరువు మూట వేళ్ళాడుతుంది. అతడు వాళ్ళున్న యింట్లోకి ప్రవేశించి తన సరుకులను అమ్ముకోవాలా? వద్దా? అన్నట్లు సందేహిస్తున్నాడు.

ఎర్నెష్టు అతడ్ని ఎవిస్‌కు చూపిస్తూ ఆ మనిషి జాక్సన్ అని చెప్తాడు. దున్నపోతులా వున్న ఆ మనిషి పనికి పోవాలి కానీ, యిలా వీధులు తిరుగుతూ సరుకు లమ్మటం సరయింది కాదు అంటూ ఎవిస్ వ్యాఖ్యానిస్తుంది.

... ఎడమ చొక్కా చేతిలో, లతడి అసలు చేయి ... లేదో చూడు, అంటూ ఎర్నెష్టు ఆమెను హెచ్చరిస్తాడు.

ఆమె చూడగా అతడి చొక్కా ఎడమచెయ్యి ఖాళీగా వున్నట్లు ఆమెకు అర్ధమవుతుంది.

"అతడి చేతికర్రలోని కొన్ని చుక్కలు మీ యింటి దూలాల నుండి కారుతున్న శబ్దాన్ని నేను విన్నాను" అంటూ ఎర్నెష్టు జాక్సన్ గురించి చెప్పటం మొదలు పెట్టాడు. "అతడు సియర్రా మిల్లులో, ఒక ప్రమాదంలో తన చేతిని కోల్పోయాడు. అతడ్ని గాయపడిన, అంగవైకల్యం పొందిన పనికిరాని ఒక గుర్రాన్ని తోలేసినట్లు మిల్లులోంచి బయటకు తోలేశారు. కంపెనీకి కాస్త డబ్బు ఆదాయం చేద్దామనే ప్రయత్నంలో అతడికి ప్రమాదం జరిగింది. యంత్రం యొక్క పళ్ళ చక్రంలోకి చొరబడుతున్న ఒక చకుముకి రాయిని తన చేత్తో తీసి బయటకు విసిరేసి పారేద్దామనే అతని ప్రయత్నంలో, అతడి-చేయి పళ్ళ చక్రంలో యిరుక్కుపోయి, భుజందాకా తెగేసుకుపోయింది. ఆ రోజు రాత్రి మిల్లులో నియమిత పని గంటలను మించి, అదనపు పని గంటలు పనిచేస్తూ వుండటంతో అలసిపోయిన అతడి కళ్ళల్లో బిగువు చాతుర్యాలు క్షీణించిపోయి, అతడి కదలికల్లో కొంత మాంద్యం ఏర్పడింది. అందువల్ల అతడు వేగవంతంగా సాగుతున్న చకుముకి రాయిని, త్వరితంగా అందుకోలేక పోవటంతో అతడి చెయ్యి యంత్రపు కోరల్లో చిక్కుకు పోయింది. అతనికి భార్యా, ముగ్గురు పిల్లలూ వున్నారు. కంపెనీ అతడికి ఏ రకమయిన మేలూ చేయకపోగా, బయటకు వెళ్ళగొట్టడమే కాకుండా, అతడు కోర్టులో వేసిన నష్టపరిహార దావాను, మహాసమర్ధుడైన వకీలును పెట్టి వాదించి, అతడ్ని ఓడించి, విజయవంతంగా కేసు గెలిచింది" అంటూ జాక్సన్ ఉదంతాన్ని ఎర్నెస్టు ఎవిస్‌కు చెప్పారు.

"నీకు పూర్తి కథ తెల్సి వుండకపోవచ్చు లేదా నువ్వు ఆ ఉదంతం గురించి మాకు పూర్తిగా చెప్పి వుండక పోవచ్చు. బహుశా జాక్సన్ తలబిరుసు గలవాడైన పొగరుమోతు అయి వుండవచ్చు. అలాకాకపోతే నువ్వు చెప్పిన వివరాలకన్నా మరిన్ని అదనపు వివరాలు అతడికి వ్యతిరేకమయినవి లేకుంటే కోర్టు ఎందుకు అతడి కేసును కొట్టేస్తుంది." అంటుంది ఎవిస్

"అతడు పొగరుమోతా? ఎందుకా తన చెయ్యి పిప్పి అయినా కూడా అతను పొగరుమోతా? అతడు శాంతపరుడైన ఒక క్రింది స్థాయి సేవకుడు. అతడు పొగరుగా మెలిగినట్లు అతడి సర్వీసు రికార్డులో ఒక్క రిమార్కు కూడా లేదు. అయినా ఇవన్నీ నీవే పరిశోధించి వాస్తవాలు తెలియపరచకూడదూ!" అంటూ ఎర్నెష్టు, ఎవిస్‌కు సవాలు విసురుతాడు. బిషప్ మోర్‌హౌస్ మాదిరిగానే,ఎవిస్ కూడా ఆ వాస్తవాలను స్వీకరించి, జాక్సన్ ప్రమాద ఉదంతానికి సంబంధించి వాస్తవాల పరిశోధనకు పూనుకొంటుంది.

తన పరిశోధనలో భాగంగా ఆమె జాక్సన్‌ను కల్సుకొంటుంది. ఒక మురికి వాడలోని, దుర్గంధపు పరిసరాల్లో వున్న గుడిసెల్లో నివసిస్తున్న జాక్సన్ ఎవిస్ కల్సుకుంటుంది. అతడు ఎర్నెష్టు చెప్పినట్టుగానే శాంతమూర్తి, తాను ఆ మిల్లుల్లో 17 సంవత్సరాలుగా పని చేస్తున్నాననీ, ఆ మిల్లులో జరిగే ప్రమాదాలన్నీ పని ముగించబోయే ఆఖరి గంటల్లో జరగటాన్ని తాను గమనించాననీ, మొదటి భాగపు పనిగంటల్లో ప్రమాదాలు జరుగవనీ, ఆఖరి గంటల్లోనే ప్రమాదాలు జరిగి ఎందరో-వందలాది కార్మికులూ, బాలకార్మికులూ- యంత్రాల కోరలకు చిక్కుకొని ప్రమాదాల పాలై అంగవైకల్యం చెందటమో, మరణించటమో జరుగుతున్న దాన్ని తాను కళ్ళారా చూశాననీ, యిక తన ప్రమాద విషయానికి వస్తే, యంత్రం ముందు పని చేసేటప్పుడు పాటించాల్సిన ఏ నియమాన్నీ తాను నిర్లక్ష్యం చేయలేదనీ, అజాగ్రత్తగా లేననీ, తాను కుడిచేత్తో బెల్టును తోసేసి, ఎడంచేత్తో సాగిపోతున్న చెకుముకి రాయిని అందుకో బోయాననీ, అయితే చక్రాన్ని తిప్పే బెల్టు వూడిపోయిందా లేదా అన్నది తాను గమనించలేదనీ తన కుడి చేయి బెల్టును వూడదీసిందనుకొన్నాననీ, కానీ అది పూర్తిగా వూడలేదనీ, అందువల్లనే తన ఎడమ చేయి యంత్రపు కోరల్లో చిక్కుకొని పిప్పి పిప్పియి పోయిందనీ, వాళ్ళు తనకు పరిహారం యివ్వలేదనీ, ఫ్యాక్టరీ సూపరెండెంటు, ఫోర్మన్‌లు యిచ్చిన తప్పుడు సాక్ష్యాల వల్లనే తన దావా ఓడిపోయిందనీ, వాళ్ళు అలా చేసి వుండకూడదనీ, కనీసం తనకో నైట్‌వాచ్‌మేన్ ఉద్యోగమయినా యిచ్చుండాల్సిందనీ జాక్సన్ ఎవిస్‌కు చెప్పాడు.

తర్వాత ఆమె జాక్సన్ తరఫున వాదించిన న్యాయవాదిని కల్సింది. అతడ్ని చూసిన మరుక్షణంలోనే ఎవిస్ అతడ్ని బలహీనమయిన, అసమర్ధుడైన న్యాయ వాది అని గుర్తించింది. అటువంటి వాడ్ని పెట్టు కొన్నందుకే జాక్సన్ కేసు ఓడిపోయిందని ఆమె భావించింది. అయినా అతడ్ని మీ కేసు ఎందుకు ఓడిపోయింది అంటూ ప్రశ్నించింది.

అందుకు అతడు తాను పుట్టుకతోనే ఓడిపోయిన వాణ్ణనీ, ప్రతిపక్షానికి ఉపయోగపడే సాక్ష్యాన్నే సాక్షులు యిచ్చారనీ, యజమాన్యపు లాయరు కల్నల్ ఇంగ్రాం క్రాస్ పరీక్షల్లో జాక్సన్‌ను గందరగోళపరిచి తనకనుకూల మయిన సాక్ష్యాన్ని రాబట్టుకొన్నాడనీ, ఆ కేసు నెగ్గటానికి తనకు కనీసపు అవకాశం కూడా లేదనీ, కల్నల్ ఇంగ్రాం ఒక మహత్తరమైన ఉద్దండుడైన న్యాయవాది అనీ, అలా కాకపోతే అతన్ని సియూరామిల్సు, ఎర్‌స్టన్ కాండ్ సిండికేట్, బర్కలీ కన్సాలిడేటెడ్, ప్లెసంట్‌సన్ ఎలక్ట్రిక్‌లాంటి బడా కార్పోరేషన్లు అతడ్ని తమ లాయరుగా ఎందుకు నియమించుకుంటాయనీ, అసలు కేసు నెగ్గటానికి తనకు నామమాత్రమైన అవకాశం కూడా లేదనీ, ఆ కేసు విచారించిన జడ్జి, క్లాడ్‌వెల్, కల్నల్ ఇంగ్రామ్‌లు ఒకే ప్రాంతంలో నివసిస్తారనీ, ఒకే క్లబ్బులో సభ్యులనీ, వారిరువురి భార్యలూ ఒకరి యింటికి మరొకరు తిరుగుతూ ఒకరికొకరు పార్టీలు యిచ్చుకొంటారనీ, అందువల్లనే తన కేసు ఓడిపోయిందనీ, కానీ జాక్సన్‌కు నష్టపరిహారం పొందే హక్కు ఉన్న విషయం తనకు ఖచ్చితంగా తెల్సుననీ అతడు వాపోతాడు.

తర్వాత ఎలిస్, కోర్టు విచారణలో సాక్ష్యమిచ్చిన ఫోర్మెన్‌లలో ఒకరైన పీటర్ డోనెల్లీని కల్సుకొని, "మీరు మీ సాక్ష్యంలో జాక్సన్ యంత్రం పాడవకుండా రక్షించటానికి చేసిన ప్రయత్నంలో, ప్రమాదవశాత్తు తన చేతిని పోగొట్టుకొన్నాడన్న వాస్తవాన్ని ఎందుకు కోర్టు దృష్టికి తీసుకురాలేదు" అంటూ ప్రశ్నించింది.

అందుకు బదులుగా అతడు "నాకు భార్యా బిడ్డలున్నారు, వాళ్ళని సక్రమంగా సాకగలగాలంటే నేను వాస్తవాన్ని చెప్పటం మంచిది కాదు. నేను ఒక పసిపిల్లాడిగా వున్నప్పుడు ఆ మిల్లులో పనికి చేరాను. చాలాకాలం కష్టపడి పనిచేసి ప్రస్తుత హోదా స్థాయికి చేరుకొన్నాను. అయినా యిప్పుడు నేను ఏట్లో మునిగి పోతున్నా నన్ను రక్షించటానికి ఒక్క కార్మికుడు కూడా చేయి అందియ్యడు. ఎందుకంటే నేను గత రెండు సమ్మెల్లోనూ, కంపెనీ యజమాన్యంతోనే వున్నాను. నన్ను 'యజమానుల తొత్తు' సమ్మె విద్రోహి ' అంటూ కార్మికులు రాళ్ళతో నన్ను కొట్టారు. ఇప్పుడైతే ఈ మిల్లులో పనిచేసే బాల కార్మికులలో నన్ను బూతులు తిట్టని వాడే లేడు. పరిహారం పొందటానికి జాక్సన్ అర్హుడే, అతడు మంచి కార్మికుడు, అతడు ఎప్పుడూ ఏ రకమయిన అల్లరీ, గోలా చేయలేదు. అయితే, నా పిల్లల కోసం నన్నూ. నా ఆత్మని నిరంతరం భగభగమండే నరకపు జ్వాలల్లో కాల్చుకోవటానికి సిద్ధపడే నేను కోర్టులో సత్యాన్ని చెప్పలేకపోయాను లని అతడు బదులిచ్చాడు.

తర్వాత ఆమె సూపరింటెండెంట్ హెన్రీడల్లాస్‌ను కల్సింది. అతడ్నించి ఆమె ఒక్క విషయాన్ని కూడా రాబట్టలేకపోయింది. తర్వాత యింకో ఫోర్మన్ జేమ్స్ స్మిత్‌ను కల్సింది.

అతడు పీటర్ డానిల్లో చెప్పిన విధంగానే, జాక్సన్‌కు నష్టపరిహారం దక్కాల్సిందేనని అంగీకరించాడు. చేయిని కోల్పోయి నిస్సహాయుడైన జాక్సన్‌ను అలా బయటికి పంపించివేయటం అమానుషమైన నిర్దాక్షిణ్యమైన క్రూరమైన చర్య అనీ అతడు అంగీకరించాడు. అతడు ఆ మిల్లులో యిటువంటి ప్రమాదాలు జరుగుతాయనీ, అయినా వాళ్ళకు ఎటువంటి నష్టపరిహారం దక్కకుండా కోర్టుల్లో పోరాడటం అన్నది కంపెనీ యజమాన్యం యొక్క విధానమనీ, ఆ రకంగా వందల వేలల్లో స్టాక్‌దారులకు లాభం ఆదా చేయబడుతుందనీ, తాను యిష్టపూర్వకంగానే జాక్సన్ యంత్రాన్ని రక్షించటం కోసం తన చేతిని పోగొట్టుకొన్నాడన్న వాస్తవాన్ని కోర్టులో చెప్పలేదనీ, అందుకు బదులు అతడి నిర్లక్ష్యం వలన, అజాగ్రత్త వలన చేతిని పొగోట్టుకున్నాడు కనుక అతడికి పరిహారం యివ్వాల్సిన అవసరం లేదనీ సాక్ష్యం చెప్పాననీ, వాస్తవానికి ఎక్కువ గంటలు పనిచేసిన కార్మికుడు అలసిపోతాడనీ అందువల్ల ప్రమాదాలు జరుగుతాయనీ, కానీ తాను భార్యా బిడ్డలు గలవాడు కనుక, కల్నల్ ఇంగ్రామ్ చెప్పమన్నట్లుగా అబద్ధపు సాక్ష్యం చెప్పాననీ ఆమెకు తెలియబరచి, తాను చేసినది అన్యాయం కాదా? అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేక కోపం తెచ్చుకొని ఒక బూతు తిట్టి, 'తాను యిప్పుడు చెప్పిన విషయాలను ఎన్నడూ ఎవరికి చెప్పలేదని అవసరమయితే కోర్టులో ప్రమాణం చేసి మరీ చెప్తాననీ, అందువలన ఈ విషయాలు మరెక్కడా ప్రస్తావించవద్దు అంటూ ఆమెను పంపించివేశాడు.

ఇవన్నీ తెల్సుకొన్న ఎవిస్ తన యూనివర్శిటీ జీవితం, విద్య, సంస్కృతి అన్నీ అవాస్తవికమయినవేననీ, తాను జీవితం గురించీ సమాజం గురించీ కేవలం సిద్ధాంతాలను మాత్రమే నేర్చుకొన్నాననీ, ప్రస్తుతం మాత్రమే ఈ జాక్సన్ ఉదంతం ద్వారా జీవన వాస్తవికతను తెల్సుకొంటున్నాననీ అర్థం చేసుకొంది.

తర్వాత కల్నల్ ఇంగ్రామ్‌ను కల్సుకొంది. ఇరువురూ ఒకొర్నొకరు బాగా ఎరిగున్న వాళ్ళే. అతడు సొసైటీ మనిషి. అతడు ఎప్పుడూ ఎవిస్‌ను సంప్రదాయ పూర్వకమయిన చలాకీతనంతో పలకరిస్తాడు. మంచి సౌమ్యుడిలాగా, అద్భుతంగా కనిపిస్తాడు. అటువంటి వ్యక్తి జాక్సన్ పేరెత్తగానే జబ్బుపడ్డ మనిషిలా అయిపోయాడు. ఆ ప్రస్తావన ఆయనపై వేసిన క్రూరమైన జోక్‌గా అన్పించింది ఆయనకు. "జాక్సన్‌కు పరిహారం దక్కాల్సిందేనా?" అన్న ప్రశ్నకు 'ఖచ్చితంగా దక్కాల్సిందే' అంటూ జవాబు చెప్పి, అది తన వ్యక్తిగత అభిప్రాయమనీ, కానీ తన వృత్తిపర దృక్పథం ప్రకారం న్యాయానికి, చట్టానికి సంబంధముండదు అని చెప్పాడు. "వృత్తిధర్మం కోసం వ్యక్తిగత భావాన్నే బలిపెట్టడం ఆత్మహత్యాసదృశ్యం కాదా?" అన్న ఎవిస్ ప్రశ్నకు జవాబు చెప్పకుండా అతడు తప్పించుకు జారుకున్నాడు.

తర్వాత ఎవిస్, జాక్సన్‌కు జరిగిన అన్యాయాన్ని వార్తాపత్రికల వారికి రాసి పంపింది. కానీ ఎవ్వరూ ఆమె రాసిన కధనాన్ని ప్రచురించలేదు. ఆమె తనకు తెల్సిన పెర్సీ లేటన్ అనే, మూడు ప్రముఖ వార్తాపత్రికలకు చెందిన రిపోర్టరును కల్సింది. ఎందుకు జాక్సన్ ఉదంతాన్ని వాళ్ళ పత్రికలు ప్రచురిచలేదని ప్రశ్నించింది. అది పత్రికలవారి సంపాదకత్వ విధానం అంటూ అతడు బదులు చెప్తాడు. 'అదేరకమయిన విధానం' అంటూ ఎవిస్ తిరిగి ప్రశ్నిస్తే. "అడ్వర్టైజ్‌మెంట్లు తెచ్చుకొని అందుకు చెల్లింపులు తెచ్చుకొంటే, యిటువంటి ఉదంతాలు ప్రచురింబడవు" అంటూ అతడు ముక్తసరిగా జవాబిచ్చాడు. అప్పట్నుంచీ ఆమె తన ముందు కనబడుతున్న సమాజం గుండా వాస్తవాలను చూడటం ప్రారంభించింది. జాక్సన్‌కు వ్యతిరేకంగా అప్రకటిత మయిన కుట్ర జరిగిందనీ,ఆ అప్రకటిత కుట్ర కేవలం జాక్సన్‌కు మాత్రమే వ్యతిరేకంగా కాక మొత్తం అన్ని పరిశ్రమల్లో, అన్ని మిల్లుల్లో పని చేస్తున్న కార్మిక వర్గానికి వ్యతిరేకంగానే జరుగుతోందనే భయంకర సత్యాన్ని ఆమె చూసింది

తర్వాత ఆమె సియర్రా మిల్లులో అత్యధిక స్టాకు వాటాలను కలిగివున్న ప్రముఖులైన ఎక్సన్‌గారినీ, పెర్టన్ వైత్‌గారినీ కల్సుకొంది. వాళ్ళిద్దరిలోనూ తాము సంఘంలోని యితరులందరికంటే ఆధిక్యమంతులమనే ప్రభునీతి భావం ఉట్టిపడుతోంది. "ఈ సమాజ రక్షకులము మేమే, యీ సమాజంలో చాలామందికి ఆనంద-స్థితిని కల్గించే వాళ్ళం మేమే! మేమే కనుక, మేము మాత్రమే కనుక మా వివేచనా శక్తితో ఉద్యోగ అవకాశాలను కల్పించి వుండి వుండకపోతే ఈ కార్మిక వర్గం ఎంతటి దురవ్యవస్థతో బాధపడి వుండేదో? అన్న విషాద చిత్రాన్ని ఊహించుకొంటూ, తమ పట్ల తాము ఒక ఉన్నత భావాన్ని నిశ్చయంగా కలిగివున్న వ్యక్తుల్లా ప్రవర్తించారు. వాళ్ళు ఆమె ప్రశ్నలకు సూటిగా జవాబు చెప్పకుండా, జీవితంలో ఆమె అనుభవరాహిత్యం పట్లా ఆమె యవ్వనం పట్ల అభిమానాన్ని చూపిస్తూనే విధానం గురించి మాట్లాడి, తామనుసరించే విధానమే న్యాయం అనే సిద్ధాంతాలను వల్లించారు.

అందమైన వాళ్ళు 'తామే యితర మానవులకన్నా వివేచనాశక్తిలోనూ, సామర్థ్యంలోనూ వున్నతులమనే, అందమైన కాల్పనిక ప్రపంచాన్ని సృష్టించుకొన్నారు. అందువల్లనే మిగిలిన అందరి మానవాళికీ తిండి పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తమకే అధికారం మంజూరు చేయబడిందనే భావనలో వారున్నారు. వారు ఆఖరికి రాజుల యొక్క దైవిక హక్కు-వాణిజ్యం రాజుల యొక్క దైవిక హక్కు అన్న సిద్ధాంతాన్ని పునరుజ్జీవింప చేశారు. ఈ పరిశోధనలో ఎవిస్‌కూ ఏ రకంగానూ ఉపయోగపడనిది వీరిద్దరే.

వీరి తర్వాత వీరిద్దరి భార్యలను విడివిడిగా కల్సుకొంది ఎలిస్. వీరిద్దరూ సొసైటీ వనితలు. వీరు యూనివర్శిటీలు, చర్చిలు మొదలైన సంస్థలకు మహారాజ పోషకులు. వాళ్ళూ వాళ్ళ భర్తలు మాట్లాడినట్లుగానే మాట్లాడారు. వాళ్ళు తమ వర్గనీతిపట్ల, తమ భర్తలకువలెనే వర్గఅహంభావంతో వున్నారు. జాక్సన్ కుటుంబ దుర్భర పరిస్థితులు చెప్పి, అతడి కుటుంబానికి ఏదైనా సహాయాన్ని వారు ఐచ్ఛికంగా చేసుండాలని ఎవిస్ సూచిస్తే, వాళ్ళు తమకు తమ సామాజిక బాధ్యతలను గురించి సలహా యిచ్చే వారిపట్ల సానుభూతిలేదన్న విషయాన్ని నిర్మొహ మాటంగా చెప్పారు. ఎవరికి వారు విడి, విడిగా మాట్లాడినా యిద్దరూ ఒకే రకమైన జవాబులు చెప్పారు.

"నిర్లక్ష్యం-అజాగ్రత్తలను తాము పారితోషికాలు యిచ్చి ప్రోత్సహించమనీ, పారితోషికాలు యివ్వటం ద్వారా పేదలు యంత్రాలలో పడి తమను తాము గాయపరచుకొనే విధంగా వాళ్ళను ప్రేరేపించబోమనీ' తెగేసి చెప్పారు.

మరో రకంగా వీళ్ళు కూడా ఎర్నెష్టు చెప్పినట్టుగా యంత్రాలకు కట్టి వేయబడ్డ మనుష్యులే' అని ఎలిస్ అర్థంచేసుకోగల్గింది.

జాక్సన్ ఉదంతం ద్వారా జాక్‌లండన్ నాటి పారిశ్రామిక కార్మికులను తమ లాభార్జన కోసం పెట్టుబడిదారులు ఎంతటి నిర్దయతో యంత్రాల కోరలకు బలిచేసే వారో స్పష్టం చేస్తాడు. 100 ఏళ్ళ నాడే కాదు, నేడు కూడా యీ ఘోరం మన దేశాల్లాంటి అభివృద్ధి చెందుతున్న-అభివృద్ధి చెందని బడుగు దేశాల్లో అమలు జరుపబడుతూనే వుంది. పనులను ఔట్‌సోర్సింగ్ పేరిట కాంట్రాక్టర్లకూ, సబ్ కాంట్రాక్టర్లకూ అప్పచెప్పి, ఆ కాంట్రాక్టర్ల వద్ద కార్మికులు పనిచేసే సమయంలో ప్రమాదాలకు గురై అంగవైకల్యం పొందినా, మరణించినా, పనిస్వభావాన్ని బట్టి ప్రమాదకర ప్రాణాంతక రోగాల వాతబడినా, పారిశ్రామిక యాజమాన్యాలు, బాధిత కార్మికులకు పరిహారం చెల్లించకుండా 'తప్పించు కుంటున్నారు. పారిశ్రామిక కార్మికుల పరిహార చట్టం వర్తింపబడే కార్మికులు సహితం పెద్ద మొత్తాలు చెల్లించి కల్నల్ ఇన్‌గ్రాం లాంటి సమర్థవంతులైన పెద్ద లాయర్లను నియమించుకొనే స్తోమతు లేక చిన్న చిన్న లాయర్లను పెట్టుకొని పరిహారపు కోర్టు కేసుల్లో ఓడిపోవటం జరుగుతోంది. కోర్టులు సహితం కేసుల విచారణకు ఏళ్ళూ వూళ్ళూ జాప్యం చేసి దావా వేసిన కార్మికులు ఆ కేసును వదులుకొనేలా నిరుత్సాహపరుస్తున్నాయి. కేసులన్నీ కార్మికుడి నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం సంభవించిందనే, పారిశ్రామిక యజమాన్యాలు సమర్పించే, తప్పుడు సాక్ష్యాధారాల మూలకంగా వీగిపోతున్నాయి. ప్రమాదబాధితుడైన బాధిత కార్మికుడికి తన కేసుకు సంబంధించిన సాక్ష్యాలను పదిలపరచుకొని, కోర్టుల్లో సమర్పించేందుకు కావల్సిన అవకాశాలు కానీ, తత్సంబంధమయిన జ్ఞానం గానీ వుండకపోవటం అన్నది ఈ కేసులు వీగిపోవటానికి ప్రధాన కారణం. కోర్టుకు యివేవీ పట్టవు. పై పెచ్చు జాక్సన్ కేసులో జడ్జి క్లాడ్‌వెల్ గురించి చెప్పినట్లు, న్యాయాధిపతులందరూ పెట్టుబడిదారీ వర్గానికి చెంది దాని ప్రభావంలో పనిచేసేవారే

ఈ సందర్భంగా న్యూయార్కు పట్టణ పరిసర ప్రాంతాల్లో పని స్థితిని గురించి ఆ రోజుల్లోనే అధ్యయనం చేసి, కార్మిక శాఖకు ఒక నివేదికను అమెరికన్ బూర్జువా అర్ధశాస్త్రవేత్త డా॥ హెచ్. వేయర్‌డాక్స్ లాండర్ పంపించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం యంత్రాల వినియోగం యొక్క వేగాధికత్య ఎక్కువ అవటం వలన పారిశ్రామిక ప్రమాదముల సంఖ్య, వృత్తి జబ్బుల సంఖ్య పెరిగింది. ఒక ప్రైవేట్ కంపెనీలో రిజిష్టర్ చేయబడిన ప్రమాదాల సంఖ్య వివరాలు ఈ క్రింది విధంగా వున్నాయి. పరిశ్రమల యంత్రాల వేగాధిక్యత నూటికి 85 వంతులు పెరగటమే దీనికి మూలకారణం.

సం॥	ప్రమాదాలు	నరాలశక్తి పూర్తిగా క్షీణించినవారు	పిచ్చిఎక్కిన వారిసంఖ్య
1926	2535	696	39
1927	2553	768	35
1928	2693	870	40
1929	2931	-	55

(మూలం- 'సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' అన్న లెనిన్ గ్రంధం నుండి)

ఈ వివరాలనుబట్టి ఆ రోజుల్లో పారిశ్రామిక ప్రమాదాల సంఖ్య ఎంత ఎక్కువగా వుండేదో అర్ధమవుతుంది. ఈ వివరాల స్వభావాన్ని జాక్‌లండన్, ఈ జాక్సన్ ప్రమాద వృత్తాంతం ద్వారా పాఠకులకు ఎరుకపరుస్తూ, పారిశ్రామిక ప్రమాదాల విషయంలో యిమిడి వున్న పలు అంశాలను(దోపిడీ) మన దృష్టికి అతి చాకచాక్యంగా తీసుకురావటం జరిగింది.

ఈ సందర్భంగానే లాయర్ కల్నల్ ఇంగ్రాం యొక్క వృత్తి సామర్థ్యాన్ని వివరించే రూపంలో కార్పోరేషన్‌ల, సంపన్నుల లాయర్ల స్వభావాన్ని, వాళ్ళు చట్టం అమలు కాకుండా ఎంతగా కృషి చేశారో తెలియచెప్పాడు. ఇదే విషయాన్ని ఆనాడే అంటే 1905లోనే అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్వెల్టు, హార్వర్డ్ ప్రారంభోత్సవంలో చెప్పిన ఈ క్రింది విషయం, జాక్‌లండన్ కల్నల్ ఇంగ్రాం గురించీ, అటువంటి కార్పోరేట్ లాయర్ల గురించీ చేసిన చిత్రణ ఎంత సరయినదో తెలియచేస్తుంది:

"ప్రతీ సంపదకేంద్రంలోనూ వున్న బార్ సభ్యులైన అత్యంత పలుకుబడి కలిగిన, అతి ఎక్కువ ప్రతిఫలం చెల్లింపబడే లాయర్లు, తమ సంపన్నవంతులైన వ్యక్తిగత లేదా కార్పోరేట్ క్లయింట్లు కోసం ఏ విధంగా సంపదను ప్రజావసరాల కోసం, ప్రయోజనాల కోసం నియంత్రించటం కోసం చేయబడిన చట్టాలను ఉల్లంఘించటం కోసం, ఎంతో ధైర్యవంతమయిన, చాతుర్య పూరితమయిన పధకాలను రూపొందించటమన్నదే తమ ప్రత్యేకమైన కర్తవ్యంగానూ, కృషిగానూ పెట్టుకొన్నారు' అన్న విషయం మనందరికి తెల్సును."

ఈ ఉదంతంలోనే జాక్‌లండన్ ఇన్సూరెన్సు కంపెనీల బండారాన్ని ఎర్నెష్టు ఎవిస్‌కు చెప్పిన మాటల ద్వారా బట్టబయలు చేస్తాడు "పనిచేసే కార్మికుడి కన్నా భద్రతతో జీవించడానికి, మీ నాన్నకు గాయపడ్డానికి గానీ, చంపబడ్డానికీ గానీ కల అవకాశాలు 8 రెట్లు

తక్కువ అని నీకు తెలుసా?..... ఇన్సూరెన్సు కంపెనీలు ప్రేలుడు పదార్థాలు తయారుచేసే కంపెనీల్లో పనిచేసే శిక్షితులైన కెమిస్టుల నుండి, కార్మికుడికన్నా 8 రెట్లు ప్రీమియంను వసూలు చేస్తాయి. నాబోటి విప్లవకారుడికైతే అసలు ఇన్సూరెన్సు చేసుకోవటానికే అంగీకరించరు." అంటూ ఇన్సూరెన్సు వ్యాపారంలో గల కిటుకును, అంతస్సూత్రాన్ని వివరిస్తాడు.

ఈ ఘటన వివరణ సందర్భంలోనే వార్తాపత్రికల స్వభావం గురించి జాక్‌లండన్ మనకు స్వల్పంగా తెలియచేస్తాడు. రాబోయే అంకాల్లో ఈ విషయమై ఆయన యిచ్చిన వివరణను తెల్సుకొందాం! తిరిగి అసలు కథలోకి వద్దాం!

సామాజిక వాస్తవాలను అర్థం చేసుకొంటున్న క్రమంలో ఎవిస్, ఎర్నెస్టు పట్ల ప్రేమ పెంచుకొంటుంది. ఎర్నెస్టు సూటిగానే. ఎటువంటి ప్రేమ ప్రకటనలు చేయకుండానే ఆమెను చుంబించి కౌగిలించుకొనే రూపంలో తన ప్రేమను వ్యక్తం చేస్తాడు. ఎవిస్‌కు అతడు తనను ప్రేమించిన పద్ధతి నచ్చుతుంది. ఇక జరుగవల్సిందల్లా వాళ్ళ పెళ్ళి మాత్రమే.

పసిఫిక్ తీరంలో ఫిలోమాత్ అనే క్లబ్బు అనేది ఒకటుంది. అది అన్నిక్లబ్బులకన్నా అపురూపమయింది. ఆ క్లబ్బులో సమాజంలోని అతి సంపన్నులయిన, దృఢ సంకల్పమున్న సంపన్నులే సభ్యులుగా వుంటారు. వారు నిజంగా సమాజాన్ని శాసిస్తున్న దొరలే. ఆ క్లబ్బు సభ్యులు నెలకొకసారి ఏదో ఒక ప్రైవేటు గృహంలో సమావేశమై ప్రముఖులు లేదా నూతన విషయాలు కనుగొన్న వారి ఉపన్యాసాలు వింటూంటారు. ఉపన్యాసకునికి భారీ ఎత్తు ప్రతిఫలం ముట్టచెప్తారు. ఉపన్యాసకుడు నిష్కర్షగా తన అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చు. అటువంటి ఒక ఉపన్యాసం యివ్వటానికి మిస్ బ్రైంట్‌వుడ్ అనబడే ఆ క్లబ్బును స్థాపించిన ఒక సంపన్న వృద్ధ కన్య ద్వారా ఎర్నెస్టుకు ఆహ్వానం లభించింది. ఎర్నెస్టు ఉపన్యాసం యివ్వటానికి అంగీకరిస్తాడు. ప్రొఫెసర్ కన్నింగ్ హాం కూడా ఫిలోమాత్ క్లబ్బు సభ్యుడు కాబట్టి, ఎవిస్‌కు ఆ ఉపన్యాసం వినటానికి అవకాశం దొరికింది

ఆ సభకు అతి ప్రఖ్యాత కార్పోరేషన్ లాయర్ అయిన కల్నల్ వాన్ గిల్బర్టు అధ్యక్షత వహించాడు అతడు పెద్ద సంపన్నవంతుడు కూడా. అతడు కనీసం లక్షడాలర్ల ఫీజు లేకుండా ఏ కేసును చెపట్టనంతటి పెద్ద కార్పోరేటు న్యాయవాది. అతడు ఎర్నెస్టును సభకు పరిచయం చేస్తూ ఎంతో వ్యంగ్యంగా ఎర్నెస్టు ఒక సామాజిక సంస్కర్త అనీ, కార్మికవర్గ సభ్యుడనీ, సభికులకు తెలియచేస్తాడు.

ఉపన్యాసాన్ని ప్రారంభించిన ఎర్నెస్టు ముందుగా తన యొక్క ఆశల గురించీ, ఆదర్శాల గురించీ, ఉన్నత వర్గాల స్వర్గం గురించీ తాను చదివిన ఆదర్శవాదాల గురించీ, వాటి నుండి తాను హుందాగా మానవులు జీవించటం అన్న ఆదర్శాన్ని ఎంచుకోవటం గురించీ, తన చిన్ననాటి మిల్లు జీవితం గురించీ, గుర్రపునాడాలు వేసే వృత్తి నేర్చుకోవటం గురించీ, సోషలిస్టులను కల్సుకోవటం గురించీ చెప్పి, ఆ సోషలిస్టులలో పాలక వర్గాలకు ఊడిగం చేయ నిరాకరించిన మేధావులూ, ప్రొఫెసర్లు వున్నారనీ వారేకాక పాలకవర్గాలకు నచ్చని అభిప్రాయాలుండి క్రైస్తవ మతాన్నుండి వెళ్ళగొట్టబడిన మతాధిపతులున్నారనీ చెప్పుకొచ్చాడు.

"అహేతుకమయిన ప్రస్తుత సాంఘిక వ్యవస్థను కూల్చద్రోసి ఆ శిధిలాలపై భవిష్యత్‌కోసం సహేతుకమైన సామాజిక వ్యవస్థను నిర్మించటంకోసం పాటుపడుతున్న వారే సోషలిస్టులు".

"నేనెరిగున్న విప్లవవాదులందరిలోనూ మానవత్వం పట్ల గల దృఢ విశ్వాసం, అచంచలమైన ఆదర్శభావం, నిస్వార్థతా మాధుర్యత, ఆత్మపరిత్యాగం, ప్రాణ త్యాగానికి సిద్ధత- లాంటి మహత్తరమైన ఆత్మకు సంబంధించిన సుగుణాలను నేను కనుగొన్నాను. అక్కడి జీవితం స్వచ్ఛమయినది, ఉదాత్తమయినది, సజీవమైనది" అంటూ ఎర్నెస్టు సోషలిస్టు విప్లవకారుల ధన్య జీవితాల గురించి చెప్పాడు.

అయితే తాను ఉన్నత వర్గాలవారితో కలిసి తిరిగిన తర్వాత, ఆ యజమాని వర్గానికి చెందిన వారి పట్ల తన భ్రమలు తొలగిపోయాయనీ, అద్భుతమయిన చర్చిలూ- అత్యధిక వేతనాలు చెల్లించబడే మతబోధకులున్నా కూడా, యజమానులు మాత్రం ఆడా, మగా అందరూ కూడా భౌతిక విషయానక్తులేనని గ్రహించానని- వారి జీవితాలను ప్రధానంగా భౌతికతే శాసిస్తోందనే కీలక విషయాన్ని గ్రహించానని చెప్పాడు. ఒకవైపు యుద్ధాన్ని గురించి విమర్శించేటపుడు శాంతిదూతను జపిస్తూనే, మరోవైపు కిరాయిగూండాల చేతికి తుపాకులిచ్చి తన స్వంత ఫ్యాక్టరీలో సమ్మె చేసే కార్మికులను చంపేందుకు పురమాయించిన వ్యక్తులనూ, ఒకవైపు బహుహతుల కోసం జరిగే కుస్తీ పోటీల్లోని అమానుషత్వాన్నీ, పాశవికత్వాన్నీ వివరిస్తూనే మరోవైపు పసిపిల్లల

"అహేతుకమయిన ప్రస్తుత సాంఘిక వ్యవస్థను కూల్చద్రోసి ఆ శిధిలాలపై భవిష్యత్‌కోసం సహేతుకమైన సామాజిక వ్యవస్థను నిర్మించటంకోసం పాటుపడుతున్న వారే సోషలిస్టులు".

ఆహారాన్ని కల్తీ చేస్తూ, ఎలా వందలమంది పసిపిల్లలను చంపే మహానుభావులనూ తాను జీవితంలో చూశానని చెప్పాడు.

"సున్నితమయిన కులీన లక్షణాలతో వున్న కులీనుడైన ఈ పెద్ద మనిషి కార్పోరేషన్ల బోర్డులలో ఒక డెమ్మీ డైరెక్టరుగా వుంటూనే రహస్యంగా విధవరాళ్ళ, అనాధల సొమ్మును కాజేస్తాడు, సాహిత్య పోషకుడిగా వుంటూ చక్కటి గ్రంథాలను సేకరించే యీ పెద్ద మనిషి, మున్సిపాలిటీని శాసిస్తున్న వికారమైన యజమానికి చాటుగా లంచాలు చెల్లిస్తాడు. తన పత్రికలో పేటెంటు మందుల గురించి అడ్వర్టయిజ్‌మెంట్లు ప్రచురించే ఈ సంపాదకుడు, అతన్ని ఈ పేటెంట్లు గురించి వాస్తవాలు ప్రచురించమని అడిగినందుకు నన్ను పోకిరీ వాణ్ణంటూ తిట్టిపోశాడు. ఎంతో నిదానంగా మనస్ఫూర్తిగా దైవం యొక్క మంచితనాన్ని గురించీ, ఆదర్శవాదం యొక్క సౌందర్యాన్ని గురించీ మాట్లాడే ఈ పెద్ద మనిషి యింతకుముందే తన వ్యాపార సహచరులకు ఒక ఒప్పందంలో విద్రోహం చేశాడు. చర్చి మూలస్తంభాల్లో ఒకడిగానూ, విదేశీ మత సంస్థలకు విరివిగా విరాళిచ్చే యీ పెద్ద మనిషి, తన ఫ్యాక్టరీలో యువతులను కడుపు నిండటానికి చాలని అతి తక్కువ వేతనాలు యిచ్చి, రోజుకు 10 గంటలపని చేయించుకుంటూ ఆ అభాగ్యు రాళ్ళు వ్యభిచారంలోకి దిగటాన్ని ప్రోత్సహిస్తున్నాడు విశ్వవిద్యాలయానికి కుర్చీలు యిచ్చి, విరాళాలు యిచ్చి, బ్రహ్మాండమైన చర్చిలను కట్టించిన యీ పెద్ద మనిషి. డాలర్ల కోసం, సెంట్ల కోసం అబద్ధాలు చెప్పి కోర్టులను కూడా మోసం చేసినవాడు. ఈ రైలు రోడ్డు సంస్థల బడా యజమాని రహస్యంగా రిబేట్లను మంజూరు చేసి ఒక పౌరుడిగా, ఒక పెద్ద మనిషిగా, ఒకక్రైస్తవునిగా తాను ఆడిన మాటను తానే తప్పాడు. ఈ సెనేటర్ ఒక దుర్మార్గమైన చదువులేని పారిశ్రామికవేత్త చేతిలో ఒక బానిస. ఒక కీలుబొమ్మ ఒక పనిముట్టు

అదేవిధంగా ఈ గవర్నరు, ఈ సుప్రీంకోర్టు జడ్జీలు కూడా ఆ దుర్మార్గులైన, చదువులేని పారిశ్రామికవేత్త చేతిలో బానిసలే, కీలుబొమ్మలే పనిముట్లే. వీళ్ళు ముగ్గురూ రైల్వే పాసుల్తో తిరిగిన వాళ్ళే. ఈ నున్నగా కనబడే పెట్టుబడిదారుడే రాజకీయ యంత్రాలకు, రాజకీయ యంత్రపు యజమానులకూ పాసులు యిచ్చే రైలురోడ్డు సంస్థలకూ అసలైన 'యజమాని' అంటూ ఓట్ల ద్వారా దేశాన్ని పాలించే రాజకీయ యంత్రాంగానికి పెట్టుబడిదారులు మాత్రమే యజమానులనీ, ప్రజలు నమ్ముతున్నట్లు తమ దేశాన్ని, "ప్రజలవలన, ప్రజలచేత, ప్రజల కొరకు," ఏర్పడ్డ ప్రభుత్వం పాలించటంలేదనీ ఎర్నెస్టు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసి, తానుంటున్నది స్వర్గం కాదనీ, కుళ్ళిపోయిన వాణిజ్య-వ్యాపార సమాజంలో వున్నానని తెలుసుకొన్నాననీ, ఆ సమాజంలో భయంకరమైన స్వార్థం, కటిక కసాయితనం, ఛండాలపు తిండిపోతుతనం, నిత్యజీవితంలో ఆచరింపబడుతున్న భౌతికతత్వాలు మాత్రమే వున్నాయనీ, ఈ సమాజంలో వ్యాపార విషయంలో తప్పు మిగిలిన విషయాల్లో మూర్ఖులుగానూ, వున్నారు. స్వచ్ఛంగానూ, గౌరవనీయంగానూ, సజీవంగానూ వున్న వారెవరూ లేరనీ చెప్పి, ఎర్నెస్టు విప్లవ సైన్యం గురించి వర్ణించాడు. వివిధ దేశాల్లో సోషలిస్టులకు వచ్చిన ఓటు లెఖలను చెప్పాడు. అతడు అమెరికాలోని 15 లక్షలమంది సోషలిస్టులను మిగిలిన ప్రపంచ మంతటిలో గల 2 కోట్ల 30 లక్షల మంది సోషలిస్టులతో ఐక్యపరచిన సోషలిస్టుల అంతర్జాతీయ సంస్థ గురించి చెప్పాడు.

అటువంటి రెండున్నర కోట్ల మంది బలమైన సభ్యులు కలిగిన సోషలిస్టు విప్లవ సైన్యం "మాకు (సంపదలో) కొంతభాగం కాదు. మీ దగ్గరున్నదంతా కావాలి. మీ దగ్గరున్న మొత్తం సంపద అంతా మా స్వాధీనంలోకి వస్తే తప్ప మేం తృప్తిపడం. మేము అధికారం యొక్క కళ్ళేలు, మానవాళి గమ్యాలు మా చేతుల్లోనే వుండాలని కోరుతున్నాం. ఇవిగో మా బలమైన చేతులు. మేమూ మీ ప్రభుత్వాలను, రాజభవనాలను, యితర సంపదలను మీ నుండి గుంజుకొని దల్చుకొన్నాం. అటువంటి రోజు వచ్చిన రోజున మీరు పొట్టకూటి కోసం పొలంలో పనిచేసే రైతులానో లేదా నగరాల్లో ఆకలితో పస్తులుంటూ, గిడసబారిపోయి పనిచేస్తున్న గుమాస్తాల మాదిరిగ పనిచేయాల్సి వస్తుంది" అంటూ ప్రకటించాడు.

పెట్టుబడిదారీ వర్గం సామాజిక వ్యవహారాలను సక్రమంగా నిర్వహించలేకపోయినందునే, అమెరికాలో 15 లక్షలమంది విప్లవకారులు ఆవిర్భవించారనీ, ఆదిమకాలంనాటి గుహల్లో నివసించే మనిషి కన్నా ఆటవికంగా నేటి మనుష్యులను పెట్టుబడిదారీ సమాజం తయారుచేసిందనీ, ఈ మనుష్యులకు సహజమైన ప్రతిభతో శక్తిని ఉత్పత్తి చేసి పెట్టే నేర్పే తప్ప వాళ్ళ స్వాధీనంలో పనిముట్లు లేకుండా చేశారనీ, అయినా యిప్పుడు ఆదిమ కాలం నాటికన్నా వేలరెట్లు ఎక్కువగా శ్రామిక ప్రజలు ఉత్పత్తి చేయగలుగుతున్నారనీ, కానీ ప్రజలు దారిద్ర్యంలో మగ్గుతున్నారనీ,- కడుపుకు తిండి, తగిన ఆశ్రయం లేక, ప్రమాణాలకు తగ్గ పనిచేసే సామర్థ్యాన్ని కొనసాగించలేని స్థితిలో పేదరికంగా పరిగణించటం జరుగుతోందనీ, ఈ పేదల గురించిన వాస్తవాలు వెల్లడి కాకూడదన్న భయంతోనే 1910వ సంవత్సరంలో జనాభా లెక్కలను ప్రజలకు వెల్లడించ లేదనీ, అమెరికాలో ఆ రోజున 30 లక్షలమంది బాల కార్మికులున్నారనీ, యింకో 12 సంవత్సరాల్లో వారి సంఖ్య రెట్టింపు అవుతుందనీ, నాటి ఆటవిక మానవుడి కన్నా వేలరెట్ల ఉత్పాదన శక్తిగల నేటి అమెరికాలో తిండీ, నీడా లేని ప్రజలు ఒకటిన్నర కోట్లమంది వున్నారనీ, అందువలన పాలించే అధికారంలో వుండే అర్హత మీకు లేదనీ, మీరు శాసనసభ భవనాల్లోనే నిస్సిగ్గుగా బాలకార్మికుల, పసిపిల్లల శ్రమ లేకుండా లాభాలను సాధించలేము అని ప్రకటించిన నీతిమాలిన నీచులు అని, మీరు సంపదతో అధికార మదంతో విర్రవీగుతున్న క్షుద్రులనీ-యిటువంటి మీకు మేము మీతో తలపడి నపుడు తేనె పట్టులోని మగతేనెటీగపై, యితర తేనెటీగలన్నీ ఈ మగ తేనెటీగను అంతం చేసేందుకు దాడిచేసి నప్పుడున్న అవకాశం కూడా వుండదనీ ఎర్నెస్టు వారిని సవాలుగా హెచ్చరిస్తాడు.

కల్నల్ వేన్ గిల్బర్టుతో పాటు అక్కడి సభికుల్లోని మరికొందరు 'అదంతా పచ్చి అబద్ధం' అంటూ ఆవేశంగా ముందుకురుకుతారు. కానీ ఏ ఒక్కరూ అతడు చేసిన ఆరోపణను-పెట్టుబడిదారీ వర్గం సమాజ నిర్వహణను సక్రమంగా చేయలేకపోయింది అన్నదాన్ని త్రిప్పికొట్టలేక పోతారు-అప్పుడు వారందరికి నాయకుడైన విక్సన్ లేచి

"చూడండి ఆ ఎలుగుబంటు. అదే ఎర్నెస్టు మన ప్రభుత్వాలనూ, మన రాజభవనాలనూ. మనకున్న దాన్నంతా గుంజుకుంటామంటున్నాడు. నిజమే. సమాజంలో ఒక పెనుమార్పు రాబోతోంది. అది అతడు ఎదురుచూస్తున్న మార్పు కానే కాదు. అతడు మనల్ని నలిపి, పిప్పి చేసి పారేస్తానంటున్నాడు ఒకవేళ మనమే ఆ ఎలుగుబంటును నలిపి పిప్పిచేస్తే.... అయితే మనం యిప్పటిలా రొద చేయటం ద్వారా ఆ పని చేయం-మన జవాబు తుపాకి గుళ్ళ ద్వారా చెప్తాం. మనం అధికారంలో వున్నాం. ఆ అధికారంలో వున్న కారణం రీత్యానే, మనం అధికారంలోనే మిగిలి వుండిపోతాం" అంటూ ఎర్నెస్టు సవాలుకు జవాబు చెప్తాడు.

ఇందుకు జవాబుగా "మాకు తెలుసు. మా చేదు అనుభవం వల్ల మాకు తెలుసు. మీరు మానవాళి కోసం సక్రమంగా న్యాయంగా వ్యవహరించండి అని మేము చేసే అభ్యర్థనలు, విజ్ఞాపనలూ మీ హృదయాలను కనీసంగా కూడా స్పృశించవని మాకు తెలుసు. పేద ప్రజల ముఖాలను త్రొక్కి పారేస్తున్న మీ కాలిమడమ అంతటి కఠినమైనవి మీ హృదయాలు. అందుకే మాకుగల ఓట్ల శక్తి ద్వారా మీ ప్రభుత్వాన్ని మీ నుండి గుంజుకుంటాం" అని ఎర్నెస్టు చెప్పాడు. "మీకు ఎన్నికల్లో మెజారిటీ వచ్చినా మేం ప్రభుత్వాధికారాన్ని మీకు అప్పగించటానికి తిరస్కరిస్తే?" అంటూ విక్సన్ ఎదురు ప్రశ్న వేస్తాడు.

"అది కూడా మేం ఆలోచించాం. మేమూ మందు గుండ్లతోనే సమాధానం చెప్తాం-బలమే మనకు మధ్యవర్తి తీర్పునిస్తుందని మాకు తెల్సును. బలం ద్వారానే విషయం పరిష్కారమవుతుంది. ఇది వర్గాల యొక్క పోరాటం. పాత ఫ్యూడల్ సమాజాన్ని మీ వర్గం ఎలా కూల్చద్రోసిందో, మీ వర్గాన్ని కార్మికవర్గం కూలద్రోస్తుంది. ఇది అనివార్యమైన విషయం. కాకపోతే మీ వర్గాన్ని కూల్చద్రోసేందుకు ఒక సంవత్సరం లేదా పది సంవత్సరాలు, లేదా వేల సంవత్సరాలు పట్టొచ్చు. అది కూడా బలప్రయోగం ద్వారానే జరుగుతుంది. "అంటూ తన ఉపన్యాసాన్ని ముగిస్తాడు.

ఈ రకంగా జాక్‌లండన్, పెట్టుబడిదారీ వర్గం యొక్క వర్గ స్వభావాన్ని, దాని హృదయం లేనితనాన్ని, రాజ్యాధికారాన్ని పొందటానికి ఓట్లు, ఎన్నికలే భేషయిన మార్గం అని తాను చెప్పిన్న 'ప్రజాస్వామిక విధానం' తన అధికార ప్రయోజనాలకు విరుద్ధంగా పరిణమిస్తే, దాన్ని ఎలా కాలరాచి పారేసి దౌర్జన్యానికి హింసకూ నిస్సంకోచంగా దిగుతుందో, అంతిమంగా ఆయుధాలశక్తే రాజ్యాధికార సమస్యను పరిష్కరించే మధ్యవర్తిగా మలచబడిన వాస్తవికతను గురించీ, అనివార్యంగానే వర్గపోరాటం చేయాల్సిన స్థితికి కార్మికవర్గం ఎలా నెట్టబడుతుందో, ఈ నాటకీయ దృశ్యం ద్వారా పాఠకులకు వివరించటం జరిగింది.

ఇక కథ విషయానికొస్తే.

రాబోయే ఘటనలకు సంబంధించిన హెచ్చరికలు ఎవిస్‌కు వస్తున్నాయి కార్మికవర్గ నాయకుల్తో, పొత్తు పెట్టుకోవడాన్ని వ్యతిరేకిస్తూ, ఎవిస్‌కు హెచ్చరికలు అందుతున్నాయి. సమాజంలోనూ, యూనివర్శిటీలోనూ పలుకుబడిగల శ్రీమతి విక్సన్, ఎవిస్ ఒక తెలివితక్కువ మొద్దు అనీ, అనవసరంగా యితరుల వ్యవహారాల్లో తలదూరుస్తోందనీ ప్రచారం రేకెత్తించింది. ఎవిస్ యొక్క స్నేహితులంతా ఆమెను తప్పించుకొని తిరుగుతున్నారు. బహుశా తాను ఎర్నెస్టును పెళ్ళి చేసుకోబోతున్న దానికి అసమ్మతిగా తన స్నేహితులు అలా ప్రవర్తిస్తున్నారు అనుకుంటోంది. కానీ ఆమె తన వర్గ శత్రువుకు ఆశ్రయం యివ్వటం వలన, తన వర్గం అటువంటి వైఖరిని ఆమె పట్ల ప్రదర్శిస్తోందని ఎర్నెస్టు ఆమెకు ఎరుకపరుస్తాడు.

మరోవైపు జాన్ కన్నింగ్‌హాంను యూనివర్శిటీ అధ్యక్షుడయిన విల్‌కాక్సు పిలిపించి' యింటికి అన్ని రకాల సోషలిస్టులనూ, రాడికల్సునూ పిలవటం అన్నది సరయినది కాదనీ, అందువల్ల లాభం లేదనీ సున్నితంగా హెచ్చరించి, కన్నింగ్ హాంకు రెండేళ్ళు పూర్తి జీతంతో శలవలిస్తాననీ, యూరోపు పర్యటించి అక్కడ కావాలనుకొంటే పరిశోధనలు జరుపుకోమనీ ప్రతిపాదిస్తాడు. ఇలా చెప్పటం అంటే తనకు లంచం యివ్వటమే అని భావించిన జాన్ కన్నింగ్ హాం విల్‌కాక్సు యివ్వజూపిన అవకాశాన్ని నిరాకరిస్తాడు.

ఈ ఉదంతం విన్న ఎర్నెస్టు "ప్రస్తుతం వున్నంత భయంకరమైన కల్లోలిత-అస్థిర పరిస్థితుల్లో ప్రపంచం యింతకు ముందెన్నడూ లేదు. మన పారిశ్రామిక వ్యవస్థలో వేగవంతంగా జరుగుతున్న మార్పులే మన మతంలోనూ, రాజకీయ, సామాజిక నిర్మాణాల్లోనూ వేగవంతమయిన మార్పులను తీసుకొస్తున్నాయి. సామాజిక నిర్మాణంలో మనకు కానరాని భయంకరమైన విప్లవం జరుగుతోంది. ఈ విషయాలను కొంచెం కొంచెంగా మనం గ్రహించగలుగుతున్నాము. కానీ యివి ఈ రోజున వాతావరణంలో తిరుగాడుతున్నాయి- స్పష్టమయిన, భయంకరమైన, విస్తృతి గలిగిన విషయాలు అవి...... ..... బ్రహ్మాండమైన ప్రమాదకరమైన నీడ ఏదో, యిప్పుడు భూమిపై పడబోతోంది. దీన్నే నేను కొద్దిమంది ధనస్వాముల మురా అదుపులో పాలింపబడుతున్న నిరంకుశ వ్యవస్థ యొక్క నీడ అని పిలుస్తాను. అయితే దాని స్వభావమేంటో నేను అర్థం చేసుకోలేక పోతున్నాను " అంటూ జాన్‌కన్నింగ్ హాంను విల్‌కాక్స్ ప్రతిపాదనను అంగీకరించి యూరోపు వెళ్ళిపొమ్మని ఎర్నెస్టు సలహా ఇస్తాడు. అంగీకరించడు. "మీరూ బిషప్ మూర్‌హౌస్ సాగే బాటలోనే సాగుతున్నారు" అంటూ ఎర్నెస్టు తాను బిషప్‌కు అధోజగత్తును(నిరుపేదల ప్రపంచాన్ని-దౌర్భాగ్యాన్ని) చూపించాననీ, దానితో ఆయన ఆత్మ జబ్బు పడిందనీ, అయితే ఆయన గతంలో మాదిరే భూమి మీద కాకుండా వూహాలోకంలోనే విహరిస్తూ, తాను నాగరికుల మధ్య నైతిక బోధలు చేసే యత్నంలో వున్నాడని తెలియచేస్తాడు.

తనకు కూడా ప్రభుత్వం అమెరికా దేశపు కమీషనర్ ఆఫ్ లేబరు ఉద్యోగం యిస్తానని కబురు పంపిందనీ- అంటే తనకు లంచం యివ్వజూపుతోందనీ, ఇది పాత ట్రిక్కేననీ, యిది వర్గపోరాటం అంతటి పాతది అనీ, - కార్మిక సైన్యాన్నుండి వారి అధికారులను దొంగిలించటం అన్నదే యీ ట్రిక్కు అనీ, యిదే రకంగా ఎందరో కార్మిక నాయకులను గతంలో ఎన్నోసార్లు కొనుగోలు చేసుకోవటం జరిగిందనీ, మొత్తం ఒక కార్మిక సైన్యంతో పోరాడి నెగ్గటం కంటే, ఒక కార్మిక సైనిక అధ్యక్షుణ్ణి కొనుగోలు చేసుకోవటం చాలా చౌక అయినదనీ-అలా అమ్ముడుపోవటం కార్మిక విద్రోహమనీ, అందువలన తాను అమ్ముడు కాదల్చుకోలేదనీ చెప్తాడు. మరీ యితర కారణం కోసం కాకపోయినా, కనీసం తన తండ్రి జ్ఞాపకార్థమైనా అమ్ముడుబోనని ఎర్నెస్టు కన్నీటి వర్షంతో చెప్పి, తన తండ్రి సోమరిపోతులైన, పరాన్నభుక్కులైన, మృగాలైన యజమానులకు ఒక రాత్రి మందు పార్టీకి సరిపడే సంపాదన చేకూర్చిపెట్టడం కోసమో. లేక ఒక చక్కని ఆభరణం చేకూర్చిపెట్టడం కోసమో లేదా అటువంటి మరోదాన్నే యజమానులకు చేకూర్చిపెట్టటం కోసమో జీవితాన్ని బలిపెట్టాడని బాధపడతాడు.

ఈ రకంగా జాక్‌లండన్ వర్గ పోరాటపు హెచ్చరిక చేసిన కార్మికవర్గంపై కొద్దిమంది ధనస్వాముల మురాచే పాలింపబడే నిరంకుశ రాజ్యం యొక్క నీడ గురించి వెల్లడి చేస్తాడు. ఎర్నెస్టు లాగానే ఆ కాలంలో ఆ నీడయొక్క స్వభావాన్ని అస్పష్టంగానైనా అర్థం చేసుకొన్న, హత్యకు గురయిన నాటి అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ తన హత్య జరగటానికి కొంచెం ముందుకాలంలో యిలా అంటాడు: "నేను సమీప భవిష్యత్తులో నా దేశపు భద్రతకు ప్రమాదకరంగా పరిణమించబోయే ఒక సంక్షోభ ఆగమనాన్ని చూశాను. అది నన్ను భయంతో వణికింప

...ంపి. .కార్పోరేషన్లకు పట్టం కట్టబడింది. ఉన్నత ...ాలలో అవినీతి పెంపొందే యుగం రాబోతోంది. ఈ దేశంలో వున్న ధనం యొక్క శక్తి, ప్రజలమధ్య నున్న విరుద్ధ అభిప్రాయాలను ఆధారం చేసుకొని, దేశ సంపద అంతా కొద్దిమంది చేతుల్లోకే కేంద్రీకరింపబడి, అమెరికన్ రిపబ్లిక్కు ధ్వంసమయ్యే వరకూ తన పాలనను పొడిగిస్తుంది."

దీన్నిబట్టి పెట్టుబడిదారీ వ్యవస్థ ముదిరి, చిక్కబడి తన ఉన్నత దశలోకి చేరుతున్న పరిణామం యొక్క నీడను నాడు జాక్‌లండన్ అర్థం చేసుకొన్నాడని తెలుస్తోంది. కొద్దిమంది ముఠా యొక్క నిరంకుశ ధనస్వామ్య పాలనా వ్యవస్థ యొక్క నిర్బంధ అణచివేత విధానం-యంత్రాంగాల వ్యవస్థనే జాక్‌లండన్ "ఇనుప మడమ"గా భావించాడు. యీ నిర్బంధ వ్యవస్థ ప్రజలను నిర్బంధించటానికి ఎలా చాపక్రింద నీరులా చొరబడుతోందో జాక్‌లండన్ ఈ అంకంలో వివరించాడు.

ఇక కథలోకి వస్తే

బిషప్ మూర్‌హౌస్ తన అధిభౌతిక భావనలకు అనుగుణంగానే ప్రస్తుత దౌర్భాగ్య ప్రపంచాన్ని తన బోధనల ద్వారా సరిచేయటం కోసం ఉపక్రమిస్తాడు. ఐ.పి. హెచ్ అనే సంస్థ యొక్క మత బోధనలకు పరిచయ సందేశం యిచ్చే రూపంలో ప్రపంచాన్ని మతబోధన ద్వారా బాగుచేసే యత్నాన్ని ప్రారంభిస్తాడు. "ఇప్పటి వరకు, చర్చీ, మతబోధకులూ ఏసుక్రీస్తు స్థానంలో ధన దేవతను అధిష్టించటం జరిగింద"నీ ఫలితంగా ప్రపంచమంతా దుర్మార్గం, దౌర్భాగ్యాలతో నిండి చెడిపోయిందనీ, చర్చిలు అన్నీ ఆడంబరంతో, వైభవంతో ప్రభువు యొక్క మార్గం నుండి దూరంగా వెళ్ళిపోయాయనీ, ప్రభువు యొక్క గొర్రెపిల్లలకూ తమకూ మధ్య అడ్డుగోడ నిర్మించాయనీ, అందువలన ధనవంతులు, సంపన్నవంతులూ ప్రభువు యొక్క గొర్రెపిల్లల్ని త్రొక్కి పారేస్తున్నారనీ, హృదయాలను కఠినపర్చుకొన్నారనీ, బాధతోనూ, వేదనతోనూ ఆక్రోశించే ఈ భూమి మీ ద వున్న ప్రజల ఆర్తనాదాలను వినకుండా చెవులు మూసుకున్నారనీ, కానీ వారి ఆక్రందనలను ఒక రోజు వినటం అన్నది జరుగుతుందనీ సందేశం యిస్తారు. ఆయన అలసిపోయి, అనారోగ్యంతో వున్నాడన్నట్టుగా భ్రమింపచేస్తూ ఆయన్ను మెల్లగా నిర్వాహకులు చేయి పట్టుకొని బయటకు నడిపిస్తారు. ఆయన యిచ్చే సందేశాన్నంతా వార్తాపత్రికల ప్రతినిధులు రాసుకున్నారు. కానీ మర్నాటి దినపత్రికల్లో ఒక్కటీ కూడా ఆయన చెప్పిన ఒక్క మాటను కూడా ప్రచురించలేదు.

"పత్రికల యొక్క 'విధానాన్ని' పాటించుతున్నందుకు ఎడిటర్లకు పెద్ద మొత్తాలలో జీతం ముట్టచెప్పబడుతుంది. 'విధానం' అంటే సుస్థాపితమైన వ్యవస్థకు ప్రమాదకరం కాని అంశాలను, విషయాలను మాత్రమే ప్రచురించటం, అమెరికాలోని పత్రికారంగం పెట్టుబడిదారీ వర్గం మీద పరాన్నభుక్కుగా జీవిస్తూ, దాని బంటుగా వుంటుంది. అది నిర్వర్తించే కర్తవ్యమల్లా సుస్థాపితమైన వ్యవస్థకు ఊడిగం చేస్తూ, ప్రజాభిప్రాయాన్ని ఆ వ్యవస్థకు అనుకూలంగా మలిచిపెట్టడమే". అంటూ ఎర్నెష్టు బిషప్ సందేశం పత్రికల్లో ప్రచురింపబడక పోవటానికి గల కారణాన్ని విశదీకరిస్తాడు.

ప్రజాస్వామ్య మూలస్థంభాల్లో పత్రికలు ఒక ముఖ్యమైన స్థంభం అంటూ, పత్రికా స్వేచ్ఛలాంటి అందమైన నినాదాలు చేస్తూ ప్రజలను నమ్మబలుకుతూ వర్థిల్లుతూ తన మనుగడను సాగిస్తున్న వార్తా పత్రిక రంగం యొక్క అసలు స్వభావాన్నీ, దాని పక్షపాత స్వభావాన్నీ ఎర్నెష్టు ద్వారా జాక్‌లండన్ బట్టబయలు చేయిస్తాడు. నాటి అమెరికాలోనే. కాదు,-నేటి మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ వార్తాపత్రికా-మీడియా-వ్యవస్థ అదే రకంగా వ్యవహరిస్తూ, అధికారంలో వున్న ధనస్వామ్య వర్గాల పక్షపాతమే వహిస్తుండటంలోని మర్మం అదే!

యిక కథలోకి వస్తే,

కొన్నాళ్ళ తర్వాత బిషప్ మూర్‌హౌస్ అతిగా శ్రమించి అలసట పొందాడనీ, అందువలన ఆ అలసట ప్రభావం నుండి కోలుకోవటానికి సెలవు మీద పంపబడ్డాడనీ ప్రకటించటం జరిగింది.

ఎర్నెష్టు సోషలిస్టు టిక్కెట్టు మీద అమెరికన్ కాంగ్రెసుకు పోటీ చేయబూనుకున్నాడు. ఇందుకు కొంచెం ముందుగా జాన్‌కన్నింగ్ హాం ఈసారి చిన్న, చిన్న పెట్టుబడిదారులను తన యింట్లో డిన్నర్‌కు ఆహ్వానించాడు. ఆ 'డిన్నర్'ను 'లాభనష్టాల' డిన్నర్ అని పిలిచారు.

ఆ డిన్నర్‌కు చాలా బ్రాంచీలు వున్న పచారీ సామానులను అమ్మే బడా సంస్థ అయిన ఓవెన్&కంపెని అధిపతి ఓవెన్, కోవాల్ట్ ది వాషర్ బన్ అనే మందులు అమ్మే సంస్థకు చెందిన యిద్దరు పార్టనర్లూ, కింట్రూ కోసా ప్రాంతంలో గల ఒక పెద్ద గ్రానైటు క్వారీ యజమాని అస్సున్‌గారు, తదితర చిన్న చిన్న ఫ్యాక్టరీల, వ్యాపార సంస్థల యజమానులు వచ్చారు. ఎర్నెష్టు కూడా ఆ డిన్నర్‌కు వచ్చాడు.

"పత్రికల యొక్క 'విధానాన్ని' పాటించు తున్నందుకు ఎడిటర్లకు పెద్ద మొత్తాలలో జీతం ముట్టచెప్పబడుతుంది. 'విధానం' అంటే సుస్థాపితమైన వ్యవస్థకు ప్రమాదకరం కాని అంశాలను, విషయాలను మాత్రమే ప్రచురించటం, అమెరికాలోని పత్రికారంగం పెట్టుబడిదారీ వర్గం మీద పరాన్నభుక్కుగా జీవిస్తూ, దాని బంటుగా వుంటుంది. అది నిర్వర్తించే కర్తవ్యమల్లా సుస్థాపితమైన వ్యవస్థకు ఊడిగం చేస్తూ, ప్రజాభిప్రాయాన్ని ఆ వ్యవస్థకు అనుకూలంగా మలిచిపెట్టడమే". అంటూ ఎర్నెష్టు బిషప్ సందేశం పత్రికల్లో ప్రచురింపబడక పోవటానికి గల కారణాన్ని విశదీకరిస్తాడు.

ఆ చిన్న పెట్టుబడిదారుల ఏకగ్రీవ ఫిర్యాదు ఏమిటంటే, కార్పోరేషన్లూ, ట్రస్టులూ తమను బ్రతకనియ్యటల్లేదని, అందువల్ల వాళ్లు "ట్రస్టులను ధ్వంసం చేయండి" అన్న నినాదంతో రైలురోడ్డు టెలిగ్రాఫ్ లాంటి ట్రస్టులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ, వాటిపై ఎక్కువ ఆదాయపు పన్ను విధించి, తీవ్రంగా వ్యవహరించి ఆ ట్రస్టులు అధికాధికంగా ప్రోగు చేసుకొన్న ధనరాసులను నాశనం చేయాలని వారు బోధిస్తారు. అదేరకంగా స్థానికంగా గల రుగ్మతలన్నింటికీ పరిష్కారంగా నీరూ, గ్యాసూ, టెలిఫోన్లూ, సిటీరైల్వేలూ లాంటి ప్రజోపయోగ సర్వీసులను మున్సిపాల్టీలు నిర్వహించాలని సూచిస్తారు. వారు ఒక ప్రత్యేక మధ్య తరగతి పార్టీ అయిన గ్రేంజీ పార్టీ ద్వారా పోట్లాడదలుచుకొన్నారు.

అసుమ్‌సేన్‌గారు శాన్‌ఫ్రాన్సిస్కోలో సంభవించిన పెద్ద భూకంపం వలన తన క్వారీ వ్యాపారం నాల్గురెట్లు పెరిగినా, తన స్థితి మాత్రం ఏమీ మెరుగ్గా లేదనీ, రైల్వేలు, తమ యిష్టానుసారం రవాణా చార్జీల ఆయుధం ఉపయోగించి తన లాభాలన్నింటినీ హరించివేస్తున్నాయని వాపోతాడు.

ఓవెన్ కూడా, అసుమ్‌సేన్ చెప్పిన దాన్ని సమర్థిస్తూ, తన పచారీ వ్యాపారంలో కూడా అలాగే జరుగుతోందనీ, ఎక్కువ పెట్టుబడి పెట్టే ట్రస్టుల బడా వ్యాపారంలో తక్కువ ఉత్పత్తి దుర్వ్యయం జరుగుతుందనీ, సామర్థ్యం పెరుగుతుందనీ అందువలన ట్రస్టులు తక్కువ రేటుకు వస్తువులను అమ్మి తమలాంటి చిన్నవారిని మింగేయగల్గుతున్నాయని తన గోడు విన్పిస్తాడు.

అదే రకంగా స్టాండర్డు ఆయిల్ కంపెనీ సరఫరా చేసే అదనపు పెట్టుబడితో పాలట్రస్టు తమ పాల వ్యాపారాన్ని దెబ్బతీసిందనీ, అందర్నీ ట్రస్టులోకి రమ్మని-లేదా నశించిపొమ్మని బెదిరించిన పాల ట్రస్టు క్రమంగా తమను పాల వ్యాపారం నుండి గెంటివేసి, తమ వ్యాపారాలను మింగివేసిందనీ, ట్రస్టు తనకు గల భారీ ఎత్తు పెట్టుబడుల సౌలభ్యం వలన, క్రొత్త కొత్త యంత్రాలను వినియోగించి పాలను తక్కువ రేటుకు అమ్మే రూపంలో తమను తుడిచిపెట్టేసిందనీ క్వాలిన్‌గారు చెప్తారు.

ఇవన్నీ విన్న ఎర్నెస్టు ట్రస్టులూ, కాంబినేషన్లూ పోటీ అన్నదాన్ని వ్యాపారంలో లేకుండా రద్దు చేస్తాయనీ, మత్స్య న్యాయసూత్రాన్ని పెట్టుబడి అనుసరిస్తుందనీ ఆ రకంగానే యిపుడు జరుగుతోందనీ మీరు (చిన్న పెట్టుబడిదార్లు) చిన్న వ్యాపారస్థులను మీ పెట్టుబడిశక్తితో మింగేశారనీ, మిమ్మల్ని మీ కన్నా పెట్టుబడిగల ట్రస్టులూ, కాంబినేషన్లూ వ్యాపారాల నుండి తొలగించివేశాయనీ, మీరు వాంఛిస్తున్న, చెబ్తున్న "అందరికీ స్వేచ్ఛావకాశాలు" అన్న అమెరికా దేశపు విముక్తి సందర్భంగా మన తాత ముత్తాతలు వల్లించిన మౌలిక సూత్రాలు నిలబడవనీ, ఆర్థిక వ్యవస్థ యొక్క పరిణామ క్రమదశలోనే వున్నామనీ, వాణిజ్య పోటీలోనే ఉద్భవించిన ట్రస్టులు, పోటీనే రద్దు చేస్తాయనీ, కాంబినేషన్(పెట్టుబడిదారుల కలయిక) అన్నది పోటీ కన్నా శక్తివంతమయినదనీ, ట్రస్టులు తమ వద్ద గల అపార పెట్టుబడితో శ్రమని తగ్గించే యంత్రాలు వాడటం ద్వారా ఉత్పత్తి యొక్క సామర్థ్యాన్ని పెంచి వేస్తాయనీ, అందువలన మీరు కోరుకుంటున్న విధంగా ట్రస్టులను ధ్వంసం చేసి పాత రోజుల నాటి స్థితికి వెళ్ళటం అన్నది జరిగే పని కాదనీ, అది సరయినది కాదనీ, పెట్టుబడి సృష్టించిన సమర్థవంతంగా, చౌకగా ఉత్పత్తి చేసే యంత్రాలపైన మన అదుపును సాధిద్దాం అనీ, దాన్నే సోషలిజం అంటారనీ, అది ట్రస్టులకన్నా పెద్ద కాంబినేషన్ అనీ, పెద్ద ఆర్థిక, సామాజిక కాంబినేషన్ అనీ, యిప్పటి వరకూ దాన్ని మించిన కాంబినేషన్ మన భూగ్రహంపై కానరాలేదనీ వారికి వివరిస్తాడు. మనం కాంబినేషన్ని అంతకన్నా మహత్తరమైన కాంబినేషన్‌తో ఎదుర్కొందాం. రండి మీరు మా సోషలిస్టులతో చేతులు కలపండి. మనమే నెగ్గుతాం! అంటూ వాళ్ళను ఆహ్వానిస్తాడు.

అయితే వాళ్ళందరూ తమ తలలు అడ్డంగా ఊపుతూ అందుకు వ్యతిరేకత వ్యక్తం చేస్తారు. అప్పుడు ఎర్నెస్టు వారిని "మీ గ్రేంజీ పార్టీని ప్రధానంగా ప్రతిరోధించేది ట్రస్టులే కదా!" అంటూ ప్రశ్నిస్తాడు. అందుకు జవాబుగా క్వాలిన్ "మేం ఓరెగాన్ రాష్ట్ర శాసనసభలో మెజార్టీ సంపాదించాము. మా చిన్న పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించే చట్టాలను చట్టసభలో వుంచాము. కానీ గవర్నర్ దాన్ని వీటో చేశాడు. ఆ గవర్నరు ట్రస్టుల యొక్క తొత్తు. మేము కొలరాడాలో గవర్నర్లను ఎన్నుకొన్నాము. కానీ అక్కడి శాసనసభ అతడ్ని గవర్నరుగా పదవీ ప్రమాణం చేయించటానికి తిరస్కరించింది. రెండుసార్లు జాతీయ ఇన్‌కంటాక్సు బిల్లులు చేశాము. కానీ అవి రాజ్యాంగ విరుద్ధమయినవి అంటూ సుప్రీంకోర్టు కొట్టివేసింది. కోర్టులూ ట్రస్టుల చేతుల్లోనే వున్నాయి...." అంటూ చెప్పుకొచ్చారు.

"అంటే చట్ట సభలనన్నింటినీ నియంత్రించేది ట్రస్టుల యొక్క కాంబినేషన్ అయితే అదే ప్రభుత్వం అయిపోతుందన్నమాట. అప్పుడేం చేస్తారు?" అంటూ వాళ్ళను ఎర్నెస్టు ప్రశ్నించాడు.

"మేం మా బలంతో ఎదురు తిరుగుతాం" అన్నారు వాళ్ళు.

"మీరు ప్రభుత్వం వాళ్ళ చేతిలో వుందని ఎదురు తిరుగుతారన్నమాట. కానీ మీ మీద ప్రభుత్వం సైన్యాన్నీ, నేవీని, మిలీషియాని, పోలీసుల్ని-మొత్తం అమెరికా దేశపు యుద్ధ యంత్రాంగాన్ని ప్రయోగిస్తుంది. అపుడు బలం ఎందుకూ కొరగాదు. ఒకప్పుడు 50 వేల మందిగా వున్న సైన్యం రోజు-రోజూ పెరిగి యిప్పుడు 3 లక్షలకు పెరిగింది. వీరుకాక మిలీషియా వుంది. అంతేకాక ప్రభుత్వానికి ఎమర్జెన్సీ అధికారం వుంది. ఆ అధికారంతో అది పౌరులను మిలీషియాలోకి బలవంతంగా తీసుకెళ్తుంది.......అప్పుడు హెబియస్ కార్పస్ బదులు మీకు దక్కేవి పోస్టుమార్టంలే." అంటూ ఎర్నెస్టు చెప్తాడు.

"అలా జరుగదు. పౌరులను మిలీషియాలోకి తీసుకెళ్ళటం రాజ్యాంగ విరుద్ధం" అంటూ వాళ్ళు అరుస్తారు.

"రాజ్యాంగం గురించి మీకేం తెలుసు. కోర్టులు రాజ్యాంగానికి భాష్యం చెప్తాయి. అవి ట్రస్టుల చేతిలో కీలుబొమ్మలు- యిప్పటికే పౌరులను మిలీషియాలోకి లాక్కెళ్ళే చట్టాన్నీ, అందుకు నిరాకరిస్తే కోర్టు మార్షల్ చేసి శిక్షించే బిల్లుని రహస్యంగా కాంగ్రెసులోనూ, సెనేట్లలోనూ ప్రవేశపెట్టి, దానికి అధ్యక్షుడి ఆమోదాన్ని పొంది చట్టం చేయటం జరిగిపోయింది" అని చెప్పి "మీలో చాలామంది సోషలిజం అసాధ్యం అంటున్నారు. కానీ అది అనివార్యం అని మీకు చెప్పదల్చుకొన్నాను. చిన్న పెట్టుబడిదారులైన మీరు కొట్టుకుపోతున్నట్టే, ఆర్థిక పరిణామక్రమంలో పెద్ద పెద్ద ట్రస్టులూ కొట్టుకుపోతాయి. ఆర్థిక పరిణామక్రమం వెనక్కి ప్రవహించదు. అది సోషలిజం వేపు పయనిస్తుంది. పెట్టుబడీ, కార్మికశక్తీ కలిసి సృష్టించే అదనపు పెట్టుబడి తిరిగి పెట్టుబడిగా పెట్టబడి ఉత్పత్తి ఎక్కువ చేస్తోంది. అత్యధిక ఉత్పత్తి వలన నరుకులు దేశ అవనరాలను మించి మిగులుతాయి. వాటిని విదేశీ మార్కెట్లలో అమ్మకానికి పంపటం జరుగుతోంది. అమెరికా తన మిగులు సరుకులను అభివృద్ధి చెందని దేశాల మార్కెట్లకు పంపి, ఆ దేశాల నుండి సెక్యూరిటీ బాండ్లు పొందే రూపంలో అక్కడి రైలురోడ్లకూ, గనులకూ, ఫ్యాక్టరీలకూ, భూములకూ యజమాని అయి కూర్చుంటుంది. దేశాల మధ్య యుద్ధాలు సంభవిస్తాయి. ఆదేశాలు ప్రపంచాన్ని పంచుకొంటాయి". అంటూ కారల్‌మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతాన్ని ఎర్నెస్టు వివరిస్తాడు.

అవన్నీ అంగీకరిస్తూనే "వారు యిప్పుడు యిది మా మధ్యతరగతి వర్గానికి చావో, రేవో తేల్చుకోవాల్సిన సమస్య. దీన్ని మా తాతముత్తాతల కాలం నాటి పురాతన, మొరటు పద్ధతుల ద్వారానే పరిష్కరించుకుంటాం. నీవన్నట్టు ఆర్థిక పరిణామ క్రమ ప్రవాహాన్ని వెనక్కి మళ్ళించటానికే నిశ్చయించుకొన్నాం, మేం అదనపు ఉత్పత్తికి కారకమయిన యంత్ర ధ్వంసకులుగానే వుంటాం!" అంటూ తమ అభిప్రాయాన్ని చెప్తారు.

"మీరు మీకంటే బలమైన రెండు శక్తులను వ్యతిరేకిస్తున్నారు. బడా పెట్టుబడిదారులైన ట్రస్టులు మిమ్మల్ని వెనక్కి తిరగనివ్వవు. అవి మిమ్మల్ని యంత్రాలను ధ్వంసం చేయనివ్వవు. అంతకన్నా మరింత బలమైన శక్తి అయిన కార్మికవర్గం కూడా మిమ్మల్ని యంత్రాల ధ్వంసం చేయనీయదు. అందువలన ప్రపంచం యొక్క యంత్రాల యొక్క యజమానత్వము రెండు శక్తుల మధ్యనే వుంది.... ఒకవేళ కార్మిక శక్తి నెగ్గితే, అమెరికాతో పాటు మొత్తం ప్రపంచమంతా ఒక బ్రహ్మాండమయిన నూతన శకంలోకి ప్రవేశిస్తుంది. అప్పుడు యంత్రాల చేత పీల్చిపిప్పి చేయబడటం బదులు జీవితం ఆనందమయినదిగా, హుందా గలదిగా, మెరుగైనదిగా. ఉదాత్తమయినదిగా కార్మికవర్గంచే మలచబడుతుంది. ఉత్పత్తులన్నీ సమదృష్టితో. సమధర్మంగా పంపిణీ చేయబడతాయి.... వినియోగింపబడని అదనపు ఉత్పత్తులంటూ మిగలవు. ఎందుకంటే లాభాలు అనేవి వుండవు గనుక" అంటూ ఎర్నెస్టు సోషలిజం యొక్క ఆవిర్భావ అవకాశాలను వారికి వివరిస్తాడు.

"ఒకవేళ యుద్ధంలో ట్రస్టు గెలిస్తే?" అంటూ కోవాల్టు గారు ప్రశ్నిస్తాడు.

"అప్పుడు- మానవ చరిత్ర పుటలను మరే యితర నిరంకుశత్వమూ మలినం చేయనంతగా ఒక భయంకరమైన నిర్దాక్షిణ్యమైన నిరంకుశత్వం యొక్క యినుప మడమ క్రింద మీరూ, కార్మికశక్తి అయిన మేమూ కూడా నల్లుల్లా నలిపివేయబడతాం. నిర్దాక్షిణ్యమయిన- ఆ నిరంకుశత్వానికి "యినుప మడమ" అన్న పేరే సరయినది" అని ఎర్నెస్టు వారికి తెలియచేస్తాడు.

" అంటే నీ సోషలిజమన్నది ఒక కల అన్న మాట"! అంటారు వాళ్ళు.

"అది కల కాదని మరోరకంగా తెలియపరుస్తాను..... బడా పెట్టుబడిదారులైన ట్రస్టులను మీరు ధనస్వామ్యమని పిలుస్తున్నారు. దాన్నే నేను కొద్దిమందిచే నియంత్రించబడే నిరంకుశ పాలనా వ్యవస్థ అని పిలుస్తాను. మన ప్రస్తుత సమాజంలో మూడు పెద్ద వర్గాలున్నాయి. వీటిలో మొదటిది ధనస్వామ్య వర్గం. ఈ వర్గంలో సంపన్నులైన బ్యాంకర్లూ, రైల్వేల అధిపతులూ, కార్పోరేషన్ డైరెక్టర్లూ, ట్రస్టుల అధిపతులూ వున్నారు. రెండవది మీ వర్గమైన మధ్య తరగతి వర్గం, మీలో రైతులూ, వ్యాపారులూ, చిన్న ఉత్పత్తిదారులూ, వివిధ వృత్తి నిపుణులూ వున్నారు. ఇక మూడోది నా వర్గం. అంటే శ్రామికవర్గం.... ఈ రోజున అమెరికాలో సంపదపై గల యజమాన్యత అన్నదే, కీలకమైన-ముఖ్యమైన -అధికారికంగా వుంది. ధనస్వామ్యం చేతిలో 67 బిలియన్ల డాలర్ల సంపద వుంది. అమెరికాలోని వివిధ వృత్తులలో పనిచేసే వారి మొత్తంలో 10% మంది మాత్రమే ధనస్వామ్య వర్గానికి చెందిన వారున్నారు. అయినా వారు 70% సందపకు అధిపతులు. మధ్యతరగతి చేతిలో 25% సంపద వుంది. దేశం మొత్తం పనిచేసే వారిలో 70% మంది శ్రామిక వర్గానికి చెందినవారే. వీరి చేతిలో కేవలం 4 బిలియన్ల డాలర్ల సంపద మాత్రమే వుంది అంటే దేశపు మొత్తం సంపదలో 70%గా వున్న శ్రామికవర్గం చేతిలో 4% సంపద మాత్రమే వుంది. అందువలన అధికారం ధనస్వామ్య వర్గం చేతుల్లోనే వుంది. మీ మధ్యతరగతి చేతిలో మా కన్నా ఎక్కువ శాతం సంపద వుంది కనుక, మేం -కార్మికులం- మీ కన్నా బలహీనులం అంటూ మురిసిపోవటం వలన మీకు లాభం లేదు. ఎందుకంటే శ్రామికులమైన మా దగ్గర సంపద కన్నా బలం కలిగిన సంపద మా వద్ద వుంది. అది మా శారీరకశక్తి- మా కండరాల్లో వుంది. దీన్ని ఎవరూ మా నుండి పెరికివేయలేరు. మా శక్తి ఓట్లు వేసే మా చేతుల్లో వుంది. తుపాకి ట్రిగ్గర్లను లాగగలిగే మా వ్రేళ్ళలో వుంది. ఈ శక్తిని మా నుండి ఎవరూ లాగేసుకోలేరు....కానీ ధనస్వామ్యం మీ శక్తిని(సంపదను) మీ నుండి గుంజుకొంటోంది. ఇక మీకు సంపద అనేది మిగలకుండా మిమ్ములను అది చేస్తోంది. అపుడు మీ మధ్యతరగతి వర్గం అంతరిస్తుంది. మీరంతా మాలోకి దిగిపోయి, శ్రామికులుగా మారుతారు. కార్మికవర్గానికి పోయేదేమీ లేదు. కాకపోతే మధ్యతరగతి వర్గమే అటు సింహానికీ యిటు పులికి మధ్య గొర్రెపిల్లలా కొట్టుమిట్టులాడుతోంది. మిమ్ములను త్వరలో ధనస్వామ్య వర్గం కబళించబోతోంది." అని పరిస్థితులను ఎర్నెష్టు వివరిస్తాడు.

"అందువల్లనే మీరు మీ తాత తండ్రుల నాటి పద్ధతులకు వెనక్కి మళ్ళాలంటున్నారు. కానీ ఈ రోజున రైతులకు ఏ రకమయిన అధికారముంది? వాళ్ళు కౌలు రైతులుగానో తమ భూములను తనఖా పెట్టుకొన్న వారుగా వుండటం వల్ల, వారిలో సగం మంది దాసులుగా (బానిసలు) వున్నారు. అంతేకాదు ట్రస్టులే భూయజమానులుగానో లేక రైతులను నియంత్రించేవిగానే ఉన్నందు వలన కోల్డు స్టోరేజీలు, రైలురోడ్లు, ఎలివేటర్లు. ఓడలు లాంటి పంటల మార్కెటింగ్ సాధనాలను ట్రస్టులే తమ యజమాన్యతలో వుంచుకుని, నియంత్రించటం వలన కూడా రైతులు దాసులుగానే వున్నారు. ట్రస్టులే మార్కెట్లను నియంత్రిస్తున్నాయి. ఆ రకంగా రైతులకు ఏ అధికారం లేకుండా పోయింది. రోజురోజుకూ ట్రస్టులు పాల వ్యాపారులను పిండిపారేసినట్టే రైతులను పిండి పారేస్తున్నారు. పొగాకు ట్రస్టు ఒక్క న్యూయార్కులోనే 400 వందల చుట్టల షాపులను పిండిపారేసింది. గత కాలపు బొగ్గు క్షేత్రాల యజమానులను రైలురోడ్డు ట్రస్టు వెళ్ళగొట్టి ఆ క్షేత్రాలకు అధిపతి అయింది. స్టాండర్డు ఆయిల్ ట్రస్టు 20 ఓడల కంపెనీలకు యజమాని

అయింది రాగి లోహాన్ని అది నియంత్రిస్తోంది. రాగిని కరిగించే కార్ఖానాలను కూడా నిర్వహిస్తోంది. ఈ రోజున అమెరికన్ దేశంలోని 10 వేల పట్టణాల్లో స్టాండర్డు కంపెనీకి చెందిన కంపెనీలే కరెంటు సరఫరా చేస్తున్నాయి. కరెంటు రైళ్ళను నడుపుతున్నాయి. ఈ పరిశ్రమలను నిర్వహిస్తున్న వేలాదిమంది చిన్న పారిశ్రామికవేత్తలు వెళ్ళగొట్టబడ్డారు. రైతుల్లాగే, చిన్న తరహా ఉత్పత్తిదారులు అన్ని విధాలుగాను ఫ్యూడల్ బంధనాల్లోకి దాసులుగా కుదింపబడ్డారు. ఇక రాజకీయ వాదులంతా ధనస్వామ్యపు తొత్తులయ్యారు. ప్రస్తుత సమయంలో వివిధ వృత్తి నిపుణులూ, కళాకారులూ పేరుకు తప్ప మిగతా అన్ని విషయాల్లోనూ కౌలు రైతులు మాదిరిగానే దాసులైపోయారు. వారిలో ప్రతి ఒక్కరూ ప్రొఫెసర్లూ, మతబోధకులూ, ఎడిటర్లూ ధనస్వామ్యానికి సేవ చేస్తూ తమ ఉద్యోగాలను నిలబెట్టుకొంటున్నారు. ధనస్వామ్యానికి హాని చేయనటువంటి లేదా దాన్ని శ్లాఘించేటటువంటి ప్రచారం చేయటమన్నదే వారు ధనస్వామ్యానికి అందిస్తున్న సేవ. ఒకవేళ వాళ్ళు ధనస్వామ్యానికి హానికరమైన భావాలను ప్రచారం చేస్తే వాళ్ళ ఉద్యోగాలూడిపోతాయి. దాంతో వాళ్ళు శ్రామికవర్గంలోకి దిగజారిపోయి నాశనమయిపోనైనా పోవాలి లేదా కార్మికవర్గ ఆందోళనకారులుగానైనా రూపొందాలి. ఇక పత్రికలూ, చర్చి, బోధనా వేదికలూ, యూనివర్శిటీలు లాంటి ప్రజాభిప్రాయాన్ని మలిచే వ్యవస్థలన్నీ దేశ ప్రజల ఆలోచనా క్రమాన్ని నిర్దేశిస్తున్నాయి. ఇక కళాకారులైతే ధనస్వామ్యం యొక్క అగౌరవనీయమైన అభిరుచులనే తార్పుడుగాళ్ళుగా ప్రజలకు తారుస్తున్నారు....... సంపద దానికదే నిజమైన అధికారం కాదు. ప్రభుత్వాధికారాన్ని పొందటానికి అదో సాధనం. ఈ రోజున ధనస్వామ్యమే ప్రభుత్వాన్ని అదుపు చేస్తోంది. దీని మెదడు అంతా చిన్నదైన, శక్తివంతమైన ఏడు బృందాల కూటమిగా వుంది. ఈ బృందాల్లో ఒక్క రైలు రోడ్డు గ్రూపే జడ్జీలకు, బ్యాంకర్లకు, ఎడిటర్లకు, మంత్రులకు యూనివర్శిటీ ప్రముఖులకు, రాష్ట్ర చట్టసభల సభ్యులకు. కాంగ్రెసు (పార్లమెంటు) సభ్యులకు వేలాది. అసంఖ్యాకమైన ఉచిత పాస్‌లను జారీ చేస్తుంది రాష్ట్ర రాజధానుల్లో విలాసవంతమైన లాబీలు నిర్వహిస్తోంది. దేశంలోని అన్ని పట్టణాల్లోనూ, నగరాల్లోనూ ప్రాథమిక సమావేశాలకూ, సభలకూ హాజరయే చిన్న చిన్న రాజకీయవేత్తల, చిన్నపాటి వ్యవహర్తలైన సైన్యాన్ని నిర్వహిస్తుంది. వీరందరూ జ్యూరీ సభ్యులగా నియమింపబడుతూ వుంటారు. రైల్వే ప్రయోజనాలకు అనుకూలంగా పని చేసేందుకు జడ్జీలకు లంచాలు యిస్తారు.... ఈ రోజున ధనస్వామ్యం చేతిలోనే అధికారం అంతా వుంది. అది చట్టాలను చేస్తుంది ఎందుకంటే సెనేట్, కోర్టులు, కాంగ్రెసు(పార్లమెంటు), రాష్ట్ర శాసనసభలకు అదే స్వంతదారు కనుక. తాను చేసే చట్టాలను అమలుపరచటానికి దానికి పిలిచిన వెంటనే వచ్చిపడే పోలీసులు, సైన్యం, నేవీ, మిలీషియా (పౌరసైన్యం) అందుబాటులో వున్నాయి." అంటూ నాటి ధనస్వామ్యం యొక్క విశ్వరూపాన్ని గురించి ఎర్నెస్టు వివరిస్తాడు.

అత్యంత నాటకీయంగా చిత్రీకరించిన ఈ "యంత్ర ధ్వంసకుల డిన్నర్" (ఎర్నెస్టు అలా దీనికి పేరు పెట్టాడు) అనబడే ఈ వ్యాపారస్తుల విందు ఉదంతం ద్వారా, జాక్‌లండన్ అమెరికన్ ధనస్వామ్య సమాజంలోని వివిధ వర్గాలనూ, వాటి లక్షణాలనూ, వాటి భావాలనూ సరయిన మార్క్సిస్టు అవగాహనతో విశ్లేషించటమేకాక, ఆర్థిక పరిణామాల క్రమాన్ని శాస్త్రీయంగా వివరించాడు. రాజ్యాంగం, కోర్టులు, యూనివర్శిటీలు, చర్చిల యొక్క మీడియా యొక్క దోపిడీ వర్గ అనుకూల నైజాన్ని బట్టబయలు చేశాడు. వర్గపోరాట క్రమంలో బలమైన సామాజిక వర్గం యితర సామాజిక వర్గాలను రాజ్యాధికారం ఎంతటి నిర్దయతో, క్రూరత్వంతో నలిపి వేస్తుందో వివరించాడు. ఓట్లు ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చినా, అధికారం నెరపకుండా ధనస్వామ్యం ఎన్ని ఎత్తులతో, ఎన్ని జిత్తులతో కట్టడి చేసి నిరాకరిస్తుందో వివరించాడు. ధనస్వామ్యం నీతి నియమాలను, ప్రజాభిప్రాయాన్ని ఏ రకంగా తన అధికారంతో నియంత్రిస్తుందో, తన ప్రయోజనాలకు హానికరమైన భావాలు ప్రచారం కాకుండా ఎలా అడ్డుకొంటుందో చక్కగా వివరించాడు. తన అధికారంపై సవాలు విసిరిన వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేయటానికి వీలుగా సైన్యం, పోలీసులు, మిలీషియా లాంటి యుద్ధ యంత్రాంగాన్ని ఎంతగా సంసిద్ధం చేసిపెట్టుకొందో వివరించాడు. ధనస్వామ్యం కేవలం కొద్దిమంది బడా పెట్టుబడిదారుల నాయకత్వాన్నే ఎలా నిరంకుశ శక్తిగా తరింపచేసిందో వివరించాడు. మధ్యతరగతి వర్గం ఆర్థిక పరిణామ క్రమాన్ని వెనక్కి త్రిప్పాలనే ప్రయత్నానికి పూనుకొంటుందనీ, పెట్టుబడిదారీ విధానం క్రమంగా తన ఉన్నత దశ అయిన సామ్రాజ్యవాద స్థితికి చేరుకుంది

ఈ మధ్యతరగతిపై, బడా పెట్టుబడిదారీ వర్గం చేసిన వేగవంతమయిన దాడిని చూసి ఎర్నెస్టు ఆశ్చర్యపోయాడు. "అది నిరుపయోగం" "మేం ఓడించబడ్డాం. 'ఇనుప మడమ' యిక్కడ తిష్టవేసింది. నేను తప్పుగా అర్థం చేసుకున్నాను. ఓట్ల ద్వారా శాంతియుతంగా విజయం సాధించవచ్చుననుకొన్నాను. విక్సన్ చెప్పినట్లు ఇప్పుడు మాకు మిగిలిన కొద్దిపాటి స్వేచ్ఛలు కూడా రద్దు చేయబడతాయి. ఇనుపమడమ మా ముఖాల మీదనుంచి నడిచిపోతోంది. ఇక రక్తపాత విప్లవం తప్ప చేయటానికి కార్మికవర్గానికి మిగిలిందేమీ లేదు. మేమే నెగ్గుతాం...." అని నాటి పెట్టుబడిదారీ వర్గపు నిరంకుశ అణచివేత విధానాలను చూసిన ఎర్నెస్టు అనుకొన్నాడు.

"బడా పెట్టుబడిదారీ వర్గం నుండి బ్యాలట్ మార్గం ద్వారా శాంతియుతంగా అధికారాన్ని హస్తగతం చేసుకోవటం అన్నది భ్రమేనని, కార్మికవర్గ విప్లవం ద్వారా మాత్రమే బడా పెట్టుబడిదారీ వర్గ వ్యవస్థను కూలగొట్టడం సాధ్యమవుతుందనీ" స్పష్టంగా నిర్ధారణ చేస్తాడు. ఈ నిర్ధారణ నేటికీ, ఎల్లప్పటికీ పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోయటానికి-సక్రమమైన అవగాహనగానే వుందని యిప్పటి మనకు తెలుసు.

అని లెనిన్ చేసినా నిర్ధారణలకే(1916లో) జాక్‌లండన్ 1908 నాటికి రాగలగటం అన్న దాన్ని బట్టి జాక్‌లండన్ యొక్క మార్క్సిస్టు సిద్ధాంత అవగాహన ఎంతటి క్రమమైనదో మనకు వ్యక్తమవుతుంది.

ఇక కథలోకి వద్దాం!

జాన్‌కన్నింగ్ హాంను యూనివర్శిటీ పని నుండి తొలగించారు. ఆయన రాసి ప్రచురించిన 'ఆర్థికశాస్త్రం-విద్య' అన్న పుస్తకం ఆయనను ఉద్యోగం నుండి తొలగించే ప్రక్రియను త్వరితం చేసింది. తర్వాత ఆయన రాసిన ఆ పుస్తకాన్ని ఒక పథకం ప్రకారం అణచిపెట్టి వేయటం జరిగింది. ముందు పత్రికలు ఎంతో మర్యాదగా ఆ పుస్తకాన్ని తిట్టాయి. భౌతిక శాస్త్రంలోని ప్రొఫెసర్ తనకు ఏమీ తెలియని సామాజిక శాస్త్రం గురించి రాయటం బాగోలేదు అన్నాయి. తర్వాత మేగజైన్లు ఆ పుస్తక ప్రస్తావననే అసలు తీసుకు రాకుండా మౌనంగా నొక్కి పెట్టాయి. తర్వాత ఆ పుస్తకం ఆశ్చర్యకరంగా ఒక్క కాపీ కనపడకుండా మార్కెట్టు నుండి మాయమైంది. తన పుస్తకాన్ని కావాలనే కనపడకుండా అణచిపెట్టారన్న విషయాన్ని పత్రికల ద్వారా బయటి ప్రపంచానికి తెలియచేద్దామని పత్రికలవాళ్ళకు ఆయన ఉత్తరాలు రాశాడు. కానీ వాళ్ళు వాటిని ప్రచురించలేదు. లేదా అతడు రాసిన విషయాలను వక్రీకరించి ప్రచురించారు. అతడు తన పుస్తకంలో 'సామాజిక విప్లవం' అన్న సమాసాన్ని వాడాడనీ అందువల్ల అతడు అరాచకవాదిగా నిహిలిష్టుగా మారిపోయాడనీ అతనికి వ్యతిరేక ప్రచారం సాగింది. ఈ రకంగా ఆయన్ను వేధించటం ద్వారా, మధ్యతగరతి వర్గం, కార్మికవర్గంతో పొత్తు పెట్టుకోవటానికి భయపడేటట్టు చేయటం జరిగింది.

ఈ విషయాన్ని తెల్సుకొన్న సోషలిస్టు ప్రచురణకర్తలైన 'అప్పీలు టు రీజన్' అనే సంస్థ, జాన్ కన్నింగ్ హాం యొక్క 'ఆర్థికశాస్త్రం-విద్య' అన్న పుస్తకాన్ని ముద్రించటానికి అంగీకరించి, ఆ ప్రక్రియను మొదలు పెట్టింది. వెంటనే ఆ సంస్థను అణచివేయటం మొదలైంది. ముందుగా పోస్టల్ శాఖ ఆ ప్రచురణ సంస్థ నిర్వహించే 'అపీల్ టురీజన్' అన్న పత్రిక యొక్క ప్రత్యేక సంచికలను, పోస్టల్ రవాణా చేయటానికి -పోస్టాఫీసులు నిరాకరించటంతో మొదలయింది. ఇతర రవాణా సంస్థలూ ఆ పత్రికను వివిధ ప్రాంతాలకు పంపటానికి (తీసుకుపోవటానికి) నిరాకరించాయి. ఈలోగా ఒకరోజు రెండువేలమంది చేతుల్లో అమెరికన్ జండాలు పట్టుకొని సోషలిస్టు ముద్రణాలయం మీద పడి, ముద్రణ అయి, పంపకానికి సిద్ధంగా వున్న జాన్‌కన్నింగ్ హాం యొక్క పుస్తకం 20,000 కాపీలతో పాటు, ఆ ముద్రణాలయానికి నిప్పంటించి కాల్చేశారు. ఆ మర్నాడు చూడబోతే ఆ మనుష్యులెవ్వరో అచూకీ కూడా లేదు. ఆ ముద్రణాలయం వున్న గిరాల్డ్ నగరానికి చెందిన వారెవ్వరూ, దానిపై దాడి చేసిన మూకలో లేరు. ఈ రకంగా కిరాయి మూకలు--రౌడీలైన, బ్లాంక్ హండ్రెడ్స్‌ను కొద్దిమంది ధనస్వాములచేత నిర్వహింపబడుతున్న నిరంకుశ పాలక వ్యవస్థ 'కిరాయి మురాల ద్వారా" ప్రజలపై దాడిని జరిపించే ప్రక్రియను ఆరంభించింది. అయితే ఈ కిరాయి మురా దేశభక్తులుగానూ, సమాజ రక్షకులుగానూ నటిస్తున్నారు. ప్రజలను వంచిస్తున్నారు. ఆఖరుకు మతబోధకులు(చర్చి) కూడా ఈ కిరాయి మురాల చిత్తశుద్ధిని ప్రసంశిస్తూ, బోధనలను చేయటం మొదలెట్టారు.

మరోవైపున చరిత్ర వేగవంతంగా రూపొందుతోంది. శాన్‌ఫ్రాన్సిస్కో స్ట్రీట్-కార్ కార్మికుల సమ్మె బలవంతంగా అణచివేయబడింది. రేవు కార్మికుల ఫెడరేషన్; దాని అనుబంధ కార్మిక సంఘాలూ, యితర నిర్మాణరంగ కార్మిక సంఘాలూ బలంగా మద్దతు యిచ్చి నిర్వహింప బడుతున్న లాగుడు బండ్ల డ్రైవర్లు సమ్మెను దుర్మార్గంగా అణచివేశారు. పోలీసులు కార్మికులను చితకబాది, అనేకమంది తలలు పగులగొట్టి, ఆఖరుకు సమ్మె చేసే కార్మికులపై ఒక మిషన్ గన్ను నుండి గుళ్ళు కురిపించటం ద్వారా ఆ సమ్మెను పాశవికంగా అణచివేశారు.

ఈ ఘటనలు కార్మికుల, శ్రామికప్రజల కోపాన్ని పెంచాయి. కార్మికులు రాజకీయ ప్రతిచర్య ద్వారా తమ వ్యతిరేకులపై కసి తీర్చుకోదల్చుకొన్నారు. రోజురోజుకూ యూనియన్ తర్వాత యూనియన్ సోషలిస్టులకు అనుకూలంగా తమ మద్దతు ప్రకటిస్తూ ఓట్లు వేస్తున్నారు. ఆఖరుకు మరణయాత్రకు శవాన్ని సంసిద్ధం చేసే" అండర్ టేకర్లు, కోళ్ళను పట్టుకొనే కార్మికుల సంఘాలు కూడా సోషలిస్టులకు తమ మద్దతును తెల్పటాన్ని చూస్తే కార్మికులు తమ శతృవులపై ఎదురు తిరగటానికి ఎంతగా ముందుకొస్తున్నారో అర్థమవుతుంది. సోషలిస్టుల సమావేశ ప్రాంగణాలు శ్రోతలతో పూర్తిగా నిండిపోతూ వుండగా, పూర్వకాలపు రాజకీయ పార్టీ నాయకుల సభా ప్రాంగణాలు శ్రోతలు లేక బోసిపోతున్నాయి.

అమెరికా దేశంలో ఎన్నడూ జరగనంతటి భారీ ఎత్తున కార్మిక అశాంతి, అలజడులు చెలరేగాయి. అధికాధికంగా ఉత్పత్తి చేయబడ్డ సరుకులు వినియోగింపబడకపోవటం వలన, అదనపు ఉత్పత్తులు అమ్మకాల్లేక మిగిలిపోయాయి. ఫలితంగా పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించి, తక్కువ గంటలు పనిచేస్తున్నాయి. యిష్టారాజ్యంగా వేతనాల కోతలను విధించారు. ఈ రకంగా కార్మికులకు కష్టమైన గడ్డు రోజులు వచ్చాయి.

2 లక్షలమంది మెషినిస్టులు, తమ మిత్రులైన 5 లక్షలమంది అమెరికన్ లోహ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో కలిసి చేసిన బ్రహ్మాండమైన సమ్మెను అణచివేశారు. పరిశ్రమల యజమానులు నియమించిన రౌడీ మురాలైన సమ్మె విచ్ఛిన్నకారులకూ, సమ్మెకారులకూ మధ్య భీకర ఘర్షణలు జరిగాయి. యజమానులు నియమించి, పురిగొల్పిన బ్లాక్ హత్యలు మురాల ఆస్తిని ధ్వంసం చేశాయి. అపుడు 2 లక్షలమంది అమెరికన్ సైన్యాన్ని రంగంలోకి దింపి, ఈ సమ్మెమ అణచివేశారు. అనేకమంది కార్మిక నాయకులను మరణశిక్షకు గురి చేశారు. చాలామంది కార్మిక నాయకులను జైళ్ళల్లోకి త్రోశారు. సమ్మెకారులైన కార్మికులను పశువుల బందుల దొడ్డిలో పెట్టి నిర్భంధించి వారిని సైనికులు దారుణంగా హింసించారు.

ఆర్థిక మాంద్యం ఫలితంగా, ఒకనాడు వర్ధిల్లిన పరిశ్రమలు యిప్పుడు ఆర్థికంగా కుంటుపడటంతో ఆ భారం కార్మికులపైకి నెట్టివేయబడిన కార్మికుల జీవితాలు దుర్భరమయిపోయాయి. కార్మికులు యిక్కడా, అక్కడా అన్నది లేకుండా దేశమంతా సమ్మెలు చేస్తున్నారు. సమ్మెలు చేయని కార్మికులను యజమాన్యాలే బయటికి పంపేస్తున్నాయి. పేపర్ల నిండా హింస, రక్తపాతాన్ని గురించిన ఉదంతాలే. అల్లరి, గృహ దహనాలు, ఉద్దేశ్య పూర్వకంగానే ఆస్తులను ధ్వంసం చేయటం లాంటి బ్లాక్ హండ్రెడ్ మురాల అమానుష చర్యల వల్ల మొత్తం సైన్యాన్ని రంగంలోకి దించారు. పట్టణాలూ, నగరాలూ అన్నీ సైన్యపు క్యాంపుల్లా మారిపోయాయి. కార్మికులను కుక్కల్ని కాల్చినట్లు కాల్చిపారేయటం సర్వసాధారణమైంది. సమ్మె విచ్ఛిన్న మురాలను నియమించుకున్నారు. సమ్మె విచ్ఛినకర ముఠాలను కార్మికసంఘాలు త్రిప్పికొట్టే సందర్భాలలో సైన్యం రంగప్రవేశం చేసి యూనియన్లను నిర్దాక్షిణ్యంగా నలిపి పారేస్తోంది. మిలిషియాను కూడా (పారా మిలటరీ దళాలను) రంగంలోకి దింపారు. ఈ అల్లర్ల సాకుతో ప్రభుత్వం మరో లక్షమంది సైనికులను నియమించుకొంది.

ఆ రకంగా ధనస్వాములందరూ కలిసి మొట్ట మొదటిసారిగా కార్మికులపై కార్మికవర్గం పై భారీ ఎత్తున దాడిని ప్రారంభించి, సంఘటిత కార్మికవర్గాన్ని ఓడించే కృతనిశ్చయాన్ని ప్రకటించారు. మరోవైపు బ్యాంకులు, తామిచ్చిన అప్పులు తీర్చమని కార్మికులపై ఒత్తిడి చేశాయి. ఆ రకంగా కొద్దిమందిచే నిర్వహింప బడుతున్న ధనస్వామ్య నిరంకుశ వ్యవస్థ, అమెరికా దేశపు ప్రభుత్వ కోశాధికారానికిగల అన్నిశక్తులనూ ఉపయోగించుకొంది.

ఇపుడు పెట్టుబడిదారీ వర్గ నాయకత్వం మధ్య తరగతి వర్గం మీద పడింది. కార్మికులను పెట్టుబడిదారీ వర్గం చీల్చి చెండాడటానికి పెద్ద యజమానులు అసోసియేషన్లు యిప్పుడు ఒకనాటి తమ మిత్రుల చేతుల్లో నాశనం చేయబడుతున్నాయి. ట్రస్టులు ధృఢంగా నిలబడి ఈ మధ్య తరగతి వ్యాపారస్థుల చిన్న పెట్టుబడిదారుల లాభాలను కాజేశాయి. 1912లో ఈ మధ్యతరగతిపై చావు దెబ్బకొట్టే దాడిని చేశాయి. ఈ మధ్యతరగతిపై, బడా పెట్టుబడిదారీ వర్గం చేసిన వేగవంతమయిన దాడిని చూసి ఎర్నెస్టు ఆశ్చర్యపోయాడు. "అది నిరుపయోగం" "మేం ఓడించబడ్డాం. 'ఇనుప మడమ' యిక్కడ తిష్టవేసింది. నేను తప్పుగా అర్థం చేసుకున్నాను. ఓట్ల ద్వారా శాంతియుతంగా విజయం సాధించవచ్చుననుకొన్నాను. విక్సన్ చెప్పినట్లు ఇప్పుడు మాకు మిగిలిన కొద్దిపాటి స్వేచ్ఛలు కూడా రద్దు చేయబడతాయి. ఇనుపమడమ మా ముఖాల మీదనుంచి నడిచిపోతోంది. ఇక రక్తపాత విప్లవం తప్ప చేయటానికి కార్మికవర్గానికి మిగిలిందేమీ లేదు. మేమే నెగ్గుతాం...." అని నాటి పెట్టుబడిదారీ వర్గపు నిరంకుశ అణచివేత విధానాలను చూసిన ఎర్నెస్టు అనుకొన్నాడు.

అప్పటినుండే ఎర్నెస్టు తన విశ్వాసాన్ని కార్మికవర్గం పైననే పెట్టుకొన్నాడు. తన పార్టీ కన్నా తానే ఈ విషయాన్ని ముందుగా గ్రహించాడు. కానీ అతని సహచరులు అతడితో ఏకీభవించలేదు. వాళ్ళు యింకా ఎన్నికల్లో విజయం సాధించవచ్చుననే అభిప్రాయంలో వున్నారు. వాళ్ళు తమ బలంమీద ఎక్కువుగా నమ్మకం పెంచుకున్నారు. వారు ఎక్కువుగా ధనస్వామ్యపు తీవ్ర నిర్బంధ స్వభావాన్ని చూడ నిరాకరించారు. వారి రకపు సామాజిక పరిణామ క్రమంలో ధనస్వామ్య తీవ్ర నిర్బంధ వ్యవస్థకు తావులేదు. వారు ఎర్నెస్టును "నిన్ను కాంగ్రెసుకు (పార్లమెంటుకు) పంపుతాం, అపుడు అంతా సరిగ్గానే అవుతుంది" అని చెప్తారు.

"నన్ను పార్లమెంటులోంచి బయటకు పీకిపారేసి, ఓ గోడపక్క నిలబెట్టి, నన్ను కాల్చిపారేస్తే, ఏంటి అప్పుడు?" అంటూ ఎర్నెస్టు తన సహచర అసోసియేషన్లను ప్రశ్నిస్తాడు.

"మనం శక్తి అంతా ఉపయోగించి ప్రతిఘటిస్తాము" అంటారు వారందరూ.

"కాదు అప్పుడు మీరు, మీ రక్తంలో మీరే కొట్టుమిట్టాడుతారు...... ఇది వరకు మీరు చెప్పినట్లే మధ్యతరగతి వాళ్ళు చెప్పారు. వాళ్ళ గతి ఇప్పుడేమైందో చూశారు కదా"! అంటూ ఎర్నెస్టు వాళ్ళ అభిప్రాయానికి కోపంగా ప్రతి జవాబిస్తాడు.

ఈ మొత్తం ఉదంతం చెప్పటం ద్వారా జాక్ లండన్, పెట్టుబడిదారీ విధానం తాను అనివార్య ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొన్నపుడు, తాను సుభిక్షంగా వున్న కాలంలో కార్మికులకు కల్పించిన సౌకర్యాలను రద్దు చేస్తుందనీ, వేతనాలను తగ్గిస్తుందనీ, లే ఆఫ్‌లకు పాల్పడి సంక్షోభాన్ని కార్మికవర్గంపైననే నిర్దాక్షిణ్యంగా మోపుతుందనీ, తన శక్తితో, ప్రభుత్వశక్తితో, పోరాడిన కార్మికవర్గంపైన తీవ్ర, అమానుష అణచివేతనూ, నిర్బంధాన్ని ప్రయోగిస్తుందనీ, సమ్మె విచ్ఛిన్నదారులను కిరాయికి నియమించు కోవటం ద్వారా విచ్ఛిన్నానికి పూనుకోవటమే కాకుండా, తానే అల్లర్లు అశాంతి సృష్టించి, వాటి పట్ల గగ్గోలుపెట్టి తిరిగి తానే శాంతి భద్రతల స్థాపన పేరిట సైన్యాన్నీ, పోలీసులునూ రంగప్రవేశం చేయించి పోరాడే కార్మికవర్గాన్నీ, దాని నాయకత్వాన్నీ అణచివేస్తూందనీ తెలియచెప్పాడు. అంతేకాక ఎర్నెస్టు ఆలోచన రూపంలో " బడా పెట్టుబడిదారీ వర్గం నుండి బ్యాలట్ మార్గం ద్వారా శాంతియుతంగా అధికారాన్ని హస్తగతం చేసుకోవటం అన్నది భ్రమేనని, కార్మికవర్గ విప్లవం ద్వారా మాత్రమే బడా పెట్టుబడిదారీ వర్గ వ్యవస్థను కూలగొట్టడం సాధ్యమవుతుందనీ" స్పష్టంగా నిర్ధారణ చేస్తాడు. ఈ నిర్ధారణ నేటికీ, ఎల్లప్పటికీ పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోయటానికి-సక్రమమైన అవగాహనగానే వుందని యిప్పటి మనకు తెలుసు.

పోతే కథలోకి వస్తే

జాన్‌కన్నింగ్‌హాంకు సియెర్రా మిల్లులో వున్న షేర్లకుగాను ఈ త్రైమాసిక డివిడెండ్లు పంపలేదు. ఆయన ఆ విషయాన్నడుగుతూ కంపెనీకి ఉత్తరం రాస్తే, అసలు ఆయనకు తమ కంపెనీలో షేర్లే వున్నట్లు రికార్డుల్లో లేదని తిరిగి జవాబు రాశారు. అతడు తాను బ్యాంకు లాకరులో దాచుకొన్న షేర్ సర్టిఫికేట్లు కోసం వెళ్ళి చూసుకుంటే అతడి లాకరు ఖాళీగా వుంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక వీధిలో యధాలాపంగా జాన్‌కన్నింగ్‌హాం విక్సన్ తారసపడి, అతడ్ని దుర్మార్గుడా అంటూ నిందిస్తాడు. ఆ కారణంచేత అతణ్ణి పోలీసులు అరెస్టు చేసి, విక్సన్‌పై భౌతికదాడికి పాల్పడ్డాడని కేసుపెట్టి, కోర్టులో జుల్మానా విధిస్తారు. "శాస్త్ర పరిశోధనలు చేసి, పనిచేసి అలసిపోయిన కన్నింగ్‌హాంకు పిచ్చెక్కిందనీ, అతణ్ణి పిచ్చాసుపత్రిలో చేర్పించాలనీ" పత్రికలు, సలహాయిస్తూ వార్తలు ప్రకటించాయి. ఈలోగా జాన్ కన్నింగ్

హం ప్రముంగా స్థలం కొనుక్కొని అందులో ఏ అప్పు లేకుండా కట్టుకొన్న స్వంత యిల్లును, యిల్లు కట్టుకోవటానికి తీసుకొన్న అప్పు వాయిదాలు చెల్లించ లేదని చెప్పి తమ తనఖా క్రింద వుందని అతడి యిల్లు స్వాధీనం చేసుకొంటారు. పాపం ఏ తనఖా లేకపోయినా అక్రమంగా సృష్టించిన పత్రాలలో తన యింటి తనఖా పత్రాలు, వాటిలో తన స్వంత సంతకం వుండటం చూసి జాన్‌కన్నింగ్‌హాం ఖంగుతిని, యిక తాను చేయగల్గిందేమీ (కోర్టు ద్వారా తన ఆస్తి కోసం దావాలు వేయటం లాంటివి) లేదనే నిర్ధారణకే వచ్చి, "ఇపుడు మనం నిజమైన కార్మికులు అవుదాం" అంటూ "యిప్పుడు నేను స్వయంగా కార్మికవర్గం గురించి తెల్సుకొంటాను" అని తన కుమార్తె ఎవిస్‌తో చెప్తాడు.

ఎర్నెస్టు ఎప్పటిలాగే ప్రతీరోజూ చాలా కష్టపడి పని చేస్తున్నాడు. కార్మికవర్గం గురించి ఒక ప్రచారకుడిగా తాను జరుపుతున్న ప్రచార కార్యకాలాపాలను సాగిస్తున్నాడు. కార్మిక సంస్థల సభ్యులకిచ్చే ఉప న్యాసాలనూ క్రమం తప్పకుండా యిస్తున్నాడు. ఇదికాక తన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు. మరోవైపు తన అధ్యయాన్ని ఒక్క రోజు కూడా ఆపకుండా సాగిస్తూనే వున్నాడు. ఇటువంటి పరిస్థితుల మధ్య ఎవిస్, ఎర్నెస్టు ఎవర్‌హార్డులు పెళ్ళి చేసుకొని ప్రేమలో, మునిగిపోయారు.

బిషప్ మూర్‌హౌస్ విశ్రాంతి నుండి తిరిగి వచ్చి మళ్ళీ "చర్చి క్రీస్తు బోధనల నుండి దూరంగాపోయిందనీ, క్రీస్తు స్థానంలో, ధన దైవాన్ని ప్రతిష్టించిందని, తనకు ఆరోగ్యం కుదుటబడింది కనుక తిరిగి తాను తానెరిగిన వాస్తవాలను బోధిస్తాననీ" అది వరకు ఐ.పి.హెచ్ లో బోధించినట్లు మత బోధనకు పూనుకొన్నాడు. వెంటనే పత్రికలు మహర్షిలాంటి బిషప్ మూర్‌కు పిచ్చెక్కిందనీ అతడికి మానసిక ఆరోగ్యం బాగు చేయించటం కోసం శానిటోరియంకు పంపించాలని వార్తలు ప్రచారం చేశాయి. తిరిగి అలక్ష్మి మానసిక రోగుల శానిటోరియం (పిచ్చాసుపత్రి)కు బందీ చేశారు. నిజానికి బిషప్ పూర్తి మానసిక ఆరోగ్యంతో, స్వచ్ఛంగా, ఉదాత్తంగా వున్నాడు. తాను చూసిన విధంగా వాస్తవాన్ని బోధిస్తానంటే ఆయన్ను పిచ్చాసుపత్రిలో బంధించారు. అతడి ధనం, సమాజంలోని హోదా, సంస్కారం, ఏవీ, అతడ్ని రక్షించలేకపోయాయి ధనిక సమాజానికి ఆయన అభిప్రాయాలు సమాజానికి హాని చేసేవి. వారి ప్రకారం మతిస్థిమితం వున్న వారెవరూ అటువంటి అభిప్రాయాలు వ్యక్తం చెయరనే ఆధునిక సమాజం యొక్క అభిప్రాయం.

కొన్నాళ్ళకు తిరిగి ఆయన బయటకు వచ్చాడు. ఆయన మానసిక స్థితి బాగు పడిందని పత్రికలు ప్రకటించాయి. అతడు తిరిగి తన పాత పద్ధతుల్లో, పాత బోధనలను బోధించటం మొదలెట్టాడు. బహుశా ఆయన్ను చిత్రహింసలు పెట్టి తమకనుకూలంగా ధనస్వామ్యం వంచుకొందా? దెబ్బలకు తట్టుకోలేక ఆయన లొంగి పోయాడా?

మతబోధనలు యధాప్రకారం చేస్తున్న బిషప్‌మోర్ హౌస్ ఒక రోజు అదృశ్యమయిపోయాడు. తనకున్న ఆస్తిపాస్తులన్నింటినీ -పట్టణంలో వున్న తన భవనాన్నీ, మెన్లోపార్కు గ్రామంలో వున్న తన యింటినీ, పెయింటింగులను, యితర కలక్షన్లనూ, లైబ్రరీని- అదృశ్యం కావటానికి ముందు ఆయన అమ్మివేశాడు. అందువలన ఆయన ఎవరికీ కనపడకపోయినా ఆత్మహత్య చేసుకొన్నాడా అనుకోవడానికి ఆస్కారం కన్పించలేదు.

ఒకరోజు మురికివాడలో నివసిస్తూ-సామానులు తెచ్చుకోవటానికి వెళ్ళిన ఎవిస్‌కు ఆ మురికివాడలో ఆయన తారసపడ్డాడు. నిరుపేదల దుస్తులను ధరించి, వారిలాగే సంచరిస్తున్న ఆయన్ను ఎవిస్ గుర్తుపట్టి పలకరించింది. ముందు భయపడ్డ ఆయన తాను ఆమెతో వాళ్ళింటికి అప్పుడే రాలేనని చెప్పాడు. ఆయన తన యింటి వద్ద, ఒక అరవై ఏళ్ళ జర్మన్ ముసలి స్త్రీకి ఆశ్రయం యిస్తూ, ఆమెకు సపరిచర్యలు చేస్తూ వున్నాడు. ఆయన అప్పుడు ధర్మం చేయటం అంటే వేళాకోళం ఆడుతున్నాడు. ఎర్నెస్టు చెప్పినట్టు వ్రణానికి ఆపరేషన్ చేయాలే తప్ప మందు పూయటం కుదరదంటున్నాడు. తన ఆస్తిని అంతా అమ్మిన మొత్తంలో నిరుపేదలయిన కార్మికులూ, దరిద్రులకూ, దౌర్భాగ్యులకు తిండి పెడ్తున్నాడు. కడుపులో తిండి లేకుండా ప్రభువు యొక్క గొర్రె పిల్లల ఆత్మలు వేదాంతాన్ని నేర్చుకోవటానికి సంసిద్ధంగా వుండవన్నది, ప్రస్తుతం ఆయన భావన. కార్మికులకు సక్రమంగా కూలీ చెల్లించటం జరగటం లేదని యిపుడు ఆయన వాదిస్తాడు. అయితే తాను దొరికిపోకుండా వుండటానికి ఆయన ఒకేచోట చాలా కాలం వుండకుండా, వివిధ ప్రాంతాలకు తిరుగు తున్నాడు. ఇప్పటికి తాను ప్రభువు నిర్దేశించిన నిజమైన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నానని ఆయన తృప్తి పొందు తున్నాడు.

ఇపుడు కావాలనే, ఉద్దేశ్యపూర్వకంగా వ్యవసాయ ఉత్పత్తులు ధరలు తగ్గింపవేయబడ్డాయి. రైలు-రోడ్డు రవాణా సంస్థలు రవాణా రేట్లను ఘోరంగా పెంచివేసి రైతుల నడ్డి విరిచాయి. అందువల్ల రైతులు లోన్ల మీద లోన్లు తీసుకోవాల్సి వచ్చింది. పాత అప్పులే తీర్చకపోగా, కొత్త అప్పులు చేయాల్సి వచ్చింది.. ఈలోగా తమ అప్పులు చెల్లించమని బ్యాంకులు ఒత్తిడి తీవ్రం చేశాయి. దాంతో రైతులు తమ భూములను (తనఖాలో వున్న) ట్రస్టుకు స్వాధీనపరిచి, వ్యవసాయ ట్రస్టులో కార్మికులుగా, ఉద్యోగులుగా చేరిపోయారు. ఆ రకంగా వారు ట్రస్టు క్రింద సాధారణ కూలీలుగా పనిచేయాల్సి వచ్చింది. వారందరూ వేతన కూలీలుగా మారిపోయారు. కాదంటే వారికి మిగిలింది ఒకే అవకాశం- దేశదిమ్మరుల్లా తిరగట మన్నదే. అయితే అదీ, అంత తేలికగా కుదరకుండా ప్రభుత్వం దేశదిమ్మరుల వ్యతిరేక చట్టాన్ని కఠినంగా అమలు జరిపింది. ఈ రకంగా రైతాంగాన్ని బడా పెట్టుబడిదారీ వర్గం నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేసింది.

కానీ ఒక వారం రోజుల తర్వాత ఆయన్ని నాపా పిచ్చాసుపత్రిలో చేర్చినట్లు పత్రికలు ప్రకటించాయి. తన దగ్గర వున్న దాన్నంతా పేదలకిచ్చేసే ధనవంతుడు ఈ రోజుల్లో పిచ్చాడుగా పిలువబడుతున్నాడు.

1912 చివరి రోజుల్లో, అత్యధిక మెజార్టీతో ఎర్నెష్టు ఎవర్‌హార్డు ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ సెనేట్ అభ్యర్థిగా నెగ్గాడు. మీర్‌స్టు, అనే ఒక మధ్యతరగతి పేపరు యజమాని, తన పత్రిక ద్వారా ధనస్వాములకు వ్యతిరేకంగా ప్రచారం చేయటం అన్నది ఎర్నెష్టు నెగ్గటానికి తోడ్పడింది. కానీ ఆ పత్రిక యజమాని వ్యాపారం దెబ్బతిని, ధ్వంసమయిపోయింది. ట్రస్టులు అడ్వర్టైజ్‌మెంట్లు యివ్వక ఆపివేయటంతో అతడి వ్యాపారం నాశనమయిపోయింది. అందువల్ల అతడికీ, అతడి డెమొక్రటిక్ పార్టీ అనుయాయులకీ ఒకటే మార్గం మిగిలింది. అదే వారందరూ సోషలిస్టు పార్టీలో కలిసిపోవడం హీర్‌స్టు చేసిన కుహనా-సోషలిస్టు బోధనల యొక్క అనుచరుల కృషి పంటను కోసుకొని ఎర్నెష్టు పెద్ద మెజార్టీ సాధించుకున్నాడు. అయితే సోషలిస్టు ప్రచురణా సంస్థలను ధ్వంసం చేయడంతో, రైతులను తమ వైపు మరల్చుకోవాలనుకొన్న ఎర్నెస్టు ఆశలు ఫలించలేదు. రైతాంగంలో మనిషి, మనిషికీ, ప్రచారం చేయాల్సిరావటంతో సోషలిస్టులు రైతుల్లో బలంగా, గణనీయంగా విస్తృతంగా తమ ప్రభావాన్ని పడవేయ లేకపోయారు. వారందరినీ మధ్యతరగతి రాజకీయవేత్తలైన క్వాలిన్‌లాంటి వాళ్ళు ఆకట్టు కున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో పేద రైతులు మరింతగా నష్టపోయారు. దేశంలో వున్న ఏడు బడా ట్రస్టులూ కలిసి ఐక్యంగా ఒక బడా వ్యవసాయ ట్రస్టును ఏర్పాటు చేశాయి రైలు/రోడ్డు కంపెనీ ధరలనూ, బ్యాంకర్లు స్టాక్ ఎక్స్ఛేంజినీ, తమ అదుపులో పెట్టుకొని రైతాంగాన్ని మరింత రుణభారంలోకి నెట్టారు. అదేరకంగా బ్యాంకులూ, ట్రస్టులూ రైతాంగానికి అప్పులు యిచ్చి తమ వలలో యిరికించుకొన్నారు. ఇక చేయాల్సిందల్లా వలను పైకి లాగటమే.

1912లోని ఆర్థిక మాంద్యం ప్రభావం బాగా నెలకొన్న కష్టకాలంలో, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్లలో అప్పటికే ధరలు ఘోరంగా పడిపోజొచ్చాయి. ఇపుడు కావాలనే, ఉద్దేశ్యపూర్వకంగా వ్యవసాయ ఉత్పత్తులు ధరలు తగ్గింపవేయబడ్డాయి. రైలు-రోడ్డు రవాణా సంస్థలు రవాణా రేట్లను ఘోరంగా పెంచివేసి రైతుల నడ్డి విరిచాయి. అందువల్ల రైతులు లోన్ల మీద లోన్లు తీసుకోవాల్సి వచ్చింది. పాత అప్పులే తీర్చకపోగా, కొత్త అప్పులు చేయాల్సి వచ్చింది.. ఈలోగా తమ అప్పులు చెల్లించమని బ్యాంకులు ఒత్తిడి తీవ్రం చేశాయి. దాంతో రైతులు తమ భూములను, (తనఖాలో వున్న) ట్రస్టుకు స్వాధీనపరిచి, వ్యవసాయ ట్రస్టులో కార్మికులుగా, ఉద్యోగులుగా చేరిపోయారు. ఆ రకంగా వారు ట్రస్టు క్రింద సాధారణ కూలీలుగా పనిచేయాల్సి వచ్చింది. వారందరూ వేతన కూలీలుగా మారిపోయారు. కాదంటే వారికి మిగిలింది ఒకే అవకాశం- దేశదిమ్మరుల్లా తిరగట మన్నదే. అయితే అదీ, అంత తేలికగా కుదరకుండా ప్రభుత్వం దేశదిమ్మరుల వ్యతిరేక చట్టాన్ని కఠినంగా అమలు జరిపింది. ఈ రకంగా రైతాంగాన్ని బడా పెట్టుబడిదారీ వర్గం నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేసింది.

1912లోని ఈ పరిస్థితులను చూస్తున్న సోషలిస్టు నాయకులందరూ ఒక్క ఎర్నస్టు తప్ప, పెట్టుబడిదారీ విధానానికి ఆఖరి రోజులు వచ్చాయని నిర్ణయం చేశారు. భారీ సంఖ్యలో పెరిగిన నిరుద్యోగ సైన్యం, నాశనం చేయబడ్డ రైతులు-మధ్యతరగతి వర్గాలు, కార్మిక సంఘాలను అణచివేసి కార్మికులను ఓడించటం లాంటి విషయాలన్నీ, సోషలిస్టుల పెట్టుబడిదారీ విధానానికి ఆఖరి రోజులు వచ్చాయన్న నిర్ణయాన్ని సమంజసమే నయినట్లూ, యిపుడు సోషలిస్టులే ధనస్వామిక వ్యవస్థపై దెబ్బకొట్టి క్రిందకు పడదోస్తున్న భావనను సమర్ధి స్తున్నట్లుగా వున్నాయి.

సోషలిస్టులు తాము ధనస్వామ్యంపై బ్యాలెట్టు పెట్టడం ద్వారా సాధించబోయే విజయాన్ని గురించి ప్రతీచోటా ప్రకటిస్తున్నారు. ధనస్వామ్య వర్గం ఈ సవాలును అంగీకరించింది. అది సోషలిస్టుల బలాలను చీల్చి వేయటం ద్వారా, వారిని ఓడించింది. ధనస్వామ్యం యొక్క ఏజెంట్లు 'సోషలిజం అపచారమనీ, అది నాస్తికత్వం' అనీ గొంతెత్తి అరిచారు. చర్చిలనూ, ప్రత్యేకించి క్యాథలిక్ చర్చిని, ధనస్వామ్యవర్గం రంగంలోకి దించి సోషలిస్టుల ఓట్లలో ఒక భాగాన్ని కాజేసింది. తన సీక్రెటు ఏజెంట్ల ద్వారా మధ్యతరగతి వర్గం వారి గ్రేంజి పార్టీని ప్రోత్సహించి, పట్టణాల్లోని మధ్యతరగతి వర్గాలల్లో మరణావస్థలోనున్న గ్రేంజి పార్టీని తిరిగి బ్రతికించింది. అందువల్ల సోషలిస్టు పార్టీకి చాలా ఓట్లు వచ్చినా, దానికి అన్ని కార్యనిర్వాహక చట్ట సభల్లోనూ, రాష్ట్ర చట్టసభల్లోనూ మైనార్టీ సీట్లు మాత్రమే వచ్చాయి. 1913 సెనేట్‌కు 50 మంది సోషలిస్టు పార్టీ పార్లమెంటు సభ్యులు ఎన్నికైనా వాళ్ళకు ఏ రకమయిన అధికారం లేకుండా పోయింది. గ్రేంజిపార్టీ వారికన్నా సోషలిస్టులు మెరుగ్గా వున్నారు. గ్రేంజి పార్టీ వారు ఒక డజను రాష్ట్రాల్లో మెజార్టీ సంపాదించారు.

దేశంలో వస్తు వినిమయం బాగా తగ్గిపోయింది. కార్మికులకు ఉద్యోగాలు లేక, వినిమయ వస్తువులు కొనుగోలు చేయటానికి చేతిలో డబ్బు లేకుండా వున్నారు. దాంతో మన దేశంలో మిగిలిన అధిక ఉత్పత్తులను అమెరికా ప్రపంచ మార్కెట్లో అమ్ముకొనే ప్రయత్నం చేసింది. ఇందుకోసం అమెరికా జర్మనీతో ఘర్షణలుపడి, ఆ ఘర్షణలు యుద్ధాలకు దారి తీశాయి. దేశంలో యుద్ధ మేఘాలు క్రమ్మాయి. అధిక ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్టులో అమ్ముకోవటం కోసం జరుగుతున్న దేశాల మధ్య ఆర్థిక ఘర్షణలు, ప్రపంచ, మార్కెట్టు కోసం ఆర్థిక ప్రయోజనాల మధ్య సంఘర్షణలు సోషలిస్టు విప్లవం యొక్క గర్జనలతో అంతా అస్తవ్యస్తంగా వుంది కొద్దిమంది చేతుల్లో వున్న ధనస్వామ్య నిరంకుశ వర్గం జర్మనీతో యుద్ధాన్ని కోరుకుంది. యుద్ధం వలన దేశంలో గుట్టబడి పోయిన అదనపు ఉత్పత్తులు చెల్లిపోతాయి. అన్ని దేశాలకు ప్రమాదకరంగా పరిణమించిన నిరుద్యోగ సైన్యం తగ్గి పోతుంది. ధనస్వామ్య వర్గాల యొక్క స్వాధీనంలోకి ప్రపంచ మార్కెట్టు వస్తుంది. "ధనస్వామ్య నిరంకుశ వ్యవస్థకు వ్యతిరేకంగా సోషలిజం" అన్న అసలు సమస్య స్థానంలో జర్మనీకి వ్యతిరేకంగా అమెరికా అన్న భావన ప్రజల మనస్సుల్లో నాటడం ద్వారా, ఆ వంకతో యిక సైన్యాన్ని రద్దు చేయాల్సిన అవసరం, యిక ధనస్వామ్య నిరంకుశ వ్యవస్థకు లేకుండా పోతుంది.

సోషలిస్టులు పశ్చిమదేశాల సోషలిస్టులతో ఒక రహస్య సమావేశం జరిపి, అమెరికాలో మొట్టమొదటి సారిగా యుద్ధంపై ఒక నిర్ణయాన్ని తీసుకొన్నారు. జర్మనీలో కల 50 లక్షలమంది సోషలిస్టులు కూడా అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో ఆధ్వర్యంలో ఒక నిర్ణయాన్ని తీసుకొన్నారు. వాళ్లల్లో చాలామంది జర్మన్ సైన్యంలో వున్నారు కూడా, రెండు దేశాల్లోని సోషలిస్టులూ యుద్ధానికి వ్యతిరేకంగా తమ నిర్ణయాన్ని ప్రకటించి యుద్ధం చేస్తే సార్వత్రిక సమ్మెకు దిగుతామని బెదిరించారు. అన్ని దేశాల్లోని విప్లవ పార్టీలూ, ఎటువంటి పరిస్థితుల్లోనయినా, అంతర్జాతీయ శాంతి నెలకొల్పాలనే సోషలిస్టు సూత్రాన్ని ప్రజలకు తెలియచేశాయి.

అమెరికన్,జర్మనీ ప్రభుత్వాలు యుద్ధానికి తలపడ్డ మరుక్షణంలోనే రెండు దేశాల్లోని సోషలిస్టులూ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చారు. అమెరికాలో గొప్ప సార్వత్రిక సమ్మె జరిగింది. జర్మనీలోనూ అదే రోజు గొప్ప సార్వత్రిక సమ్మె జరిగింది. రెండు దేశాల్లోనూ పూర్తిగా కార్యకలాపాలు స్థంబించిపోయాయి. తమ తమ రంగాల్లో నిశ్చయాత్మకంగా ఓడింపబడ్డ అమెరికాలోని కార్మికవర్గం సోషలిస్టులతో కలిసి రాజకీయ సార్వత్రిక సమ్మెకు దిగారు. మిలియన్ల మంది కార్మికులు తమ పనిముట్లను అక్కడే పారేసి, పనులు వదిలిపెట్టి సమ్మెలో పాల్గొన్నారు. ప్రత్యేకించి అణచగొట్టబడి, తలలు పగులగొట్టించుకొని, పూర్తిగా నాశనం చేయబడ్డ మెషినిష్టులూ, వారి స్నేహితులైన లోహ పరిశ్రమ కార్మికులు ఈ సమ్మెలో చురుకుగా పాల్గొన్నారు. ఆఖరుకు సంఘటితరంగంలోని కార్మిక సంఘ నాయకులు కూడా ఈ రాజకీయ సమ్మెలో పాల్గొన్నారు. ప్రత్యేకించి మహిళలు ఈ సమ్మె విజయవంతం కావటంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. బడిపిల్లలు స్కూళ్ళు మానేశారు. టీచర్లు స్కూళ్ళు మానేశారు. కార్మిక సంఘీభావం అన్నది విస్తృత స్థాయిలో వ్యాపించింది. వార్తా పత్రికలు ఆగిపోయాయి. దేశంలో ఎక్కడేమవుతోందో ఎవరికి అర్థం కావట్లేదు చూడబోతే అమెరికా దేశం మొత్తంగా చచ్చిపోయినట్టు కనబడింది. వారం రోజుల పాటు జరిగిన ఈ సార్వత్రిక సమ్మె ధనస్వామ్య నిరంకుశ పాలక ప్రభువులకు గుణపాఠం నేర్పింది. ఈ హెచ్చరికతో, మరోసారి సార్వత్రిక సమ్మెను జరుగనీయరాదనే నిర్ణయానికి ధనస్వామ్య నిరంకుశ పాలకులు వచ్చారు. యుద్ధాన్ని ఆపాలనీ లేకపోతే సార్వత్రిక సమ్మెను కొనసాగిస్తామనీ యిరు దేశాల కార్మికులూ తమ, తమ ప్రభుత్వాలకు హెచ్చరికలు ప్రకటించారు. దాంతో యుద్ధం ఆపబడింది. ఇరుదేశాలు సంధి ఒడంబడిక చేసుకొన్నాయి. జర్మనీ చక్రవర్తీ- అమెరికన్ నిరంకుశ ధనస్వామ్య వర్గమూ మైత్రి ఒప్పందం చేసుకొన్నారు. జర్మనీలో సోషలిస్టులు రాజ్యాధికారం పొందారు. అపుడు అమెరికా తాను చేసుకొన్న యుద్ధ ఒడంబడిక(శాంతి)ని పాటించక ద్రోహానికి పాల్పడింది. అమెరికన్ ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం తాను శాంతి ఒప్పందాన్ని పాటించక, వ్యతిరేకించానని అమెరికన్ ధనస్వామ్య పాలకవర్గం ప్రకటించింది.

1913 జనవరి వచ్చేటప్పటికి ప్రపంచ వ్యవహారాల్లో సంక్షోభం వచ్చింది. ప్రపంచమార్కెట్టు పై పూర్తి ఆధిపత్యం సాధించిన అమెరికన్ దృఢ ధనస్వామ్య నిరంకుశ వర్గం ప్రపంచ మార్కెట్టు నుండి అనేక దేశాలను బయటకు తరిమివేసింది. వివిధ దేశాల్లో విప్లవాల రూపంలో పునర్‌నిర్మాణం జరిగింది. ప్రపంచమంతా గందరగోళం, హింసలతో నిండిపోయింది. వివిధ దేశాల్లో మిలిటెంటు కార్మికవర్గం తమ దేశాల్లోని ప్రభుత్వాలను స్వాధీనం చేసుకొన్నది. మార్క్సు చెప్పినట్లు "పెట్టుబడిదారీ విధానం యొక్క వ్యక్తిగత ఆస్తి యొక్క చావు గంటలు మ్రోగాయి. ఆస్తులను స్వాధీనం చేసుకొన్న వాళ్ళనే యిపుడు స్వాధీనం చేసుకోవటం జరిగింది". వివిధ దేశాల్లో పెట్టుబడిదారీ ప్రభుత్వాలు వేగంగా కూలిపోయి, ఆస్థానంలో కామన్‌వెల్తు సహకార ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అమెరికాలో మాత్రం యిటువంటి పరిణామం సంభవించ లేదు. అక్కడి కొద్దిమంది ధనస్వాముల చే నడపబడే నిరంకుశ ధనస్వామ్య వ్యవస్థ కార్మికుల దారిలో బలమైన అడ్డుగోడగా నిల్చింది. గ్రేంజిపార్టీ నెగ్గిన 12 రాష్ట్రాల్లోనూ-లవి యిపుడు తమ ప్రభావం క్రిందికి వచ్చాయి కనుక- కామన్వెల్తు కో ఆపరేటివ్ ప్రభుత్వాలను ప్రకటించటం కోసం అమెరికన్ సోషలిస్టులు వేచి చూస్తున్నారు. కానీ ఎర్నెస్టు మాత్రం తమ వైఫల్యానికి (సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పాటు చేయటంలో) కారణాన్నీ సంభవించిన ప్రమాద కారణాన్నీ పసిగట్టాడు. పెద్ద పెద్ద కార్మిక సంఘాల్లో తమ నుండి (సోషలిస్టు నుండి) పార్టీ ఫిరాయించ బోతున్నారనే, బడా కార్మిక సంఘాల్లో కులీన కులతత్వం తలెత్తబోతోందని ఎర్నెస్టు పసిగట్టాడు. ఆ రకంగా అతడు "ఇనుమ మడమ" నెగ్గిందనీ, యిక కనుచూపు మేరలో తాము ముగిసిపోతామనీ అర్థం చేసుకొన్నాడు.

మొదటి సార్వత్రిక సమ్మెలో ఘనమైన పాత్ర నిర్వహించిన మెషినిష్టు సంఘ నాయకత్వంతో పాటు, యితరులు రెండోసారి సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వాలనే విషయాన్ని తిరస్కరించారు. దేశంలోని పెట్టుబడిదారీ వర్గం, మొదటి జనరల్ సమ్మె తర్వాత, తమతో ఒక అవగాహనకు వచ్చిందనీ, తమ సంఘ సభ్యుల ప్రయోజనాలను పెంపొందించే అవగాహనా ఒప్పందం చేసుకొందనీ, అందువలన మరో సార్వత్రిక సమ్మె చేయాల్సిన అవసరం తమ సంఘ కార్మికులకు లేదని ఆ సంఘాల నాయకత్వం నాయకులు వాదించారు.

బడా యూనియన్లకు సబ్సిడీలు యిచ్చే రూపంలో నిరంకుశ ధనస్వామ్య వర్గం ఆ యూనియన్ల కార్మికులు మరో సార్వత్రిక సమ్మెలో పాల్గొనకుండా ఏర్పాటు చేసుకొంది. ఫలితంగా రైలు రోడ్డు యూనియన్ సభ్యులకూ, ఇనుమ-ఉక్కు పరిశ్రమల రంగ కార్మికుల సంఘ సభ్యులకూ, ఇంజనీర్ల మిషనిస్టు యూనియన్ సభ్యులకు గణనీయంగా జీతాలు పెంచేరు. పనిగంటలు తగ్గించారు. ఇతర సంఘాల సభ్యులకూ యిదే తరహా జీతాల పెంపుదల, పనిగంటల తగ్గింపు లాంటి మెరుగైన సౌకర్యాలు ప్రకటించబడ్డాయి. దాంతో ఈ సంఘాల నాయకులు తమ కార్మికవర్గ లక్ష్యానికి ద్రోహం చేశారు. ఇప్పుడు ఈ యూనియన్లలో సభ్యత్వం పొందటమంటే, స్వర్గంలో సీటు సంపాదించినంత గొప్ప విషయం అయింది. ఈ రకంగా అసంఘటితరంగ, నేర్పులేని సాధారణ కార్మికుల ప్రయోజనాలకు బడా కార్మిక సంఘాలు విద్రోహానికి పూనుకొన్నాయి.

ఈ రకంగా తిరిగి వర్గపునాదిపైన ఏర్పడ్డ వ్యవస్థ-నిరంకుశ ధనస్వామ్య వ్యవస్థ- కొనసాగటంలో విజయవంతమయింది. అది కార్మికుల్లో సృష్టించిన

> పార్లమెంట్లూ, శాసనసభలూ ఎటువంటి బూటకమయినవో, అవి కేవలం బాతాఖానీ క్లబ్బులుగా ఎలా మిగిలిపోయాయో, ధనస్వామ్య నిరంకుశ వర్గం పార్లమెంటునూ, కోర్టునూ రాజ్యాంగబద్ధంగానే ఎలా తన అదుపులో వుంచుకొంటోందో, తన వ్యతిరేకులను ఏ విధంగా ఆ చట్టసభల్లో స్థానాలను సంపాదించు కొన్నా పని చేయనీయదో, తన వాస్తవ లక్షణాలను బయటపెట్టి రచ్చ చేయబూనుకొన్న చట్ట సభ సభ్యులను ఏ రకంగా కుట్రపూరితంగా ఇరికించి, నిర్బంధానికి గురి చేస్తుందో... జాక్లండన్ చిత్రీకరించారు. *100* ఏళ్ళ తర్వాత నేటికీ ఈ చట్ట సభల్లో జరుగుతున్నది యిదే తంతు అన్న విషయం గమనిస్తే, ఆయన శాస్త్రీయంగా ఈ అంశాలను ఎంత నిశితంగా పరిశీలించి విశ్లేషించాడో బోధపడుతుంది. 'ప్రజాస్వామ్యం అబద్ధం- బూటకం నిబద్ధం' అన్న విషయాన్ని ఆయన ఆనాడే ఎలుగెత్తి చాటడం జరిగింది.

[illegible] యొక్క ప్రభావం ఏదో నాటికి ఇనుప మడమను నాశనం ఎర్నెస్టు భావించాడు

సామాజిక పరిణామ క్రమానికి అడ్డుకట్టను వేసిన నిరంకుశ ధనస్వామ్య వర్గం తాను దేశ ప్రజలపై పూర్తి పట్టును సాగించింది కాబట్టి యిప్పుడు అదనపు సంపదను బ్రహ్మాండమైన రాజవీధులు నిర్మించటానికీ, మహా పట్టణాలను నిర్మించటానికి విజ్ఞానశాస్త్రాన్ని అభివృద్ధి చేయటినికీ పూనుకొని కళలను అభివృద్ధి చేస్తుందని ఎర్నెస్టు అభిప్రాయపడ్డాడు. ఎందుకంటే ఆ వర్గానికి అంతకన్నా చేయటానికి ఏమీ వుండదు కనుక, ఈజిప్షియన్ల ఫారోలేయిన్లు వలె అది బ్రహ్మాండమైన కట్టడాలను, పట్టణాలనూ నిర్మిస్తుంది అన్నది ఎర్నెస్టు అభిప్రాయం. ఈ క్రమంలో సామాన్య శ్రామికుడు అథోజగత్తులోకి పూర్తిగా నెట్టివేయబడతాడని, అలా అథోజగత్తులోకి నెట్టబడిన శ్రామిక ప్రజానీకం శతాబ్దాల అనంతరం తిరిగి తలెత్తి నిరంకుశ ధనస్వామ్య వ్యవస్థను కూల్చివేస్తారని ఎర్నెస్టు ఊహించాడు.

ఈ ఎపిసోడ్ చిత్రీకరణ ద్వారా, జాక్లండన్, సామ్రాజ్యవాద స్థితికి ఎదిగిన పెట్టుబడిదారీ విధానం ఏ రకంగా ప్రపంచ మార్కెట్లుపై అధిపత్యం సాధించటానికి యుద్ధాలను సృష్టిస్తుందో, తాను చేసుకొన్న శాంతి ఒడంబడికలు, యుద్ధ ఒడంబడికలను కాలరాస్తుందో, కార్మికవర్గం-అంతర్జాతీయ కార్మికవర్గం-తన కార్మిక వర్గ అంతర్జాతీయ సూత్రం, శాంతి వైఖరులతో సామ్రాజ్యవాద యుద్ధాలను ఐక్యంగా ఏ రకంగా నిరోధించగలదో వివరించాడు. మరోవైపు పెట్టుబడిదారీ వర్గం కార్మికుల్లోకి, యూనియన్ నాయకత్వాల ద్వారా ఆర్థిక వాదాన్ని ఎలా చొప్పిస్తుందో, ఎలా కార్మిక సంఘ నాయకులను-ఒప్పందాల రూపంలో-కొనుగోలు చేసి వారిని చైతన్య వంతమయిన వర్గపోరాటాల నుండి తప్పిస్తుందో, ఎలా కులీన కార్మిక కులాలను సృష్టిస్తుందో, చక్కగా వివరించాడు. ఈ రోజుకి కూడా అమెరికాలో కార్మికవర్గ పోరాటాలు చెలరేగి అభివృద్ధి చెందటానికి ఆటంకంగా వున్నది ఆ ఆర్థికవాద నిరంకుశ కార్మిక సంఘ నాయకులూ ఆ కులీన కార్మికులేనన్న విషయం మనం [illegible] కొన్ని శతాబ్దాల అనంతరమైనా కార్మికులు [illegible]కి చైతన్యవంతమై పోరాటాల శ్రామిక ప్రజానీకం [illegible] నిరంకుశ ధనస్వామ్య వ్యవస్థను కూల్చివేస్తుంది అనే అనివార్య పరిణామ సంభవాన్ని, ఎర్నెస్టు అభిప్రాయం ద్వారా జాక్ లండన్ వ్యక్తపరిచాడు. ఈ అని [illegible] ప్రకటించాడు

మళ్ళీ కథలోకి వస్తే,

1913 జనవరి ఆఖరివారంలో పత్రికలు పారిశ్రామిక యజమాన్యాలు కార్మికులకు పెంచిన వేతనాల గురించీ, పెంచిన ఇతర సౌకర్యాల గురించీ భారీగా ప్రచారం చేశాయి కార్మికుల కుటుంబ సభ్యులు కూడా ఈ ఆర్థికవాద ప్రభావంలోకి ఈడ్చుకుపోబడ్డారు. బడా కార్మిక సంఘ నాయకత్వాలు "మాకు ఎక్కువ కూలి చెల్లించండి! ఆ మొత్తాలను ప్రజల నుండి ధరల రూపంలో సంపాదించండి" అనే నినాదాన్ని లేవనెత్తాయి. ఫలితంగా కార్మికుల(సంఘటితరంగ) వేతనాలు పెరిగి ఆ పెరుగుదల భారాన్ని సామాన్య ప్రజలైన అసంఘటిత కార్మికవర్గం ధరల పెరుగుదల రూపంలో భరించాల్సి వస్తుంది. ధనస్వామ్యంతో రాజీపడ్డ బడా యూనియన్లు అంతర్జాతీయ కార్మిక సంస్థలతో తెగతెంపులు చేసుకొన్నాయి. ఈ యూనియన్ల సభ్యులకు కార్మిక విద్రోహులనే ముద్రపడింది. ఈ కార్మిక విద్రోహ సభ్యులపై వారి బిడ్డలపై వెలి విధింపబడింది. మంచి అవకాశాలూ, జీవితం వున్న బడా సంఘాల సభ్యులు తమకు తాముగా కార్మిక వర్గం నుండి వేరై ఒక ప్రత్యేకమయిన తెగగా రూపొంది, విడిగా బ్రతుకుతూ, సాధారణ నైపుణ్యంలేని, అసంఘటిత కార్మికులపట్ల ద్వేషం పెంచుకొన్నారు.

మరోవైపు సాధారణ, అసంఘటిత కార్మికుల జీవితాలు మరింత దుర్భరమయ్యాయి. వారి జీతాలూ, జీవన స్థాయి పడిపోయాయి. వీరి పిల్లలకు చదువు చెప్పించలేకపోవటం వలన ప్రభుత్వం విద్యా సదుపాయాన్ని కల్పించకపోవటం వలన-దేశంలో నిరక్ష రాశ్యులైన పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది.

మరోవైపు "ఇనుమ మడమ" సుస్థాపితం చేయ బడింది. కార్మికుల్లో తిరుగుబాట్లు నిరోధింపబడ్డాయి. రైతులూ, మధ్యతరగతి వర్గాలవారు మతాన్ని పునరుద్ధరించారు. వాళ్ళు యిక ప్రపంచం అంతం కాబోతోందనీ ప్రవచించారు. కానీ అటువంటిదేమీ జరగక నిస్పృహలో పడ్డ జనం గ్రామాల్లో వ్యవసాయక్షేత్రాలపై పడి, ఆహారాన్ని కొల్లగొట్టుకుపోవటం అన్నది-ఆకలి అల్లర్లు-చెలరేగి పోయాయి. వీటిని దుపు చేయటం పేరిట "ఇనుమ మడమ" వ్యవసాయక్షేత్రాల్లో ఆహార గోడౌన్లలో తిష్టవేసింది. కొద్దిమంది చేత పాలింపబడిద నిరంకుశ ధనస్వామ్య వ్యవస్ద ఒక భయంకరమైన, భూతంగా ఎదిగింది.

సోషలిస్టులు, ' తమ కాంగ్రెసు ప్రతినిధుల ద్వారా, శాసన సభల ప్రతినిధుల ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోస్తాననీ, రెండేళ్ళ కాలంలో అధ్యక్షుడి పదవి నుండి క్రింద వరకూ తామే అధికారంలోకి వస్తామనీ చెబుతున్నాడు. కానీ ఎర్నెస్టు మాత్రం "ఆయుధాలు దగ్గరలేని మనం ఏమీ చెయ్యలేం" అంటూ వారి అభిప్రాయాలను కొట్టిపారేశాడు.

జాన్ కన్నింగ్ హాం పూర్తిగా శ్రామికుడిగా మారి, పనిలో చేరాడు. ఎర్నెస్టు పార్లమెంటులో చేరటం కోసం భార్యతో, వాషింగ్టన్ వెళ్ళాడు. సోషలిస్టులు పార్లమెంటులో తమ స్థానాల్లో కూర్చోవటానికి అవరోధాలు ఏమీ ఏర్పడలేదు. దాంతో సోషలిస్టు ప్రతినిధుల్లో తాము సాధించదలిచింది సాధిస్తామనే విశ్వాసం పెరిగింది.

అయితే గ్రేంజి పార్టీ ప్రతినిధులను వారి స్థానాలను వారు ఆక్రమించుకుండా నిరోధించటం జరిగింది. వారందరి ఎన్నికలు చెల్లవని కోర్టు కేసులు వేసి, ఆ కేసులను కోర్టుల్లో సాగదీస్తున్నారు. గ్రేంజర్లు ఏమి చేయలేని శక్తిలేని స్థితికి నెట్టబడ్డారు. అపుడు నిరంకుశ ధనస్వామ్య పాలకులకు చెందిన ఏజెంట్లు రైతులను ప్రేరేపించి తిరుగుబాట్లను సృష్టించాడు ఈ తిరుగుబాట్లు రగిలి, రైతులు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలను బలవంతంగా స్వాధీనం చేసుకొన్నారు అలా ప్రభుత్వాలను బలవంతంగా స్వాధీనం చేసుకోవటం అనే పేరిట కేంద్ర ప్రభుత్వం [illegible] మరోవైపు [illegible]లా, క్రైస్తవులా, క్రైస్తవుల్లా వేషాలు ధరించి "ఇనుప మడమ" యొక్క ఏజెంట్లు ప్రజలను అల్లర్లు చేయమని రెచ్చగొట్టారు. స్వయంగా వాళ్ళ ఏజెంట్ల బృందాలే భవనాలకూ, ఫ్యాకరీలకూ నిప్పంటించి లూటీలు చేశారు. మురికి వాడల్లో ప్రజలకు సారా పంచి అల్లర్లు రెచ్చగొట్టారు. వీటిని అదుపు చేసే పేరట కేవలం సాక్రమాంటో నగరంలోనే పదకొండువేలమంది పురుషులనూ, స్త్రీలనూ, పిల్లలనూ రోడ్డుపై సైనికులు కాల్చి చంపారు. లేదా వాళ్ళను యిళ్ళల్లోనే హత్య చేశారు. గ్రేంజర్లు స్వాదీనం చేసుకొన్న ప్రతీ రాష్ట్రంలోనూ హింసా, రక్తపాతాలు పెరిగిపోయాయి. మొదట ఏజెంట్లు, బ్లాక్ హండ్రెడ్ మురాలూ అల్లర్లు రేపితే ఆనక సైన్యం రంగ ప్రవేశం చేసింది. వీరితోపాటు పౌరసైన్యమయిన మిలిషియా పిలిపించబడింది. కాన్సాస్లోని ఆరువేల మంది పౌర మిలిషియా సభ్యులు, గ్రేంజిపార్టీ వారిపై సైనిక చర్య చేయటానికి వ్యతిరేకించి, తిరుగుబాటు చేశారు. వీరు ఏజెంట్ల ప్రోత్సహం, ప్రేరణలతో కొందరు తమ అధికారులను పట్టుకొని చంపారు. ఆ వంకన సైన్యం వీరందరినీ చుట్టుముట్టింది. దాంతో వారు సైన్యానికి లొంగిపోయారు. మొత్తం ఆ ఆరువేలమంది మిలిషియా సభ్యులనూ, సైన్యం సంహరించింది. నిరాయుధులైన వారిపై మిషన్గన్నులతో సైన్యం దాడి జరిపింది. అదే సందర్భంలో గ్రేంజర్లను కూడా నాశనం చేయటం జరిగింది. ఆ తర్వాత బొగ్గు గని కార్మికులను నాశనం చేయటం జరిగింది. ఏడున్నర లక్షలమంది బొగ్గు కార్మికులు సమ్మె చేశారు. వారిని ఏ ప్రాంతంలో వారిని ఆ ప్రాంతంలోనే వేరు చేసి, పాశవికంగా చితగ్గొట్టి లొంగదీసుకోవటం జరిగింది. సమ్మె విచ్ఛిన్నకులు సమ్మెదారులను బానిసలను తోలినట్లు తోలారు.

అటు గ్రేంజర్లు రక్తపాతంలో ముంచబడి వినాశనం చేయబడటం, యిటు సంఘటిత కార్మిక ఉద్యమ నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేయటం చూస్తున్న సోషలిస్టులు దృఢంగా నిలబడ్డారు ఈ సమయంలో వాళ్ళు రహస్య నిర్మాణాన్ని ప్రారంభించి, ఆ రహస్య నిర్మాణాన్ని గట్టిబరచుకొన్నారు. తమ పార్టీలో "పోరాట దళాలను" ఏర్పాటు చేశారు. ధైర్యవంతులైన, ఆత్మత్యాగానికి సిద్ధపడ్డ సభ్యులను ఈ "పోరాట దళాల" సభ్యులుగా వుంచారు. ఆ దళాల్లో పనిచేసే సభ్యులు సరాసరిన 5 సంవత్సరాల కాలం మాత్రమే జీవించగలిగి వుండేవారు. ఆ దళ సభ్యులు తమ ఆశయం కోసం అనంత త్యాగాలు చేసేవారు. ఆ రోజుల్లో సోషలిస్టులు నిర్వహించాల్సిన కర్తవ్యాలు ఈ విధంగా వున్నాయి: ముందుగా తమ శ్రేణుల్లో వున్న నిరంకుశ ప్రభుత్వ ఏజెంట్లను ఏరిపారేయటం. 'పోరాట దళాల' ను నిర్మించి వాటిని నిర్వహించటం రహస్య విప్లవ సంస్థను నిర్మించి, నిర్వహించటం, నిరంకుశ ధనస్వామ్య ప్రభుత్వపు అన్ని శాఖల్లోనే సోషలిస్టు ఏజెంటులను చొప్పించటం-ప్రత్యేకించి కమ్యూనికేషన్, రవాణా రంగ కార్మికుల్లోనూ, సైన్యంలోనూ, గుమాస్తాల్లోనూ, కార్యదర్శుల్లోనూ, ప్రజలను రెచ్చగొట్టే ప్రభుత్వ ఏజెంట్లలోనూ-సోషలిస్టు ఏజెంట్లను చొప్పించటం ఇది చాలా ఓపిగ్గా, మెల్లగా సాగాల్సిన ప్రమాదభరితమైనపని. చాలా సందర్భాలలో విఫలమై సోషలిస్టులకు పెద్ద నష్టాలను కల్గిస్తుంది.

బహిరంగ యుద్ధంలో 'ఇనుప మడమ' విజయం సాధించింది. కానీ సోషలిస్టులు తాము ప్రారంభించిన నూతన తరహా సంగ్రామంలో (వినూత్నమయిన, భయంకరమైన, రహస్య పోరాటం) విజయం పొందారు. సోషలిస్టులు 'ఇనుప మడమ' యొక్క నిర్మాణ్నాంతా తమ ఏజెంట్లతో నింపారు. అనేకమంది కార్యకర్తలు ఈ రోజు కనబడ్డవారు మర్నాడు అదృశ్యమవుతున్నారు. సోషలిస్టులు నిర్మాణంలోకి కూడా ప్రభుత్వ రహస్య ఏజెంట్లు చొరబడ్డారు. సోషలిస్టులు అనేక సందర్భాలలో మతఛాందస వాదంలా పరిగణించి విముక్తి దేవతను పూజించేంత స్థాయికి విప్లవాన్ని పూజించారు. తమ లక్ష్యం కోసం స్త్రీ, పురుషులు తమ జీవితాన్ని అంకితం చేశారు. వాళ్ళు మానవత్వాన్ని ప్రేమించారు.

అమెరికన్ కాంగ్రెస్లో (పార్లమెంటులో), సోషలిస్టులు చాలా అల్పసంఖ్యలో మైనార్టీగా వున్నారు. కాంగ్రెస్ అన్నది కేవలం బూటకమయినదిగా, బూటకమైన ఒక ఫార్ములా వుంది. కాంగ్రెసులో, పాత పద్ధతుల్లో ప్రశ్నలు ఎంతో గంభీరంగా చర్చించబడేవి. ఇదంతా నిరంకుశ ధనస్వామ్య వ్యవస్థకు అదికారం కల్పించేందుకు సాగుతున్న రాజ్యాంగబద్ధ ప్రక్రియా నాటకం. ఎర్నెస్టు తదితర సభ్యులకు, తాము తమకు యిష్టంలేని శాసన [illegible] నాటకంలో నటిస్తున్నట్టు తెల్సును. దీని ద్వారా తాము ఏమీ సాధించలేమని కూడా వారికి తెల్సును. వాళ్ళు తొందరగా ఈ ఫార్సును ముగిద్దామని ఆశిస్తున్నారు.

ఎర్నెస్టు నిరుద్యోగుల బాధల గురించీ, వారి దుస్థితి గురించీ అక్కడ మాట్లాడాడు. ఈ ప్రశంసలద్వారా కనీసం కొందరు సెనేట్ సభ్యుల హృదయాలనైనా మనస్సాక్షినైనా కదిలించాలనేది అతడి ఉద్దేశ్యం. కానీ అతడు మాట్లాడు తున్నపుడు వారు (రిపబ్లికన్ డెమోక్రాటిక్ పార్టీ సెనేటర్లు) పెద్దగా, వెకిలిగా హేళన చేస్తూ, అరుపులు అరచి గోలచేశారు. దాంతో ఆగ్రహం చెందిన ఎర్నెస్టు "మీకు ఆత్మలు లేవు. మీరు వెన్నెముకలేని దృఢత్వం లేని పదార్ధాలు. మీరు మిమ్మల్ని ఎంతో ఘనంగా రిపబ్లికన్లు, డెమోక్రాట్లు అని పిలుచుకుంటారు కానీ రిపబ్లికన్ పార్టీ లేదు. డెమోక్రటిక్ పార్టీ లేదు. ఈ సభలో డెమోక్రాట్లు లేరు రిపబ్లికన్లూ లేరు. మీరంతా ధనస్వామ్యవర్గం యొక్క మూతిని నాకేవాళ్ళు. తార్పుడుగాళ్ళు. మీరు పురాతన కాలపు సమాసాలతో నిండిన భాషలో, విముక్తిని గురించి గొప్పగా మాట్లాడుతారు. కానీ మీరు జీవిత మంతా 'ఇనుప మడమ' యొక్క రక్తపిశాచపు దుస్తులనే ధరించి వుంటారు" అంటూ అరుస్తాడు.

'రాచకవాది....'రాజద్రోహం" అంటూ వాళ్ళు అరిచారు. స్పీకరు సెనేట్ రక్షణాధికారులవేపు చూస్తూ "ఆర్డర్, ఆర్డర్ " అంటూ అరుస్తున్నాడు.

ఇంతలో ప్రేక్షకుల గ్యాలరీ నుండి ఏదో వస్తువు, మెరుస్తు వచ్చి ఎర్నెస్టు కాళ్ళ దగ్గరపడి, ప్రేలి పొగలు వెదజల్లింది. సుడులు తిరుగుతున్న ఆ పొగలలో ఎర్నెస్టు నేలమీదకి జారిపోయాడు. సైనికులు హాలులోకి తోసుకు వచ్చారు. ఇదంతా చూస్తూ నిమ్మళించిన ఎర్నెస్టు "ఇదో దుష్ట పథకం- ఎవ్వరూ కదలకండి లేదా నాశనమయి పోతారు" అంటూ తన సహచరుల్ని వారించాడు.

సైనికులు ఎర్నెస్టునూ, వాషింగ్టన్లో వున్న కాంగ్రెసు సభ్యులందర్నీ అరెస్టు చేశారు. ఆఖరికి హోటల్ గదిలో టైఫాయిడ్తో బాధపడుతున్న సింప్సన్ను కూడా అరెస్టు చేశారు. వారిపై తొందరగా విచారణ ముగిసింది. వీళ్ళపై కాంగ్రెసులో (పార్లమెంటులో) బాంబు పేల్చిన నేరారోపణ చేయబడింది. చాలామంది సెనేట్ సభ్యులు తాము ఎర్నెస్టు బాంబును విసరటానికి సన్నద్ధమవు తుండగా చూశామనీ, ఈలోగానే అది పేలిపోయిందనీ కోర్టులో ప్రమాణం చేసి మరీ సాక్ష్యం చెప్పారు. ఎర్నెస్టు ఆ విచారణను తిరస్కరిస్తూ " ఆ బాంబు నుండి కేవలం పొగ వచ్చిందే తప్ప, ఎవరికీ హాని చేయలేదు. అది నా కాళ్ళ వద్ద పడి ప్రేలింది కానీ, నన్ను చంపలేదు నేనే కనుక నిజంగా బాంబును విసరదల్చుకొంటే యిటువంటి చచ్చు పొగబాంబును వదిలివుండేవాడ్ణి కాను చాలా నష్టపరిచే బాంబు విసిరి వుండేవాడ్ణి నా బాంబు నుండి పొగకు బదులు, మరో రకమయినవి బయటికి వచ్చుండేవి" అంటూ వాదించాడు అయినా అతని వాదన పట్టించుకోని కోర్టు అతడికి జైలు శిక్ష విధించింది

నిజానికి ఆ బాంబును సోషలిస్టులు విసరలేదు. "ఇనుప మడమ" కుట్రపూరితంగా తన ఏజెంట్ల చేత ఆ పని చేయించి సోషలిస్టులను యిరికించింది వారందరినీ జైలు పాలు చేసింది. ఎవిస్ను కూడా [illegible] చూడనీయ కుండా ఆరు నెలల పాటు ఏ నేరారోపణ లేకపోయినా జైల్లో నిర్బంధించింది.

ఈ ఎపిసోడ్ ద్వారా పార్లమెంట్లూ, శాసనసభలూ ఎటువంటి బూటకమయినవో, అవి కేవలం బాతాఖానీ క్లబ్బులుగా ఎలా మిగిలిపోయాయో, ధనస్వామ్య నిరంకుశ వర్గం పార్లమెంటునూ, కోర్టునూ రాజ్యాంగబద్ధంగానే ఎలా తన అదుపులో వుంచుకొంటోందో, తన వ్యతిరేకులను ఏ విధంగా ఆ చట్టసభల్లో స్థానాలను సంపాదించు కొన్నా పని చేయనీయదో, తన వాస్తవ లక్షణాలను బయటపెట్టి రచ్చ చేయబూనుకొన్న చట్ట సభ సభ్యులను ఏ రకంగా కుట్రపూరితంగా ఇరికంచి, నిర్బంధానికి గురి చేస్తుందో, ప్రజల నిజమైన సమస్యలకు బదులు, అసందర్భపు చర్చలు ఈ చట్టసభలనబడే వాటిలో ఎలా సాగుతాయో, వాస్తవ పరిస్థితులను పట్టించు కోకుండా ధనస్వామ్య ప్రతినిధులు ఏరకంగా మనసులు లేని మృగాల్లా ప్రవర్తిస్తారో జాక్లండన్ చిత్రీకరించారు. 100 ఏళ్ళ తర్వాత నేటికీ ఈ చట్ట సభల్లో జరుగుతున్నది యిదే తంతు అన్న విషయం గమనిస్తే, ఆయన శాస్త్రీయంగా ఈ అంశాలను ఎంత నిశితంగా పరిశీలించి విశ్లేషించాడో బోధపడుతుంది. 'ప్రజాస్వామ్యం అబద్ధం- బూటకం నిబద్ధం' అన్న విషయాన్ని ఆయన ఆనాడే ఎలుగెత్తి చాటడం జరిగింది.

మళ్ళీ కథలో కొస్తే!

ఎవిస్ వున్న జైల్లోని ఒక డాక్టర్ సోషలిస్టుల "పోరాట దళాలకు" చెందిన సభ్యుడు. ఆ రకంగా ధనస్వామ్య నిరంకుశ ప్రభుత్వ సంస్థల్లో అన్నింటినీ సోషలిస్టు ఏజెంట్లు అల్లుకుపోయారు. వీరి ద్వారా ఎవిస్కు ఎప్పటికప్పుడు, అక్కడకి మూడువేల మైళ్ళ దూరంలో గల పశ్చిమతీరంలోని జైలులో వున్న ఎర్నెస్టు [illegible]చారలు అందుతూ వుండేవి ఇరువురి మధ్యనా ఉత్తర ప్రత్యుత్తరాలు అందించబడుతూ వుండేవి. ఇప్పుడు సోషలిస్టులు ఒకే రోజున దేశంలోని వివిధ ప్రాంతాల్లోని జైళ్ళలలో నిర్బంధించబడిన 52 మంది కాంగ్రెసు (సెనేట్) సభ్యులనూ విడిపించుకుపోవాలనీ, ఆ రకంగా కార్మిక వర్గంపై ఒక బలమైన ప్రభావాన్ని కలుగచేయాలని నిర్ణయించారు. తద్వారా తమ శక్తిని చూపించటం ద్వారా సోషలిస్టులు తమపట్ల ప్రజల్లో విశ్వాసం పెంచుకోవాలని భావించారు.

ఆరు నెలల తర్వాత జైలు నుండి విడుదల అయిన ఎవిస్, తాను అదృశ్యమై, ఎర్నెస్టు కోసం ఒక సురక్షిత రహస్య స్థలాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయింపబడింది. ఆ ప్రకారం ఎలిస్ జైలు నుండి బయటకు రాగానే తన వేషం ఒక కులీన స్త్రీలా మార్చుకొని, ముగ్గురు పరిచారికలతో(గ్రేస్, అన్నా రాయల్స్టన్ అనబడే పోరాట దళ సభ్యులు జెర్ట్రాస్టోల్ ఆ వేషంలో) ఖరీదైన రైలుబోగిలో పశ్చిమప్రాంతానికి ప్రయాణం సాగించి కాలిఫోర్నియా చేరింది. అక్కడ పరిచారికలుగా నటించిన ముగ్గురూ ఆమెను విడిచి మరో కామ్రేడ్తో వెళ్ళిపోయారు. వారిలో గ్రేస్ను ఆరు నెలల తర్వాత 'ఇనుప మడమ' సంహ రించింది. బెర్తా 12 ఏళ్ళ తర్వాత అదృశ్యమయింది. అన్నా రాయల్స్టన్ యింకా విప్లవంలో ప్రధానమైన పాత్రను పోషిస్తుంది. తర్వాత ఎలిస్, శాన్ఫ్రాన్సిస్కో ఖాతంలో చిన్న చేపల నావపై ఎక్కి రాత్రంతా ప్రయాణం చేసి మారిన్ ద్వీపం చేరింది. అక్కడ పగలంతా విశ్రాంతి తీసుకొని, తిరిగి రాత్రి నావ మీద సాన్పాబ్లో ఖాతాన్ని దాటి పెటాలుమా సముద్రపు పాయలోని రేవుకు చేరుకుంది. అక్కడి నుండి ముందుగా ఏర్పాటు చేయబడ్డ గుర్రంపై సొనామా పర్వతంపై పయనించి బెన్నెట్ కొండచరియల్లోకి చేరింది. అక్కడగల ఒక లోయలో ఆమె రహస్యంగా దాగుండే స్థావరం ఏర్పాటు చేయ బడింది. ఈ రహస్య స్థావరం ధనస్వామి విక్సన్కు గల లేళ్ళపార్కుకు, అతడి వేట స్థావరానికి పావుమైలు దూరంలో వుంది. ఇది ఆమెకు నిజంగా సురక్షితమైన రహస్య స్థావరం. ఎందుకంటే 'విక్సన్ ఎస్టేటు దరిదాపుల్లో 'విప్లవకారుల-ఎర్నెస్టు యొక్క' రహస్య స్థావరం వుంటుందని 'ఇనుప మడమ' యొక్క గూఢచార్లు ఎప్పుడూ ఊహించరు. అనుమానించరు. అక్కడ కాలుపెట్టారు. ఆమెకు తోడుగా వచ్చినతను జాన్ కార్లసన్. అతడు విప్లవోద్యమంలో సామాన్య కార్యకర్త.

[illegible] యొక్క గుర్రపుశాలల్లో నౌకరి చేసుకుంటాడు. ఆయన సోషలిస్టుల చేత త్వరగా కామన్‌వెల్త్ సహకార వ్యవస్థ ఏర్పాటు చేయబడాలని ఆకాంక్షిస్తున్నాడు.

ఎర్నెస్టు ఆమెకు ఓ ఉత్తరం రాస్తాడు. అందులో ఆమె వేషభాషల్లోనే కాక, మనిషిగా కూడా తనలో సహా ఎవరూ పోల్చుకోలేని విధంగా మరో స్త్రీలా మారిపోవాలనీ, ఆమె యొక్క గొంతూ, ముఖ కవళికలు హావభావాలు, ప్రత్యేక అలవాట్లు, ధోరణులు, నడకా అన్నీ పూర్తిగా మారిపోవాలని ఆమెను కోరతాడు.

ఆ ప్రకారం ఆమె తన నడక, హావభావాలు, వేషభాషలు, అలవాట్లను, మాట్లాడే తీరును కష్టపడి సాధన చేసి ఎవ్వరూ గుర్తుపట్టలేనంతగా తనను తాను మార్చుకొంది.

ఈలోగా తండ్రి జాన్ కన్నింగ్‌హాం నుంచి ఆమెకు ఉత్తరాలు ఆగిపోయాయి. ఆయన అదృశ్యం అయిపోయాడు. సోషలిస్టు పార్టీ ఏజెంట్లు అమెరికాలోని జైళ్ళన్నీ వెతికినా ఆయన జాడ చిక్కలేదు. ఆయన అంతర్థానంలో వున్న చిక్కుముడి నేటికీ విడలేదు.

ఆమెకు తోడు రహస్య స్థావరంలోకి మరో యిద్దరు యువతులు వచ్చారు. వీరిని వెంబడించి వస్తున్న గూఢచారి జాన కర్లసన్‌ని పసిగట్టి అతణ్ని ఖతం చేసి పారేస్తారు.

ఎవిస్ తన పార్టీ ఏజెంట్ల ద్వారా బిషప్ మోర్‌హౌస్ జాడ కోసం దేశమంతా గాలింపు చేస్తుంది. కానీ ఆయన జాడ దొరకలేదు. కానీ తర్వాత ఆయన చికాగో మ్యాన్'లో జరిగిన మారణహోమం సందర్భంగా హఠాత్తుగా ఎలిస్‌కు క్షణ మాత్రం కన్పించి మాయమయ్యాడు.

సియారామిల్లు ప్రమాదంలో చేయిని పోగొట్టుకొన్ని ఆమె విప్లవం మార్గంలో పయనించటానికి కారకుడైన జాక్సన్ తిరిగి మళ్ళీ ఎన్నడూ ఎవిస్‌కు కనబడలేదు. అతడు విప్లవవాదుల్లో ఎప్పుడూ చేరలేదు. కానీ కసిని పెంచుకొని, ద్వేషంతో అరాచకవాదిగా మారి పెర్టన్‌వైట్ ప్రాసాదాన్ని ఒక అర్ధరాత్రివేళ పేల్చివేసి, పోలీసులకు పట్టుబడి, విచారణ కోసం జైల్లో మ్రగ్గుతూ, ఒకరోజున ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు.

డా॥ హామరుఫీల్డు, డా॥ చాలింగ్ ఫోర్డులు ధనస్వామ్యానికి విశ్వాసపాత్ర సేవలందించి, ప్రతిఫలంగా, పెద్ద పెద్ద చర్చి ప్రసాదాలను లభింపచేసుకొని వాటిలో హాయిగా, ఆనందంగా బ్రతుకుతున్నారు. నిరంకుశ ప్రభుత్వసేవలో వారిద్దరూ మదించిపోయారు.

జాక్సన్‌కు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చిన ఫోర్మన్ పీటర్ డానెల్లీ ఒకసారి ఈ మధ్య ఎవిస్‌కు తారసపడ్డాడు. ఇప్పుడు విచిత్రంగా అతడు అతిభయంకరమైన విప్లవ సమరసంస్థ అయిన "ఫ్రిస్కోరెడ్స్" అన్న సంస్థలో సభ్యుడు. ఈ విషయాన్ని అతడే" ఒకనాడు పుంధుమీద పొక్కుగా బ్రతికిన తాను ఈనాడు ఆ సంస్థ సభ్యుడనని" ఎలిస్‌కు చెప్పాడు.

కల్నల్ యింగ్రాం ప్రస్తుతం బెర్లిన్‌లో రాయబారిగా వున్నాడు.

కల్నల్ వాన్ గిల్బర్ట్, చికాగోలో కమ్యూన్‌ను రక్తపాతంలో ముంచటంలో ప్రముఖపాత్ర వహించి, విప్లవకారులచేత పట్టుబడి విచారింపబడి మరణశిక్షకు గురయ్యాడు.

జాక్సన్ కేసును వాదించిన న్యాయవాది జోసఫ్ హార్డ్‌ను విచిత్ర పరిస్థితిల్లో ఎవిస్ చూసింది. అతడు నిరంకుశ ప్రభుత్వ గూఢచారిగా పనిచేసి, సోషలిస్టులకు పట్టుబడి, విచారణలో మరణశిక్ష విధింపబడి లాక్కుపోబడుతున్న సమయంలో, ఎవిస్ కాళ్ళు పట్టుకొని తనకు ప్రాణభిక్ష పెట్టమని దీనంగా బతిమాలి, ఎంతో దీనంగా, హృదయ విదారకంగా ఏడ్చాడు.

1915లో తాము నిర్ణయించుకున్న ప్రకారం ఒకే సమయంలో, ఒకే రోజున అన్ని జైళ్లలో వున్న అందరి సోషలిస్టు సెనేట్ సభ్యులనూ, వారితో పాటు మరో మూడువందల నాయకులనూ సోషలిస్టులు విడిపించారు. సింప్సన్ మాత్రం అప్పటికే జైళ్ళో చిత్రహింసల్లో చనిపోయాడు. సోషలిస్టు రహస్య పార్టీ ముద్రణాలయాన్ని స్థాపించింది. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసింది. పార్టీ గూఢచారి వ్యవస్థ పెంపొందింపబడింది.

జైలునుండి విడిపింపబడ్డ ఎర్నెస్టు తన భార్య యొక్క రహస్య స్థావరానికి చేరుకున్నాడు. అక్కడ అనేకమంది యితర విప్లవకారులతో కలిసి వాళ్ళు కష్టపడి పనిచేశారు. ఇలా సాగుతున్న క్రమంలో ఒక రోజున వాళ్ళ రహస్య స్థావరంలోకి విక్సన్ కమాండరుకు ఫిలిప్ విక్సన్ యదాలాపంగా, తనకు తెలియకుండా వచ్చాడు. అతణ్ని వారు బంధించి క్రమంగా తమ కామ్రేడ్‌గా అతడి స్వచ్ఛంద సహకారంతో పూర్తిగా మార్చేశారు. అతడు 1927లో నూమోనియా జబ్బుతో మరణించారు.

మరోవైపు అల్పసంఖ్యాక నిరంకుశ ప్రభుత్వ వర్గాలు అతివిశాలమైన, సంక్లిష్ట ప్రభుత్వ యంత్రాంగాన్ని పకడ్బందీగా రూపొందించింది దాని ఆట కట్టించటం సోషలిస్టులకు సాధ్యం కాలేదు. దేశ వ్యవహారాలు యథా ప్రకారం నడిచిపోతున్నాయి. సమ్మెలు, లాకవుట్లు మొదలైన కార్మిక అశాంతి, అలజడులు లేకుండా పోయాయి. ఎక్కడైన కార్మికులు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ప్రజల మధ్యన తమశక్తిని వ్యక్తం చేసినప్పుడు వారిని విడిగా బయటకు తీసుకెళ్ళి మెరుగైన పరిస్థితులు కల్పించి అల్పసంఖ్యాక నిరంకుశ ప్రభుత్వం వారిని తమ కిరాయి మూకల్లో సభ్యులుగానే చేర్చుకుంటోంది. కీలక పరిశ్రమల్లోని కార్మికులు పెంపొందిన సౌకర్యాలతో హాయిగా బ్రతుకుతున్నారు. వాళ్ళు ఆ రకంగా యంత్రాలకు-అర్ధబానిసలుగా చాకిరీ చేసే కుదింపబడ్డారు. అందువలన వాళ్ళు తమకన్నా దురదృష్టవంతులైన అధోజగత్తుకు చెందిన సోదరులైన వాళ్ళ గురించి ఏమీ పట్టించుకోని ఒక స్వార్ధయుగం ఉద్భవిస్తోంది.

"ఇనుప మడమ" సేవలో కిరాయి మూకల సంస్థ ఒకటి బ్రహ్మాండంగా అవతరించి, సాగిపోతోంది. ఈ కిరాయి మూకల సంస్థలోని సభ్యులు ప్రత్యేక తెగగా తయారై, స్వంత పట్టణాల్లో వుంటూ, స్వపరిపాలనాధికారం అనుభవిస్తూ ప్రత్యేక హక్కులూ, సౌకర్యాలతో తులతూగుతున్నారు. వాళ్ళు తమ స్వంత వర్గ నీతిని రూపొందించుకొంటున్నారు.

నిరంకుశ వర్గాలకు చెందిన వారి సంతానం యిపుడు సైనిక నాయకులుగానూ, పారిశ్రామిక అధిపతులుగానూ సేవలందిస్తూ, నిరంకుశ ప్రభుత్వానికి తమ బలాన్ని జతచేశారు ఇంజనీర్లగానూ, ప్రభుత్వాధికారులుగానూ, వలసదేశాల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులుగానూ, ప్రభుత్వ రహస్య శాఖల్లో అధికారులుగానూ వాళ్ళు పనిచేస్తున్నారు. విద్య, కళలు, మతం, సాహిత్యం లాంటి అన్ని రంగాల్లోనూ వారే పనిచేస్తూ అల్పసంఖ్యాక నిరంకుశ ప్రభుత్వం శాశ్వతంగా కొనసాగటానికి వారు అన్ని విధాలా తోడ్పడుతున్నారు. వాళ్ళు తమని తాము మానవజాతి పరిరక్షకులమని భావించుకొంటున్నారు. ఈ రకంగా వీరు "ఇనుప మడమ"కు తమ బలాన్ని చేకూర్చారు.

కార్మికుల్లో కులాలు, కిరాయి మూకలు, కుప్పతిప్పలుగా వున్న రహస్య గూఢచారులు, రకరకాల పోలీసు వాళ్ళ బలంతో "ఇనుప మడమ" వర్ధిల్లుతోంది.

మరో వేపు కోట్లమంది నిస్సహాయంలో వున్న ప్రజలు కష్టాలు, కడగండ్లూ నానాటికీ పెరిగి ఉదాసీన స్థితిలోకి జారిపోతున్నారు. వాళ్ళని అల్పసంఖ్యాక నిరంకుశ ప్రభుత్వం పలు ప్రలోభాలతో తన వైపుకు త్రిప్పుకొని, వారి అసంతృప్తిని జోకొడుతూ, శ్రామిక వర్గానికి సహజంగా వుండే నాయకులు లేకుండా తన పబ్బం గడుపుకుంటోంది.

శ్రామికప్రజలు మురికివాడల్లో పశువులకన్నా హీనస్థితిలో జీవిస్తున్నారు. వారికి పనిచేసే హక్కు, ఒక చోట నుండి మరో చోటకి కదిలే హక్కు ఆయుధాలు పట్టుకొనే హక్కు లేకుండా పోయి పనిబానిసలుగా కుదింపబడ్డారు. అసాధారణమైన అవసరాలు కలిగే సందర్భంలో-పెద్ద పెద్ద రహదార్లు వెయ్యాల్సి వచ్చినపుడు, కాలువలు తవ్వాల్సినపుడు, కొండల్లో సొరంగాలు తొలచాల్సినపుడు, కోటలు కట్టాల్సినపుడు-మురికివాడల్లో వుండే యావత్తు జనాన్నీ వాళ్ళ యిష్టాల్తో ప్రమేయం లేకుండా, పని జరిగే స్థలాలకు బలవంతాన పట్టుకుపోయి బారక్కుల్లో పశువుల్లాగా కుక్కి వాళ్ళచేత బండచాకిరీ చేయిస్తారు. మురికిపేటల్లో అధోజగత్ మృగాన్ని చూసి అల్పసంఖ్యాక నిరంకుశ ప్రభుత్వం జడుసుకుంటోంది.

ఎర్నెస్టు రహస్య ప్రదేశం నుండి బైటపడి, కార్యాచరణకు పూనుకోవాలనే పిచ్చి వూహలో వున్నాడు. వేగంగా మొదటి తిరుగుబాటు పూర్తి చేయాలనీ, ఒకవేళ ఆ తిరుగుబాటు విఫలమైతే కార్మికవర్గాన్ని అట్టడుగు వర్గాన్నీ వర్గ చైతన్యం కల్గించి, కార్మికవర్గాన్ని సంఘటిత పరచటం ద్వారా పునర్వ్యవస్థీకరించటానికి ఎర్నెస్టు ఎన్నో పథకాలను మనస్సులో వేసుకున్నాడు. అన్ని ఏర్పాట్లు చేసుకొని 1917 మేలో ఎర్నెస్టులతో పాటు, అందరూ ఆ రహస్య స్థావరాన్ని వదిలి బయటికెళ్ళారు. 1918 వసంతంలో మొదటి తిరుగుబాటును ప్రారంభించాలనే నిర్ణయంతో వారు బయటి ప్రపంచంలోకి వచ్చారు.

సమ్మెలనాటి చేదు అనుభవాల రీత్యా, "తాము సంకేతం యిచ్చిన మరుక్షణమే దేశవ్యాపితంగా వున్న అన్ని రహస్య స్థావరాలనుండి, దేశం నలమూలల నుండీ, నగరాల నుండీ చిన్న చిన్న పట్టణాల నుండీ, బ్యారక్స్‌ల నుండీ ఒక పెట్టున విప్లవకారులందరూ ముందుకు దూకి, అల్పసంఖ్యాక నిరంకుశ ప్రభుత్వం యొక్క సమాచారం పంపే వ్యవస్థ నాడీ మండలమైన, వైర్లెసు స్టేషన్లనన్నింటినీ పేల్చిపారేయాలనీ, ఆ విధంగా మొదటి దెబ్బకే 'ఇనుప మడమ' నేల కరుచుకొని కకావికలవ్వాలన్నిది విప్లవకారులు వేసిన ఎత్తుగడ. దీనితోపాటు వంతెనల్ని, సొరంగాల్నీ బ్రద్దలుకొట్టి రైలుమార్గాలను స్థంభింప చేయాలి సంకేతం అందగానే పోలీసు అధికారుల్నీ, ఉన్నతస్థాయి ప్రభుత్వాధికారుల్ని, కిరాయిమూకల నాయకులను నిర్బంధించి స్థానిక యుద్ధరంగ శత్రు నాయకుల పీడ వదిలించుకోవాలి. రహస్య ముద్రణ శాలల నుండి మహిళా కామ్రేడ్లు ప్రకటనలు ముద్రించి పంచిపెట్టాలి. "ఇనుప మడమ" కొలువులో గల ఉన్నత స్థానాల్లో వున్న సోషలిస్టు ఏజెంట్లు అందరూ అరాచకత్వం, గందరగోళం సృష్టించాలి. ముందు గిడ్డంగుల్ని, యుద్ధ యంత్రాంగం తాలూకు సకల సున్నిత యంత్ర పరికరాలను విధ్వంసం చేయాలి. హఠాత్తుగా సమ్మెట పోటులాంటి దెబ్బతిన్న నిరంకుశ ప్రభుత్వం నవనాడులు కృంగిపోయి తిరగి కోలుకొనే లోపలనే దాని అంతం సంభవించాలి. ఈ పరిణామాల్లో అధోజగత్‌లోనున్న ప్రజలను వాళ్ళ యజమాన్ల మీదికీ, నగరాల మీదికీ, యజమానులు భవనాల మీదకే వుసిగొల్పి, వారూ,ప్రభుత్వ పోలీసులూ ఒకడినొకరు పరిమార్చుకొంటూండగా, ప్రభుత్వ యంత్రాంగం మీద అధిపత్యం సాధించాలన్నది- ఎర్నెస్టు తదితరులచేత రచించబడిన మొదటి తిరుగుబాటు పథకం.

అయితే వీరి పథకాన్ని ముందుగానే పసిగట్టిన "ఇనుప మడమ'' ఎత్తుగడగా తానే చికాగోలో తిరుగుబాట్లను, తన కిరాయి మమూకల ద్వారా రెచ్చగొట్టింది. ఈ విషయం తెలియని సోషలిస్టులు, "ఇనుపమడమ" వేసిన ఉచ్చులు యిరుక్కున్నారు. ఆ రకంగా చికాగో నగరంలో రేగిన అలజడులను "ఇనుప మడమ" తన సైనిక, పోలీసు దళాలతో ఎదుర్కొంది. సాధారణ ప్రజలూ, పోలీసులూ ఒకరిపై ఒకరు భీభత్సమయిన దాడులు జరుపుకొన్నారు. రోడ్లు ప్రజల శవాలతో రక్తశిక్తమయ్యాయి ప్రజలు చెలరేగి పోయారు. సైనికులు వాళ్ళని పిట్టలను కాల్చేసినట్టు కాల్చేశారు. అయినా అట్టడుగు జనం నేల ఈనినట్లుగా వస్తూ పోట్లాడుతున్నారు. సైనికులు వారిని వీధుల్లో పశువులను తోలినట్లు తోలి మిచిగాన్ సరస్సు ద్వారా తోలుకుపోయి వాళ్ళని అందులో ముంచేశారు. నలభైవేల మంది జనం ఆ రకంగా ఆ సరస్సుకు ఆహుతి యివ్వ బడ్డారు. మర తుపాకులతో జనాన్ని కాల్చిపారేయటం జరిగింది.

ఆ రకంగా మొదటి తిరుగుబాటు ప్రారంభం కాకముందే దాన్ని అల్పసంఖ్యాక ధనస్వామ్యం నిరంకుశ ప్రభుత్వం, ప్రజలపై మారణకాండ జరిపి ఊచకోత కోసి పాశవికంగా అణచివేసింది.

చికాగొలో జనం మధ్యలో చిక్కుకుపోయిన ఎలిస్‌ను తోటి విప్లవకారులు రక్షించి చికాగో నుండి రైలెక్కించి బయటకు పంపేయటం జరుగుతుంది. రైలులో ఆమె అనేకసార్లు మూర్ఛబోయి, ఆఖరిలో ఎర్నెస్టు చేత రక్షింపబడుతుంది. ఆమెను తీసుకొని వెళ్ళిపోతున్న ఎర్నెస్టు, అక్కడి జనం నూలు చొక్కా ధరించిన, తెల్లటి జుట్టుతో వున్న ఒక వ్యక్తిని గుర్తుపట్టాడు. అతడి ఎవరో కాదు. బిషప్ మూర్ హౌస్ . అతడు శ్రామిక జనంతో పాటే నిలబడిపోరాడుతున్నాడు.

"ఈసారి మనం ఓడిపోయాం. కానీ ఎల్లప్పటికీ మనం ఓడిపోలేదు. మనం చాలా నేర్చుకొన్నాం. రేపు మరింత గట్టి వివేకంతోటీ, క్రమశిక్షనతోటీ మన లక్ష్యం తలెత్తుతుంది" అంటూ ఎర్నెస్టు కార్మిక విప్లవ సంఘం పట్ల తన ధృఢ విశ్వాసాన్ని తన భార్య ఎలిస్‌కు ప్రకటిస్తాడు. వాళ్ళు న్యూయార్కు చేరుకొన్నక ఎందుకు, ఏ రకంగా తమ లక్ష్యసాధనను విపత్తు చుట్టుముట్టిందో దాన్ని గురించి పూర్తిగా అర్ధం చేసుకొన్నారు.

తర్వాత దేశమంతటా బానిసల తిరుగుబాట్లు, మారణహోమాలూ, ఊచకోతలూ జరిగాయి. మృత వీరుల సంఖ్య అనంతంగా పెరిగిపోయింది.

నిరుత్సాహానికి గురైన అనేకమంది కామ్రేడ్లు టెర్రరిస్టు దుస్సాహసిక ఎత్తుగడలలో ప్రతికార చర్యలకు దిగారు. అనేక దుస్సాహసికవాద సంస్థలు పుట్టుకొచ్చాయి. ఆ సంస్థలు సోషలిస్టు-విప్లవంకు అనుబంధ సంస్థలు కావు. అవి చేపట్టిన దుస్సాహసిక తీవ్రవాద కార్యకలాపాలు, విప్లవానికి ఎంతో హాని చేశాయి. సరయిన అవగాహనలేని ఈ వీరులు తమ జీవితాలను ఉద్దేశ్యపూర్వకంగానే త్యాగార్పణ చేశారు. వీరి చర్యల వలన సోషలిస్టు విప్లవకారుల పథకాలు దెబ్బతిన్నాయి. వారి పార్టీ నిర్మాణాన్ని ఎదగకుండా అడ్డుకొన్నాయి.

ఎర్నెస్టు యితర, నాయకులతో కలిసి, విప్లవ శక్తులను పునర్నిర్మించే కష్టమైన విస్తృత కర్తవ్యాన్ని నిర్వహించటానికి తిరిగి ఉపక్రమించాడు.

ఈ రకంగా ఈ ఎపిసోడ్‌లో "ఇనుప మడమ" ఏ రకంగా అధోజగత్ ప్రజలపై విరుచుకుపడి, అమానుషంగా వారిని తన తుపాకీ గుండ్లకు బలిచేసిందో, వారి తిరుగుబాటును ప్రారంభం కాకముందే ఎలా ప్రజలు ముఖాల మీద నడుచుకొంటూ వెళ్ళి, క్రూరంగా తన కాలి మడమతో నేలపై రాసి, చిధ్రిమివేసిందో జాక్ లండన్ వివరించారు.

తాము నేర్చుకొన్న గుణపాఠాల ఆధారంగా తిరిగి కార్మికవర్గం తలెత్తి వివేకంతో, క్రమశిక్షణతో ప్రవర్తించి నిరంకుశ ధనస్వామ్య వ్యవస్థను చాలాకాలం తర్వాతైనా క్రూలదోసి, సోషలిస్టు వ్యవస్థను స్థాపించి తీరుతుందనే విశ్వాసాన్ని ప్రకటించాడు.

తీవ్రవాద దుస్సాహసిక హింసా ధోరణులు విప్లవానికి హానికరమనీ, నిదానంగా కార్మిక విప్లవం శక్తులను పునస్సమీకరించి, సంఘటితపరిచి, కార్మికవర్గ విప్లవం నిర్వహించటం ద్వారా మాత్రమే విప్లవం విజయవంతమవుతుందని తేల్చి చెప్పాడు.

ఈ రకంగా యీ 'ఇనుప మడమ' నవల ద్వారా జాక్‌లండన్, పెట్టుబడిదారీ విధానం యొక్క స్వభావాలనూ, అత్యున్నతమయిన సామ్రాజ్యవాద దశకు అది పరిణామం చెందే దశలో పెట్టుబడిదారీ విధానం అవలంబించే దోపిడీ విధానాల స్వరూప, స్వభావాలను మార్క్సిస్టు పద్ధతిలో సక్రమంగా విశ్లేషించి, మౌలికమయిన అన్ని అంశాలన్నింటినీ సక్రమంగానే నిర్ధారించగలిగాడు. కార్మికవర్గ పోరాటాలు అనివార్యతనూ, కార్మికవర్గం రాజ్యాధికారాన్ని సాధించుకోలేదనీ, అందుకు దోపిడీ పెట్టుబడి విధానం అంగీకరించక, అడ్డుకొంటుందని, బలప్రయోగం ద్వారా మాత్రమే కార్మికవర్గం పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోయకలుగుతందని నిర్ద్వంద్వంగా తేల్చి చెప్పాడు. తన రాజ్యాధికారాన్ని నిలబెట్టుకోవటానికి బడా పెట్టుబడిదారీ వర్గం ఎంతకైనా తెగిస్తుందనీ, కుట్రలూ, మాయోపాయాలతోపాటు, ఫాసిస్టు నిర్బంధాన్ని పోరాడే ప్రజలపై ప్రయోగిస్తుందనీ అందుకు కూడా విప్లవకారులు సంసిద్ధంగా వుండాలని హెచ్చరించాడు. "బ్యాలట్ బాక్సు ద్వారా రాజ్యాధికారానికి", రాగలమనుకోవడం ఎంతటి భ్రమో నిరూపించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ వల్లించే "ప్రజాస్వామ్యం "రాజ్యాంగబద్ధపాలన" లాంటి నినాదాలు ఎంతటి బూటకమయినవో, ఎంతో ప్రతిభావంతంగా చిత్రీకరించారు.

ఈ రకంగా "ఇనుప మడమ" అనే జాక్ లండన్ యొక్క నవల, 100 ఏళ్ళ తర్వాత కూడా వర్గ చైతన్యాన్ని వర్గ అవగాహననూ, వర్గపోరాట ప్రేరణను చేకూర్చే ఒక సజీవ చైతన్య ప్రవాహంలా కార్మికులకు అందుబాటులో వున్న ఒక మంచి గ్రంథం అని చెప్పక తప్పదు. కార్మికవర్గం-దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోసే వరకూ ఈ "ఇనుప మడమ" ప్రపంచ కార్మిక లోకంలో స్ఫూర్తిదాయకంగా వెలుగొందుతుంది

ఇటీవలి కాలంలో ఈ నవలను అమెరికాలో పునర్ముద్రిస్తున్న సందర్భంగా కొందరు విమర్శకులు ఈ నవలను పొగడుతూనే, జాక్ లండన్ "అమెరికాలో మధ్యతరగతి వర్గం ధ్వంసం చేయబడుతుందని" రాబోయే పరిణామాల గురించి ఊహానిర్ధారణ చేశాడనీ, అది తప్పు అయిందనీ, అమెరికాలో మధ్యతరగతి వర్గం ధ్వంసం చేయపడకపోగా అది సుఖశాంతులతో వర్ధిలుతోందంటూ ఆయన నిర్ధారణలను తప్పు పట్టే దుస్సాహసానికి పూనుకొన్నారు. ఆయన నిర్ధారణలను మౌలికంగా తప్పు పట్టలేనివారు- సోషలిజం పట్ల తీవ్ర వ్యతిరేకతతో- యిటువంటి కువిమర్శలకు పాల్పడుతున్నారని చెప్పక తప్పదు.

నిజానికి అమెరికాలో నేడు మధ్యతరగతి వర్గంగా రూపొందినది నాడు కులీన వర్గంగా పెట్టుబడిదారీ వర్గం చేత మలచబడిన నిపుణులైన కార్మికులూ-బడా కార్మిక సంఘాల సభ్యులయిన వారూ, ఆనాటి మధ్యతరగతి వర్గం వల్లే నేడు స్వతంత్ర్యంగా వాణిజ్యాన్నీ, పరిశ్రమలనూ, ఉత్పత్తులనూ నిర్వహించే చిన్నపెట్టుబడిదారుల వర్గం లేదు. నేడు బడా కార్పోరేటు కంపెనీలకు, వాటిపై ఆధారపడి కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లుగా ఔట్‌సోర్సింగ్ పనులు చేసిపెట్టే, లేదా విడిభాగాలను తయారుచేసి యిచ్చే మధ్యతరగతి వర్గాలే వున్నాయి. ఈ రోజున ఆ వర్గాలు కుదించిన వాళ్ళేం సుఖంగా అన్ని స్వేచ్ఛా హక్కులతోనూ బ్రతకటల్లేదు. అమెరికన్ బడా గుత్తపెట్టుబడిదారీ కార్పోరేషన్ల ప్రయోజనాలకు హాని చేయని విరుద్ధంకాని వ్యాపకాలను, భావజాలాన్ని మాత్రమే అక్కడ అనుమతించటం జరుగుతుంది. సాధారణ పౌరుల వ్యక్తిగత ఏకాంతంపై కూడా నిఘావేసే ప్రస్తుత అమెరికన్ బడా పెట్టుబడిదారీ వర్గ నిరంకుశత్వ ప్రభుత్వపు "ఇనుప మడమ" 1908 నాడుకన్నా వేలరెట్లు బలోపేతమయి శ్రామిక ప్రజలపై దాడి చేసే స్థితిలో నేడుంది. అక్కడి పెట్టుబడిదారీ వ్యవస్థ తాను యిరుక్కుపోతున్న అనివార్య ఆర్థిక సంక్షోభం నుండి బయటపడటానికి ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లాంటి దేశాలపై దురాక్రమణ యుద్ధాలకు పాల్పడింది. తాము యిరుక్కొన్న ఆర్థిక సంక్షోభపు బారాన్నుండి తప్పించుకొని, సూపర్ లాభాలు ఆర్జించుకోవటానికి అమెరికన్ బడా కార్పోరేషన్లు తమ ఉత్పత్తులను చౌక కూలీ, తక్కువ సౌకర్యాలను శ్రమశక్తి లభించే దేశాలకు తరలించటం జరుగుతుంది. ప్రస్తుతం సబ్‌ప్రైమ్ సంక్షోభం పేరిట, బ్యాంకులు అప్పులు

(తరువాయి 15వ పేజీలో)

భవానీపురం దర్గా ప్లాట్‌దార్ల జీవితాలతో చెలగాటమాడుతున్న కృష్ణాజిల్లా కలెక్టర్

రెండున్నర దశాబ్దాల క్రితం రాష్ట్ర ప్రభుత్వ రాజపత్రం (గజెట్), ప్రభుత్వ అధికారిక జీఓలు, రిజిస్ట్రార్ ఆఫీస్‌లో పక్కా రిజిస్ట్రేషన్‌లు, అర్బన్ ల్యాండ్ సీలింగ్, పట్టణాభిసంస్థల పూర్తి అనుమతులు పొంది పక్కా ఇళ్ళు కట్టుకొని నివాసముంటున్న వందలాది పేద, మధ్యతరగతి కుటుంబాలు పెనుతుఫాను తాకిడికి అల్లకల్లోలం అయిన చందంగా తమ ఇళ్ళు తమవి కావు, పునాదులతో సహా పెళ్ళగించవేయబడ్తాయన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులతో భయకంపితులై జీవన్మరణ పోరాటానికి సన్నద్ధులయ్యారు.

ఈ విధంగా వందలాది కుటుంబాలు వీధిపాలు కావటానికి కారణం ఎవరో కాదు చట్టాన్ని కాపాడి ప్రజల హక్కులకు రక్షణ కల్పించాల్సిన జిల్లా కలెక్టరే సాక్షాత్తు బడా.రియల్ ఎస్టేట్ వర్గాల కొమ్ముకాసి చట్టాన్ని తారుమారు చేసిన ఉదంతం కృష్ణాజిల్లా విజయవాడ నగరంలో వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో కొట్టుమిట్టాడుతున్న 'న్యాయం' కోసం బాధితులు ప్రాణం ఉగ్గపట్టుకొని ఎదురుచూపులు చూస్తున్నారు.

ఉదంతం పూర్వాపరాలు:

విజయవాడ నగరంలోని హైదరాబాద్ హైవే రోడ్డు ప్రక్కనేగల భవానిపురంలోని ది హజరత్ గాలిబ్ షాహిద్ దర్గాను అభివృద్ధిచేసే నిమిత్తం సర్వే నెం.63లో గల ఎకరాలు 35.20 సెంట్ల భూమిని విక్రయించటానికి ప్రతిపాదించగా ది లక్ష్మీ శ్రీనివాస కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వారు ఎకరా రు.70,000 ల ధరకు కొనుగోలు చేయటానికి తమ ప్రతిపాదనను తెలిపారు. సదరు ప్రతిపాదనను స్టేట్ వక్ఫ్ బోర్డు గజెట్ నోటిఫికేషన్ (రాజపత్రం) ద్వారా ప్రకటించింది. దానిలో 30 దినముల లోపల సదరు భూమి విక్రయము విషయంలో అభ్యంతరములుగాని, సలహాలుగాని, మరి ఏ ఇతర ఆసక్తిగాని ఉన్న యెడల తెలుపవలసిందిగా. మరియు సదరు అమ్మకమును ప్రభుత్వము వారి ఖరారునామా పొందిన పిదప మాత్రమే జరుగునని యను 25-2-1982న రాష్ట్ర రాజపత్రము నందు మరియు 20-5-1982న కృష్ణాజిల్లా రాజపత్రము నందు ప్రకటించియున్నారు. మరోవైపు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఏర్పాటు చేసుకొన్న ది మహమ్మదీయ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వారు 12 ఎకరముల భూమిని అప్పటి మార్కెట్ ధరకు విక్రయించవలసిందిగా 3-03-82న కోరినారు. ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్‌బోర్డు వారు 19-8-82న సమావేశం జరిపి, సదరు రెండు సంస్థలు ప్రతిపాదించిన ఎకరము రు. 70.000ల ధరకంటే మార్కెట్ రేట్ లక్ష రూ.పైనే వుందని కావున ఈ ప్రతిపాదనలను ఆమోదించటం లేదని, లక్ష రూ.పైన ఆఫర్లు వచ్చిన పిదప నిర్ణయం తీసుకోవాలని బోర్డు సమావేశం ప్రకటించింది. దీని ప్రకారం 1982 అక్టోబర్‌లో వివిధ సొసైటీలతో పాటు ఈ రెండు సంస్థలు తమ ఆఫర్లను పబ్లిక్ బిడ్స్‌ద్వారా తెలియజేశారు. 23-10-82న జరిగిన వక్ఫ్‌బోర్డు మీటింగ్‌లో వచ్చిన ఆఫర్లను క్షుణ్ణముగా పరిశీలించి మొత్తం ఆఫర్లలో 'ది మహమ్మదీయ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ' వారు వేసిన ఎకరం ధర రూ.1.28 లక్షలకు మొదటి ఆఫర్ గాను, 'ది లక్ష్మీ శ్రీనివాస కో ఆపరేటివ్ సొసైటీ వారి ధర రు.1.26 లక్షలుగా రెండవ ఆఫర్‌గా వచ్చింది. దీనిపై మొదటి ఆఫర్ ఇచ్చిన వారికి సదరు స్థలం (ఎ.35.20 సెంట్లు)ను విక్రయించుటకు ఖరారు నామా ఇవ్వవలసిందిగా వక్ఫ్‌బోర్డువారు ప్రభుత్వాన్ని కోరారు. దీని ప్రకారం రాష్ట్రప్రభుత్వం 4-05-83న జీ.ఓ.యం. యస్ నెం.773ను విడుదల చేసి మహమ్మదీయ కో ఆపరేటివ్ సొసైటీకి ఖరారు నామా అనుమతి ఇచ్చారు. ఈ విక్రయ నిర్ణయాన్ని 26-05-83న వెలువరించిన రాజపత్రంలో ఫైనల్ నోటిఫికేషన్‌గా ప్రకటించారు. దీనితో సదరు భూమి విక్రయ కార్యక్రమం ముగిసిపోయింది. మహమ్మదీయ సొసైటీవారు వక్ఫ్‌బోర్డు మరియు విజయవాడలోని దర్గా ముజావర్ల సమక్షంలో సదరు భూమికి రు.45,06,000 మొత్తాన్ని చెల్లించగా రిజిస్టర్ చేసి విక్రయించి ధఖలు పరిచారు. తర్వాత రాష్ట్రప్రభుత్వం 5-3-84న జీ.ఓ.యం.యస్ నెం.250 రెవెన్యూ అర్బన్ ల్యాండ్ సీలింగ్ ప్రకారం సదరు భూములను 5-09-85లోపు సొసైటీ సభ్యులకు ప్లాట్లు రిజిస్టరుచేసి ధఖలు పరచాలని లేని యెడల అర్బన్ ల్యాండ్ సీలింగ్ పర్మిషన్ రద్దుపరచబడునని ఆదేశించినది. సదరు ఉత్తర్వుల ప్రకారం సొసైటీ సభ్యులకు రిజిస్టర్ చేసే కార్యక్రమం పూర్తిచేశారు. ప్లాట్‌దారు వారి వారి తాహతుకు తగినట్లుగా ఉడా వారి లే అవుట్ పొంది, ఇండ్లు నిర్మించుకొని గత రెండు దశాబ్దములపైగా నివాసం ఉంటున్నారు.

కథను అడ్డంగా త్రిప్పి నడిపించిన శక్తులెవరు?

ఇంత పకడ్బందీగా మహమ్మదీయ కోఆపరేటివ్ సొసైటీ వారికి హజరత్ గాలిబ్ షాహిద్ దర్గాకు చెందిన ఎ.35.20 సెంట్ల భూమి విక్రయం జరగటం, ఇందులోని ప్లాట్‌దార్లకు అధికారయుతంగా రిజిస్టర్ తదితర కార్యక్రమాలు జరిగి నాలుగువందల పైగా కుటుంబాలు ప్రశాంత జీవనం గడుపుతూ వుండగా, సదరు ఎ.35.20 సెంట్ల భూమిని ఎకరా రు.70,000 చొ॥న లక్ష్మీ శ్రీనివాస సొసైటీవారికి విక్రయించవలసిందిగా, ఇప్పటివరకు రిజిస్టర్ చేయించుకొన్నా ప్లాట్‌దార్లు అందరినీ ఖాళీ చేయించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేయటంతో ప్లాట్‌దార్లు ఒక్కసారిగా అగాధంలోకి నెట్టబడ్డారు. ఎకరం రు.70,000ల చొ॥న లక్ష్మీ శ్రీనివాసా సొసైటీకి వక్ఫ్‌బోర్డు అమ్మినట్లుగా అనుమతి పత్రం మరియు ఎగ్రిమెంట్ సృష్టించి హైకోర్టు స్థాయిలో 1984 నుండి లక్ష్మీ శ్రీనివాసా సొసైటీ వ్యాజ్యము నడుపుతున్న విషయం, 2006 జనవరిలో హైకోర్టు ఉత్తర్వులు వెలువడే వరకు మహమ్మదీయ కో ఆపరేటివ్ సొసైటీ వారికి ఏమాత్రం తెలియదని ప్రకటించుకొన్నారు. రెండు దశాబ్దాలకు పైగా అధికారయుతంగా జరిగిన రికార్డు మొత్తాన్ని తారుమారుచేసి ఎకరం రు.70,000 చొ॥న వక్ఫ్‌బోర్డు నుంచి సదరు రు.35.20 సెంట్ల భూమిని పొందినట్లు రికార్డులు సృష్టించారు. ఈ భూమికోసం లక్ష్మీ శ్రీనివాసా సొసైటీ రు.4 లక్షల ఎర్నెస్టు మనీని హజరత్‌గాలిబ్ షహీద్ దర్గాకు చెందిన ముజావర్ అసోసియేషన్‌కు చెల్లించినట్లుగా రికార్డులు సృష్టించారు. ఈ వ్యవహారంపై ఎపి వక్ఫ్‌బోర్డు ఇన్‌ఛార్జి సెక్రటరీ పూర్తిస్థాయిలో విచారణ జరిపి 24-08-1983న అధికార పూర్వక లెటర్ విడుదల చేశారు. దానిలో లక్ష్మీ శ్రీనివాస సొసైటీ రు.4లక్షలు ఎర్నెస్టు మనీగా చెల్లించటం, ఎపి వక్ఫ్‌బోర్డు ముజావర్ అసోసియేషన్‌కు అమ్ముకొనే అధికారం ఇవ్వటం మొదలగు విషయాలన్నీ తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి చేశారనీ, మహమ్మదీయ కో ఆపరేటివ్ సొసైటీకి భూములు దక్కకుండా చేయటానికే ఇవన్నీ చేశారని స్పష్టంగా ప్రకటించారు.

ఈ విధంగా తప్పుడు రికార్డులు సృష్టించటం శ్రీనివాస కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులుగా ఉన్నా కొక్కు సుబ్బారావు ఒక్కడే చేయగలిగాడంటే నమ్మే 'అమాయకులు' ఎవరూ వుండరు. ఇతని వెనకాల పెద్ద రాజకీయ-రియల్టర్ మాఫియా శక్తుల 'హస్తాలు' వున్నాయన్నది జనమెరిగిన సత్యంగా రాజిల్లుతూనే వుంది కొక్కు సుబ్బారావు అండ్ కంపెనీ చరిత్ర తెలిసిన ఎవరికైనా దర్గా భూముల కుంభకోణం ఏమాత్రం కొత్త విషయంగా వుండదు. ఈ ముఠా ఎక్కువగా నున్న గ్రామ ప్రాంతంతోపాటు విద్యాధరపురం, కుందావారి కండ్రిక, గుడివాడ తదితర ప్రాంతాల్లో ఈనాటికీ అనేక భూ కుంభకోణ వివాదాలలో మునిగి తేలుతూనే వుంది. ఇప్పుడు దర్గా భూములు నేషనల్ హైవే ప్రక్కన వుండటంతో వాటి ధరలు నానాటికీ పెరిగిపోతూ బంగారం గనుల్లా తయారు కావటంతో ఆ భూములపై కొక్కు సుబ్బారావు ముఠా గ్రద్దలా వాలి తన్నుకు పోవాలని శతసహస్ర మాఫియా పన్నాగాలు పన్నుతున్నాయి. ఈ పన్నాగాల వలలో ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసే 'శక్తి'గాక జిల్లా కలెక్టర్‌ను కూడా వలలో వేసుకొనే 'శక్తిమాన్' లుగా ఎదిగారు.. అంతిమంగా కృష్ణా జిల్లా కలెక్టర్ నవీన్ మిట్టల్ (మార్చి 8, 08లో బదిలీ అయ్యాడు)ను రబ్బర్ స్టాంప్‌గా మార్చగల్గారు.

కంచే చేనుమేసిన చందంగా మారిన కలెక్టర్ నవీన్ మిట్టల్

ప్రజల హక్కులను హరించి వేస్తుంటే పరిరక్షించాల్సిన కృష్ణా జిల్లా కలెక్టర్ నవీన్‌మిట్టల్ భవానీపురం దర్గా ఇళ్ళ యజమానులు, ప్లాట్‌దార్ల జీవితాలపట్ల పెనుభూతంగా మారిపోయాడు. రెండు దశాబ్దాలపైగా దర్గా భూములకు సంబంధించిన ఎ.35.20 సెంట్ల భూమిలో నివశిస్తున్న ప్రజలకు సంబంధించిన పక్కా ఇళ్ళు, ప్లాట్లు తమవి కావు, వాటిని ఖాళీచేయాలని వచ్చిన హైకోర్టు తీర్పు అశనిపాతంలా పరిణమించింది. అయితే ప్లాట్‌దార్లు వెంటనే తేరుకొని మహమ్మదీయ సొసైటీ నాయకత్వాన హైకోర్టునుండి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం ప్రారంభించారు. సుప్రీంకోర్టులో వాజ్యము జరుగుతున్న స్థితిలో, మహమ్మదీయ సొసైటీ ప్లాట్‌దార్లు అన్ని ప్రభుత్వ ఉత్తర్వులు తమ న్యాయపోరాటాన్ని అన్ని విధాలా బలపరుస్తాయన్న ఆత్మవిశ్వాసంతో వున్న స్థితిలో కృష్ణాజిల్లా కలెక్టర్ నవీన్ మిట్టల్ సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున 7-01-08న కౌంటర్ పిటీషన్ ఫైల్ చేశారు.

కలెక్టర్ ఫైల్‌చేసిన పిటీషన్‌లో 1982 ఆగస్టులో ఎకరం రు70,000 చొప్పున 2-8-82న విక్రయ అగ్రిమెంట్ పొందిన లక్ష్మీ శ్రీనివాస సొసైటీకి 1982లోనే స్వాధీనం చేయబడినదని, అధికారయుతంగా అన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిగిన అన్ని జీఓలను అక్రమంగా పొందిన ఆర్డర్లుగా పేర్కొనడమేగాక, ప్రభుత్వ అధికారులను, వక్ఫ్‌బోర్డు వారిని ఉద్దేశపూరితంగా తప్పుదోవ పట్టించి, ప్రలోభపరచి మహమ్మదీయ సొసైటీవారు దర్గా భూములు ఎ.35.20 సెంట్లను అక్రమంగా పొందారని పేర్కొన్నారు. లక్ష్మీ శ్రీనివాస సొసైటీ అధ్యక్షుడు కొక్కు సుబ్బారావు వెనకాల వున్న రాజకీయ, రియల్టర్ మాఫియా శక్తుల 'అధికారం' ముందు తాను పనిచేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం విడుదలచేసిన రాజపత్రాలను, జీవోలను కూడా 'మహమ్మదీయ సొసైటీ' వారు 'ప్రలోభపెట్టి' చేయించుకున్నారని ఒక జిల్లా కలెక్టర్ చేత సుప్రీంకోర్టు ముందు పిటీషన్‌లో చెప్పించగల్గారు. కలెక్టర్ చేపట్టిన ఈ చర్య దర్గా భూముల ఇళ్ళ, ప్లాట్‌దార్లకు నమ్మశక్యంగాని చర్యగా తోచవచ్చు. అయితే ఈ చర్య యావత్ సమాజాన్ని, సభ్య పౌరులను తీవ్ర ఆందోళనకు గురిచేసే పరిణామంగా ముందుకొచ్చి అనేక ప్రశ్నలను సంధింపచేసేదిగా మారింది.

కంచె చేను మేయడాన్ని ఎలుగెత్తి చాటుతున్న బాధితులు

కృష్ణాజిల్లా కలెక్టర్ సుప్రీంకోర్టులో బడా రియల్టర్ల తరపున ఎప్పుడైతే కౌంటర్ పిటీషన్ వేశారో, ఈ చర్యపై హతాశులైన బాధితులు వెంటనే తేరుకొని 'మహమ్మదీయ సొసైటీ' నాయకత్వాన న్యాయపోరాటం ప్రారంభించారు. తొలుత 11-02-08న విజయవాడ సబ్‌కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమంతో ఆందోళన ప్రారంభించటంతో బయటి ప్రపంచానికి దర్గా భూముల కుంభకోణానికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. సబ్‌కలెక్టర్ ఆఫీస్‌వద్ద ధర్నా కొనసాగింపుగా భవానీపురం దర్గా సెంటర్‌లో నిరవధిక రిలే నిరాహార దీక్షల కార్యక్రమాన్ని చేపట్టారు. నిరవధిక ఆందోళన కొనసాగుతూ వుండటంతో సబ్‌కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ దర్గా భూములకు సంబంధించిన మొత్తం రికార్డును పరిశీలించక తప్పలేదు. కలెక్టరే అసలైన దోషి కావడంతో బాధితుల ముందు అసహనం ప్రకటించటం అంతిమంగా ముఖం చాటేసి అంతా సబ్‌కలెక్టర్ మీదకు నెట్టేశాడు. తర్వాత మార్చి నెల చివరలో బదిలీపై వెళ్ళిపోయాడు.

సుప్రీంకోర్టులో ఫిబ్రవరి 25న తీర్పు వెలువడుతుంది అనుకొన్నది వాయిదా పడింది. కావున ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభించిన ఆందోళనను మార్చి 8వ తేదీన ముగించి న్యాయపోరాటం సాగిస్తున్నారు. మార్చి 27వ తేదీన సుప్రీంకోర్టు విచారణను ముగించింది. సుప్రీంకోర్టు తీర్పుకోసం బాధితులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 2005లో క్రింది కోర్టులో తీర్పు వ్యతిరేకంగా రావటంతో దీన్ని ఆసరాచేసుకుని మహమ్మదీయ సొసైటీకి చెందిన ఎ.35.20 సెంట్లలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగనీయకుండా విజయవాడ కార్పోరేషన్ అధికారులు గుడ్డిగా అడ్డుపడ్తున్నారు. న్యాయమైన హక్కులకోసం బాధితులు సాగించిన దీర్ఘకాలిక ఆందోళనకు కృష్ణాజిల్లా ఓపిడిఆర్ సంఘీభావం ప్రకటించటమేకాక వాస్తవ సేకరణ కమిటీవేసి బాధితులు సాగిస్తున్న న్యాయపోరాటానికి తగిన మద్దతు నందించింది. విజయవాడ నగరంలోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు తమ సంఘీభావాన్ని ప్రకటించాయి.

తాము చేసిన చట్టాలనే కాదని ప్రజల ప్రాథమిక హక్కులను హరించివేయటానికి కూడా వెనుకాడకుండా బడా ధనాఢ్య వర్గాల, పెత్తందారీశక్తుల ప్రయోజనాలను కాపాడుతున్న బ్యూరాక్రాటిక్ అధికారశక్తులపై పోరాటం మరింత సంఘటితంగా సాగించాలి.

- ముప్పాళ్ళ భార్గవశ్రీ

జాక్ లండన్.... (14వ పేజీ తరువాయి)

వాయిదాలు చెల్లించని వారి యిళ్ళను జప్తు చేయటం, ఉద్యోగాల్లో కోత విధించటం, వేతనాల కోత విధించటం, ఒకనాడు నిష్ణాతులైన కార్మికుల-ఉద్యోగుల పెన్షన్ సౌకర్యాలను కుదించి కోతపెట్టడం, పెన్షన్ పథకాలను సంస్కరించి పెన్షన్ సదుపాయాలను కుదించటం, హెల్తు-యిన్సూరెన్సు భారాన్ని తగ్గించుకొని కార్మికుల ఆరోగ్య సదుపాయాలకు ఎగనామం పెట్టడం లాంటి చర్యల ద్వారా మధ్యతరగతిగా వున్న కులీన కార్మికులపై సంక్షోభ భారాన్ని నెట్టడం, యితర దేశాల నుండి వచ్చే అసంఖ్యాకమయిన వలస కూలీల శ్రమశక్తినీ దోపిడీ చేసుకొంటూ, వారిని హీనాతిహీనంగా చూడటం, 9/11 ఘటనలను ఆధారం చేసుకొని ప్రెసిడెన్షియల్ ఆర్డరు రూపంలో పౌరుల హక్కులన్నిటినీ రద్దు చేసే చట్టాలను సంసిద్ధం చేసుకొని వుండటం, తీవ్రవాదాన్ని (టెర్రరిజం) అణిచివేసే పేరిట, అంతరంగిక దేశ భద్రత పేరిట దేశ పౌరులను ఏ క్షణాన్నైనా నిర్బంధించటానికి అవకాశాలు కల్పించుకోవటం లాంటి అనేక మధ్యతరగతి వ్యతిరేక, కార్మికవర్గ వ్యతిరేక అమెరికన్ బడా పెట్టుబడిదారీ నిరంకుశ పాలనా వ్యవస్థ నేడు మరింత భీకరమైన "ఇనుప మడమ"గా రూపొందింది.

ఈ అమనుష అమెరికన్ బడా పెట్టుబడిదారీ వర్గ నిరంకుశ వ్యవస్థను జాక్‌లండన్ ఎన్నడో చెప్పినట్టు కార్మికవర్గ రక్తపాత విప్లవం ద్వారా తప్ప రాజ్యాధికారం నుండి కూలద్రోయటానికి మరో ప్రత్యామ్నాయ మార్గమేమీ లేదు. అలాగే ఈ దుష్ట బడాపెట్టుబడిదారీ నిరంకుశ వ్యవస్థకు అసలైన ప్రత్యామ్నాయం సోషలిజమే! ఉదారవాద ఆర్థికవేత్తలచే ఎన్నిసార్లు, ఎన్ని రూపాల్లో "పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదు" అంటూ వల్లించేసినా, తనకనుసన్నలలోని మీడియాతో ప్రచారం కావింపచేసినా, చర్చి సాయంతో కమ్యూనిష్టు వ్యతిరేక భావజాలం వ్యాపింపచేసినా, జాక్‌లండన్ 1908లోనే తన విశ్వాసాన్ని ప్రకటించినట్టు, నేడో రేపో కార్మికవర్గ విప్లవం ద్వారా అక్కడి నిరంకుశపెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చటమన్నదే తథ్యం! అటువంటి కార్మిక విప్లవం-వర్గపోరాటం ఉద్భవించటానికి అవసరమయిన భౌతిక పరిస్థితులు ఈ రోజున అమెరికాలో మస్తుగా వున్నాయి.

ఈ నేపధ్యంలో చూసినపుడు అటు అమెరికా దేశంలోనూ, యిటు ప్రపంచంలోని వివిధ దేశాల్లోనూ కార్మికవర్గాన్ని తమ చారిత్రక కర్తవ్యం వైపుకు ప్రేరేపించటంలో జాక్‌లండన్ యొక్క ఈ "ఇనుప మడమ" మహత్తరంగా దోహదపడుతుందనన్నది నిస్సందేహం.

కార్మికవర్గ శ్రేయోభిలాషులకూ, వర్గ ఉద్యమ-పోరాటాభిలాషులకూ, భారత విప్లవోద్యమ నిర్మాణానికి పూనుకొంటున్న శక్తులకూ స్ఫూర్తిదాయకంగా వుంటుంది ఈ "ఇనుప మడమ". ◈

మార్క్సీయ నాస్తికోద్యమకారుడు బి.రామకృష్ణ ప్రథమ వర్ధంతి

దేశీయ భౌతికవాద సంస్కృతి పునాదిగా మార్క్సిస్టు గతితార్కిక భౌతికవాదాన్ని ప్రజలలో ప్రచారం చేస్తూ ప్రత్యామ్నాయ భౌతికవాద సంస్కృతి నిర్మాణానికి అహర్నిశలూ కృషిచేసిన బి.రామకృష్ణ మొదట వర్ధంతి కార్యక్రమాలు గుంటూరుజిల్లా మంగళగిరి సమీపంలోని నిడమర్రు చార్వాకాశ్రమంలోనూ, మంగళగిరిలోనూ ఏప్రిల్ 18న ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమ నిర్వహణకై ఏర్పడిన ఆహ్వాన సంఘ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు చార్వాకాశ్రమంలో రామకృష్ణ నిలువెత్తు విగ్రహాన్ని వారి సహచారిణి గృహలక్ష్మి ఆవిష్కరించారు. మన మధ్యకు నడచి వస్తున్నాడా అనే భ్రమ కల్గించేంత సజీవంగా ఈ విగ్రహాన్ని, రామకృష్ణ శిష్యుడు, స్నేహితుడు నందలాల్ రూపొందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముందుగా కత్తి పద్మారావు మాట్లాడుతూ రామకృష్ణతో ఏర్పడిన సాన్నిహిత్యాన్ని తనకు వివాహం చేసిన విషయాన్నీ చెబుతూ రామకృష్ణ జీవితంలో ఎక్కడా రాజీపడలేదన్నారు. ఆయన జీవితంలోని అనేక కోణాలను పద్మారావు వివరించారు. ఆ తర్వాత కొత్తపల్లి రవిబాబు (జనసాహితి) మాట్లాడుతూ రామకృష్ణ ఎక్కడా రాజీపడలేదనీ, రాజీపడ్డవారిని, కత్తి పద్మారావుతో సహా ఏమాత్రం క్షమించలేదనీ, వారి నిజాయితీ ఆదర్శప్రాయమైనదని ఉన్నారు. మహనీయుల విగ్రహాలు, ఫోటోలు మనం తప్పుదోవపడుతున్నప్పుడు హెచ్చరించడానికి ఉపయోగపడతాయి" అన్నారు. కె.అయ్యన్న, కె.సత్యనారాయణ మొదలగు వారు మాట్లాడారు. వివిధ దూరప్రాంతాలనుండి హేతువాదులు, చార్వాకులు, నాస్తికులు, భౌతికవాదులు పెద్దఎత్తున హాజరైన ఈ కార్యక్రమం ఆద్యంతమూ నినాదాలతో, జనం పాటలతో సాగింది.

అదేరోజు సాయంత్రం మంగళగిరి పట్టణంలో అంబేద్కర్ విగ్రహంవద్ద ఏర్పాటు చేసిన వర్ధంతి సభకు వై.కె.స్వాగతం పలికారు. నాస్తిక సమాజం నాయకుడు కె.అయ్యన్న అధ్యక్షత వహించిన సభలో కొత్తపల్లి రవిబాబు(జనసాహితి), జి.కళ్యాణరావు(విరసం) కత్తి పద్మారావు (దళిత మహాసభ), పెనుగొండ లక్ష్మీనారాయణ (అరసం), బి.ఎమ్.లీలాకుమారి(దళిత స్త్రీ సాహిత్య పరిషత్తు), ఎన్.ఎస్.సి. బోసు(ఏపిసిఎల్‌సి), జె.వి. రాఘవులు (సిపియం), మాచర్ల మోహనరావు తదితరులు ప్రసంగించారు. ప్రజాకళా మండలి గాయకులు, ప్రజాకళాకారులు, వికాసగాయకులు పాటలు పాడారు.

Janasakti (Communist Revolutionaries'Fortnightly) Printed Matter Book-Post RNI No.8315/63 H/VJ-077/2007-09

గిరిజన-రైతుకూలీ భూపోరాట ఉద్యమాలను ముందుకు తీసుకుపోదాం!

అవకాశవాద-విద్రోహుల కుట్రలను భగ్నం చేద్దాం!!

కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి వర్ధంతి సభలో వక్తల ఉద్ఘాటన


గిరిజన రైతాంగ పోరాట యోధుడు, అతివాద-మితవాదాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం జరిగిన విప్లవ కమ్యూనిస్టు యోధుడు, పీడిత ప్రజల ముద్దుబిడ్డ, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు, అమరుడు కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి 7వ వర్ధంతి సభ 24-4-08న సాలూరు సీతారామ కళ్యాణ మండపంలో ఉదయం 11.30 గం॥లనుండి సాయంత్రం 5 గం॥ల వరకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యములో జరిగింది. విజయనగరం జిల్లా నలు మూలలనుండి, ఏజన్సీ ప్రాంతాలనుండి 2 వేల మంది ప్రజలు హాజరై నివాళులు అర్పించిన ఈ సభకు కా॥ఊయక ముత్యాలు (గిరిజన-గిరిజనేతర పేదల నాయకుడు) అధ్యక్షత వహించారు.

ఈ సందర్భముగా కామ్రేడ్ ముత్యాలు మాట్లాడుతూ విజయనగరంజిల్లా గిరిజన, రైతుకూలీ ఉద్యమ నిర్మాణంలోను, ఆ సందర్భంగా ఉద్యమ ప్రజలపై భూస్వాములు, పాలకవర్గాలు, వారి పోలీసు యంత్రాంగం సాగించిన నిర్బంధాన్ని ఎదుర్కొనటంలో కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి గొప్ప నాయకత్వ పాత్రను నిర్వహించారని పేర్కొన్నారు. ప్రజల బాషలో సామాన్యులకు సైతం రాజకీయాలు అర్థమయ్యేలా చెప్పి, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టారని, ప్రజలను పోరాటాలకు సమాయత్తం చేసేవారని చెప్పారు.

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షురాలు, ఉత్తరాంధ్ర గిరిజన - గిరిజనేతర ప్రజల ఉద్యమ మార్గదర్శి కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ విజయనగరం జిల్లా గిరిజన, రైతుకూలీ ఉద్యమానికి కా॥ఎమ్మేస్‌కు విడదీయరాని సంబంధం ఉందని అన్నారు. 24 సంవత్సరాల క్రితం భోపాల్‌లో విషవాయువు లీక్ అయిన సందర్భముగాను, పంజాబ్‌లో సిక్కుల ఊచకోత సందర్భముగాను సాలూరు ప్రాంతంలో అనేక బహిరంగసభలు నిర్వహించి పాలకవర్గాల దుర్మార్గాలను ఎండగట్టి ప్రజలను అప్రమత్తం చేశారని చెప్పారు. 1992 మే 29వ తేదీన పార్వతీపురంలో జరిగిన బహిరంగ సభలో వేలాది మంది గిరిజనుల నుద్దేశించి మాట్లాడారు. ఈ సభలో ఆనాడు పీపుల్స్‌వార్‌పై పెట్టిన నిషేధాన్ని ఖండించారు. 1992లో చోర గ్రామంపై పోలీసులు దాడిచేసి ప్రజలను నిర్బంధించి కాల్పులు జరిపినప్పుడు అమరుడు కా॥ఎన్.వి.క్రిష్ణయ్యతో కలిసి కా॥మండ్ల సుబ్బారెడ్డి ప్రజల తరఫున పోరాడి అండదండలు అందించారని చెప్పారు. తన 77 సంవత్సరాల జీవితంలో 61 సంవత్సరాల రాజకీయ జీవితం కలిగి ఉండి ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచారని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని, దళ కమాండర్‌గా ఉండి అనేక సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపారని అన్నారు. 1970లో ఆనాటి హెూంమంత్రి వెంకళరావు తనపై బనాయించిన కుట్రకేసు విచారణ సందర్భముగా, కుట్ర కేసు తనపై గాదని, పాలకులపై బనాయించాలని, వెంకళరావు శిక్షించాలని ప్రకటించి దోపిడీ పాలకుల విధానాలను తూర్పార బట్టారు. తన రాజకీయ జీవితం యావత్తు పాలకవర్గాల కుట్రలను ఎండగట్టటంలోను భూసంస్కరణల భూటకత్వాన్ని బట్టబయలు చేస్తూ 1/70 చట్టాన్ని ఖచ్చితంగా అమలు జరపాలని పోరాడుతూ, గిరిజన-రైతుకూలీ ఉద్యమం నిర్మించటంలో అలుపెరగని కృషి చేశారని చెప్పారు. సాగు-త్రాగు నీరు సమస్య భూ సంస్కరణలతో ముడిపడి ఉందని చెప్పి అనేక భూ ఉద్యమాలకు నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఆ కృషిలో భాగంగా పాలకవర్గాలు పెట్టిన 'రాజద్రోహం' కేసు విచారణకు హాజరై, తన వాదనను వినిపించటానికి వచ్చి, ఉద్యమ కర్తవ్యంలో తలమునకలై అమరులయ్యారని చెప్పారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారి మంత్రులు, ఎంఎల్ఏలు కోట్లాది రూపాయల ధనం, భూములు, సంపద ప్రోగు చేసుకుంటున్నారని, ప్రజలకు కష్టాలు, కన్నీళ్ళు మిగిల్చారని, పాలకులకు వ్యతిరేకంగా, పేదలకు భూమి దక్కేలా భూపోరాటం సాగించటమే కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డికి మనం యిచ్చే ఘనమైన నివాళి అంటూ తన ఉద్వేగపూరిత ఉపన్యాసాన్ని ముగించారు.

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జె.కిషోర్‌బాబు మాట్లాడుతూ గిరిజనులకు విద్య, వైద్యం అందచేయడంలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైఫల్యం చెందిన పాలకులు, గిరిజనులను మనుష్యులుగా చూడనిరాకరిస్తున్నారని, గిరిజనులు చైతన్యం కావటం పాలకులకు బెంబేలు కలుగుతుందని చెప్పారు. అందుకే దేశవ్యాపితంగా 5 వందల కోట్లతో గిరిజన ప్రాంతాల్లో ఎలిపాడ్‌లు నిర్మించి, సైన్యం, పోలీసులతో గిరిజన గ్రామాలను దిగ్బంధనంచేసి, భయానక వాతావరణం సృష్టించి, గిరిజనుల భూ పోరాటాలను అణచివేసేందుకు సిద్ధమౌతున్నారని పేర్కొన్నారు. రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా, వారు ఆత్మహత్యలకు పాల్పడే విధంగా పాలన చేస్తున్న పాలకులు నేడు 120 రూ.లకే బియ్యం, నూనె, పప్పులు తదితర నిత్య జీవితావసర వస్తువులు ఇస్తామని మాట్లాడటం ప్రజలను మభ్య పెట్టటమేనని ధరలను అదుపు చేయలేని పాలకులు, వ్యాపారులకు అనుగుణంగా పాలన చేస్తున్నారని చెప్పి ముగించారు.





అనంతరం ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య (ఏపిఎఫ్‌టియు) రాష్ట్ర అధ్యక్షులు కా॥సి. పెద్దన్న మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చెరనుండి భరతమాతను విముక్తి చేసేందుకు జరిగిన జాతీయ ఉద్యమ పోరాటంలో కా॥సుబ్బారెడ్డి చిన్న వయస్సులోనే పాల్గొన్నారని, నాటి నుండి నేటి నల్లదొరల దోపిడీ పాలనను అంతంచేసే పోరాటాలలో చివరి శ్వాస ఆగిపోయేవరకు అలుపెరగని పోరాటం చేసిన యోధుడని అన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజల భూములకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆనాటి ఎన్.టి.రామారావు ప్రభుత్వం మెడలు వంచి సాధించారని, ఇలా సాధించుకోవటం రాష్ట్ర చరిత్రలో మొదటి సారని చెప్పారు. రాయలసీమ ప్రాంతంలో కరువు సమస్యలపై, సాగు-త్రాగు నీటికోసం 1985లో జరిగిన పాదయాత్రలో నేటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, కా॥ఎమ్మేస్‌లు నాయకత్వం వహించారని ఈ యాత్రలో కా॥సుబ్బారెడ్డి అందరికి ఆదర్శప్రాయంగా నిలిచారని చెప్పారు. భూస్వాముల మిగులు భూములు, బంజరు తదితర భూముల స్వాధీనానికి సాగిన అనేక పోరాటాల్లో వేలాది మంది ప్రజలను కదిలించి, ప్రజలు సాధించుకొనే విధంగా వారిని సిద్ధంచేశారని చెప్పారు. కామ్రేడ్ సుబ్బారెడ్డి పేరును జపిస్తూ క్రిష్ణమూర్తి, ప్రకాష్‌లు ఆయన ఆశయానికి ద్రోహంచేస్తూ రైతుకూలీ ఉద్యమ ద్రోహులుగా మారారని, ఇలాంటి వారిని ప్రజలు తరిమికొట్టాలని చెప్పి ముగించారు. రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥కె.కోటయ్య, తన ఉపన్యాసంలో పచ్చని గిరిజన గ్రామాలనుండి, గిరిజనులను ఖాళీ చేయించి గనులు ఇతర అటవీ సంపదను దోపిడీ వర్గాలకు కట్టబెట్టేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలను త్రిప్పికొట్టాలని చెప్పారు. తమ భూములకోసం, సంపదకోసం పోరాడుతున్న గిరిజనులపై తీవ్ర నిర్బంధకాండ అమలు చేస్తున్నారని, దీన్ని గిరిజన ప్రజలు సంఘటితంగా త్రిప్పికొట్టాలని పిలుపు యిచ్చారు.

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) విజయనగరంజిల్లా కార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ స్నేక్ పార్కుల పేరుతో మక్కువ మండలంలోని గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రయత్నిస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లోని వేలాది ఎకరాల భూములు, భూస్వాముల అన్యాక్రాంతంలో ఉన్నాయని వాటి స్వాధీనానికి రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఉద్యమం చేపడుతుందని చెప్పారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)పేరు చెప్పుకొని క్రిష్ణమూర్తి, ప్రకాష్‌లు ఆ ఉద్యమ విచ్ఛిన్నకులుగా, ద్రోహులుగా మారి చేసే కుట్రలను, కుతంత్రాలను త్రిప్పికొట్టి గిరిజన, రైతుకూలీ పోరాటాలను ముందుకు తీసుకెల్దామని ఇదే కా॥మండ్ల సుబ్బారెడ్డికి మనం ఇచ్చే నివాళులని చెప్పి ముగించారు.

సభలో ఇంకా గిరిజన, గిరిజనేతర పేదల నాయకులు కామ్రేడ్ ఇండ్ల రామిరెడ్డి, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ గణేష్‌పాండా, విజయనగరం జిల్లా రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) అధ్యక్షులు కా॥గంటా ఎరుకనాయుడు, శ్రీకాకుళం జిల్లా నాయకులు కా॥టి.అరుణ, సి.పి.ఐ(యం.యల్) విజయనగరం జిల్లా నాయకులు కా॥బి.శంకరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అనంతరం శ్రీకాకుళం గిరిజనోద్యమాన్ని వివరించే 'పోరుదారి' అనే నృత్య నాటికను గిరిజనులు అద్భుతంగా ప్రదర్శించారు. 'పోరాట' నేపధ్యాన్ని, గిరిజన ప్రజలపై సాగిన దోపిడీని, గిరిజన చైతన్యక్రమాన్ని, ఉద్యమ ఆవశ్యకతను, ప్రజలు పోరాడిన తీరును, కోరన్న-మంగన్నల అమరత్వాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించారు.

సభ అనంతరం సాయంత్రం 5 గం॥లకు సాంప్రదాయ కిందిరి నృత్యాలతో పాటలతో కళాకారులు కదంతొక్కగా రెపరెపలాడే ఎర్రజెండాలు చేపట్టిన రెండువేలకు పైగా పాల్గొన్న ఉద్వేగభరిత ఊరేగింపు పురవీధులన్నీ ఎరుపు రంగు సంతరించుకొని సాలూరు పట్టణ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకొంది.

ఈ సభకి ముందు 5వేల కరపత్రాలు, 15వందల పోస్టర్లు ద్వారా విస్తృత ప్రచారం చేశారు. మక్కువ, సాలూరు, పాచిపెంట, కొమరాడ, పార్వతీపురం, కురుపాం, సీతానగరం, బొబ్బిలి, జియమ్మవలస మండలాలలోని 150 గ్రామాలనుండి సభకి 2 వేల మంది ప్రజలు హాజరయ్యారు. ◈

ఏం చెయ్యాలి?

\- ఉమాకాంత్

ఇవేళ తనని నేను ఎక్కడ చూశానో
సరిగ్గా ఈ క్షణంలో కూడా
అక్కడే వుండాలి లెనిన్
ఫ్యాక్టరీల్లో వేడెక్కిన ఇనుం మీద
బలిష్టమైన చేతులతో లెనిన్ బలంగా దెబ్బవేయడమో
నాగలి మేడికి ఆయన కట్టిన ఎర్రని జెండా
భూస్వాముల భూముల్ని దున్నేస్తుండేవేళో
అప్పటిదాకా అతినెమ్మదిగా తిరిగే గడియారం ముల్లులు
ఒక్కసారిగా పెద్ద శబ్దంతో గిరగిర.....
గిరగిర తిరేగస్తున్నాయి
ప్రదర్శనల్లో ఉచ్ఛస్వరంతో
లెనిన్ నినాదాల ఇస్తూ వుండటం
మేడే నాడు తెల్లవారకముందే లేచి
కార్మికులతో కలిసి ప్రదర్శన లేవదీయాలని
ప్రయత్నించిన ప్రతిసారీ
లెనిన్ అరచేతులకు సంకెళ్లు తగిలించి
ఆయన్ని పంపేస్తారు దేశం నుంచి బహిష్కరించి
'చుట్టూ శాంతియుత వాతావరణం
ప్రజలకు తినటానికి తిండి
దేశంలో ప్రజాస్వామ్యం నెలకొనాలని
అతుకులు పడ్డ యూనిఫారంతో
చిరిగిన చెప్పులతో నిలుచున్న సైనికులకు
లెనిన్ ఉద్బోధిస్తారు
సమాజంలో రెండే రెండు వర్గాలు
ఒకటి పెట్టుబడిదారీ వర్గం
రెండోది శ్రామికవర్గం
ఏ వర్గం పక్షం వహించాలో
ఇహ నిర్ణయం తీసుకోవడం మీవంతు!
యుద్ధం తీరే మారిపోయింది
పది దినాల్లో ప్రపంచాన్ని పెద్ద కుదుపుకి గురి చేసింతి
నాలుగు రోడ్ల జంక్షన్లలో వున్న విగ్రహాలు
సమాధుల్లో వున్న మమ్మీలు
సెల్ఫ్‌ల్లో నీట్‌గా అమర్చి వున్న పుస్తకాలు
వీటివల్ల ఉండదు ఎవ్వరికీ ప్రయోజనం
చాలా రోజుల తర్వాత వెదికితే
లెనిన్ కనిపించడం లేదు
ఆయన అవసరం. ఈనాడు ఎంతైనా వుంది
రోడ్డుపక్కని ఫుట్‌పాత్ మీద
మామూలు మనుషులతో కలిసిపోయి
ఆయన సంభాసిస్తారు వాళ్లతో
'ఏం చెయ్యాలో'!
చాల రోజుల తర్వాత
ఇవేళ అక్కడే కనిపించారు లెనిన్
అదే ఆయన వుండే చోటు
తన వారు వుండే చోటు కూడా అదే!

అనువాదం: నిర్మలానంద ◈

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010